

'ప్రభుత్వ పథకాలు మరింత వేగంగా మారుమూల పల్లెలకు వెళ్లాలి'

సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 14 వెల: ₹ 6.50

సంపుటి: 16 సంచిక: 281

సోమవారం 24-6-2024

SIMULTANEOUSLY PRINTED AT CHENNAI | DELHI | VIJAYAWADA | BANGALORE | HYDERABAD | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VISAKHAPATNAM | WARANGAL



అఫ్గానిస్తాన్ అద్భుతం

ఆస్ట్రేలియాపై 21 పరుగుల తేడాతో సంచలన విజయం - 12లో



అమెరికాలో కాల్పులు

చికిత్స పొందుతూ బాపట్ల జిల్లాకు చెందిన యువకుడి మృతి - 14లో



పునర్వినియోగ ప్రయోగ పరీక్ష సక్సెస్

గతంతో పోలిస్తే అత్యంత ప్రతికూల పరిస్థితుల్లోనూ పునర్విని యోగించగలిగే ప్రయోగ వాహనాన్ని వరుసగా మూడోసారి విజయవంతంగా పరీక్షించినట్లు ఇస్రో ప్రకటించింది.

వివరాలు 6లో ▸



నీట్ అక్రమాలపై సీబీఐ కేసు నమోదు

నీట్–యూజీ అక్రమాల విషయంలో కీలక పరిణామం చోటుచేసుకుంది. ఈ కేసులో మొదటి ఎఫ్ఐఆర్ నమోదు చేసినట్లు సీబీఐ అధికారులు ఆదివారం వెల్లడించారు.

వివరాలు 6లో ▸

అమెరికాకు డైరెక్ట్ ఫ్లైట్ ఏదీ?

యూఎస్ ప్రయాణికుల్లో హైదరాబాద్‌ది మూడోస్థానం

ఏటా 10 లక్షల మంది రాకపోకలు

గతంలో చికాగో వరకు వారానికి 2 సర్వీసులు

కోవిడ్ నుంచి నిలిపివేసిన ఎయిర్ ఇండియా



ఏటా 10 లక్షల మంది రాకపోకలు సాగిస్తున్నా.. శంషాబాద్ నుంచి అమెరికా వెళ్లడానికి డైరెక్ట్ ఫ్లైట్ లేదు. దీంతో ప్రయాణికులు అమెరికాలో ఎక్కడకు వెళ్లాలన్నా రెండు, మూడు విమాన సర్వీసులు మారాల్సి వస్తోంది. శంషాబాద్ ఎయిర్‌పోర్టు నుంచి బయలుదేరే అంతర్జాతీయ ప్రయాణికుల్లో 60శాతం మంది అమెరికాకు వెళ్లేవారే ఉంటారు. గతంలో ఎయిర్ఇండియా చికాగో వరకు వారానికి రెండు సర్వీసుల చొప్పున నడిపింది. 350 సీట్లు ఉండే ఆ ఫ్లైట్‌కు ప్రయాణికుల నుంచి అనూహ్యమైన ఆదరణ లభించింది. 90శాతం ఆక్యుపెన్సీతో నడిచాయి. కోవిడ్‌కాలం నుంచి ఆ సర్వీసులను నిలిపివేశారు. ఆ తర్వాత పునరుద్ధరిస్తామని, ఎయిర్ పోర్టువర్గాలు చెప్పినా.. ఇప్పటివరకు చికాగో ఫ్లైట్‌లు తిరిగి ప్రారంభం కాలేదు.

..:: సాక్షి, హైదరాబాద్ ::..

3 స్థానంలో హైదరాబాద్

శంషాబాద్ అంతర్జాతీయ విమానాశ్రయం నుంచి ప్రతిరోజు సుమారు 55,000 మంది డొమెస్టిక్ ప్రయాణికులు రాకపోకలు సాగిస్తుండగా, మరో 10 వేల మందికి పైగా అంతర్జాతీయ ప్రయాణికు లు వివిధ దేశాలకు ప్రయాణం చేస్తున్నారు. దుబాయ్, సింగపూర్, మలేసియా, బ్రిటన్, దోహా, జెడ్డా, మాలే, థాయ్‌లాండ్, జర్మనీ తదితర దేశాలకు నేరుగా విమాన సర్వీసులు అందుబాటులో ఉన్నాయి. కానీ అమెరికాకు మాత్రం అలాంటి సదుపాయం లేదు. అమెరికా ప్రయా ణికుల్లో న్యూఢిల్లీ, ముంబయి తర్వాత హైదరాబాద్ మూడోస్థానంలో ఉన్నట్లు ఇంటర్నేషనల్ ఎయిర్‌ట్రాన్స్‌పోర్ట్ అసోసియేషన్ (ఐఏటీఏ) వెల్లడించింది. ఏటా సుమారు 10లక్షల మంది హైదరాబాద్ నుంచి అమెరికాకు రాకపోకలు సాగిస్తున్నారు. తెలుగురాష్ట్రాల నుంచి లక్షలాది విద్యార్థులతోపాటు ఉద్యోగులు, వారి బంధువులు కూడా పెద్ద సంఖ్యలో ప్రయాణం చేస్తున్నారు.

ఏటేటా పెరుగుతున్న ప్రయాణికులు

హైదరాబాద్ నుంచి అమెరికాకు వెళుతున్న ప్రయాణికుల్లో ఎక్కువ శాతం న్యూయార్క్, చికాగో, శాన్‌ఫ్రాన్సిస్కో నగరాలకు వెళుతున్నారు. ప్రయాణికుల సంఖ్య కూడా ప్రతి సంవత్సరం పెరుగుతోంది. కోవిడ్ అనంతరం రాకపోకలు మరింత ఎక్కువయ్యాయి. ఐఏటీఏ లెక్కల ప్రకారం కోవిడ్‌కు ముందు 2019లో 8.5 లక్షల మంది ప్రయాణం చేయగా, కోవిడ్ కాలంలో రాకపోకలు నిలిచిపోయే నాటికి 2020లో 3లక్షల మంది ప్రయాణం చేశారు. ఆ మరుసటి సంవత్సరం పూర్తిగా నిలిచిపోయాయి.ఆంక్షలు తొలగించిన తర్వాత ప్రయాణికుల రాకపోకలు గణనీయంగా పెరిగాయి. యూఎస్ నుంచి కొత్తగా వీసాలు లభించకపోయినా, వీసాలు కలిగి ఉన్న ప్రయాణికులంతా కోవిడ్ అనంతరం ఇరువైపులా పెద్దసంఖ్యలో ప్రయాణం చేశారు.

మహిళల సమస్యలను వింటున్న వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్



చేసేది చెప్పాం.. చెప్పింది చేశాం

- 40 శాతం మంది నమ్మి ఓటేశారు
- మన వైపు ఉన్న మరో 10 శాతం మంది కూటమి వైపు మొగ్గు చూపారు
- 6 నెలల్లో చంద్రబాబు అసలు స్వరూపం తెలుస్తుంది
- చెప్పిన హామీలు ఏ మేరకు అమలు చేస్తారో వేచి చూద్దాం
- వైఎస్సార్‌సీపీ కేడర్, ఆస్తులపై దాడులతో విధ్వంసకర పాలన
- ప్రజాపక్షంగా వ్యవహరిద్దాం.. 2029లో ప్రజలు మనవైపే చూస్తారు.. కేడర్ ఎవ్వరూ అధైర్యపడొద్దు.. అండగా ఉంటాం
- వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు, మాజీ సీఎం వైఎస్ జగన్

2 లో

మంగళగిరిలోని టీడీపీ కేంద్ర కార్యాలయం



పచ్చ సౌధాలు!

వాగు పోరంబోకును ఆక్రమించి మంగళగిరిలో 'ఎన్టీఆర్ భవన్'

అనుమతి లేకుండా ఎనిమిది అంతస్తులతో విలాస భవనం

- ప్రస్తుతం టీడీపీ ప్రధాన కార్యాలయం అదే
- దీనిపై కోర్టులో కొనసాగుతున్న విచారణ
- రాష్ట్రవ్యాప్తంగా రాజకోటల్లా టీడీపీ ఆఫీసులు.. జీవోలన్నీ బాబు హయాంలోనే
- ఏకంగా ఉండవల్లిలోని అక్రమ కట్టడంలో చంద్రబాబు నివాసం
- విజయవాడ ఆటోనగర్‌లో ఇరిగేషన్ స్థలాన్ని లాక్కుని టీడీపీ ఆఫీసు ఏర్పాటు
- విశాఖలో దసపల్లా కొండను తొలిచి కార్యాలయాన్ని కట్టేసిన టీడీపీ
- కాకినాడలో జెడ్పీ భవనాన్ని స్వాధీనం చేసుకుని టీడీపీ ఆఫీసు నిర్మాణం
- శ్రీకాకుళంలో దళితులకు కేటాయించిన భూముల్లో ఎన్టీఆర్ భవన్
- తమకు అనుకూలంగా గతంలోనే పార్టీలకు భూముల కేటాయింపు విధానం తెచ్చిన చంద్రబాబు
- వాటి ఆధారంగానే కేటాయింపులు.. పక్కనున్న పేదల స్థలాలు సైతం కబ్జా
- తన నిర్వాకాలను కప్పిపుచ్చి వైఎస్సార్‌సీపీ కార్యాలయాలపై తప్పుడు ప్రచారాలు

10 లో

ఆగని టీడీపీ దమనకాండ

వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు, సానుభూతిపరుల ఇళ్లపై కొనసాగుతున్న దాడులు

పలుచోట్ల శిలాఫలకాల విధ్వంసం 5 లో

భయం గుప్పెట్లో జగ్గయ్యపేట


ఇతర గ్రామాలకూ విస్తరిస్తున్న డయేరియా

ఇప్పటికే ఆరుగురు మృతి.. తాజాగా 11మంది ఆస్పత్రిపాలు

ప్రైవేటు ఆస్పత్రులకు తరలుతున్న బాధితులు 3 లో

హ్యాండ్లింగ్.. వెరీ లేట్.!

- పోర్టులో రోజుల తరబడి నిలిచిపోతున్న షిప్స్
- అస్తవ్యస్తంగా మారిన కార్గో హ్యాండ్లింగ్
- బెర్తులు కేటాయింపులో ట్రాఫిక్ సిబ్బంది నిర్లక్ష్యం
- వ్యవస్థలో లోపాలే కారణమంటూ కుంటిసాకులు
- కొత్త ట్రక్ పార్కింగ్ టెర్మినల్‌తో ఇబ్బందులు ఎదుర్కొంటున్న ట్రేడర్లు



సాక్షి, విశాఖపట్నం: నెల రోజుల క్రితం వరకూ మేజర్ పోర్టులతో పోటీ పడుతూ దూసుకుపోతున్న విశాఖపట్నం పోర్టు అథారిటీ(వీపీఏ).. ఇప్పుడు చతికలపడుతోంది. సరకు హ్యాండ్లింగ్‌లో వరుస రికార్డులు సృష్టించిన పోర్టు.. ఇప్పుడు అదే సరకు రవాణా విషయంలో నీలి సముద్రమంత నిర్లక్ష్యాన్ని ప్రదర్శిస్తోంది. ట్రాఫిక్ విభాగ వైఖరి కారణంగా కార్గో హ్యాండ్లింగ్ కోసం బెర్తుల కేటాయింపుల్లో నిర్వహణ లోపం కొట్టొచ్చినట్లు కనిపిస్తోంది. ట్రేడర్లు మొరపెట్టుకుంటున్నా తమకేమీ పట్టనట్లుగా పోర్టు అధికారులు వ్యవహరిస్తుండటంతో హ్యాండ్లింగ్ క్రమంగా కుంటుపడుతోంది. ఒకే నెలలో అత్యధిక సరకు హ్యాండ్లింగ్.. ఏడాది వ్యవధిలో అత్యధికంగా కోల్ కోక్ దిగుమతి.. భారీగా క్రూడ్ ఆయిల్ నిర్వహణ.. కంటైనర్ల ఎగుమతిలో సరికొత్త రికార్డు.. రెండు మూడు నెలల క్రితం.. పోర్టు ఖాతాలో జమ అయిన రికార్డులివీ. సరకు రవాణా విభాగంలో దేశంలోని మేజర్ పోర్టుల్లో కొన్నింటికి సాధ్యం కాని రికార్డులను సైతం తన ఖాతాలో జమ చేసుకున్న విశాఖపట్నం పోర్టు అథారిటీ ప్రస్తుతం నెమ్మదిస్తోంది. ట్రాఫిక్ సిబ్బంది నిర్లక్ష్యం అధికారుల అలసత్వం కారణంగా హ్యాండ్లింగ్ చాలా ఆలస్యంగా సాగుతోంది. పోర్టుకు చేరుకున్న కార్గో షిప్‌లకు సరైన బెర్తింగ్ ఇవ్వడంలో సంబంధిత విభాగాధికారులు అలసత్వం ప్రదర్శిస్తున్నారు.

కొత్త చిక్కులు తెచ్చిన ట్రక్ పార్కింగ్ టెర్మినల్

ఈ ఏడాది సరకు హ్యాండ్లింగ్ 90 మిలియన్ మెట్రిక్ టన్నులు దాటాలంటూ పోర్టు చైర్మన్ లక్ష్యాన్ని నిర్దేశించినా ఆ పరిస్థితులు మాత్రం ఎక్కడా కనిపించడం లేదు. ముఖ్యంగా పోర్టు ఇటీవల రూ.40 కోట్ల వ్యయంతో అందుబాటులోకి తీసుకొచ్చిన ట్రక్‌పార్కింగ్ టెర్మినల్ కారణంగా ట్రేడర్లు ఇబ్బందులు పడుతున్నారు. ఈ టెర్మినల్ పోర్టుకు లాభాలు తీసుకొస్తుందే తప్ప.. సరకు రవాణాకు పెద్దగా ఒరిగిందేమీ కనిపించడం లేదు. పోర్టు ఏరియాకు సుమారు 8 కిలోమీటర్ల దూరంలో ఈ ట్రక్ టెర్మినల్ ఉంది. ఒక ట్రక్‌ని పార్కింగ్ చేయాలంటే రోజుకు రూ.150 వరకూ ట్రేడర్లు చెల్లించాల్సి ఉంటుంది. సరకు ఎగుమతి, దిగుమతి చేసుకోడానికి పోర్టుకు ట్రక్ వెళ్లాలంటే.. కచ్చితంగా టెర్మినల్ నుంచే బయల్దేరాలి. అయితే.. బెర్తింగ్ విషయంలో ట్రాఫిక్ విభాగం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుండటం వల్ల.. రెండు మూడు రోజులు టెర్మినల్‌లో ట్రక్‌లు ఉండాల్సి వస్తోంది. ఫలితంగా.. ఒక్కో ట్రక్‌కు రూ.450 వరకూ చెల్లించడంతో పాటు 16 కిలోమీటర్ల మేర డీజిల్ అదనపు భారంగా మారుతోంది. ఈ కారణంగా.. వచ్చిన లాభాలన్నీ.. పోర్టుకే జమ చేయాల్సి వస్తోందంటూ స్టివడోర్స్ వాపోతున్నారు. మౌలిక సదుపాయాలపైనా కనీస దృష్టి సారించడం లేదని ఈ వ్యవహారాలను డిప్యూటీ చైర్మన్ దృష్టికి తీసుకెళ్లేందుకు ప్రయత్నిస్తున్నా ఆయన పట్టించుకోవడం లేదంటూ ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా ట్రాఫిక్ విభాగంపై చైర్మన్ దృష్టిసారిస్తే తప్ప.. పోర్టు బాగుపడదని విమర్శిస్తున్నారు. ఈ పద్ధతి ఇలాగే కొనసాగితే స్టివడోర్స్ అంతా పక్కనే ఉన్న గంగవరం పోర్టు వైపు అడుగులు వేసే ప్రమాదం ఉందని హెచ్చరిస్తున్నారు.

రెండు మూడు రోజులైనా..

ఇటీవల కాలంలో రెండు మూడు రోజులైనా సరకుతో వచ్చిన షిప్‌లకు బెర్తులు ఇవ్వడం లేదన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. షిప్ వచ్చిందని హ్యాండ్లింగ్ చేసుకునేందుకు అవకాశం కల్పించాలని ట్రేడర్లు అడిగే వరకూ ట్రాఫిక్ విభాగాధికారులు, సిబ్బంది పట్టించుకోవడం లేదు. ఇటీవల గుజరాత్ నుంచి వచ్చిన ఓ అధికారి ఈ వ్యవహారాలను పూర్తిగా విస్మరించేశారంటూ విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. స్టివడోర్లకు అందుబాటులోకి రావడం లేదని ఆయన లేకపోవడంతో దిగువ స్థాయి సిబ్బందికి అడుగుతున్నా సరైన స్పందన రావడం లేదంటూ వాపోతున్నారు. ఫలితంగా తీవ్ర నష్టాల్ని చవిచూస్తున్నామంటూ స్టివడోర్స్ ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గతంలో ట్రాఫిక్ విభాగంలో ఈ తరహా ఇబ్బందులు ఎప్పుడూ ఎదుర్కోలేదని స్టివడోర్స్ చెబుతున్నారు. ట్రాఫిక్ నిర్వహణ బాధ్యతలు సక్రమంగా నిర్వర్తించడం కూడా పోర్టు విస్మరించడం విస్మయానికి గురి చేస్తోందని ఆరోపిస్తున్నారు.

నష్టాల పాలు

పదిలీటర్ల పాలిచ్చే ఆవును కొనాలంటే లక్షకు పైమాటే. ఆ పాడి ఆవును సంరక్షించి పాలను విక్రయిస్తే లీటరుకు దక్కేది రూ.25 మాత్రమే. అదే పాలను మనం దుకాణాల్లో కొనాలంటే లీటర్‌కు రూ.70 పెట్టాల్సిందే. కనీసం మంచినీళ్ల బాటిళ్లకైనా గ్యారెంటీ ధరలు ఉంటున్నాయి కానీ స్వచ్ఛమైన పాలకు మాత్రం గ్యారెంటీ లేకుండా పోయింది. పాల ఉత్పత్తి పెరిగిందంటూ డెయిరీ నిర్వాహకులు రింగ్‌గా ఏర్పడి పాలను కొనట్లేదు. దీంతో పాడి రైతులకు నష్టాలు తప్పట్లేదు.

- ఉత్పత్తి పెరిగిందంటూ పాలను కొనుగోలు చేయని డెయిరీ నిర్వాహకులు
- రింగ్‌గా ఏర్పడి పాల రేట్లను తగ్గించిన వైనం
- రైతులకు భారంగా మారిన పాడి ఆవుల పెంపకం
- గిట్టుబాటు కాని పాల ధరతో నష్టాల బాటలో రైతులు


పాలను పితుకుతున్న మహిళ

పలమనేరు: మొన్నటి దాకా జిల్లాలోని ప్రైవేటు డెయిరీలలో లీటర్ పాల ధర రూ.44 ఉండగా, ఇప్పుడు లీటర్ పాలు కేవలం రూ.25 నుంచి రూ.30కే దొరుకుతున్నాయి. డెయిరీల సామర్థ్యానికి మంచి పాలు వస్తున్నాయని నిర్వాహకులు పాల ధరలను అమాంతం తగ్గించేశారు. ప్రైవేటు పాల డెయిరీల నిర్వాహకులు రింగ్‌గా ఏర్పడి ధరల తగ్గించేశారని, రైతులు, పాల సేకరణ ఏజెంట్లు ఆరోపిస్తున్నారు. రైతులు డెయిరీలకు వేసే పాల ధర తగ్గినపుడు దుకాణాల్లో విక్రయించే పాల ధర మాత్రం ఎందుకు తగ్గడం లేదని పాడిరైతులు ప్రశ్నిస్తున్నారు.

సిండికేట్ అయిన నిర్వాహకులు..

ఇప్పటిదాకా మామిడి గుజ్జు పరిశ్రమల నిర్వాహకులు సిండికేట్ కావడం చూశాం. తాజాగా అదే రీతిలో జిల్లాలోని పాలడెయిరీల యజమానులు సైతం రింగ్‌గా ఏర్పడి ధరలను తక్కువ చేశారనే మాట వినిపిస్తోంది. ప్రస్తుతం జిల్లాలో దొడ్ల, హెరిటేజ్, పరాగ్, తిరుమల, హట్సన్, సంఘం, శ్రీజ లాంటి పాలడెయిరీ నిర్వాహకులు ధరలను శాసిస్తున్నారు.

చిత్తూరు జిల్లాలో పాడి వివరాలు..

- జిల్లాలోని ప్రైవేటు పాల డెయిరీలు పదిదాకా ఉన్నాయి
- మిల్క్ చిల్లింగ్ సెంటర్లు 60
- పాడిరైతులు 88 వేల మంది దాకా
- రోజుకు పాల ఉత్పత్తి 4 లక్షల లీటర్ల వరకు..

ప్యాకెట్ పాల ధర మాత్రం పైపైకి..

కంపెనీ బ్రాండ్‌లను బట్టి బహిరంగ మార్కెట్‌లో ప్యాకెట్ లీటర్ పాల ధర రూ.70 ఉండగా, అర్ధలీటర్ రూ.35 ఉంది. అదే రైతు డెయిరీలకు పోసే పాల ధరలు తగ్గుతుండగా మార్కెట్‌లో డెయిరీ పాల ప్యాకెట్ల ధరలు మాత్రం పెరుగుతూనే ఉన్నాయి.

మిగిలేది అంతంతే..

పలమనేరు సమీపంలోని బేరుపల్లికి చెందిన ఓ రైతు రూ.1.20 లక్షలు పెట్టి పది లీటర్ల పాలిచ్చే ఆవును కొన్నాడు. పూటకు(పొద్దున, సాయంత్రం) 20 లీటర్ల పాలను డెయిరీకి పోస్తున్నాడు. రోజుకు లీటర్ రూ.25 లెక్కన రూ.500 వస్తోంది. నెలకు రూ.15 వేలు సంపాదన. ఆ ఆవు సంరక్షణలో భాగంగా నెలకు ఫీడ్‌కు రూ.1500, బూసాకు రూ.1000, గానుగపిండికి రూ.2,000, రైతు కూలి రూ.6 వేలు మొత్తం రూ.10,500 దాకా ఖర్చు వస్తోంది. ఇక గడ్డి ఖర్చు రూ.2 వేలు కలుపుకుంటే రూ.12,500. నెలకు వచ్చే బిల్లు రూ.15 వేలు అయితే అందులో రూ.12,500 పోగా మిగిలేది కేవలం రూ.2,500 మాత్రమే. మధ్యలో ఆవుకు ఏదైనా జబ్బు చేస్తే రైతు చేతి నుంచి పెట్టుకోవాల్సిన పరిస్థితి నెలకొంది. వచ్చే ఆ కాసింత డబ్బులతోనే రైతు కుటుంబాన్ని పోషించుకోవాలి. ఇలాగైతే ఎలా అప్పులు తీర్చేది ఎలా బతికేదని రైతు ఆవేదన. ఇది కేవలం ఓ రైతు బాధేకాదు పడమటి మండలాల్లోని పాడి రైతుల్లోనూ నెలకొన్న కష్టమే.

కొండెక్కిన పాడి ఆవుల ధరలు..

జిల్లాలో ఎక్కువగా హెచ్ఎఫ్, జెర్సీ రకాల సీమ జాతి ఆవులను రైతులు కొనుగోలు చేస్తున్నారు. వీటిని రాష్ట్ర సరిహద్దులోని కర్ణాటక, తమిళనాడు నుంచి తేవాల్సిందే. లీటరు పాలు రూ.10 వేలుగా 10 లీటర్ల పాలు ఇచ్చే ఆవును లక్షకు పైగా కొంటున్నారు. బీమా కట్టాలి. పది లీటర్ల పాలు ఇచ్చే ఆవుకు నెలకు 50 కేజీల ఫీడ్, ఓ బస్తా బూసా, 30 కిలోల గానుగపిండి అవసరం ఉంటుంది. వీటి ధరలు మాత్రం అమాంతం పెరుగుతూనే ఉన్నాయి.

అకస్మాత్తుగా ధరల తగ్గుముఖం..

ఎన్నికలకు ముందు దాకా ఫ్యాట్ శాతం 3.5, ఎస్ఎన్ఎఫ్ (సోలిడ్స్ నాట్ ఫ్యాట్) 8.5 నుంచి 9శాతం వచ్చే పాలు లీటర్ ధర రూ.44 ఉండేది. వెన్నశాతం తక్కువగా ఉన్న పాలు లీటర్ ధర కనిష్ఠంగా రూ.33 వరకు పలికేవి. డెయిరీలకు కెపాసిటీకి మించి పాలు వస్తున్నాయనే సాకుతో నిర్వాహకులు మంచి ఫ్యాట్ ఉన్న పాల ధర ప్రస్తుతం రూ.36 కాగా కనిష్ఠ ధర రూ.25 పడిపోయింది. ఉన్నట్టుండి లీటర్‌పై రూ.10 దాకా తగ్గడంతో పాడిరైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. దీంతో పాటు రైతులు డెయిరీలకు పంపిన పాలను సైతం తమకు వద్దంటూ వెనక్కి పంపేస్తున్నారు.


పాడి ఆవులు


పాలను సేకరిస్తున్న ఏజెంట్లు

కూలి కూడా మిగల్లేదు..



తన వద్ద 5 ఆవులు ఉన్నాయి. రోజూ 30 లీటర్ల పాలను డెయిరీకి పోస్తున్నా. లీటర్ రూ.44 ఉన్న ధర ఇప్పుడు రూ.30 కంటే తగ్గింది. ఈ రేట్లతో పాడి ఆవులను మేపడం వేస్ట్. ధరల విషయంలో పాల డెయిరీలు ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నాయి. పొద్దస్తమానం ఆవులకు చాకిరీ చేసి వాటికి మేత, గానుగపిండి పెట్టి పోషిస్తే మా కూలి కూడా మిగలడం లేదు.

– జయరామిరెడ్డి, పాడిరైతు, బేరుపల్లి, పలమనేరు

మరీ మోసం..



నేను 30 ఏళ్లుగా పాల వ్యాపారం చేస్తున్నా. ఇప్పుడు ఉన్న దాణా ధరలు, పెరిగిన పాడిఆవుల రేట్లతో లీటర్‌కు రూ.40పైన ఉంటేనే రైతుకు గిట్టుబాటు ఉంటుంది. ఈ మధ్య వర్షాల కారణంగా పచ్చిమేత లభ్యమవుతోంది. దీంతో పాల ఉత్పత్తి పెరిగింది. దీన్ని ఆసరాగా చేసుకుని పాల డెయిరీల నిర్వాహకులు తమకు వస్తున్న పాల కంటే అధికంగా వస్తున్నాయని వెనక్కి పంపుతున్నారు. ధరలు కూడా తగ్గించారు. ఇలాగే ఉంటే పాడిపశువులను అమ్ముకోవాల్సిందే.

– పాలు శీనా, పాల ఏజెంట్, బైరెడ్డిపల్లి

క్లుప్తంగా...

నేటి నుంచి అక్కడక్కడా వానలు

సాక్షి, విశాఖపట్నం: నైరుతి రుతుపవనాలు అరేబియా సముద్రం, గుజరాత్‌లోని మరి కొన్ని ప్రాంతాల్లోకి, మహారాష్ట్రలోని మిగిలిన భాగాలు, మధ్యప్రదేశ్-ఛత్తీస్‌గఢ్‌లోని మరి కొన్ని భాగాలు, ఒడిశాలోని మిగిలిన భాగాలు.. జార్ఖండ్‌లోని కొన్ని ప్రాంతాల్లోకి ప్రవేశించాయి. రానున్న మూడు, నాలుగు రోజుల్లో ఉత్తర అరేబియా సముద్రం, పశ్చిమ బెంగాల్, జార్ఖండ్, బీహార్‌లోని మిగిలిన భాగాల్లోకి ప్రవేశించనున్నాయి. దేశమంతటా రుతుపవనాలు విస్తరించేందుకు అనుకూల వాతావరణం ఏర్పడింది. ఈ కారణంగా.. రాష్ట్ర వాతావరణంలో మార్పులు కనిపిస్తున్నాయి. క్రమంగా కోస్తా, రాయలసీమల్లో వానలు విస్తరించే అవకాశాలు ఉన్నాయని వాతావరణ కేంద్రం వెల్లడించింది. నైరుతి ప్రభావంతో.. నేటి నుంచి రాష్ట్రంలో అక్కడక్కడా వానలు కురిసే అవకాశాలున్నాయి. ఉత్తరాంధ్ర, కోస్తా, రాయలసీమల్లో రానున్న మూడు రోజుల పాటు తేలికపాటినుంచి మోస్తరు వర్షాలు, ఒకట్రెండు చోట్ల ఉరుములు, మెరుపులతో కూడిన భారీ వర్షాలు పడే సూచనలున్నాయి. తీరం వెంబడి గంటకు 40 నుంచి 50 కి.మీ వేగంతో ఈదురు గాలులు వీచే అవకాశాలున్నాయని అధికారులు వెల్లడించారు.

ఆర్థికాభివృద్ధికి జీఎస్టీ ఉద్యోగుల కృషి

- ఏపీ కస్టమ్స్ కమిషనర్ సీహెచ్. వెంకయ్య చౌదరి



సాక్షి, అమరావతి: జీఎస్టీ ఉద్యోగులు దేశ ఆర్థికాభివృద్ధికి వెన్నుదన్నుగా నిలుస్తున్నారని ఏపీ కస్టమ్స్ కమిషనర్ సీహెచ్.వెంకయ్య చౌదరి తెలిపారు. విజయవాడలో ఆదివారం నిర్వహించిన సెంట్రల్ ట్యాక్స్ గెజిటెడ్ ఉద్యోగుల సర్వసభ్య సమావేశంలో ఆయన మాట్లాడారు. ఉద్యోగులు సమన్వయం, చిత్తశుద్ధితో విధులు నిర్వహిస్తుండటంతోనే ప్రభుత్వం పన్నుల లక్ష్యాలను సాధించగలుగుతోందన్నారు. జీఎస్టీ ఉద్యోగులకు భోగాపురం విమానాశ్రయంలో విధులు కేటాయించాలన్న డిమాండ్‌ను తాను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్తానన్నారు. కేంద్ర జీఎస్టీ కమిషనర్ సాధు నర్సింహారెడ్డి మాట్లాడుతూ గుంటూరు, తిరుపతిల్లో జీఎస్టీ ఉద్యోగులకు క్వార్టర్స్ నిర్మాణానికి ప్రతిపాదనలు పంపామని చెప్పారు. ఏపీ జీఎస్టీ ఉద్యోగులు ప్రత్యేక సీనియారిటీ జాబితాను రూపొందించాల్సిన అవసరం ఉందన్నారు. అనంతరం ఉద్యోగ విరమణ చేసిన జీఎస్టీ అధికారులను సత్కరించారు. ఈ సందర్భంగా గుంటూరు సెంట్రల్ జీఎస్టీ కమిషనరేట్ పరిధిలోని సెంట్రల్ ట్యాక్స్ గెజిటెడ్ అధికారుల నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా బి.నవీన్ రాజు, ఉపాధ్యక్షులుగా సీహెచ్. ఈశ్వరరావు, బి.సుకుమార్, ప్రధాన కార్యదర్శిగా కె.యుగంధర్ కుమార్‌లతోపాటు కార్యవర్గ సభ్యులను ఎన్నుకున్నట్టు తెలిపారు.

తెలంగాణ

పోరాటాలతోనే సమస్యలకు పరిష్కారం

- సాక్షి మీడియా గ్రూప్ ఎడిటర్ వర్ధెల్లి మురళి
- తెలంగాణ సాయుధ పోరాట యోధుడు మల్సూర్ జీవిత చరిత్ర పుస్తకం ఆవిష్కరణ


మాట్లాడుతున్న వర్ధెల్లి మురళి

నూతనకల్: సమాజంలో నాటి నుంచి నేటి వరకు హక్కుల సాధనకు ఉద్యమాలు తప్పడం లేదని సాక్షి మీడియా గ్రూప్ ఎడిటర్ వర్ధెల్లి మురళి అన్నారు. ఆదివారం సూర్యాపేట జిల్లా నూతనకల్ మండల కేంద్రంలోని సాయిరాం ఫంక్షన్ హాల్‌లో తెలంగాణ సాయుధ పోరాట యోధుడు, కల్లుగీత కార్మిక సంఘం రాష్ట్ర మాజీ అధ్యక్షుడు తొట్ల మల్సూర్ జీవిత చరిత్ర పుస్తకాన్ని ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సామాజిక, రాజకీయ, ఆర్థిక పరిస్థితులపై ప్రపంచవ్యాప్తంగా అనేక పోరాటాలు జరిగాయని, వాటి ద్వారానే ప్రజలు తమ సమస్యలను పరిష్కరించుకున్నారని గుర్తు చేశారు. తెలంగాణ సాయుధ పోరాటానికి పూర్వం సమాజంలోని అసమానతలు, అంటరానితనం, వెట్టిచాకిరీ విముక్తి కోసం ఎంతో మంది వీరులు తమ పోరాటాన్ని కొనసాగించారని, ఇందులో తొట్ల మల్సూర్ ముఖ్య భూమిక పోషించారని ఆయన పేర్కొన్నారు. రాజ్యాంగం ప్రకారం ప్రజలకు లభించే హక్కులను భూస్వాములు, పెత్తందార్లు కాలరాసినప్పుడు వారి అసంతృప్తిని గ్రహించి పోరాట పంథా వైపు నడిపించి, సమస్యలను పరిష్కరించిన ఎంతో మంది వీరులు తెలంగాణ ప్రాంతంలో ఉన్నారని చెప్పారు. ప్రతి ఒక్కరూ తొట్ల మల్సూర్ స్ఫూర్తితో సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని కోరారు. కల్లుగీత కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఎంవీ రమణ మాట్లాడుతూ.. అన్యాయానికి గురవుతున్న పీడిత ప్రజలను ఏకతాటిపై నడిపించి, సాయుధ పోరాటం చేసిన ఘనత మల్సూర్‌దేనని అని అన్నారు. ఈ కార్యక్రమంలో కల్లుగీత కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు ఎల్గూరి గోవిందు, జెడ్పీటీసీ సభ్యుడు కందాల దామోదర్‌రెడ్డి, మాజీ ఎంపీపీ తాదూరి లింగయ్య, ఎక్సైజ్ డీఎస్పీ బిక్కి గుర్వయ్య పాల్గొన్నారు.


పులివెందుల క్యాంపు కార్యాలయం వద్దకు భారీగా తరలివచ్చిన వైఎస్సార్‌సీపీ శ్రేణులు, అభిమానులకు అభివాదం చేస్తున్న వైఎస్ జగన్


రాత్రివేళ సైతం వైఎస్ జగన్‌ను కలిసేందుకు వేచి ఉన్న వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు, ప్రజలు

చేసేది చెప్పాం.. చెప్పింది చేశాం

కేడర్ ఎవ్వరూ అధైర్యపడొద్దు.. అండగా ఉంటాం.. వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు, మాజీ సీఎం వైఎస్ జగన్

సాక్షి ప్రతినిధి, కడప: 'చెప్పింది చెప్పినట్లు చేసి చూపెట్టాం. చెప్పనవి కూడా ఆచరణలో చూపెట్టాం. మనం చేయగలిగిందే ఎన్నికల్లో చెప్పాం. 40 శాతం మంది నమ్మి ఓటేశారు. మన వైపు ఉన్న మరో 10 శాతం మంది కూటమి వైపు మొగ్గుచూపారు. చంద్రబాబు సూపర్ సిక్స్ పథకాలన్నారు. ప్రజలకు ఇచ్చిన హామీలు ఏమాత్రం నిలబెట్టుకుంటారో వేచిచూద్దాం. చంద్రబాబు మాటలు నమ్మి మోసపోయామని ప్రజలు గ్రహించే రోజు రానే వస్తుంది. వైఎస్సార్‌సీపీ కేడర్ లక్ష్యంగా వ్యక్తిగత దాడులు, ఆస్తులు ధ్వంసం చేస్తూ కూటమి ప్రభుత్వం విధ్వంసకర పాలన సాగిస్తోంది. కేడర్ ఆత్మస్థైర్యం కోల్పోవద్దు. అండగా నిలుస్తాం. బాధితులందర్నీ కలుస్తాం' అని వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అన్నారు. ఆదివారం పులివెందుల క్యాంపు కార్యాలయంలో స్థానిక మున్సిపల్ కౌన్సిలర్లతో ప్రత్యేకంగా భేటీ అయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ చంద్రబాబు సర్కార్ ప్రజలకిచ్చిన హామీలన్నీ నెరవేర్చాలని, అందుకోసం వైఎస్సార్‌సీపీ ప్రజాపక్షంగా నినదిస్తోందన్నారు. 'మన హామీలను నమ్మి 40 శాతం మంది ఓటు వేశారు. 50 శాతం కూటమి వైపు మొగ్గుచూపారు. చంద్రబాబు ఇచ్చిన హామీలు, చెప్పిన పథకాలు అమలు చేయలేరు. ఆరు నెలల్లో చంద్రబాబు అసలు స్వరూపం బహిర్గతం అవుతుంది. కూటమికి ఓటేసిన ప్రజలు మరోమారు మోసపోయామని గ్రహిస్తారు' అని అన్నారు.


పులివెందుల మున్సిపల్ కౌన్సిలర్లతో సమావేశమైన వైఎస్సార్‌సీపీ అధినేత వైఎస్ జగన్

మన పట్ల ప్రజలకు విశ్వాసం ఉంది


వైఎస్ జగన్‌ను కలిసేందుకు బారులుదీరిన అభిమానులు

వైఎస్సార్‌సీపీ పట్ల ప్రజలకు సంపూర్ణ విశ్వాసం ఉందని వైఎస్ జగన్ అన్నారు. మనం చేసిన మంచి, మేలు ప్రజల గుండెల్లో ఉండిపోయిందని చెప్పారు. శిశుపాలుడు లాగా తప్పులు మొదలయ్యాయని, రాష్ట్రంలో విధ్వంసకర పాలన కొనసాగుతోందన్నారు. 'మనకు ఓటు వేశారని, వారికి ఓటు వేయలేదనే కారణంగా ప్రజలు, వైఎస్సార్‌సీపీ కేడర్, ఆస్తులపైన దాడులు చేస్తున్నారు. కొన్ని చోట్ల ప్రాణ నష్టం కూడా జరిగింది. శిశుపాలుని లాగా పాపాలు చేస్తున్నారు. ఆ పాపం పండే రోజు వస్తుంది. 2029లో ప్రజలు మన వైపే చూస్తారు. మంచి చేసిన మీ జగన్ వైపే ప్రజలు నిలవనున్నారు. ఎవ్వరూ అధైర్యపడొద్దు. ప్రతి ఒక్క కార్యకర్తకు అండగా నిలుస్తా. చంద్రబాబు సర్కార్ బాధితులందర్నీ కలుస్తా' అని స్పష్టం చేశారు. టీడీపీ వాళ్లు తన భర్తను టార్గెట్ చేసి దాడి చేశారని ముదిగుబ్బ సర్పంచ్ సతీమణి వాపోయారు. అధైర్య పడొద్దని, తాను అండగా ఉంటానని వైఎస్ జగన్ ఆమెను ఊరడించారు. మనకు మంచిరోజులు రానున్నాయని, అంత వరకు ఓపిగ్గా ఉండాలని సూచించారు.

పోటెత్తిన యువత

మాజీ సీఎం వైఎస్ జగన్‌ను చూసేందుకు, ఆయనతో మాట కలిపేందుకు, ఫొటో దిగేందుకు యువత పెద్ద సంఖ్యలో పులివెందులకు వచ్చారు. సుపరిపాలన అందించిన జగన్ యోగ క్షేమాలు తెలుసుకోవాలని మరికొందరు తరలి వచ్చారు. పదవులు ముఖ్యం కాదు.. మీ వెంటే మేమంతా నడుస్తాం.. మీతోనే మాబాట.. అని భరోసా నింపేందుకు ఇంకొందరు విచ్చేయడంతో క్యాంపు కార్యాలయం కిక్కిరిసింది. స్థానిక నాయకులతో సమీక్ష నిర్వహిస్తూనే, మరోవైపు వచ్చిన వారికి ధైర్యం చెబుతూ వైఎస్ జగన్ రోజంతా బిజీబిజీగా గడిపారు. ఏకధాటిగా నిల్చొని వేలాది మంది ప్రజానీకాన్ని కలిశారు. ఈ క్రమంలో ఆయన్ను చూడాలని, కలవాలని యువత ఆత్రుత ప్రదర్శించే క్రమంలో తోపులాట చోటుచేసుకుంది. కిటికీ అద్దాలు పగిలి ఓ యువకుడికి చిన్నపాటి గాయమైంది. జనం భారీగా తరలి రావడంతో కేవలం అర గంటలో మధ్యాహ్న భోజనం ముగించి, మళ్లీ సాయంత్రం వరకు ప్రజలతో ఆప్యాయంగా మాట్లాడారు. జిల్లా వ్యాప్తంగా పార్టీ నేతలు, కార్యకర్తలు పెద్ద ఎత్తున తరలివచ్చారు. ఎమ్మెల్యే ఆకేపాటి అమర్‌నాథరెడ్డి, ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు చెవిరెడ్డి భాస్కరరెడ్డి, ఎస్ రఘురామిరెడ్డి, ఎస్‌బీ అంజాద్‌బాషా, కొరముట్ల శ్రీనివాసులు, రాచమల్లు శివప్రసాద్‌రెడ్డి, డాక్టర్ సుధీర్‌రెడ్డి, గడికోట శ్రీకాంత్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ రీజనల్ కో ఆర్డినేటర్, కడప మేయర్ కె సురేష్‌బాబు, ఎమ్మెల్సీలు రమేష్ యాదవ్, రామచంద్రారెడ్డి, మాజీ ఎమ్మెల్సీ పోచంరెడ్డి సుబ్బారెడ్డి, పులివెందుల మున్సిపల్ చైర్మన్ వరప్రసాద్, వైస్ చైర్మన్ వైఎస్ మనోహర్‌రెడ్డి, మార్కెట్ యార్డు చైర్మన్ చిన్నప్ప తదితరులు వైఎస్ జగన్‌ను కలిసి మాట్లాడారు.


పులివెందులలోని క్యాంపు కార్యాలయం వద్దకు తరలివచ్చిన యువత


రాత్రివేళ సైతం వైఎస్ జగన్‌ను కలిసేందుకు భారీగా వచ్చిన వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు, ప్రజలు


అభిమానులతో వైఎస్ జగన్ సెల్ఫీ


ప్రజల నుంచి వినతిపత్రాలు స్వీకరిస్తున్న వైఎస్ జగన్


మహిళలతో ముచ్చటిస్తూ...


యువకుడి నుంచి వినతిపత్రం స్వీకరిస్తూ..


చిన్నారికి ఓ సెల్ఫీ..

వలంటీర్ల వ్యవస్థపై నేడు స్పష్టత!

- నేడు జరిగే తొలి మంత్రివర్గ భేటీలో ఈ వ్యవస్థపై చర్చకు అవకాశం
- వ్యవస్థకు సంబంధించి సమగ్ర వివరాలతో పీపీటీలు సిద్ధంచేసిన ఉన్నతాధికారులు
- 2019 ఆగస్టు 15న జగన్ ప్రభుత్వం ద్వారా అమల్లోకి వచ్చిన వ్యవస్థ

సాక్షి, అమరావతి: ఐదేళ్ల కిందట రాష్ట్రంలో కొత్తగా అప్పటి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం ఏర్పాటు చేసిన వ్యవస్థను చంద్రబాబు ప్రభుత్వం యథావిధిగా పూర్తిస్థాయిలో అమలు చేస్తుందా లేక మార్పులు చేస్తుందా అన్నదానిపై సోమవారం కొంత స్పష్టత వస్తుందని అధికార వర్గాలు పేర్కొంటున్నాయి. మొన్నటి ఎన్నికల్లో గెలుపొందిన కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత తొలిసారి సీఎం చంద్రబాబు అధ్యక్షతన సోమవారం రాష్ట్ర మంత్రివర్గ సమావేశం జరగనుంది. ఈ సమావేశంలో వలంటీర్ల వ్యవస్థపై చర్చించే అవకాశం ఉందని, ఈ వ్యవస్థపై ప్రభుత్వ ఆలోచనలు ఏమిటన్నది తెలుస్తుందని చెబుతున్నాయి. చంద్రబాబు గతంలో ముఖ్యమంత్రిగా పనిచేసినప్పటికీ.. గత ఐదేళ్లలో కొత్తగా ఏర్పడిన ఈ వ్యవస్థకు సంబంధించిన పూర్తి వివరాలను ఆయనతోపాటు మంత్రివర్గ సభ్యులందరికీ కూలంకషంగా వివరించేందుకు గ్రామ, వార్డు సచివాలయాలశాఖ ఉన్నతాధికారులు వివిధ రకాల పవర్ పాయింట్ ప్రజెంటేషన్లు (పీపీటీలు) సిద్ధం చేశారు. మంత్రివర్గ సమావేశానికి ముందే సోమవారం సంబంధిత మంత్రి డోలా బాలవీరాంజనేయస్వామి ఆ శాఖ అధికారులతో వేరుగా సమీక్ష సమావేశం నిర్వహించే అవకాశం ఉందని అధికారులు తెలిపారు. రాష్ట్రంలో గ్రామీణ ప్రాంతాలలో ప్రతి 50 ఇళ్లకు ఒకరు, పట్టణ ప్రాంతాల్లో 75–100 ఇళ్లకు ఒకరు చొప్పున మొత్తం 2.65 లక్షలమంది వలంటీర్లతో 2019 ఆగస్టు 15న గ్రామ, వార్డు వలంటీర్ల వ్యవస్థ ఏర్పడిన విషయం తెలిసిందే. అదే ఏడాది 2019 అక్టోబరు 2న గ్రామ, వార్డు సచివాలయాల వ్యవస్థను కూడా అప్పటి జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం ఏర్పాటు చేసింది. గ్రామ, వార్డు సచివాలయాల్లో పనిచేసేందుకు ఏకంగా 1.34 లక్షల కొత్త శాశ్వత ప్రభుత్వ ఉద్యోగాలను మంజూరు చేసి అప్పటికప్పుడే భర్తీ చేసింది. ప్రస్తుతం గ్రామ, వార్డు సచివాలయాల్లో 1.27 లక్షల మంది శాశ్వత ప్రభుత్వ ఉద్యోగాల్లో పనిచేస్తున్నారు. అయితే గ్రామ, వార్డు సచివాలయ వ్యవస్థకు అనుబంధంగా గౌరవ వేతనంతో పనిచేసే 2.65 లక్షల మంది వలంటీర్లపై మొన్నటి ఎన్నికల సమయంలో కేంద్ర ఎన్నికల సంఘం అనేక ఆంక్షలు విధించడంతో పాటు ఇతర కారణాలతో రాష్ట్రవ్యాప్తంగా పెద్ద సంఖ్యలో వలంటీర్లు రాజీనామా చేశారు. దీంతో ప్రస్తుతం దాదాపు లక్షన్నరమంది వలంటీర్లు మాత్రమే పనిచేస్తున్నట్టు అధికారులు పేర్కొంటున్నారు.

తెలంగాణ

ఆరు లేన్లుగా హైదరాబాద్-విజయవాడ హైవే

- రోడ్లు భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి

చిట్యాల: రెండు తెలుగు రాష్ట్రాల ప్రధాన నగరాలైన హైదరాబాద్ నుంచి విజయవాడకు రెండు గంటల్లోనే చేరుకునేలా 65వ నంబర్ జాతీయ రహదారిని ఆరులేన్లుగా మార్చేందుకు రూ.16 వేల కోట్లు మంజూరు చేయాలని కేంద్రానికి ప్రతిపాదనలు పంపించినట్లు తెలంగాణ రోడ్లు భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి వెల్లడించారు. నల్లగొండ జిల్లా చిట్యాలలో 65వ నంబర్ జాతీయ రహదారిపై ప్రమాదాల నివారణకు ఫ్లైఓవర్ నిర్మాణానికి ఆదివారం ఆయన శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డితో కలిసి భూమిపూజ చేశారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ 65వ నంబర్ జాతీయ రహదారిని ఆరులేన్లుగా మార్చేందుకు త్వరలోనే కేంద్ర రోడ్లు, రవాణా శాఖ మంత్రి నితిన్ గడ్కరీతో సమావేశం కానున్నట్లు తెలిపారు. 65వ నంబర్ జాతీయ రహదారిపై ప్రమాదాల నివారణతో పాటు సమయం వృథా కాకుండా ప్రయాణించేందుకు వీలుగా రహదారిని నిర్మిస్తున్నట్టు పేర్కొన్నారు.


పాలనను అక్కడినుండే నడిపిస్తారట!!

భయం గుప్పెట్లో జగ్గయ్యపేట

- ఇతర గ్రామాలకూ విస్తరిస్తున్న డయేరియా
- ఇప్పటికే ఆరుగురు మృత్యువాత
- తాజాగా మరో 11మంది ఆస్పత్రిపాలు
- ప్రైవేటు ఆస్పత్రులకు తరలుతున్న బాధితులు
- రాష్ట్రవ్యాప్తంగా 168 కేసులుంటే ఒక్క జగ్గయ్యపేటలోనే 58 నమోదు
- కలుషిత నీరు, అస్తవ్యస్థ పారిశుధ్యం
- అధికారుల అలసత్వమే కారణం: మంత్రి సత్యకుమార్ యాదవ్
- 40 బృందాలు, విజయవాడలో ప్రత్యేక వార్డు ఏర్పాటు


జగ్గయ్యపేట ప్రభుత్వాస్పత్రిలో చేరిన డయేరియా బాధితులు

సాక్షి ప్రతినిధి, విజయవాడ/లబ్బీపేట/జగ్గయ్యపేట : ఎన్టీఆర్ జిల్లా జగ్గయ్యపేట నియోజకవర్గంలోని పలు ప్రాంతాల్లో డయేరియా (అతిసార) విస్తరిస్తోంది. ఇప్పటికే ఆ ప్రాంతానికి చెందిన ఆరుగురు ఈ కారణంతో మృత్యువాత పడడంతో జగ్గయ్యపేట పట్టణంతో పాటు, పరిసర ప్రాంతాల ప్రజలు భయాందోళనతో వణికిపోతున్నారు. రాష్ట్రవ్యాప్తంగా 23 గ్రామాల్లో 168 డయేరియా కేసులు నమోదుకాగా, ఒక్క జగ్గయ్యపేట నియోజకవర్గంలోనే అధికారికంగా 58 కేసులు నమోదయ్యాయి. కొందరు బాధితులు ఖమ్మం, విజయవాడ, జగ్గయ్యపేట ప్రాంతాలకు వెళ్లి చికిత్స పొందుతుండడంతో ఇవి అధికార లెక్కల్లోకి రావటంలేదు. ఇక్కడ ఇప్పటికే ఆరుగురు మృతిచెందినప్పటికీ ఇద్దరు మాత్రమే మృతిచెందినట్లు అధికారులు నిర్ధారించారు. మరోవైపు.. ఆదివారం ఒక్కరోజే జగ్గయ్యపేట, వత్సవాయి మండలాలకు చెందిన11 మంది వాంతులు, విరేచనాలతో జగ్గయ్యపేట ప్రభుత్వాస్పత్రిలో చేరారు. ఇప్పటికే 32 మంది చికిత్స పొందుతుండగా 12 మంది డిశ్చార్జ్ అయ్యారు.

వైద్య, ఆరోగ్యశాఖ జాప్యం..

జగ్గయ్యపేట పట్టణంతో పాటు, షేర్ మహమ్మద్‌పేట, మక్కపేట, చిల్లకల్లు, బూదవాడ, అనుమంచిపల్లి, గండ్రాయిల్లో డయేరియా కేసులు ఎక్కువగా నమోదవుతున్నాయి. మృత్యువాత పడిన వారు కూడా ఈ ప్రాంతాలకు చెందిన వారే ఎక్కువగా ఉన్నారు. నిజానికి.. వైద్య, ఆరోగ్యశాఖ ఈ నెల 20నే డయేరియా కేసులను గుర్తించినా అదుపు చేయడంలో జాప్యం జరిగింది. ఆ తర్వాత అప్రమత్తమై ప్రత్యేక వైద్య శిబిరాలు ఏర్పాటుచేసింది. కానీ, అధికారుల హడావిడి తప్ప క్షేత్ర స్థాయిలో ప్రత్యామ్నాయ ఏర్పాట్లు కరువయ్యాయని ప్రజలు ఆరోపిస్తున్నారు.

నీరు కలుషితం.. లోపించిన పారిశుధ్యం..

ఇదిలా ఉంటే.. డయేరియా సోకుతున్న గ్రామాల్లో నీరు కలుషితమైనట్లు వైద్యశాఖ అధికారులు గుర్తించారు. అలాగే, పారిశుధ్యం కూడా అస్తవ్యస్థంగా ఉందని.. నీటిని సరఫరా చేసే రక్షిత మంచినీటి ట్యాంకులు కూడా అపరిశుభ్రంగా ఉన్నట్లు గుర్తించారు. ప్రధానంగా గ్రామాల్లో పారిశుధ్యం పూర్తిగా లోపించింది. ఉదా.. షేర్‌హమ్మద్‌పేట చెరువు ఒడ్డునే తాగునీటి బావి ఉంది. అక్కడ బావి పక్కనే చెత్త చెదారం పేరుకుపోయి ఉంది. పైగా ఆ బావిపైన మెస్ కూడా లేకపోవడంతో నీరు పూర్తిగా కలుషితమవుతోందని గ్రామస్తులు చెబుతున్నారు. అలాగే, అనుమంచిపల్లి, గండ్రాయి, బూదవాడ ప్రాంతాల్లోని పారిశుధ్యం పరిస్థితి కూడా ఇంతే. మక్కపేట ప్రాంతంలో తాగునీటిని ఫిల్టర్ చేయకుండానే సరఫరా చేస్తున్నట్లు సమాచారం.

ప్రత్యేక బృందాల ఏర్పాటు..

ఇక డయేరియా సోకుతున్న గ్రామాల్లో శానిటేషన్ మెరుగుదలకు వైద్య, ఆరోగ్యశాఖ 40 ప్రత్యేక బృందాలను ఏర్పాటుచేసింది. విజయవాడ ప్రభుత్వాస్పత్రిలో 45 పడకలతో ప్రత్యేక వార్డును ఏర్పాటుచేశారు. మరోవైపు.. జగ్గయ్యపేట ప్రాంతాన్ని ఆదివారం వైద్య ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ పర్యటించి బాధితులను పరామర్శించారు. ఆయా శాఖాధికారులతో పరిస్థితిని సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అధికారులు అప్రమత్తంగా ఉండడంలేదని, అలసత్వం వహిస్తున్నారని.. అలాంటి వారిని ఉపేక్షించేదిలేదని హెచ్చరించారు. గ్రామాల్లో ఇంటింటి సర్వేచేయాలని, వైద్య శిబిరాలు ఏర్పాటుచేయాలని సూచించారు.

ఈ కార్యక్రమంలో వైద్య, ఆరోగ్య శాఖ ప్రత్యేక కార్యదర్శి కృష్ణబాబు, కమిషనర్ వెంకటేశ్వర్, జేసీ సంపత్‌కుమార్, ఆర్డీఓలు రవీందర్, మాధవి, డీఎంహెచ్‌ఓ సుహాసిని, వైద్యారోగ్య శాఖ అడిషనల్ ఏడీ సుబ్రహ్మణ్యశ్రీ, మున్సిపల్ ఛైర్మన్ రంగాపురం రాఘవేంద్ర తదితర అధికారులు పాల్గొన్నారు.

217 చోట్ల నీరు కలుషితం

రాష్ట్రవ్యాప్తంగా 168 డయేరియా కేసులు నమోదయ్యాయని.. ఇందులో ఒక్క జగ్గయ్యపేటలోనే 58 కేసులున్నాయని మంత్రి చెప్పారు. ముఖ్యంగా డిస్ట్రిబ్యూటరీ చానళ్లను శుభ్రం చేయకపోవడం, పైపులైన్ల లీకేజీల వల్ల తాగునీటిలో డ్రెయినేజీ మురుగు కలవడం ఇందుకు కారణమన్నారు. ఇక రాష్ట్రవ్యాప్తంగా ప్రతి బుధవారం గ్రామీణ ప్రాంతాల్లో నీటి పరీక్షలు నిర్వహిస్తామని మంత్రి సత్యకుమార్ ప్రకటించారు. ఇప్పటికే 30 వేలకు పైగా నీటి వనరుల నమూనాలు పరీక్షించగా 217 ప్రాంతాల్లో నీరు కలుషితమైనట్లు అధికారులు గుర్తించారన్నారు.

రాజ్‌భవన్‌లో 'చిన్నారుల హక్కులు' పుస్తకావిష్కరణ

మాచర్ల: చిన్న పిల్లల హక్కులపై మాచర్ల పట్టణానికి చెందిన షేక్ జాకీర్ హుస్సేన్ రచించిన పుస్తకాన్ని రాష్ట్ర గవర్నర్ అబ్దుల్ నజీర్ శనివారం రాజ్‌భవన్‌లో ఆవిష్కరించారు. చిన్న పిల్లల రైట్స్ ఫౌండర్ ఆఫ్ చైల్డ్ చాప్టర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జాకీర్ విస్తృతంగా పర్యటించి చిన్నారుల హక్కులపై అధ్యయనం చేసి పుస్తక రూపంలో తెచ్చారు. చైల్డ్ చాప్టర్ అసోసియేషన్ ఫౌండర్ జాకీర్ హుస్సేన్ సేవలను గవర్నర్ ప్రత్యేకంగా అభినందించారు.


పుస్తకం ఆవిష్కరిస్తున్న గవర్నర్ అబ్దుల్ నజీర్

చనిపోయాడనుకున్న వ్యక్తి.. బతికొచ్చాడు!

- రైలు ప్రమాదంలో గుర్తు తెలియని వ్యక్తి మృతి
- సెల్‌ఫోన్ ఆధారంగా కుటుంబీకులకు రైల్వే పోలీసుల సమాచారం
- పుట్టుమచ్చలు నిర్ధారించుకుని అంత్యక్రియలకు ఏర్పాట్లు
- అంతలోనే ప్రత్యక్షమైన చనిపోయాడనుకున్న వ్యక్తి

బషీరాబాద్: చనిపోయాడని ఓ వ్యక్తి అంత్యక్రియలకు బంధువులు అన్ని ఏర్పాట్లు చేసుకున్నారు. మృతదేహాన్ని పొలంలో ఖననం చేసేందుకు సిద్ధమయ్యారు. చివరకు పాడె ఎత్తే సమయానికి చనిపోయాడనుకున్న వ్యక్తి ఇంటి దగ్గర ఆటోలో దిగాడు. దీంతో అక్కడున్నవారంతా ఆశ్చర్యపోయారు. ఈ విచిత్ర ఘటన వికారాబాద్ జిల్లా బషీరాబాద్ మండలం నావంద్గీ గ్రామంలో ఆదివారం చోటు చేసుకుంది.

సెల్‌ఫోన్ చోరీ చేసిన వ్యక్తి మరణించడంతో...

గ్రామానికి చెందిన పిట్టల ఎల్లప్ప (40) బషీరాబాద్‌లో ఓ నాయకుడి దగ్గర పశువుల కాపరిగా పనిచేస్తుండేవాడు. మూడు రోజులుగా పనికి వెళ్లలేదు. ఇంట్లోనూ చెప్పకుండా తాండూరు వెళ్లాడు. అక్కడ అడ్డకూలీ పనికి వెళ్లి రాత్రికి తాండూరు రైల్వే స్టేషన్‌లో పడుకునేవాడు. శుక్రవారం అతడి సెల్‌ఫోన్‌ను రైల్వేస్టేషన్‌లో ఓ వ్యక్తి దొంగిలించాడు. ఈ క్రమంలో శనివారం రాత్రి వికారాబాద్ రైల్వే స్టేషన్‌లో రైలు కింద పడి ఓ వ్యక్తి దుర్మరణం చెందాడు. మృతుడి దగ్గర లభించిన సెల్‌ఫోన్ ఆధారంగా రైల్వే పోలీసులు కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చారు. దీంతో భార్య ఎములమ్మ, బంధువులు, గ్రామస్తులు ఆదివారం ఉదయం వికారాబాద్ ఆస్పత్రికి చేరుకున్నారు. తలలేని శరీరంపై పుట్టుమచ్చలు గుర్తుపట్టి తమకు సంబంధించిన వ్యక్తి అని చెప్పడంతో శవాన్ని అప్పగించారు. అంబులెన్సులో మృతదేహాన్ని ఇంటికి తీసుకెళ్లారు. కుటుంబీకులు, బంధువుల రోదనలతో ఇంట్లో విషాదం నెలకొంది. అంత్యక్రియలకు ఏర్పాట్లు చేస్తుండగానే ఎల్లప్ప తాపీగా ఆటోలో వచ్చి ఇంటి వద్ద దిగాడు. దీంతో ఎల్లప్ప సెల్‌ఫోన్ చోరీ చేసిన వ్యక్తి రైలు ప్రమాదంలో మృతి చెందినట్లు గుర్తించి మృతదేహాన్ని తిరిగి రైల్వే పోలీసులకు అప్పగించారు.

నకిలీ ఎరువుతో రైతుకు దగా


గడ్డకట్టిన యూరియా

గుర్రంకొండ: నకిలీ డ్రిప్ ఎరువు రైతును నట్టేట ముంచింది. మండలంలోని ఎల్లుట్ల పంచాయతీ శీలరిపల్లెకి చెందిన రామిశెట్టి రెడ్డిశేఖర్ ఎకరం పొలం కౌలుకు తీసుకుని టమాటా పంట సాగు చేశారు. మరో పది రోజుల్లో పంట కోతకు వస్తుంది. ఈ నేపథ్యంలో ఈ నెల 19న టమాటా సైజు పెరిగేందుకు స్థానికంగా ఉన్న ఓ దుకాణంలో డ్రిప్ ఎరువు బస్తా కొనుగోలు చేశాడు. యజమానికి డబ్బు చెల్లించినా.. బిల్లు ఇవ్వకుండా తెల్ల కాగితంపై రూ.4400 రాసి ఇచ్చాడు. అనంతరం రైతు ఆ ఎరువును డ్రమ్ము నీటిలో కలిపి డ్రిప్ పైపుల ద్వారా తన పంటకు పెట్టాడు. శనివారం వరకు వేచి చూసిన అనంతరం మొక్కపై టమాటా పూత, పిందె రాలి పోవడం, చెట్టు ఆకులు ఆకుముడత రోగం వచ్చినట్లు ముడుచుకుపోవడం గమనించాడు. మళ్లీ ఆదివారం మిగిలిన సగం బస్తా వేసి కలపగా పైకి బురుగు రాకపోవడం, గంట వరకు కరగక పోవడం, గుళికలు గడ్డకట్టడం చూసి రైతు ఆశ్చర్యపోయాడు. పైగా ఆర్బీకేల్లో యూరియా బస్తా రూ.266 కాగా, అదే బస్తా ఉప్పుతో కలిపి డ్రిప్ ఎరువు అంటూ రూ.4400 వసూలు చేయడంతో తాను దగా పడ్డానని తెలుసుకున్నాడు. వెంటనే దుకాణానికి వెళ్లి బిల్లు ఇవ్వాలని నిలదీయగా, సదరు ఎరువు దుకాణం యజమాని ఇవ్వలేదు. దీంతో పంట నష్టపోయానంటూ రైతు లబోదిబోమంటూ వెనుదిరిగాడు. అధికారులు విచారించి తనకు న్యాయం చేయాలని రైతు రెడ్డిశేఖర్ కోరుతున్నారు.

నీటి గుంతలో పడి చిన్నారి మృతి

పెద్దమండ్యం: నీటి గుంతలో పడి ఓ చిన్నారి మృతి చెందిన సంఘటన మండలంలోని కుంటకింద గొల్లపల్లెలో ఆదివారం జరిగింది. గ్రామానికి చెందిన పరదేశి శ్రీనివాసులు కుమారుడు ఈశ్వరయ్య(8) బండెపురెడ్డిగారిపల్లె ప్రాథమిక పాఠశాలలో మూడో తరగతి చదువుతున్నాడు. ఆదివారం సెలవు కావడంతో పల్లెకు సమీపంలోని చిన్నాయునికుంటలో మరో ముగ్గురు పిల్లలతో కలిసి ఆడుకొనేందుకు వెళ్లారు. లోతుగా ఉన్న గుంతను గమనించక చిన్నారి అందులో పడిపోయాడు. తోటి చిన్నారులు గుంతలో పడిన విషయాన్ని పల్లెలోకి వచ్చి తెలిపారు. యువకులు అక్కడికి వెళ్లి చూసి చిన్నారిని వెలికితీయగా అప్పటికే మృతిచెందాడు. చిన్నారి మృతితో పల్లెలో విషాదం నెలకొంది.

ఉచిత పంటల బీమాను కొనసాగించాల్సిందే

- ప్రభుత్వమే ప్రీమియం చెల్లించాలి
- వ్యవసాయ మీటర్లు నిలిపేయాలి
- ఏపీ రైతు సంఘం డిమాండ్

సాక్షి, అమరావతి: మేనిఫెస్టోలో రైతులకు ఇచ్చిన హామీల అమలుకు రాష్ట్ర ప్రభుత్వం చిత్తశుద్ధితో కృషి చేయాలని ఏపీ రైతు సంఘం డిమాండ్ చేసింది. రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కె.అచ్చెన్నాయుడుకు రాసిన లేఖను సంఘ అధ్యక్షుడు వి.కృష్ణయ్య, ప్రధాన కార్యదర్శులు కె.ప్రభాకరరెడ్డి ఆదివారం మీడియాకు విడుదల చేశారు. రైతు భరోసా పథకం కింద ప్రతి రైతుకు రూ.20 వేల చొప్పున ఇస్తామన్న పెట్టుబడి సాయం వెంటనే రైతుల ఖాతాలకు జమ చేయాలని, రబీలో దెబ్బతిన్న పంటలకు సంబంధించి రైతులకు పరిహారం, సున్నా వడ్డీ రాయితీలను జమ చేయాలని, వ్యవసాయ విద్యుత్ మీటర్ల ఏర్పాటు జీవోను వెనక్కి తీసుకోవాలని రైతు సంఘం కోరింది. రైతు భరోసా కేంద్రాలను అభివృద్ధి చేసి, రైతులకు మరిన్ని సేవలను అందుబాటులోకి తీసుకురావాలని, సొసైటీలకు పాలు పోసే రైతులకు లీటర్‌కు రూ.5, బోనస్ ఇవ్వాలని, మూతపడిన డెయిరీలను పునరుద్ధరించాలని విజ్ఞప్తి చేసింది. మద్దతు ధరపై ప్రతి పంటకు రూ.500 బోనస్ ఇవ్వాలని, ఆహార, పప్పుధాన్యాలు, వాణిజ్య, ఉద్యాన పంటలన్నిటికి మద్దతు ధరలు ప్రకటించాలని కోరింది. రబీలో రైతుల నుంచి సేకరించిన ధాన్యానికి సంబంధించిన రూ.1,600 కోట్ల బకాయిలను వెంటనే చెల్లించాలని, ఉచిత పంటల బీమా పథకాన్ని కొనసాగించాలని, రైతుల చెల్లించాల్సిన ప్రీమియం మొత్తాన్ని ప్రభుత్వమే చెల్లించాలని, అప్పుల పాలైన రైతులు బకాయిపడిన రూ.2 లక్షల వ్యవసాయ రుణాలను రద్దు చేయాలని కోరింది.

చక్కెర కర్మాగారాల్ని పునరుద్ధరించాలి

రాష్ట్రంలోని 32 లక్షల కౌలు రైతులకు యజమాని సంతకంతో సంబంధం లేకుండా గుర్తింపు కార్డులు ఇవ్వడంతో పాటు వారికి అవసరమైన బ్యాంక్ రుణాలు, ఇతర సంక్షేమ ఫలాలు అందేలా చర్యలు తీసుకోవాలని రైతు సంఘం కోరింది. రాష్ట్రంలో మూతపడిన 25 చక్కెర కర్మాగారాలను వెంటనే పునరుద్ధరించాలని, పోలవరం ప్రాజెక్టును సకాలంలో పూర్తి చేసి నిర్వాసితులకు పునరావాసం, నష్టపరిహారం పంపిణీ చేయాలని విజ్ఞప్తి చేసింది. రాయలసీమ, ఉత్తరాంధ్ర ప్రాంతాల్లో పెండింగ్‌లో ఉన్న సాగునీటి ప్రాజెక్టులు, ఎత్తిపోతల పథకాలను పూర్తి చేయాలని కోరింది.

'ఎయిడెడ్' సమస్యపై ప్రభుత్వం దృష్టి పెట్టాలి

సాక్షి, అమరావతి: రాష్ట్రంలోని ఎయిడెడ్ పాఠశాలలు, ఉపాధ్యాయుల సమస్యలపై ప్రభుత్వం దృష్టి సారించి పరిష్కరించాలని విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్‌కు ఆంధ్రప్రదేశ్ టీచర్స్ గిల్డ్ విజ్ఞప్తి చేసింది. ప్రస్తుతం రాష్ట్రంలో 846 ఎయిడెడ్ పాఠశాలలు ఉండగా, 150 పాఠశాలల్లో విద్యార్థులు లేక ఉపాధ్యాయులు ఇతర పాఠశాలల్లో డిప్యూటేషన్‌పై వెళ్లిపోయారని, మరి కొన్ని పాఠశాలల్లో ఉపాధ్యాయులు ఖాళీగా ఉంటున్నారని శనివారం ఓ ప్రకటనలో పేర్కొంది. ప్రస్తుతం ఎయిడెడ్‌లో పనిచేస్తున్న 2,100 మంది సిబ్బంది మిగులు ఉన్నారని, ఇక్కడి ఉపాధ్యాయులను విద్యార్థులున్న ప్రభుత్వ పాఠశాలల్లో సర్దుబాటు చేయాలని టీచర్స్ గిల్డ్ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు బి.చిట్టిబాబు, ఎల్కే చిన్నప్ప, ప్రతినిధి ప్రభాకర్‌రెడ్డి కోరారు. సిబ్బందికి 1998 నుంచి మెడికల్ రీయింబర్స్‌మెంట్ సౌకర్యం గాని, ఆరోగ్య కార్డు సౌకర్యం గాని లేదన్నారు. సర్వీసులో ఉండి మరణించిన సిబ్బంది కుటుంబ సభ్యులకు కారుణ్య నియామకాలు చేపట్టాలని వారు కోరారు.

చంద్రన్న బీమా రూ.10 లక్షలకు పెంపు

రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి



కాకినాడ సిటీ: ఇంట్లో కుటుంబ పెద్ద చనిపోతే కుటుంబాన్ని ఆదుకునేందుకు ఉపయోగపడే చంద్రన్న బీమా సొమ్మును రూ.3 లక్షల నుంచి రూ.10 లక్షలకు పెంచుతున్నట్లు రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ తెలిపారు. కాకినాడ ఆర్అండ్‌బీ అతిథి గృహంలో ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. కార్మిక సంక్షేమానికి ప్రభుత్వం పటిష్టమైన ప్రణాళికలను రూపొందిస్తోందని, కార్మికులతో పాటు పాత్రికేయులు, న్యాయవాదులను కూడా ఈ బీమా పరిధిలోకి తెచ్చేందుకు సన్నాహాలు చేస్తున్నామని చెప్పారు. అనంతరం కాకినాడ ప్రభుత్వ ఆస్పత్రిలో డయేరియా బాధితులను పరామర్శించారు. కాకినాడ సిటీ ఎమ్మెల్యే వనమాడి వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

ఏపీలో విధ్వంస పాలనకు చంద్రబాబు శ్రీకారం

దళిత బహుజన పార్టీ జాతీయ అధ్యక్షుడు వడ్లమూరి

హైదరాబాద్: కక్ష సాధింపు, విధ్వంస పాలనకు చంద్రబాబు శ్రీకారం చుట్టారని దళిత బహుజన పార్టీ జాతీయ అధ్యక్షుడు వడ్లమూరి కృష్ణస్వరూప్ ఆరోపించారు. వైఎస్సార్‌సీపీ కార్యాలయాన్ని కూల్చివేయడాన్ని ప్రజాస్వామిక వ్యతిరేక చర్యగా అభివర్ణించారు. హైదరాబాద్‌లోని పార్టీ కార్యాలయంలో ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. కూల్చి వేసిన స్థానంలోనే తిరిగి వైఎస్సార్‌సీపీ కార్యాలయాన్ని ప్రభుత్వం తిరిగి నిర్మించాలని డిమాండ్ చేశారు. సీఆర్‌డీఏ అధికారులపై చర్యలు తీసుకోవాలని ఏపీ హైకోర్టుకు విజ్ఞప్తి చేశారు. కోర్టు తీర్పునకు విరుద్ధంగా పార్టీ కార్యాలయాన్ని ఎలా కూల్చివేస్తారని ప్రభుత్వాన్ని నిలదీశారు. అమరావతి చుట్టుపక్కల ఉన్న టీడీపీ, బీజేపీ, జనసేన కార్యాలయాల నిర్మాణాలపై సమగ్ర విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు.

ఓటమిపై సమీక్ష చేస్తాం

గురజాల వైఎస్సార్‌సీపీ మాజీ ఎమ్మెల్యే కాసు మహేశ్‌రెడ్డి



దాచేపల్లి: తమ ఓటమిపై సమీక్షించుకుంటామని పల్నాడు జిల్లా గురజాల వైఎస్సార్‌సీపీ మాజీ ఎమ్మెల్యే కాసు మహేశ్‌రెడ్డి తెలిపారు. టీడీపీ చేస్తున్న అవమానాలు, వేస్తున్న నిందలను తట్టుకుని నిలబడతామన్నారు. ఇవే తమలో పట్టుదల పెంచుతాయని చెప్పారు. ఆదివారం ఆయన దాచేపల్లిలో మీడియాతో మాట్లాడారు. దివంగత సీఎం వైఎస్ రాజశేఖరరెడ్డి అకాల మరణం తరువాత వైఎస్ జగన్‌ను ఎన్నో రకాలుగా కాంగ్రెస్ పార్టీ అవమానించిందని గుర్తు చేశారు. ఈ అవమానాలే ఆయనలో పట్టుదలను పెంచి.. వైఎస్సార్‌సీపీని ఏర్పాటు చేసి సీఎం అయ్యేలా చేశాయన్నారు. నిండు సభలో పాండవులను అవమానిస్తే యుద్ధం చేసి రాజ్యం సాధించుకున్నారని గుర్తు చేశారు. అలాగే టీడీపీ చేసే అవమానాలను దీటుగా ఎదుర్కొంటామన్నారు. మళ్లీ ప్రజల అండదండలతో అధికారంలోకి రావడం ఖాయమని చెప్పారు. టీడీపీకి ప్రజలు ఒక అవకాశం ఇచ్చారని, దీన్ని సద్వినియోగం చేసుకోకుండా దుర్వినియోగం చేస్తోందని మండిపడ్డారు. గెలిచిన వెంటనే వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు, నేతలపై దాడులు చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ అవమానాల ప్రతిఫలం టీడీపీ అనుభవించాల్సి ఉంటుందన్నారు. తాము వెనకడుగు వేసే ప్రసక్తే లేదన్నారు. ప్రజలకు మంచి చేసే విధానంలో హుందాగా వ్యవహరిస్తామని తెలిపారు. జగనన్న నాయకత్వంలో పార్టీని బలోపేతం చేస్తామన్నారు. రాజకీయాల్లో గెలుపోటములు సహజమని, మహామహులే ఓడిపోయారని గుర్తు చేశారు. సంక్షేమ పథకాలు అద్భుతంగా చేసినప్పటికీ మద్యం, ఇసుక విషయంలో ప్రభుత్వం పట్ల ప్రజల్లో, కార్మికుల్లో కొంత అసంతృప్తి ఉన్నట్లు గుర్తించామన్నారు. తప్పులు ఎక్కడ జరిగాయో తెలుసుకుని మళ్లీ అవి జరగకుండా చూసుకుంటామన్నారు. ప్రతి కార్యకర్త, నాయకుడు ధైర్యంగా ఉండాలని, త్వరలోనే ప్రతి ఒక్కరినీ కలుస్తానన్నారు.

శ్యామ ప్రసాద్ ముఖర్జీకి బీజేపీ నివాళి

సాక్షి, అమరావతి: దేశహితం కోసం బలిదానం చేసిన మహనీయుడు శ్యామ ప్రసాద్ ముఖర్జీ అంటూ పలువురు బీజేపీ నేతలు కొనియాడారు. బీజేపీ సిద్ధాంతకర్తల్లో ప్రముఖులు శ్యామ ప్రసాద్ ముఖర్జీ బలిదాన్ దివస్ సందర్భంగా ఆదివారం విజయవాడలోని బీజేపీ రాష్ట్ర కార్యాలయంలోనూ, వివిధ ప్రాంతాల్లో పార్టీ నేతలు ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించారు. శ్యామ ప్రసాద్ ముఖర్జీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. కేంద్ర మంత్రి భూపతిరాజు శ్రీనివాస వర్మ సోషల్ మీడియా 'ఎక్స్'లో శ్యామ ప్రసాద్ ముఖర్జీ కి నివాళి అర్పించారు.

రోడ్డు ప్రమాదాల రహిత రాష్ట్రంగా ఏపీ

రవాణా శాఖ మంత్రి రామ్‌ప్రసాద్ రెడ్డి



సాక్షి, అమరావతి : రోడ్డు ప్రమాదాల రహిత రాష్ట్రంగా ఆంధ్రప్రదేశ్‌ను తీర్చిదిద్దడమే లక్ష్యమని రవాణా మంత్రి ఎం.రామ్‌ప్రసాద్‌రెడ్డి తెలిపారు. ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణం పథకాన్ని నెలరోజుల్లోనే ప్రారంభిస్తామన్నారు. రాష్ట్ర రవాణా, క్రీడలు, యువజన సర్వీసులు శాఖమంత్రిగా ఆయన వెలగపూడిలోని సచివాలయంలో ఆదివారం బాధ్యతలు స్వీకరించారు. ప్రకాశం జిల్లా దర్శిలో రూ.18.51కోట్లతో డ్రైవింగ్ శిక్షణ–పరిశోధన సంస్థ ఏర్పాటు ఫైలుపై తొలి సంతకం చేశారు. ఈసందర్భంగా మాట్లాడుతూ ఉచిత బస్సు ప్రయాణం పథకం అమలులో ఎదురవుతున్న సమస్యలు మన రాష్ట్రంలో తలెత్తకుండా తగిన చర్యలు తీసుకుంటామన్నారు. రాష్ట్రంలో 365 క్రీడల నిర్వహణకు ప్రణాళిక రూపొందిస్తామని చెప్పారు.

ప్రత్యేకహోదాతోనే ఉత్తరాంధ్ర అభివృద్ధి : శంకర్రావు



యలమంచిలి రూరల్ (అనకాపల్లి జిల్లా): రాష్ట్రానికి ప్రత్యేక హోదా ఇస్తేనే వెనుకబడిన ఉత్తరాంధ్ర అభివృద్ధి చెందుతుందని మహాత్మా జ్యోతిరావు పూలే ఆల్ ఇండియా ఓబీసీ అసోసియేషన్ జనరల్ సెక్రటరీ రౌతు శంకర్రావు చెప్పారు. ఆదివారం యలమంచిలిలో మీడియాతో మాట్లాడారు. రాష్ట్రానికి ప్రత్యేకహోదా ముగిసిన అధ్యాయమంటూ బీజేపీ పట్టించుకోకపోవడం దురదృష్టకరమని చెప్పారు. హోదాతో పాటు విభజన హామీల్లో అధికశాతం నేటికీ అమలు చేయలేదన్నారు. ఇటీవల ఎన్నికల్లో గెలిచి కేంద్రంలోను, రాష్ట్రంలోను అధికారంలోకి వచ్చిన ఎన్డీఏ ప్రభుత్వాల పాలకులు రాష్ట్రానికి జరిగిన అన్యాయాన్ని గుర్తించి వెంటనే దిద్దుబాటు చర్యలు చేపట్టాలని ఆయన కోరారు. రాష్ట్రానికి ప్రత్యేకహోదా ఇవ్వడంతోపాటు ఉత్తరాంధ్రకు ప్రత్యేక ప్యాకేజీ ప్రకటించాలని డిమాండ్ చేశారు. విశాఖ ఉక్కు పరిశ్రమ ప్రైవేటీకరణ నిర్ణయాన్ని విరమించు కోవాలని, రాష్ట్ర ప్రభుత్వం కేంద్రంపై ఒత్తిడి తెచ్చి రాష్ట్రానికి అన్నిరకాలుగా న్యాయం జరిగేలా చూడాలని కోరారు.



“మీకు బాగా నచ్చినదాన్ని అత్యంత క్రమశిక్షణా రాహిత్యంతో, సందర్భశుద్ధి లేకుండా, అసలైన పద్ధతిలో కష్టపడి చదవండి.

– రిచర్డ్ పి. ఫెయిన్‌మాన్

సాక్షి

సోమవారం, 24 జూన్ 2024

సంపూర్ణ జీవితం

భట్టి విక్రమార్క కథలో, విక్రమార్కుడి బుద్ధి కుశలతను మెచ్చి, వెయ్యేళ్లు పరిపాలించే సింహాసనాన్ని బహూకరిస్తాడు ఇంద్రుడు. అంటే వెయ్యేళ్ల ఆయువు. మరి నా సంగతేమిటని విక్రమార్కుడిని అడుగుతాడు సోదరుడు భట్టి. అన్నింటికీ వెన్నంటి ఉండే భట్టి సంగతి మరిచేపోయాడు విక్రమార్కుడు. దాంతో భట్టి ఆవేశంతో కాళికాదేవి తపస్సు చేసి, రెండు వేల ఏళ్లు బతికే వరం పొందుతాడు. మరి నా సంగతేమిటని అడుగుతాడు విక్రమార్కుడు. ఇద్దరు కలిసి కదా బతకాలి! అప్పుడు ఆలోచన చేస్తారు. సింహాసనం మీద వెయ్యేళ్లు కూర్చుని కదా పాలించమన్నది... అంటే అది ఆయువు పరిమితి కాదు, రాజ్యపాలన పరిమితి. అందుకే ఆరు నెలలు రాజ్య పాలన, ఆరు నెలలు అరణ్యవాస పథకం వేస్తారు. అలా భట్టి విక్రమార్కులు ఇద్దరూ రెండు వేల ఏళ్లు బతుకుతారు. ఒక్క భట్టి విక్రమార్కులేనా? రామాయణంలో దశరథుడు వేల ఏళ్లు బతికాడు. ఎందరో మునులు, ఋషులు వేల ఏళ్లు తపస్సులోనే గడిపి ఎన్నో శక్తులు సాధించిన కథలున్నాయి. ఎప్పటికీ చనిపోని వరాలు పొందిన రాక్షసులు ఎందరో మన పురాణాల్లో ఉన్నారు. ఎప్పటికీ బతికివుండేలా దేవతలు అమృతాన్ని సేవించారు. చనిపోయినవాళ్లను అట్టే మళ్లీ పునర్జీవింపజేసే సంజీవని కథలు, గాయాలన్నీ మానిపోయి దృఢకాయులయ్యే లేపనాల గాథలు మనకున్నాయి. వేల ఏళ్లు బతకడం అంటే దాదాపుగా చావు లేకపోవడమనే! జీవితానికి అంతం పలికే చావు అనేదాన్ని తప్పించే అన్ని ప్రయత్నాలనూ మనిషి కనీసం కథల్లోనైనా, కలల్లోనైనా చేశాడనుకోవచ్చు.

ఎప్పటికైనా చచ్చిపోతామనే వాస్తవం మనిషిని కలవరపెడుతుంది. సమస్త మానవాళి గురించి కాకపోయినా, కనీసం తన అయినవారు తనకు కాకుండాపోతారన్న చింత ఉండటంతోపాటు తానూ ఒకరోజు ఈ భూమ్మీద శూన్యంగా మిగిలిపోతాడన్నది జీర్ణం చేసుకోలేని చేదుమాత్ర. అన్ని మతాలూ మరణానంతర జీవితాలను వాగ్దానం చేయడంలో అందుకే విజయం సాధించి ఉంటాయి. చచ్చాక ఏమీ లేదు అనుకోవడం కంటే, ఆ పైనెక్కడో మళ్లీ బతుకుతాం అనేది ఒక ఊరట. అదే సమయంలో చిట్టచివర చావు అనేది ఉంటుందని తెలియడం కొంతమందికి ఒక రిలీఫ్ కూడా. లేకపోతే ఎంతకాలం ఈ రోజువారీ సంకెళ్ల లాంటి వ్యవహారాలను లాక్కురావడం? అందుకే మన పెద్దలు మళ్లీ పుట్టుక లేని ముక్తిని కోరుకున్నారు కాబోలు.

సృష్టిలోని ప్రతి జీవికీ ఒక ఆయుఃప్రమాణాన్ని నిర్దేశించిన ప్రకృతి, మనిషికి 120 ఏళ్లు ఇచ్చింది. శతమానం భవతి అని పెద్దలు దీవిస్తుంటారుగానీ, దాన్ని నూరేళ్లు అనికాక, పూర్ణాయువుతో బతకమని దీవించడంగా అర్థం చేసుకోవచ్చు. అర్ధంతరంగా మరణించడం ఆ ప్రకృతి వరాన్ని పాడుచేసుకోవడమే. అర్ధంతర మరణం ఆధునిక మానవుడికి సంభవించడానికి కర్షుడి చావుకు ఉన్నన్ని కారణాలు ఉన్నాయి. మృత్యువును, రోగాలను మోసం చేసి దీర్ఘకాలం బతగ్గలమా? మన ఆయుఃప్రమాణం కంటే చాలా ఏళ్ల పాటు బతకడాన్ని నూతన శాస్త్రీయ ఆవిష్కరణలు సాధ్యం చేయనున్నాయా? మనిషి శాశ్వతత్వాన్ని సాధించగలడా? మన ఫిజియాలజీని మార్పు చేయడం ద్వారా జీవితకాలాన్ని పొడిగించవచ్చా? ఇలాంటి ప్రశ్నలను నోబెల్ పురస్కారం అందుకున్న వెంకీ రామకృష్ణన్ తన ‘వై వి డై: ద న్యూ సైన్స్ ఆఫ్ ఏజింగ్ అండ్ ద క్వెస్ట్ ఫర్ ఇమ్మోర్టాలిటీ’ పుస్తకంలో చర్చించారు. మనిషి శరీరం కోటానుకోట్ల కణాల నిర్మితం. ప్రతి కణంలో ఉండే డీఎన్ఏ ప్రతిరోజూ లక్ష మార్పులకు గురవుతుంది. డీఎన్ఏను నాలుగక్షరాల వర్ణమాలలో రాసిన సుదీర్ఘమైన కోడ్ అనుకుంటే, నెమ్మదిగా దాని కార్యకలాపంలో అంతరాయం రావడమే ముదిమి రావడం. ప్రస్తుతం ప్రపంచవ్యాప్తంగా సుమారు 700 బయోటెక్ కంపెనీలు ముదిమి, జీవితకాల పొడిగింపు మీద పని చేస్తున్నాయి. ‘యవ్వనంలో ఉన్నప్పుడు ధనికులం కావాలనుకుంటాం; ధనికులం అయ్యాక యవ్వనాన్ని కోరుకుంటాం. యవ్వనాన్ని కొనలేకపోయినా, కనీసం దానిమీద పరిశోధనలనైనా (ఏజింగ్ రీసెర్చ్) ధనికులు కొంటున్నా’రంటారు వెంకీ రామకృష్ణన్. ఒకవేళ శాస్త్ర పరిశోధనలు ముదిమిని ఆపడంలో విజయం సాధించినా ఆ ఫలితాలు సంపన్నులకు తప్ప పేదవాళ్లకు తేలిగ్గా అందుబాటులోకి రావని చెబుతారు.

ఈ శాస్త్రాలు, పరిశోధనలతో నిమిత్తం లేకుండా; ధనిక, పేద అనే తేడా లేకుండా జీవితాన్నే ఒక సాధనగా మలుచుకున్న కొన్ని ప్రాంతాల్లో మనుషులు సంపూర్ణ ఆయువును అనుభవిస్తున్నారు. ఒకినావా (జపాన్), సార్డీనియా (ఇటలీ), నికోయా (కోస్టా రికా), ఇకారియా (గ్రీస్), లోమ లిండా (కాలిఫోర్నియా, అమెరికా)... లాంటి ప్రదేశాల్లో ఎక్కువమంది వందేళ్లు బతకడమో, దీర్ఘకాలం బతకడమో కనబడుతుంది. ఇలాంటి ప్రదేశాలు ప్రపంచంలో ‘బ్లూ జోన్స్’గా నిలుస్తున్నాయి. ‘లివ్ టు 100: సీక్రెట్స్ ఆఫ్ ద బ్లూ జోన్స్’ డాక్యుమెంటరీ ప్రయోక్త డాన్ బ్యూట్నర్... ఈ బ్లూ జోన్స్ అని నామకరణం చేయడమే కాకుండా, వాళ్ల దీర్ఘాయువు రహస్యాలను పరిశోధించారు. శారీరక కార్యకలాపాలు, తక్కువ ఒత్తిడి, స్థానికంగా దొరికే ఆహారాన్ని వినియోగించడం, బలమైన కుటుంబ, సామాజిక సంబంధాలు వీరిని ఆరోగ్యవంతులుగా ఉంచుతున్నాయని బ్యూట్నర్ చెబుతారు. రసాయనిక ఎరువులు వేయని పంటలు, 95 శాతం మొక్క ఆధారిత ఆహారం, ఎనభై శాతం మాత్రమే తిని కడుపులో కొంత ఖాళీ ఉంచుకోవడంతోపాటు, జీవితానికి ఒక ఉద్దేశం ఉంచుకోవడం వారిని ఉత్సాహవంతులుగా ఉంచే అదనపు విషయాలు. వెంకీ రామకృష్ణన్ అయినా, బ్లూ జోన్స్ శతాధికులైనా మనిషి ఆరోగ్యానికి కీలకమని చెప్పేవి మూడు: ఆహారం, వ్యాయామం, నిద్ర. ఇవైతే మన చేతిలోనే ఉన్నాయి.

వాక్ స్వాతంత్ర్యంపై విచారణా?

కామెంట్



కరణ్ థాపర్

కశ్మీర్ భారతదేశంలో అంతర్భాగమా అని ప్రశ్నించటం ద్వారా వేర్పాటువాదాన్ని సమర్థించినట్లు ఆరోపణలు వచ్చిన పద్నాలుగేళ్ల తర్వాత ‘ఉపా’ చట్టం కింద అరుంధతీ రాయ్‌ని విచారించేందుకు ఢిల్లీ లెఫ్టినెంట్ గవర్నర్ అనుమతి మంజూరు చేశారు. భారత్‌లో విలీనాన్ని ప్రశ్నించటం, లేదా విడిపోవాలని కోరటం ఇదే మొదటిసారి కాదు. 1962 మే 1న తన తొలి రాజ్యసభ ప్రసంగంలో సి.ఎన్. అన్నాదురై సరిగ్గా ఇలాంటి ఉద్దేశాలనే వ్యక్తం చేశారు. అందుకు నెహ్రూ తెల్లబోయి ఉండవచ్చు కానీ, అన్నాదురై మీద చట్టపరమైన విచారణ జరగలేదు. నేడు మనం విశ్వ గురువులమని చెప్పుకొంటున్నప్పుడు అరుంధతీ రాయ్ పట్ల ఈ నిర్దయాపూరితమైన వ్యవహారశైలి మన గురించిన బాధాకరమైన సత్యాన్ని ప్రపంచానికి వెల్లడించదా?

మహాత్మా గాంధీ, అందునా మన జాతి పిత... ఆయన చెప్పిన విషయాలను మనం ఎంత తరచుగా గుర్తు చేసుకుంటున్నాం? అంతకన్నా కూడా ఎంత తరచుగా మన ప్రభుత్వాలు ఆయన ఆకాంక్షలకు కట్టుబడి ఉంటున్నాయి? ఇదేమీ అలంకారిక ప్రశ్న కాదని మీరు తొందరలోనే గ్రహిస్తారు. నిజానికి, మనకింకా మనస్సాక్షి అన్నది మిగిలి ఉంటే బహుశా అదొక ఇబ్బందికరమైన మనోస్థితి కావచ్చు!

1922 మార్చి 18న ‘యంగ్ ఇండియా’ పత్రికలో... ప్రభుత్వాలకు, మన పైన అధికారం కలిగి ఉన్న వారికి తన వైఖరి ఏమిటో గాంధీ వివరించారు. ‘‘ప్రభుత్వం పట్ల అసంతృప్తిగా ఉండటాన్ని ఒక ధర్మంగా నేను భావిస్తున్నాను’’ అని రాశారు. ‘‘ఒక వ్యక్తికి – ఆ వ్యక్తి హింసను తలవనంత వరకు, హింసను ప్రోత్సహించనంత వరకు, లేదా హింసను ప్రేరేపించనంత వరకు – తన అయిష్టతను పూర్తిగా వ్యక్తీకరించటానికి స్వేచ్ఛ ఉండాలి’’ అన్నారు. మన ప్రభుత్వం శిలాక్షరాలుగా చెక్కించి ప్రతి ఒక్క మంత్రి కార్యాలయంలో ప్రముఖంగా కనిపించేలా ఉంచాల్సిన మాటలివి.

ఆ మాటలు ఈ కాలానికీ ఎందుకు సరిపోతాయో వివరిస్తాను. కశ్మీర్ అన్నది భారతదేశంలో ‘అంతర్భాగమా’ అని ప్రశ్నించటం ద్వారా వేర్పాటువాదాన్ని సమర్థించినట్లు పద్నాలుగేళ్ల క్రితం వచ్చిన ఆరోపణలపై ‘ఉపా’ (చట్టవిరుద్ధ కార్యకలాపాల నిరోధక) చట్టం కింద అరుంధతీ రాయ్‌ని విచారించేందుకు తాజాగా ఢిల్లీ లెఫ్టినెంట్ గవర్నర్ అనుమతి మంజూరు చేశారు. దాదాపు ఒకటిన్నర దశాబ్దం పాటు – ఇందులో సుదీర్ఘమైన పదేళ్ల కాలం మోదీ ప్రభుత్వంలోనిది – ఎలాంటి నిర్ణయమూ తీసుకోకపోవటం, లేదా తీసుకోవటం అవసరమని భావించకపోవటం అనే వాస్తవం ఎన్నో విషయాలను చెబుతోంది. ‘ఇప్పుడు ఎందుకు?’ అనే ప్రశ్నను కూడా లేవనెత్తుతోంది.

భారతదేశంలో ప్రముఖులు ఒకరు రాష్ట్ర విలీనాన్ని ప్రశ్నించటం, లేదా విడిపోవాలని కోరటం ఇదే మొదటిసారి కాదు. 1962 మే 1న తన తొలి రాజ్యసభ ప్రసంగంలో సి.ఎన్. అన్నాదురై సరిగ్గా ఇలాంటి ఉద్దేశాలనే వ్యక్తం చేశారు. ‘‘ద్రవిడియన్లు స్వయం నిర్ణయాధికారం కోసం డిమాండ్ చేస్తున్నారు... దక్షిణాది రాష్ట్రాలకు మాకు ప్రత్యేక దేశం కావాలి’’ అన్నారు. ఆ మాటకు నెహ్రూ తెల్లబోయి ఉండవచ్చు కానీ అన్నాదురై మీద చట్టపరమైన విచారణ జరగలేదు. ఆయన మాటల్ని దేశ వ్యతిరేకమైనవిగా పరిగణించలేదు. నిజమే, అన్నాదురై అలా కోరటం అభ్యంతరకరం, అవాంఛనీయం కావచ్చు. కానీ ఆరు దశాబ్దాల క్రితమే భారతదేశం అన్నాదురై మాటల్ని ఆయన వాక్ స్వాతంత్ర్యంలో భాగంగా అంగీకరించింది. ఆ కాలంలోనే వివాదాస్పద ఉద్దేశాన్ని వ్యక్తం చేయటాన్ని సైతం వాక్ స్వాతంత్ర్యంలోని ఒక హక్కుగా మనం గుర్తించాం. ‘‘ప్రభుత్వం పట్ల అసంతృప్తిగా ఉండటాన్ని ఒక ధర్మంగా నేను భావిస్తున్నాను’’ అనే గాంధీజీ ప్రసిద్ధ ప్రకటనను గౌరవించాం.



అరుంధతీ రాయ్

ప్రపంచం మనకు ఏదైనా నేర్పించిందీ అంటే అది నేడు మరింత సహనాన్ని, సర్దుబాటును కలిగి ఉండమనే. బ్రిటన్‌లోని స్కాటిష్ జాతీయవాదులు, కెనడాలోని పార్టీ కెబెక్వాలు, లేదా స్పెయిన్‌లోని కెటలాన్‌లు ఆయా దేశాల నుంచి విడిపోవటం కోసం చేసిన వేర్పాటు ఉద్యమాలు గౌరవనీయమైనవిగా, దేశ వ్యతిరేకమైనవి కానివిగా పరిగణన పొందటం అంటే... పరిణతి చెందిన వివేకవంతమైన ప్రజాస్వామ్యాలు అలాంటి వేర్పాటువాద ఉద్యమ పిలుపులను దేశ వ్యతిరేకమైనవిగా చూడకూడదని సూచించటమే కదా? ఎలా మనం వివేచన గల సహనశీలత నుండి అనాలోచితమైన, ఆమోదయోగ్యం కాని అసహనంలోకి జారిపోయాం?

అందుకు కారణం... వేర్పాటు గురించి మాట్లాడి, మనల్ని కలవరానికి గురి చేసినవారు అరుంధతీ రాయ్ కావటమేనా? అందుకు కారణం... మోదీ ప్రభుత్వంపై పదునైన విమర్శ చేస్తున్న ఆమె గొంతుక ఎదురులేనిదిగా, నమ్మదగినదిగా ఉండటమేనా? అందుకు కారణం... ఎదుర్కోడానికి మనం ఇష్టపడని సందేహాలను లేవనెత్తటం ద్వారా ఆమె మన మనసు లోతుల్లో లేని పైపై మనశ్శాంతిని హరించటమేనా?

అరుంధతీ రాయ్‌ని మన అలెగ్జాండర్ సోల్జెనిట్సిన్ (రష్యా రచయిత)లా భావించాలి కానీ, విస్తృత సోవియెట్ యూనియన్ ఆయన పట్ల ప్రవర్తించిన రీతిలో ఆమె పట్ల మనం ఉండకూడదు. ఆమె మన ఉత్తమ రచయితలలో ఒకరు. ప్రపంచానికి కూడా ఆమె ఇలాగే తెలుసు. మనం నిస్సిగ్గుగా మర్చిపోయిన సల్మాన్ రష్దీ తర్వాత అంతటి ప్రసిద్ధురాలైన, అత్యంత ప్రతిష్ఠాత్మకమైన బుకర్ ప్రైజ్ విజేత అరుంధతీ రాయ్. ఆమె పట్ల ఈ అనాగరిక, అధికార దర్ప, అనాలోచిత ప్రవర్తన... ప్రపంచంలోని అతి పెద్దదైన ప్రజాస్వామ్యానికి, అంతకుమించి ప్రజాస్వామ్యాలకే మాతృమూర్తి అయిన ఇండియాకు చెడ్డ పేరు తెస్తుంది. నిజాయితీగా, ఉన్నది ఉన్నట్లుగా మాట్లాడాలంటే అంతే.

నేడు మనం విశ్వ గురువులమని, దక్షిణార్ధ గోళానికి నాయకులమని, ఐరాస భద్రతా మండలిలో శాశ్వత సభ్యత్వానికి తగిన వాళ్లమని చెప్పుకొంటున్నాం. ఇటీవల ప్రధానమంత్రి తను తిరిగి ఎన్నికవటం ‘యావత్ ప్రపంచ ప్రజాస్వామ్య విజయం’ అని అన్నారు. అలాంటప్పుడు అరుంధతీ రాయ్ అభిప్రాయం పట్ల నిర్దయాపూరితమైన వ్యవహార శైలి మన గురించిన బాధాకరమైన, తప్పించుకోలేని సత్యాన్ని ప్రపంచానికి వెల్లడించదా? ఈ ప్రశ్నకు సమాధానాన్ని మీకై మీరే చెప్పుకొమ్మని వదిలేస్తున్నాను.

బదులుగా, నాకు ఎలా అనిపిస్తోందో చెబుతాను. మన ప్రజాస్వామ్యం, రాజ్యాంగం మనకు ప్రసాదించిన స్వేచ్ఛలు, పౌరహక్కుల పట్ల జీవితకాలం గర్వంగా గడిపాను. వాటినెవరూ మన నుంచి తస్కరించలేరన్నది సత్యం. ఇందిరాగాంధీ ప్రయత్నించారు కానీ విఫలమయ్యారు. కానీ ఇప్పుడు, ఇప్పుడిప్పుడే ఊపిరి పీల్చుకున్న ఉపశమనంలో ఉన్నప్పుడు అవి మన చేతుల్లోంచి జారిపోతాయా? అవును, అరుంధతీ రాయ్‌పై విచారణ తప్పుడు ఫలితంతో ముగిస్తే!

వ్యాసకర్త సీనియర్ జర్నలిస్ట్

సోషల్ మీడియా

సోషల్ నెట్ వర్కింగ్ వెబ్‌సైట్లు ఫేస్‌బుక్, ట్విట్టర్‌లలో సెలబ్రిటీల ‘మనసులోని మాట’లు తాజాగా ఇలా...!

పడాల్సిన అడుగు



అక్టోబర్ 7 (ఇజ్రాయెలీల మీద హమాస్ దాడి చేసిన రోజు) నుంచి నేను యూదు, ఇజ్రాయెలీ స్నేహితులతో ఏర్పరుచుకున్న స్నేహాలకు కృతజ్ఞుడిగా ఉంటాను. పాలస్తీనా ప్రజలకు న్యాయం జరగాలనీ, ఆక్రమణ ముగిసిపోయి చారిత్రక ఘర్షణ అంతం కావాలనీ వాళ్లు నిజంగా కోరుకుంటున్నారు. ఈ క్షణాన మనం యుద్ధం ముగిసిపోవాలనీ, బంధితులు విడుదల కావాలనీ కోరుకుందాం. ఇరుపక్షాల ప్రజల మెరుగైన భవిష్యత్తుకు ఇది మొదటి అడుగు అవుతుంది.

– ఇహాబ్ హసన్, పాలస్తీనా యాక్టివిస్ట్

ధనికుల న్యాయం



జెనీవా (స్విట్జర్లాండ్) విల్లాలో తమ పనివాళ్లను (భారతీయులు) అన్యాయంగా వాడుకున్నందుకు కోటీశ్వరులైన హిందూజా కుటుంబ సభ్యులకు జైలుశిక్ష పడింది. కనీస వేతనం రోజుకు 28 పౌండ్లు ఉన్నచోట వాళ్లు 7 పౌండ్లు చెల్లించారు. వాళ్లతో 18 గంటలు పని చేయించుకున్నారు. వాళ్ల పాస్‌పోర్టులను స్వాధీనం చేసుకున్నారు. అత్యంత ధనికుల్లో చాలామంది అమానవీయంగా ఉంటారు. సంపద వాళ్లను మరింత అత్యాశపరులను చేస్తుంది.

– ప్రశాంత్ భూషణ్, న్యాయవాది-యాక్టివిస్ట్

స్థిరత్వం తేవాలంటే...



పాకిస్తాన్‌కు చైనా సందేశం స్పష్టంగా ఉంది: మీకు పెట్టుబడులు కావాలంటే, రాజకీయ స్థిరత్వం తెండి. ఇమ్రాన్ ఖాన్, ఇతర పీటీఐ రాజకీయ ఖైదీలను విడుదల చేయడం ఆ స్థిరత్వం దిశగా మొదటి అడుగు అవుతుంది.

– చౌధురీ ఫవాద్ హుస్సేన్, పాక్ రాజకీయ నేత

శాకాహార రోజులు



మన మతాలు వేరుకావొచ్చుగానీ నాగరికత ప్రకారం మనమంతా భారతీయులం. మన సంస్కృతిని సజీవంగా ఉంచే బాధ్యత మన మీద ఉంది. నేను నా ఎంపికతో సోమవారాలు, గురువారాల్లో శాకాహారిని. విపరీతంగా నాన్-వెజ్ తినే నా సోదరులు కూడా మా ఇంట్లో నేను మొదలుపెట్టిన ఈ సంప్రదాయాన్ని పాటిస్తుంటారు. – యానా మీర్, యాంకర్

కఠిన వాస్తవం



వయసు పెరుగుతున్నకొద్దీ, జనాలు నిజంగా మంచివాళ్లు, దయార్ద్ర హృదయులు కాదని గమనిస్తున్నాను. వాళ్లు సరదాగా ఉండొచ్చు, ఫ్రెండ్లీగా ఉండొచ్చు, తెలివిగా ఉండొచ్చు. కానీ చాలామందిలో కనీస సభ్యత, అణకువ ఉండట్లేదు.

– జి.అంజలి, కవయిత్రి

బలవంతం



ఈమధ్య ఇన్‌స్టాగ్రామ్ చూపిస్తున్న రీల్స్ ఎంతమాత్రమూ నేను సాధారణంగా చూసే కంటెంట్‌కు దగ్గరగా లేవు. మీ గొంతులోకి ఒక రకం కంటెంటును ఎలా బలవంతంగా జొప్పించాలనుకుంటున్నారో ఇది తెలియజేస్తోంది.

– ఐశ్వర్య ముద్గిల్, న్యాయవాది

సాక్షి ఎడిటోరియల్ పేజీకి వ్యాసాలను, అభిప్రాయాలను యూనికోడ్‌లో పంపాలి. ఎక్కడా పరిశీలనలో లేనట్టు హామీపత్రం జతచేయాలి.
ఈ-మెయిల్: editpage@sakshi.com ఎడిట్ పేజీలో ప్రచురితమయ్యే వ్యాసాలను ఆ యా రచయితల వ్యక్తిగత అభిప్రాయాలుగా గమనించాలి.

ఇన్ బాక్స్

ప్రమాద రహిత రైల్వేలు కలేనా?

పశ్చిమ బెంగాల్‌లోని రంగపాణి రైల్వే స్టేషన్ సమీపంలో మరో ఘోర రైలు ప్రమాదం జరిగింది. డౌన్ కాంచన్‌జంగా ఎక్స్‌ప్రెస్‌ను గూడ్స్ రైలు వెనుక నుండి ఢీకొట్టడంతో చాలా మంది మరణించారు. అనేకమంది గాయపడ్డారు. రైల్వేవారు భద్రతా ప్రమాణాల పట్ల సరియైన శ్రద్ధ, చిత్తశుద్ధి కనపరచడం లేదనటానికి ఈ ప్రమాదం ఒక నిదర్శనం. ఈ ప్రమాదం అనేక ప్రశ్నలు రేకెత్తిస్తోంది. గూడ్స్ రైలు నిర్దేశించిన వేగం కంటే అధిక వేగంతో నడపడానికి ఎందుకు అనుమతించారు? అసలు రెండు రైళ్లు ఒకే ట్రాక్‌పై వెళ్ళటానికి బాధ్యులు ఎవరు?

ఈ సంఘటన మానవ తప్పిదమని, దుర్ఘటనకు గూడ్స్‌రైలు డ్రైవర్ కారణమని రైల్వే వర్గాలు తెలుపుతున్నాయి. ఈ సందర్భంగా మానవ వనరుల కొరత సంగతీ వెలుగులోకి వస్తోంది. లోకో పైలట్, అసిస్టెంట్ లోకో పైలట్ ఉద్యోగాలను దాదాపు ఇరవై వేలు ఏళ్లతరబడి నింపకుండా వదిలేశారు. ఈ మానవ వనరుల కొరత... రైలు డ్రైవర్లు ఎక్కువ షిఫ్టులలో పనిచేయడానికి దారితీస్తోంది. ఫలితంగా ఘోరమైన ప్రమాదాలు జరుగుతున్నాయి.

2016లో ప్రారంభించిన ఆటోమేటిక్ ట్రైన్ ప్రొటెక్షన్ సిస్టమ్ (కవచ్)ను ఫీల్డ్ ట్రయల్స్ కోసం కేవలం 1,500 కిలోమీటర్ల కంటే తక్కువ రైల్వే ట్రాక్‌లలో మాత్రమే ఏర్పాటు చేసినట్లు తెలుస్తోంది. భారతీయ రైల్వేల మొత్తం ట్రాక్ దాదాపు 70 వేల కిలోమీటర్లు. కాలానుగుణంగా అవసరాలకు తగ్గట్టు కవచ్ వంటి భద్రతా వ్యవస్థల ఏర్పాటుతోపాటు, మౌలిక సదుపాయాల ఆధునికీకరణ యుద్ధ ప్రాతిపదికన చేపట్టాలి. నాణ్యతతో కూడిన భద్రతా పరికరాలు ఏర్పాటు చేయాలి. ఈ దుర్ఘటనపై న్యాయవిచారణ జరిపి బాధ్యులైన వారిని గుర్తించి శిక్షించాలి. అదేవిధంగా ఇటువంటి దుర్ఘటనలు మునుముందు ఎట్టి పరిస్థితుల్లో జరగకుండా ప్రభుత్వం, రైల్వే బోర్డు వారు, రైల్వే శాఖలోని అన్ని విభాగాల ఉద్యోగులు, కార్మిక సంఘాల నాయకులు, సాంకేతిక నిపుణులు, మేధావులు, ఇతర స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులతో కూడిన ఒక సంఘాన్ని ఏర్పాటు చేసి; దాని సూచనలతో కఠినమైన భద్రతా నియమ నిబంధనలు రూపొందించాలి. వీటిని కఠినంగా అమలుపరచడానికి అవసరమైతే పార్లమెంట్‌లో ఒక చట్టం చేయాలి. రైల్వేలోని అన్ని విభాగాలలో ఖాళీలను వెనువెంటనే భర్తీ చేయాలి. ఆధునిక అత్యంత సాంకేతికతతో వేగంగా నడిచే ‘వందే భారత్’ రైళ్ళతో సమానంగా అదే స్థాయిలో భద్రతతో కూడిన సురక్షితమైన ప్రయాణ పరిస్థితులు కల్పించినప్పుడే భారత రైల్వే పట్ల ప్రయాణికులకు ఒక భరోసా కలుగుతుంది.

– దండంరాజు రాంచందర్ రావు, హైదరాబాద్

కాలుష్య జలాలతో సాగు ఆరోగ్యానికి కీడు

విశ్లేషణ



డా॥ శ్రీదరాల రాము

హైదరాబాదు, రంగారెడ్డి జిల్లాల్లో ఒకప్పుడు వ్యవసాయానికి ఉపయోగపడిన మంచినీటి చెరువులు జల కాలుష్యం వలన ప్రస్తుతం మురికి నీటి కూపాలుగా మారిపోయాయి. ఈ మురికినీటితో కూర కాయల సాగు అనేది విరివిగా జరుగుతోంది. ఈ విధంగా కూరగాయల సాగు చేయడాన్ని తక్షణమే నిలిపివేయాలని, హైదరాబాద్, రంగారెడ్డి జిల్లాలకు చెందిన 11 చెరువులను పునరుద్ధరించాలని తెలంగాణ హైకోర్టు రాష్ట్ర ప్రభుత్వాన్ని ఆదేశించింది. కలుషితం అయిన చెరువు నీటితో కూరగాయలను సాగు చేయడం వలన కూరగాయల లోనికి రసాయన కాలుష్య కారకాలు ప్రవేశించి ఆహారపు గొలుసు ద్వారా ‘బయో మాగ్నిఫికేషన్’ చెందడం వలన అనేక అనారోగ్య, పర్యావరణ సమస్యలు తలెత్తుతాయి.

భారతదేశం అంతటా... ముఖ్యంగా దేశంలోని పెద్ద మెట్రోపాలిటన్ నగరాలలో, లెక్కలేనన్ని సంఖ్యలో రైతులు తమ పంటలను శుద్ధి చేయని మురుగునీటితో పెంచుతున్నారు. ఉపరితల నీటికి శుద్ధి చేయని వ్యర్థపదార్థాలు వచ్చి కలిసినట్లయితే ఆ నీరు కలుషితం అవుతుంది. ఈ కలుషితమైన నీటిని రైతులు వ్యవసాయం కోసం ఉపయోగిస్తున్నారు. దీని వలన డయేరియా, చర్మవ్యాధులు, కంటి వ్యాధులు వంటివి రైతులకు సంక్రమించే అవకాశం ఉంది.



కలుషిత నీటితో వ్యవసాయం చేయడం వలన వ్యవసాయ భూములను సారవంతం చేసే విలువైన సూక్ష్మజీవులు, డీకంపోజర్స్, వానపాములు వంటివి నశించిపోయి సారవంతమైన వ్యవసాయ భూమి నిస్సత్తువ వ్యవసాయ భూమిగా మారిపోతుంది.

శుద్ధి చేయని వ్యర్థ జలాల వలన వ్యర్థ జలాలలోని భారీ లోహాలు మొక్కలను విషపూరితం చేస్తాయి. అలాగే ఇది ఆహార కాలుష్యానికి దారితీస్తుంది. అదే విధంగా ఈ కూరగాయలలో విటమిన్లు లోపిస్తాయి. శరీరంలో రసాయన కాలుష్యకారకాలు పేరుకుపోతాయి. దీని ఫలితంగా క్యాన్సర్లు, జన్యు ఉత్పరివర్తనలు, పోషకాహార లోపం ఏర్పడవచ్చు.

2000 నుండి 2003 వరకు పరిశోధన ప్రాజెక్ట్‌లో భాగంగా యూకే డిపార్ట్‌మెంట్ ఫర్ ఇంటర్నేషనల్ డెవలప్‌మెంట్ ఢిల్లీలోని వివిధ మార్కెట్‌ల నుండి ఆజాద్‌పూర్‌లోని హోల్‌సేల్ మార్కెట్‌నుండి సేకరించిన బచ్చలికూరలో భార లోహాల కాలుష్యాన్ని గుర్తించింది.

2015 అధ్యయనంలో, భారతీయ పరిశోధకుల బృందం ఢిల్లీలోని ఐదు మార్కెట్లలో కూరగాయలలో కాడ్మియం, సీసం, జింక్, రాగి అవశేషాలను అంచనా వేసింది. విషపూరిత కలుషితాలకు గురైన కూరగాయలు, పండ్లు వంటి ప్రాథమిక ఉత్పత్తులను పరీక్షించడానికి ఈ రోజు వరకు నియంత్రణ ఫ్రేమ్‌వర్క్ ఇండియాకు లేదు. ఆహార రంగంలో నియంత్రణాపరమైన పర్యవేక్షణ లేకపోవడం, అంతర్జాతీయ నాణ్యతా ప్రమాణాలను అందుకోవడంలో నిరంతర వైఫల్యం భారతదేశ రైతులు, ఆహార కంపెనీలకు ఇబ్బందిగా మారింది.

రైతులు తమ పంటలను పెంచడానికి మురుగునీటిని ఉపయోగించటానికి కారణాలు అనేకం: వేగవంతమైన జనాభా పెరుగుదల, పట్టణీకరణ, ఆహారం కోసం పెరుగుతున్న డిమాండ్, తీవ్రంగా క్షీణిస్తున్న స్వచ్ఛమైన నీటి నిల్వలు. భూగర్భ జలాలు పడిపోవడం వలన బోర్లు పడక రైతులు కలుషితమైన నీటితో వ్యవసాయం చేస్తున్నారు.


నీరు కాలుష్యమయం కాకుండా ఉండటానికి కొన్ని చర్యలు తీసుకోవాలి. పండగల సందర్భాల్లో ప్లాస్టర్ ఆఫ్ పారిస్‌తో తయారుచేసిన విగ్రహాలను మంచినీటి చెరువుల్లో నిమజ్జనం చేయడం వల్ల ఆ నీరు కలుషితం అవుతోంది. దీనికి మంచి ఉదాహరణ హుస్సేన్ సాగర్. అందువల్ల మట్టి బొమ్మలనే నిమజ్జనం చేయాలి. గృహ వ్యర్థాలను, పారిశ్రామిక వ్యర్థాలను మంచి నీటి చెరువులలోనికి విడుదల చేయకూడదు. చెరువులను కబ్జా చేసి నివాస స్థలాలుగా మార్చడాన్ని నిరోధించాలి. డ్రిప్ ఇరిగేషన్ పద్ధతులను అవలంబించాలి. కలుషితమైన చెరువులను పునరుద్ధరించి తిరిగి మంచినీటి చెరువులుగా మార్చాలి. కలుషితమైన నీటితో వ్యవసాయ చేసే ప్రదేశాలను గుర్తించి అట్టివారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలి.

మంచి నీటి చెరువులు విలువైన సహజ సంపద కాబట్టి ప్రభుత్వం, ప్రజలు సమష్టి కృషితో వీటిని కాపాడుకోవాల్సిన అవసరం ఉన్నది.

వ్యాసకర్త ఫ్యాకల్టీ ఆఫ్ కెమిస్ట్రీ అండ్ ఎన్విరాన్మెంటల్ సైన్సెస్,
శ్రీ ఇందు కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీ । 9441184667

గురువు ప్రాశస్త్యం

గురువుని సాక్షాత్తు త్రిమూర్తుల రూపంగా భావించి పూజించే సంస్కృతి భారతీయులది. తల్లిదండ్రులు జన్మనిస్తారు. కానీ ఈ జన్మకి సార్థకత, సాఫల్యం అందించే వ్యక్తి గురువు. మన అజ్ఞానాన్ని తొలగించి జ్ఞానాన్ని ప్రసాదిస్తాడు. అందుకే తల్లితండ్రుల తర్వాత గురువుకి ప్రముఖ స్థానమిచ్చింది మన సంస్కృతి. మనిషిని మనిషిగా తీర్చిదిద్దే శిల్పి గురువు. అందుకే మన విద్యాలయాల్లో, మన మందిరాలలో గురువుని స్మరిస్తూ ఈ శ్లోకాన్ని నిత్యమూ పఠిస్తున్నాము:



గురుర్బ్రహ్మ గురుర్విష్ణు గురుర్దేవో మహేశ్వరః!
గురుస్సాక్షాత్ పరబ్రహ్మ తస్మై శ్రీ గురవేనమః!!

మనకు విజ్ఞానశాస్త్రం ఎంత తెలిసినా, జీవన విలువలు అందించేది గురువు మాత్రమే. అయితే నేర్చుకోవాలనే జిజ్ఞాస శిష్యునికి ఉండాలి. గురువు జ్ఞానాన్ని ఒసగినప్పుడు దానిని గ్రహించి ప్రయోజకుడు కావాల్సిన బాధ్యత ప్రధానంగా శిష్యునిదే. భారతీయ గురుపరంపర సమస్తం త్యాగం ద్వారానే నిర్మాణం అయ్యింది. త్యాగం, సమర్పణ అనే ఉన్నత భావాలతో సమాజాన్ని నిర్మించే పనిని భారతీయ ఋషులు చేశారు. వ్యాస, వాల్మీకి, వశిష్ఠ వంటివారు మొదలుకొని ఆది శంకరాచార్య, సమర్థ రామదాసు, రామకృష్ణ పరమహంస వరుసలో అబ్దుల్ కలాం వరకు సేవ, త్యాగం అనేవే ఆదర్శాలుగా జీవించారు. నేడు ఆ ఆదర్శాలతో కోట్లాది మంది జీవిస్తున్నారు. ‘నేను మాత్రమే బాగుండాలి’ అని కాకుండా ‘నాతో పాటు సమాజం బాగుండాలి’, అవసరం అయితే సమాజం కొరకు కష్టపడాలి అనే జీవనవిలువ మన సమాజాన్ని నేటికీ రక్షిస్తోంది. ఇదే ఈ దేశ సహజ గుణం. ఈ జీవన విలువను అందించేది గురువు.

ఆహారం, నిద్ర, భయం, సంతానోత్పత్తి విషయాల్లో మనుషులకు, పశువులకు తేడా లేదు. ధర్మం మాత్రమే మానవులకు అధికమైన విశేషణం. ధర్మంగా బతకాలి అనే జీవన విలువను కూడా మన గురువులు అందించారు. ఈ ధర్మం అనేది భారతీయ సమాజంలో మాత్రమే కనపడేది. ప్రకృతిలోని పంచభూతాలు వాటి సహజగుణాన్ని వదిలిపెట్టవు. కానీ మనిషి తన స్వభావాన్ని వదిలిపెడుతున్నాడు. జంతువు జంతువులాగానే, పక్షి పక్షిలాగానే జీవిస్తుంది. కానీ మనిషి మనిషిలా బతకడం లేదు. మనిషికి మాత్రమే మనిషిలా జీవించు అని చెప్పాల్సిన అవసరం ఏర్పడింది. అలా చెప్పి సన్మార్గంలో నడిపే వ్యక్తి గురువు మాత్రమే.

– సాక్షి

గ్రహం అనుగ్రహం శ్రీ క్రోధి నామ సంవత్సరం, ఉత్తరాయణం, గ్రీష్మ ఋతువు, జ్యేష్ఠ మాసం, **తిథి:** బ.తదియ తె.3.00 వరకు(తెల్లవారితే మంగళవారం), తదుపరి చవితి, **నక్షత్రం:** ఉత్తరాషాఢ సా.5.48 వరకు, తదుపరి శ్రవణం, **వర్జ్యం:** రా.9.38 నుండి 11.10 వరకు, **దుర్ముహూర్తం:** ప.12.28 నుండి 1.20 వరకు, తదుపరి ప.3.05 నుండి 3.57 వరకు, **అమృతఘడియలు:** ఉ.11.31 నుండి 1.07 వరకు; **రాహుకాలం:** ఉ.7.30 నుండి 9.00 వరకు; **యమగండం:** ఉ.10.30 నుండి 12.00 వరకు; **సూర్యోదయం:** 5.30; **సూర్యాస్తమయం:** 6.33.

క్లుప్తంగా...

వైఎస్సార్‌సీపీ సానుభూతిపరుల ఇళ్లపై దాడులు

- పల్నాడు జిల్లా గారపాడులో ఉద్రిక్తత
- ఎస్పీకి వైఎస్సార్‌సీపీ నేతల ఫిర్యాదు

పెదకూరపాడు: పల్నాడు జిల్లా పెదకూరపాడు మండలం గారపాడు గ్రామంలో టీడీపీ శ్రేణులు రెచ్చిపోయాయి. టీడీపీకి ఓటు వేయలేదని రెండు రోజులుగా వైఎస్సార్‌సీపీ సానుభూతిపరులను బెదిరిస్తున్న నేతలు... శనివారం రాత్రి ఏకంగా దాడులకు తెగబడ్డారు. ముఖ్యంగా ఎస్సీ, ఎస్టీలను లక్ష్యంగా చేసుకుని దాడులకు పాల్పడ్డారు. ఓ పాకను తగలబెట్టారు. ఇళ్లలో ఉన్న ఎస్సీ సామాజికవర్గం వారిని బయటకు లాగి కొట్టడంతోపాటు కులం పేరుతో దూషిస్తూ బెదిరించారు. దీంతో జెడ్పీటీసీ సభ్యురాలు కంకణాల స్వర్ణకుమారి, వైఎస్సార్‌సీపీ నేత కంకణాల శివాజీ ఆదివారం ఫోన్‌లో జిల్లా ఎస్పీకి ఫిర్యాదు చేశారు. 'గ్రామంలోని ఎస్సీ కాలనీకి చెందిన మీసాల రమేష్, గంగరాజు, అనిల్‌లను కులంపేరుతో దూషించి ఇళ్లలో ఉన్న వారిని బయటికి లాగి దాడి చేశారు. లైబ్రరీ సెంటరులోని వైఎస్సార్‌సీపీ కార్యకర్తల ఇళ్లపై కర్రలతో దాడి చేసి మహిళలను అవమానపరిచేలా దుర్భాషలాడారు. ఇంట్లోకి వెళ్లి మరీ దాడి చేశారు. వైఎస్సార్‌సీపీ కార్యకర్తకు చెందిన పాకను తగలబెట్టారు. ఎస్టీ కాలనీలో వైఎస్సార్‌సీపీ కార్యకర్తలపై దాడులు చేశారు. గారపాడు గ్రామంలో శాంతిభద్రతలు పూర్తిగా క్షీణించాయి. అయినా పోలీసులు ప్రేక్షకపాత్ర వహిస్తున్నారు. తక్షణమే పోలీసు ఉన్నతాధికారులు స్పందించి దాడులను అరికట్టాలి. వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యర్తలకు రక్షణ కల్పించాలి' అని శివాజీ పేర్కొన్నారు.

వైఎస్సార్‌సీపీ నాయకుడి అరటి చెట్లు నరికివేత



దుండగులు నరికివేసిన అరటి చెట్లు

శిరివెళ్ల: నంద్యాల జిల్లా ఆళ్లగడ్డ నియోజకవర్గం శిరివెళ్ల మండలంలోని మహాదేవపురానికి చెందిన వైఎస్సార్‌సీపీ నాయకుడు బోడె వెంకటయ్యకు చెందిన తోటలోని 413 కాపు కొచ్చిన అరటి చెట్లను శనివారం రాత్రి గుర్తుతెలియని వ్యక్తులు నరికేశారు. దీంతో రూ.2.50లక్షలు నష్టం వాటిల్లిందని బోడె వెంకటయ్య తెలిపారు. గ్రామ మాజీ సర్పంచ్ నాగనరసింహుడుకు చెందిన 2.25 ఎకరాలను ఆయన గత ఏడాది కౌలుకు తీసుకుని అరటి పంట సాగు చేశారు. పంట చేతికి రావడంతో ఈ నెల 22న వ్యాపారులకు చూపించారు. అయితే ఆదివారం ఉదయం పొలం దగ్గరకు వెళ్లగా చెట్లు నరికేసి ఉన్నాయి. వెంకటయ్య ఫిర్యాదు మేరకు డీఎస్పీ షర్ఫుద్దీన్, సీఐ చంద్రబాబు వచ్చి పంటను పరిశీలించారు. కర్నూలు నుంచి క్లూస్ టీం, డాగ్ స్క్వాడ్‌ను పిలిపించారు. చెట్ల కొమ్మలపై ఉన్న వేలి ముద్రలను క్లూస్ టీం సేకరించింది. తాను 2.25 ఎకరాల్లో అరటి పంటను సాగు చేశానని, అందులో ఎకరాలోని 413 అరటి చెట్లను నరికి వేశారని, మిగిలిన పంటకు నీరందకుండా డ్రిప్ ఇరిగేషన్ పైపులు, స్టార్టర్‌ను ధ్వంసం చేశారని వెంకటయ్య పోలీసులకు తెలిపారు. సర్పంచ్ పెద్ది రమణయ్య, మార్కెట్ యార్డు ఉపాధ్యక్షుడు నరహరి, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు ఇందూరి ప్రతాపరెడ్డిలు ఇచ్చిన సమాచారం మేరకు మాజీ ఎమ్మెల్యే గంగుల బిజేంద్రారెడ్డి గ్రామానికి చేరుకుని నరికివేసిన అరటి చెట్లను పరిశీలించారు. ఇలాంటి ఘటనలను పాల్పడటం పిరికిపంద చర్య అని, నిందితులను కఠినంగా శిక్షించాలని బిజేంద్రారెడ్డి డిమాండ్ చేశారు.

చట్టబద్ధంగా నిర్మించినా కూల్చివేయడం దారుణం

వైఎస్సార్‌సీపీ కార్యాలయం కూల్చివేతపై మాజీ ఎంపీ మార్గాని



రాజమహేంద్రవరం సిటీ: కూటమి ప్రభుత్వ పాలనలో కక్షపూరిత చర్యలు ఉండవంటూనే వచ్చీ రాగానే తాడేపల్లిలోని వైఎస్సార్‌సీపీ కార్యాలయాన్ని కూలదోయడం దురదృష్టకరం, బాధాకరమని రాజమహేంద్రవరం మాజీ ఎంపీ మార్గాని భరత్‌రామ్ అన్నారు. రాజమహేంద్రవరంలో ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ప్రభుత్వ ఉత్తర్వుల ప్రకారం చట్టబద్ధంగా లీజుకు తీసుకున్న స్థలంలో రెండంతస్తులు నిర్మాణం పూర్తయిన వైఎస్సార్‌సీపీ కార్యాలయాన్ని అకారణంగా కూల్చివేయడం దారుణమని మండిపడ్డారు. గతంలో ఉన్న ప్రజావేదిక ఎన్‌జీటీ నిబంధనలకు వ్యతిరేకంగా, నదీ పరివాహక ప్రాంతంలో, చట్టబద్ధత లేకుండా, ప్రభుత్వ పాలనకు, ఏమాత్రం అనుకూలంగా లేనందు వలన మాత్రమే తొలగించాల్సి వచ్చిందని, తాము ఏమాత్రం కక్షసాధింపుతో వ్యవహరించలేదని స్పష్టం చేశారు. టీడీపీ హయాంలో 2014–19 మధ్య శ్రీకాకుళం, విజయనగరం, గుంటూరు, కడప, మచిలీపట్నం తదితర 12 ప్రాంతాల్లో ఆ పార్టీ కార్యాలయాల నిర్మాణాలకు ఎకరాల కొద్దీ భూమి కేటాయించుకున్నారని గుర్తు చేశారు. ఎకరానికి నామమాత్రంగా రూ.1,000 మాత్రమే లీజు నిర్ణయించారని, దీనికి సంబంధించిన రికార్డులు తన వద్ద ఉన్నాయని చెప్పారు. తాడేపల్లి స్థలం చట్టబద్ధంగా లీజుకు ఇచ్చిందని, దీని ద్వారా ప్రభుత్వానికి ఆదాయం వస్తున్నప్పుడు తప్పేముందని ప్రశ్నించారు.

కొనసాగుతున్న శిలాఫలకాల ధ్వంసం

- తమ్మరాజుపల్లె, గుర్రంపాలెంలో ప్రగతిపనుల శిలాఫలకాలు ధ్వంసం
- నరసరావుపేటలో జగనన్నకాలనీ శిలాఫలకం మాయం



గుర్రంపాలెంలో ధ్వంసం చేసిన శిలాఫలకం



వినుకొండరోడ్డు జగనన్న కాలనీలో అదృశ్యమైన శంకుస్థాపన శిలాఫలకం

సాక్షి నెట్‌వర్క్: రాష్ట్ర వ్యాప్తంగా టీడీపీ నేతలు, కార్యకర్తలు విధ్వంస కార్యకలాపాల్ని కొనసాగిస్తున్నారు. ప్రగతిపనుల శిలాఫలకాన్ని ముక్కలు చేస్తున్నారు. వీరి అరాచకాలు శనివారం రాత్రి, ఆదివారం కూడా కొనసాగాయి.

- నంద్యాల జిల్లా పాణ్యం మండలం తమ్మరాజుపల్లెలో హెల్త్‌సెంటర్ ప్రారంభోత్సవం సందర్భంగా ఏర్పాటు చేసిన శిలాఫలకాన్ని దుండగులు ధ్వంసం చేశారు. అప్పటి సీఎం వైఎస్ జగన్, అప్పటి ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి పేరుతో ఏర్పాటు చేసిన శిలాఫలకాన్ని ముక్కలు చేశారు. ప్రభుత్వ భవనానికి ఉన్న నవరత్నాల లోగోకు రంగులు వేశారు. దీనిపై గ్రామ వైఎస్సార్‌సీపీ నాయకులు ఫిర్యాదు చేయడంతో పోలీసులు విచారిస్తున్నారు.
- కాకినాడ జిల్లా జగ్గంపేట మండలం గుర్రంపాలెంలో గత ప్రభుత్వం హయాంలో రక్షిత మంచినీటి పథకం ప్రారంభం సందర్భంగా ఏర్పాటు చేసిన శిలాఫలకాన్ని గుర్తుతెలియని వ్యక్తులు ధ్వంసం చేశారు. దీనిపై గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ నేత, జగ్గంపేట వైస్ ఎంపీపీ నక్కా వెంకట్రావు (శ్రీను) ఆదివారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. గుర్రంపాలెంలోని సగరుపేటలో నిర్మించిన రక్షిత మంచినీటి పథకాన్ని ఈ ఏడాది మార్చి 2న అప్పటి జగ్గంపేట ఎమ్మెల్యే జ్యోతుల చంటిబాబు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన శిలాఫలకంపై అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, చంటిబాబు చిత్రపటాలను ఏర్పాటు చేశారు. శనివారం రాత్రి 9 గంటల వరకూ శిలాఫలకం బాగానే ఉందని, అర్ధరాత్రి సమయంలో గుర్తుతెలియని వ్యక్తులు దీనిని గునపంతో ధ్వంసం చేశారని శ్రీను తన ఫిర్యాదులో పేర్కొన్నారు. సంఘటన స్థలాన్ని జగ్గంపేట ఎ.ఎస్.ఐ. సుబ్బారావు ఆధ్వర్యాన పోలీసులు పరిశీలించారు. ఎవరిపైనా అనుమానాలు వ్యక్తం చేయకపోవడంతో ఇంకా ఎఫ్ఐఆర్ నమోదు చేయలేదని పోలీసులు తెలిపారు.
- పల్నాడు జిల్లా నరసరావుపేటలో సుమారు ఏడువేలమందికి గృహనిర్మాణ పట్టాల పంపిణీ, వసతి కల్పించిన వినుకొండ రోడ్డులోని జగనన్న కాలనీ ప్రారంభోత్సవ శిలాఫలకాన్ని గుర్తుతెలియని వ్యక్తులు మాయం చేశారు. ఈ విషయాన్ని స్థానికులు ఆదివారం గుర్తించారు. 2021 జనవరి మూడో తేదీన అప్పటి గృహనిర్మాణశాఖ మంత్రి, జిల్లా ఇన్‌చార్జి మంత్రి చెరుకువాడ శ్రీరంగనాథరాజు ఈ కాలనీకి భూమిపూజ చేసి శిలాఫలకం ఆవిష్కరించారు. కాలనీలో సుమారు 500 మంది ఇళ్లు నిర్మించుకుని ఉంటున్నారు. కొన్ని గృహాలు నిర్మాణంలో ఉన్నాయి. శిలాఫలకాన్ని మాయం చేసిన వ్యక్తులపై చర్యలు తీసుకోవాలని కాలనీ వాసులు కోరుతున్నారు.

ఏలూరు జిల్లా కైకరంలో టీడీపీ మాజీ జెడ్పీటీసీ హంగామా

- వైఎస్సార్‌సీపీ నాయకుడు పుప్పాల గోపి ఇంటిపై దాడి
- అదే సమయంలో టీడీపీ, జనసేన నేతల ఇళ్లపైనా దాడులు

ఉంగుటూరు: ఏలూరు జిల్లా ఉంగుటూరు మండలం కైకరం గ్రామంలో తెలుగుదేశం కార్యకర్తలు ఇష్టారీతిన ప్రవర్తించారు. తెలుగుదేశం నాయకుడైన జెడ్పీటీసీ మాజీ సభ్యుడు చింతల వాసు వర్గీయులు వైఎస్సార్‌సీపీ నేతల ఇళ్లపైన దాడికి పాల్పడడంతోపాటు తమ పార్టీ(టీడీపీ)కే చెందిన నేతలతోపాటు మిత్రపక్షమైన జనసేనకు చెందినవారి ఇళ్లపైనా దాడులకు పాల్పడ్డారు. ఈ క్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకుడు, జిల్లా పంచాయతీరాజ్ విభాగం అధ్యక్షుడు పుప్పాల గోపి ఇంటిపై దాడిచేసి కారు అద్దాన్ని పగులగొట్టారు. సీసీ కెమెరాను ధ్వంసం చేశారు. ఇదేమిటని అడగడానికి వచ్చిన గోపి తల్లిపై దౌర్జన్యానికి దిగారు. గ్రామానికి చెందిన టీడీపీ నాయకుడు కోనా శ్రీనివాసరావు ఇంటిపైకి వెళ్లి పూల కుండీలు బద్దలు కొట్టి, గేట్లుతన్ని ఇష్టారాజ్యంగా వ్యవహరించారు. మీకు ఈరోజే ఆఖరి రోజు.. చంపేస్తాం.. అంటూ బెదిరించారు. జనసేన నాయకుడు వెజ్జు సుబ్బారావు ఇంటిపైకి వెళ్లి హడావుడి చేశారు. సమాచారం అందుకున్న నిడమర్రు సీఐ సుభాష్, ఎస్ఐ మణికుమార్ పోలీసులతో గ్రామంలోకి వెళ్లి పరిస్థితిని పరిశీలించారు. ఈ ఘటనలపై కేసు నమోదు చేసి విచారిస్తున్నామని తెలిపారు.

దేవగుడిలో వైఎస్సార్‌సీపీకి చెందిన వారిపై కూటమి కార్యకర్తల దాడి

15 మందికి గాయాలు



తలపై గాయాలను చూపుతున్న వై.చిన్న ఓబయ్య

టాస్క్‌ఫోర్స్: వైఎస్సార్ జిల్లా జమ్మలమడుగు మండలం దేవగుడి గ్రామంలో టీడీపీ, బీజేపీ నేతలు, కార్యకర్తలు దాడిచేసి 15 మందిని గాయపరిచారు. బీజేపీ ఎమ్మెల్యే ఆదినారాయణరెడ్డి స్వగ్రామమైన దేవగుడిలో వారు వైఎస్సార్‌సీపీకి చెందిన వై.మురళి, అతడి బంధువుల ఇళ్లపై దాడిచేశారు. రెండిళ్లను ధ్వంసం చేశారు. ఎర్రత్తమ్మగారి చిన్న ఓబయ్య, వై.పెద్ద ఓబులేసు, పెద్ద ఓబయ్య, ఓబులేసు పేరుగల ఆరుగురు, 60 ఏళ్లు దాటిన ఆరుగురు మహిళలు.. మొత్తం 15 మందిని కొట్టి గాయపరిచారు. గాయపడిన వారు ప్రొద్దుటూరు ప్రభుత్వాస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. బాధితులు పోలీసు స్టేషన్‌కు వచ్చి ఫిర్యాదు సైతం చేయలేని పరిస్థితిలో ఉన్నారు. తిరిగి ఎమ్మెల్యే అనుచరులే గ్రామంలో తమపై దాడులు చేస్తున్నారంటూ ఫిర్యాదు చేయటానికి పోలీసు స్టేషన్‌కు వచ్చారు. పోలీసులు కేసుల నమోదుపై ఉదాసీనంగా వ్యవహరిస్తున్నారు.

'నారాయణ' యాజమాన్యం నిర్లక్ష్యానికి మా కుమారుడు బలి

తెనాలికి చెందిన విజయకుమార్ దంపతుల ఆవేదన



గిరీష్ అర్వంత్ (ఫైల్)



తమ గోడు వినిపిస్తున్న గిరీష్ తల్లిదండ్రులు

తెనాలిరూరల్: నారాయణ కాలేజీ యాజమాన్యం నిర్లక్ష్యం వల్లే తమ కుమారుడు మరణించాడని తెనాలి బుర్రిపాలెం రోడ్డులోని బీసీ కాలనీకి చెందిన కర్రె విజయ్‌కుమార్ దంపతులు ఆవేదన వ్యక్తంచేశారు. తమకు జరిగిన అన్యాయం మరొకరికి జరగకూడదని కన్నీటిపర్యంతమయ్యారు. ఈ మేరకు ఆదివారం తెనాలిలో విజయకుమార్ దంపతులు విలేకరులతో మాట్లాడారు. 'మాకు కుమారుడు గిరీష్ అర్వంత్(15), కుమార్తె ఉన్నారు. కుమారుడు గిరీష్‌ను హైదరాబాద్‌లోని హయత్‌నగర్ పరిధిలో గల కోహెడ నారాయణ కాలేజీలో ఇంటర్ మొదటి సంవత్సరంలో చేర్పించాము. ఈ నెల 12వ తేదీన కాలేజీ హాస్టల్‌లో చేరిన గిరీష్ తరచూ ఫోన్ చేసి తనకు అక్కడ బాగా లేదని ఇంటికి వచ్చేస్తానని చెబుతున్నాడు. మేం అర్వంత్‌కు సర్దిచెబుతూ వచ్చాం. అక్కడ ఇబ్బందులను భరించలేక అర్వంత్ ఈ నెల 19వ తేదీ అర్ధరాత్రి హాస్టల్ గోడ దూకి బయటకు రావాలని ప్రయత్నించాడని, ఈ క్రమంలో కరెంట్ షాక్ తగిలి మృతిచెందాడని కాలేజీ యాజమాన్యం తెలిపింది. వెంటనే మేం వెళ్లి మా కుమారుడి మృతదేహాన్ని తీసుకువచ్చి అంత్యక్రియలు పూర్తిచేశాం. మా కుమారుడి విషయంలో నారాయణ కాలేజీ యాజమాన్యం పూర్తి నిర్లక్ష్యంగా వ్యవహరించింది. అంతమంది చదువుతున్న కాలేజీ, హాస్టల్ నుంచి మా బిడ్డ బయటకు వెళ్లే ప్రయత్నం చేస్తే యాజమాన్యం ఏం చేస్తుంది? మాకు జరిగిన అన్యాయం మరొకరికి జరగకూడదు.' అని విజయకుమార్ దంపతులు కన్నీటిపర్యంతమయ్యారు.

ఎల్లో మీడియా చిత్రీకరించిన నకిలీ విజనరీ బాబు

- వైఎస్సార్‌సీపీపై దాడులతోనే కూటమి ప్రభుత్వం 20 రోజులు పూర్తిచేసింది
- వైఎస్సార్‌సీపీ ఎస్టీ సెల్ రాష్ట్ర అధ్యక్షుడు మేరాజోత్ హనుమంత్ నాయక్

సాక్షి, అమరావతి: ఎల్లో మీడియా చిత్రీకరించిన నకిలీ విజనరీ చంద్రబాబు నాయుడు అని వైఎస్సార్‌సీపీ ఎస్టీ సెల్ రాష్ట్ర అధ్యక్షుడు మేరాజోత్ హనుమంత్ నాయక్ ధ్వజమెత్తారు. ఆయన ఆదివారం తాడేపల్లిలో మీడియాతో మాట్లాడారు. 'రాష్ట్రంలో అధికారం చేతులు మారి 20రోజులు అయినా టీడీపీ కూటమి నేతలు నిత్యం వైఎస్సార్‌సీపీ అధినేత వైఎస్ జగన్‌పై, గత ప్రభుత్వంపై దుష్ప్రచారం చేయడంతోనే కాలం గడుపుతున్నారు. అదేవిధంగా వైఎస్సార్‌సీపీ నేతలు, కార్యకర్తలపై దాడులు చేయడం, ఇళ్లను, పార్టీ కార్యాలయాలను, దివంగత సీఎం వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహాలను ధ్వంసం చేయడం, అధికారులను వేధించడమే లక్ష్యంగా సాగుతున్నారు. ప్రజలను మోసం చేయడమే ఆస్తిగా, వెన్నుపోటే పెట్టుబడిగా రాజకీయాల్లో ఎదిగిన నేత చంద్రబాబు. ఎన్నికలప్పుడు అలవికాని హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చాక వాటిని తుంగలో తొక్కి ప్రజలను మోసం చేయటం చంద్రబాబు నైజం. ఎన్టీఆర్‌కు వెన్నుపోటు పొడిచి, ఎమ్మెల్యేలను ప్రలోభపెట్టి 1995లో ముఖ్యమంత్రి అయిన నీచ చరిత్ర చంద్రబాబుది. 1999 ఎన్నికల్లో నాటి ప్రధాన మంత్రి వాజ్‌పేయిపై వీచిన సానుభూతి పవనాల్లో అధికారంలోకి వచ్చిన చంద్రబాబు.. ఆ తర్వాత మేనిఫెస్టోలో ఇచ్చిన హామీలను అమలు చేయకుండా ప్రజలను మోసం చేశారు. 2014 ఎన్నికల్లో 650 హామీలు ఇచ్చి నరేంద్ర మోదీ ప్రభంజనంలో అధికారంలోకి వచ్చిన తర్వాత అన్ని హామీలను తుంగలో తొక్కి ప్రజలను మోసం చేశారు. మళ్లీ చంద్రబాబు 2024 ఎన్నికల్లో కూడా జనసేన, బీజేపీ పార్టీలతో పొత్తు పెట్టుకుని అలవికాని హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చారు. 2014–19 మధ్య చంద్రబాబు తీరుతో గాడి తప్పిన రాష్ట్రాన్ని 2019–24 మధ్య నాటి సీఎం వైఎస్ జగన్ తిరిగి గాడిలో పెట్టి రాష్ట్ర అభివృద్ధికి కృషి చేశారు. ఇప్పటికైనా చంద్రబాబుకు చిత్తశుద్ధి ఉంటే వైఎస్సార్‌సీపీపై కక్ష సాధింపు చర్యలు మానుకుని రాష్ట్ర ప్రయోజనాల కోసం పాటుపడాలి. 2024 ఎన్నికల్లో ప్రజలకు ఇచ్చిన హామీలను అమలుచేయాలి' అని హనుమంత్ నాయక్ పేర్కొన్నారు.

శునకాన్ని హింసించిన వ్యక్తిపై కేసు

- రెండు నెలల క్రితం వినోద్ అనే వ్యక్తి కుక్కను నేలకేసి కొట్టిన వైనం
- వీడియో తీసి ఇన్‌స్టాగామ్‌లో పోస్ట్ చేయగా.. కరీంనగర్ జిల్లా వాసి ఫిర్యాదు

కర్నూలు (అగ్రికల్చర్): నోరులేని మూగజీవిని చిత్రహింసలకు గురి చేసి, ఆ దృశ్యాన్ని ఇన్‌స్టాగామ్‌లో పోస్ట్ చేసిన వ్యక్తిపై పోలీసులు శనివారం కేసు నమోదు చేశారు. రెండు నెలల క్రితం కర్నూలు జిల్లా ఆలూరులో వినోద్ అనే వ్యక్తి కుక్కను చిత్రహింసలకు గురి చేశాడు. దానిని గిరగిర తిప్పుతూ నేలకేసి కొట్టాడు. వీడియో తీసి ఇన్‌స్టాగామ్‌లో పోస్ట్ చేశాడు. ఇది వైరల్ అయింది. దీనిపై తెలంగాణ రాష్ట్రం, కరీంనగర్ జిల్లా, కొత్తపల్లిలోని శ్రీలక్ష్మి హోమ్స్‌కు చెందిన ఎదులాపురం గౌతమ్ (34) ఆలూరు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. అయితే పోలీసులు అప్పుడు కేసు నమోదు చేయకుండా ఆలూరు మెజిస్ట్రేట్ కోర్టును అనుమతి కోరారు. ఫస్ట్‌క్లాస్ మెజిస్ట్రేట్ వివరాలు, వీడియో పరిశీలించి కేసు నమోదుకు అనుమతి ఇచ్చారు. దీంతో శనివారం ఆలూరు పోలీసులు వినోద్‌పై ఎఫ్ఐఆర్ నమోదు చేశారు.

వైఎస్సార్‌సీపీ ఆఫీసుల విధ్వంసం తగదు

సీఎం చంద్రబాబుపై ట్రైకార్ మాజీ చైర్మన్ సురేంద్ర ఆగ్రహం



సాక్షి, అమరావతి: రాష్ట్రంలో అధికారం చేపట్టిన చంద్రబాబు రాజకీయ కక్ష సాధింపులకు తెరలేపడం దుర్మార్గమని ఆంధ్రప్రదేశ్ ట్రైకార్ మాజీ చైర్మన్, గిరిజన నాయకుడు గుండా సురేంద్ర మండిపడ్డారు. రాష్ట్రంలో వైఎస్సార్‌సీపీ కార్యాలయాలపై ధ్వంసరచన కొనసాగిస్తున్న సీఎం చంద్రబాబు తీరును ఖండిస్తూ సురేంద్ర ఆదివారం ఒక ప్రకటన విడుదల చేశారు. రాష్ట్రంలో రాజకీయ పార్టీలకు కార్యాలయాలు నిర్మించుకునేలా ప్రభుత్వ భూములు లీజుకు ఇవ్వడం గతం నుంచి ఉందన్నారు. దీనిలో భాగంగానే 2014-2019 మధ్య అధికారంలో ఉన్న టీడీపీ రాష్ట్రవ్యాప్తంగా తమ పార్టీ కార్యాలయాలను ప్రభుత్వ స్థలాల్లో నిర్మించుకుందని తెలిపారు. అప్పట్లో ప్రతిపక్ష పార్టీలకు స్థలాలు దక్కకుండా నిబంధనలు పెట్టి అడ్డగోలుగా టీడీపీ కార్యాలయాలు నిర్మించుకున్న సంగతి ప్రజలకు గుర్తుందని పేర్కొన్నారు. ఇష్టారాజ్యంగా టీడీపీ కార్యాలయాలను నిర్మించుకున్న చంద్రబాబు.. ఇప్పుడు రాష్ట్రంలో వైఎస్సార్‌సీపీకి కార్యాలయాలు లేకుండా చేయాలని కుట్రకు తెరలేపారన్నారు. దీనిలో భాగంగానే తాడేపల్లిలో వైఎస్సార్‌సీపీ కార్యాలయాన్ని కూల్చివేయించారని, అనేక జిల్లాల్లో కార్యాలయాల నిర్మాణాలను అడ్డుకునేలా అధికార యంత్రాంగాన్ని పురిగొల్పారని ఆరోపించారు. తమది విధ్వంస పాలన కాదని, రాష్ట్రాన్ని పునర్‌నిర్మిస్తామని గొప్పలు చెబుతున్న చంద్రబాబు... వారం రోజులు గడవకుండానే తన నిజస్వరూపాన్ని బయటపెట్టారని దుయ్యబట్టారు.

కాకినాడలో అదే అరాచకం

- ముస్లిం వ్యాపారిపై టీడీపీ దాడి
- అడ్డొచ్చిన వారిపై దుర్భాషలు
- ఒకరికి గాయాలు



టీడీపీ నేతల దాడిలో గాయపడిన నూర్ మహ్మద్

కాకినాడ: టీడీపీ నేతలు రెచ్చిపోయారు. ముస్లిం వ్యాపారి దుకాణాన్ని బలవంతంగా ఖాళీ చేయించే ప్రయత్నం చేశారు. అడ్డొచ్చిన వారిని దుర్భాషలాడుతూ దాడికి తెగబడగా.. ఓ వ్యక్తి గాయపడ్డాడు. వివరాలివీ.. కాకినాడలోని జ్యోతుల మార్కెట్ సమీపంలో కరీమ్ అనే వ్యక్తి ఆరేళ్లుగా ఫ్యాన్సీ దుకాణం నడుపుకుంటున్నారు. టీడీపీ నేతల కన్ను అతని దుకాణంపై పడింది. ఆ దుకాణం ఖాళీ చేసి వెళ్లిపోవాలంటూ కాకినాడ సిటీ ఎమ్మెల్యే వనమాడి కొండబాబు అనుచరుడైన నగర టీడీపీ అధ్యక్షుడు మల్లిపూడి వీరు వారం రోజులుగా కరీమ్‌ను హెచ్చరిస్తున్నాడు. తన జీవనాధారమైన దుకాణాన్ని వదిలి వెళ్లలేనని కరీమ్ చెబుతుండటంతో శనివారం రాత్రి టీడీపీ నేత వీరు, మరో 20 మంది వ్యక్తులతో వెళ్లి ఆ దుకాణంపై దాడి చేశాడు. షాపులోని వస్తువులను ధ్వంసం చేసి, అడ్డొచ్చిన వారిని దుర్భాషలాడుతూ మరికొందరిపై దాడులకు తెగబడ్డారు. ఈ క్రమంలో దుకాణ యజమాని బంధువు నూర్ మహ్మద్‌కు గాయాలయ్యాయి. సమాచారం తెలుసుకున్న పోలీసులు అక్కడకు చేరుకుని క్షతగాత్రుడిని ఆస్పత్రికి తరలించారు. బాధితుడు కరీమ్ మాట్లాడుతూ.. తన దుకాణాన్ని టీడీపీ వారి మిత్రుడైన మరో వ్యక్తికి అప్పగించాలంటూ ఒత్తిడి తెస్తున్నారని, దీనిని వ్యతిరేకించిన తనపై దాడులకు తెగబడ్డారని ఆవేదన వ్యక్తం చేశాడు. దాడులకు పాల్పడిన వారిపై కఠిన చర్యలు తీసుకుని, తమకు రక్షణ కల్పించాలని పోలీసులకు విజ్ఞప్తి చేశాడు. మహిళలని కూడా చూడకుండా తమ బంధువులపై దాడి చేశారని ఆవేదన వ్యక్తం చేశాడు. కాగా.. చిరు వ్యాపారాలు చేస్తూ ఉపాధి పొందుతున్న వ్యక్తిపై టీడీపీ నేతలు దాడి చేయడం అన్యాయమని ముస్లిం ఆలోచనాపరుల వేదిక కో–కన్వీనర్ హసన్ షరీఫ్ పేర్కొన్నారు. మైనార్టీలకు అండగా నిలవాల్సిన వ్యక్తులే ఇటువంటి దౌర్జన్యాలకు తెగబడటం సరికాదన్నారు.

వైఎస్సార్‌సీపీ కార్యాలయాన్ని తొలగిస్తాం

- కాకినాడలో జిల్లా కార్యాలయ భవన నిర్మాణంపై నోటీసులు
- ఏడు రోజుల్లో వివరణ ఇవ్వాలని ఆదేశం



కాకినాడ రూరల్: కాకినాడ నగరం 49వ డివిజన్‌లోని పైడా వారి వీధి రాజేశ్వరి నగర్ ప్రాంతంలో అనుమతి లేకుండా వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యాలయం నిర్మిస్తున్నారని కాకినాడ మున్సిపల్ కార్పొరేషన్ టౌన్ ప్లానింగ్ విభాగం అధికారులు శనివారం నోటీసులు జారీ చేశారు. సెక్షన్ 452(1) అండ్ 461(1) ఆఫ్ ఏపీఎంసీ యాక్ట్, సెక్షన్ 89 (1అండ్2), రెడ్ విత్ సెక్షన్ 82, 90(1) ఆఫ్ ఏపీఎంఆర్ అండ్ యూడీఏ యాక్ట్–2016 కింద నిర్మాణంలో ఉన్న భవనానికి ఆదివారం నోటీసులు అతికించారు. తదుపరి నిర్మాణాన్ని తక్షణం ఆపివేయాలని పార్టీ జిల్లా అధ్యక్షుడు కురసాల కన్నబాబును ఆదేశించారు. అనధికార నిర్మాణాన్ని ఎందుకు తొలగించకూడదో తగిన కారణం చూపాలని నోటీసులో పేర్కొన్నారు. కన్నబాబు లేదా ఆయన అనుమతి పొందిన వారి ద్వారా ఏడు రోజుల్లో రాతపూర్వకంగా వివరణ ఇవ్వాలన్నారు. టౌన్ ప్లానింగ్ సూపర్‌వైజర్ కడియాల శ్రీరమ్య డిజిటల్ సిగ్నేచర్‌తో ఈ నోటీసు జారీ అయ్యింది. దీనిపై టౌన్ ప్లానింగ్ విభాగం డీసీపీ హరిదాస్‌ను వివరణ కోరగా, అనుమతి కోసం దరఖాస్తు చేశారని.. అప్రూవల్ అవ్వలేదన్నారు.

కడప వైఎస్సార్‌సీపీ కార్యాలయానికి నోటీసులు

కడప కార్పొరేషన్ : వైఎస్సార్ జిల్లా కడపలోని రామాంజనేయపురంలో నిర్మిస్తున్న వైఎస్సార్‌సీపీ కార్యాలయానికి నగర పాలక సంస్థ అధికారులు నోటీసులు జారీ చేశారు. ప్లాన్ అప్రూవల్ లేకుండా నిర్మిస్తున్నారని, దీనిపై ఎందుకు చర్యలు తీసుకోకూడదో తెలపాలని నోటీసుల్లో పేర్కొన్నారు. కార్యాలయం వద్ద గోడలకు నోటీసులు అంటించారు. పోస్ట్ ద్వారా కూడా నోటీసులు పంపినట్లు అధికారులు తెలిపారు.

బొగ్గు గనుల వేలాన్ని వెంటనే ఆపండి: ఎంపీ ఆర్.కృష్ణయ్య

సాక్షి, హైదరాబాద్: దేశవ్యాప్తంగా బొగ్గు గనుల వేలాన్ని తక్షణమే ఆపాలని జాతీయ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు, రాజ్యసభ సభ్యుడు ఆర్.కృష్ణయ్య ప్రధాన మంత్రి నరేంద్ర మోదీని కోరారు. గనుల వేలంపై రాజ్యసభలో ప్రత్యేక చర్చ జరపాలని డిమాండ్ చేశారు. దేశవ్యాప్తంగా అన్ని రాజకీయ పార్టీలు ఈ అంశంపై ఐక్యం చేసుకుంటున్నాయని, ప్రతి పార్టీ అభిప్రాయాన్ని తీసుకోవాలన్నారు. గనుల వేలం ద్వారా జాతి సంపద ప్రైవేటు వ్యక్తుల పాలవుతుందని, ఇది దేశ ఆర్థిక వ్యవస్థకు తీవ్ర నష్టం చేస్తుందని చెప్పారు. ప్రైవేటు వ్యక్తులకు ఇవ్వకుండా ప్రభుత్వరంగ సంస్థలకు కేటాయించే అంశాన్ని పరిశీలించి నిర్ణయం తీసుకోవాలన్నారు.

చీరాలలో యువకుడి హత్య

- మృతుడు క్యాటరింగ్ షాప్ నిర్వాహకుడు
- చిన్న కారణానికే కత్తితో పొడిచిన వైనం
- నిందితుడు పండ్ల వ్యాపారి వద్ద పనిచేసే యువకుడు



సంతోష్ (ఫైల్)

చీరాలటౌన్: చీరాలలో ఆదివారం దారుణహత్య జరిగింది. పండ్ల వ్యాపారి వద్ద పనిచేసే యువకుడు చిన్న కారణానికే కత్తితో పొడిచి క్యాటరింగ్ షాప్ నిర్వాహకుడు కంచర్ల సంతోష్ (36)ను హత్యచేశాడు. పట్టణ సీఐ పి.శేషగిరిరావు తెలిపిన వివరాల మేరకు.. కంచర్ల సంతోష్ (36) సంగం థియేటర్ సమీపంలో (ఖానాఖజానాలో) అయ్యప్ప క్యాటరర్స్ నిర్వహిస్తూ కర్రీ పాయింట్ కూడా నడుపుతూ జీవనం సాగిస్తున్నాడు. ఇక్కడ రోడ్డు మీద పండ్ల వ్యాపారాలు జరుగుతుంటాయి. ఆదివారం ఉదయం 11 గంటల సమయంలో పండ్ల వ్యాపారి చిన్న వద్ద పనిచేసే ఉమామహేశ్వరరావు తాగునీటి క్యాన్‌ను నీటితో కడిగాడు. ఆ నీరు ఎదురుగా ఉన్న అయ్యప్ప క్యాటరర్స్ ఖానాఖజానా దుకాణం వద్దకు చేరాయి. ఈ విషయమై కర్రీ పాయింట్‌లో పనిచేసే మహిళలు ఉమామహేశ్వరరావును ప్రశ్నించారు. దీంతో అతడు వారిపై వాగ్వాదానికి దిగాడు. దీంతో ఆ మహిళలు తమ యజమాని సంతోష్‌కు సమాచారం అందించారు. అక్కడికి వచ్చిన సంతోష్ ఈ విషయమై ప్రశ్నించాడు. దీంతో ఆగ్రహించిన ఉమామహేశ్వరరావు పండ్లు కోసే కత్తితో సంతోష్‌ని పొడిచాడు. తీవ్ర రక్తస్రావానికి గురైన సంతోష్‌ను స్థానికులు చీరాల ఏరియా వైద్యశాలకు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ సంతోష్ మృతిచెందాడు. మృతునికి భార్య, తల్లి ఉన్నారు. ఘటనాస్థలాన్ని, సంతోష్ మృతదేహాన్ని సీఐ పరిశీలించారు. మృతదేహాన్ని మార్చురీకి తరలించి కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు. హత్యకు వినియోగించిన కత్తిని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఈ కేసులో ఉమామహేశ్వరరావును, పండ్ల వ్యాపారి చిన్నను పోలీసులు అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారని సమాచారం.

ఏసీఏ ప్రధాన కోచ్‌గా యోహానన్

- 2024–25 సీజన్‌కు ఎంపిక చేసిన ఆంధ్ర క్రికెట్ సంఘం
- కేరళకు చెందిన అంతర్జాతీయ క్రికెటర్‌గా టిను యోహానన్‌కు గుర్తింపు



విశాఖ స్పోర్ట్స్: కేరళకు చెందిన అంతర్జాతీయ క్రికెటర్ టిను యోహానన్‌ను ఏసీఏ పురుషుల సీనియర్స్ జట్టుకు కోచ్‌గా నియమించారు. ఏసీఏ జట్లలోని పలు విభాగాలకు కోచ్‌లను క్రికెట్ సలహా మండలి (సీఏసీ) సూచనల మేరకు 2024–25 సీజన్‌కు ప్రధాన కోచ్‌ల ఎంపిక జరిగింది. ఆంధ్ర క్రికెట్ సంఘం(ఏసీఏ) చరిత్రలోనే తొలిసారిగా అంతర్జాతీయ మ్యాచ్‌లు ఆడిన భారతీయ మాజీ క్రికెటర్‌ను ప్రధాన కోచ్‌గా ఎంపిక చేశారు. అండర్–23 పురుషుల జట్టుకు ప్రధాన కోచ్‌గా జె.కృష్ణారావు, సీనియర్ మహిళా జట్టుకు ఎం.ఎన్.విక్రమ్ వర్మ, మహిళా జట్టుకు ఎస్.రమాదేవి, అండర్ –19 మహిళా జట్టుకు ఎస్.శ్రీనివాసరెడ్డి, అండర్–15 మహిళా జట్టుకు ఎం.సవితను ప్రధాన కోచ్‌లుగా నియమించారు. అంతర్జాతీయ క్రికెటర్‌ను ఏసీఏ ప్రధాన కోచ్‌గా తీసుకొచ్చేందుకు ఏసీఏ అపెక్స్ కౌన్సిల్ అధ్యక్షుడు పి.శరత్‌చంద్రరెడ్డి, కార్యదర్శి ఎస్ఆర్ గోపినాథరెడ్డి చేసిన కృషిని సీఏసీ చైర్మన్ మధుకర్ అభినందించారు.

మీడియం పేసర్ యోహానన్..

కుడిచేతి వాటం మీడియం ఫాస్ట్ బౌలర్ యోహానన్. కేరళ తరఫున ఫస్ట్‌క్లాస్ క్రికెట్ ఆడాడు. ఆ తర్వాత భారత్ తరఫున టెస్ట్, వన్డే క్రికెట్ ఆడిన తొలి కేరళ ఆటగాడిగా నిలిచాడు. ప్రస్తుతం కేరళ జట్టుకు కోచ్‌గా వ్యవహరిస్తున్నాడు. బెంగళూర్‌లోని నేషనల్ క్రికెట్ అకాడమీకి మొదటి ఇన్‌టేక్‌గా ఎంపికై 2001లో ఇంగ్లాండ్‌తో జరిగిన స్వదేశీ సిరీస్‌లో టెస్ట్ అరంగేట్రం చేశాడు. మొహాలీలో జరిగిన మొదటి టెస్ట్‌లో ఇంగ్లాండ్ ఓపెనర్లను పెవిలియన్ దారి పట్టించాడు. మొదటి ఓవర్ నాలుగో బంతికే తొలి వికెట్ సాధించాడు.

సుప్రీంకోర్టుకు కేజ్రీవాల్

న్యూఢిల్లీ: మద్యం కుంభకోణానికి సంబంధించిన మనీ లాండరింగ్ కేసులో ఢిల్లీ రౌస్ అవెన్యూ కోర్టు తనకు ఇచ్చిన బెయిల్‌పై మధ్యంతర స్టే విధిస్తూ ఢిల్లీ హైకోర్టు ఇచ్చిన ఆదేశాలను సవాలు చేస్తూ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్ సుప్రీంకోర్టును ఆశ్రయించారు. ఢిల్లీ హైకోర్టు ఆదేశాలను కొట్టివేయాలని కోరుతూ పిటిషన్ దాఖలు చేశారు. ఈ పిటిషన్‌పై సోమవారం సుప్రీంకోర్టులో విచారణ జరిగే అవకాశం ఉంది. కేజ్రీవాల్‌కు ట్రయల్ కోర్టు ఈ నెల 20న బెయిల్ మంజూరు చేసింది. దీనిపై ఈ నెల 21న ఢిల్లీ హైకోర్టు మధ్యంతర స్టే విధించింది. దీంతో కేజ్రీవాల్ తీహార్ జైల్లోనే ఉండిపోవాల్సి వచ్చింది. మనీ లాండరింగ్ కేసులో మార్చి 21న ఈడీ ఆయనను అరెస్టు చేసిన సంగతి తెలిసిందే.

భారత జాలర్ల అరెస్టు

కొలంబో: తమ జలాల్లో అక్రమంగా చేపల వేటకు పాల్పడుతున్నారనే ఆరోపణలపై 18 మంది భారత మత్స్యకారులను శ్రీలంక నావికాదళం అరెస్టు చేసింది. మూడు నౌకలను స్వాధీనం చేసుకుంది. శనివారం రాత్రి నిర్వహించిన సెర్చ్ ఆపరేషన్‌లో డెల్ఫ్‌ట్ దీవులకు సమీపంలోని ఉత్తర సముద్రంలో మత్స్యకారులను అరెస్టు చేసినట్లు, తదుపరి చట్టపరమైన చర్యల కోసం అరెస్టయిన మత్స్యకారులను కంకేసంతురై ఫిషింగ్ హార్బర్‌కు తరలించనున్నట్లు శ్రీలంక నేవీ అధికార ప్రతినిధి కెప్టెన్ గయాన్ విక్రమసూర్య తెలిపారు. ఈ ఏడాదిలో శ్రీలంక జలాల్లో అక్రమంగా చేపల వేటకు పాల్పడినందుకు 180 మందికి పైగా భారత మత్స్యకారులను శ్రీలంక అరెస్టు చేసింది.

ఎలాన్ మస్క్‌కు 11వ బిడ్డ



న్యూయార్క్: ప్రపంచ కుబేరుడు, టెస్లా, స్పేస్ ఎక్స్, న్యూరాలింక్ సంస్థల సీఈఓ ఎలాన్ మస్క్ మరోసారి తండ్రయ్యారు. న్యూరాలింక్ స్పెషల్ ప్రాజెక్ట్స్ హెడ్ శివోన్ జిలిస్ ద్వారా ఆయనకు కొన్ని రోజుల క్రితం మూడో బిడ్డ జన్మించినట్లు బ్లూమ్‌బర్గ్ సంస్థ వెల్లడించింది. దీంతో మస్క్ పిల్లల సంఖ్య ఇప్పటిదాకా 11కు చేరుకున్నట్లు తెలియజేసింది. మస్క్‌కు మొదటి భార్య, రచయిత్రి జస్టిన్ మస్క్ ద్వారా ఐదుగురు బిడ్డలు కలిగారు. సంగీత కళాకారిణి గ్రిమ్స్ ద్వారా ముగ్గురు పిల్లలు, శివోన్ జిలిస్ ద్వారా మరో ముగ్గురు పిల్లలు జన్మించారు. ఎలాన్ మస్క్, శివోన్ జిలిస్‌కు 2021లో కవలలు పుట్టారు. ప్రపంచవ్యాప్తంగా చాలా దేశాల్లో జననాల రేటు పడిపోతుండడంతో జనాభా తగ్గిపోతోందని మస్క్ 2021లో ఆందోళన వ్యక్తంచేశారు. అందుకే జనాభాను పెంచాలని, వీలైనంత ఎక్కువ మంది పిల్లలను కనాలని సూచించారు. పిల్లలను కనకపోతే నాగరికత అంతమైపోతుందని చెప్పారు. అత్యధికంగా తెలివితేటలు, మేధాశక్తి ఉన్న వ్యక్తులు పిల్లలను ఎక్కువగా కనాలన్నది మస్క్ అభిప్రాయం. ఆయనకు తన సంస్థల్లో పనిచేసే మహిళలతో వివాహేతర సంబంధాలున్నాయని ఆరోపణలున్నాయి.

సునాక్ ఎదురీత!

14 ఏళ్ల కన్జర్వేటివ్ పాలనకు తెర? ● లేబర్ పార్టీదే గెలుపు అంటున్న సర్వేలు ● బ్రిటన్‌లో జూలై 4న సార్వత్రిక ఎన్నికలు



బ్రిటన్‌లో పద్నాలుగేళ్ల కన్జర్వేటివ్ పాలనకు తెరపడనుందా? భారత మూలాలున్న తొలి ప్రధానిగా చరిత్ర సృష్టించిన రిషి సునాక్ గద్దె దిగాల్సి వస్తుందా? అవుననే అంటున్నాయి ఒపీనియన్ పోల్స్. షెడ్యూల్ ప్రకారం ఏడాది చివరిదాకా ఆగితే తన ప్రభుత్వంపై ప్రజల్లో పెరుగుతున్న అసంతృప్తి తారస్థాయికి చేరి ఓటమి ఖాయమనే భావనతో రిషి అనూహ్యంగా జూలై 4న ముందస్తు ఎన్నికలకు వెళ్లాలని నిర్ణయం తీసుకున్నారు. అయినా పెద్దగా ప్రయోజనమేమీ ఉండకపోవచ్చని సర్వేలంటున్నాయి. విపక్ష లేబర్ పార్టీ భారీ మెజారిటీతో అధికారంలోకి వస్తుందని పేర్కొంటున్నాయి. స్వయానా రిషీ కూడా ఎదురీదుతున్నారని, సొంత పార్లమెంట్ స్థానాన్ని కూడా కోల్పోవచ్చని సావంత పోల్ పేర్కొంది! అదే జరిగితే సొంత పార్లమెంటు స్థానంలో ఓడిన తొలి సిట్టింగ్ ప్రధానిగా బ్రిటన్ చరిత్రలో రిషి నిలిచిపోతారు...

ముందస్తు ఎన్నికలకు వెళ్లడంతోనే కన్జర్వేటివ్ పార్టీ ఓటమి సగం ఖాయమైందన్నది రాజకీయ నిపుణుల అభిప్రాయం. బ్రిటన్‌లో కన్జర్వేటివ్ పార్టీది 190 ఏళ్ల చరిత్ర. ఇంత సుదీర్ఘ చరిత్రలో 1906లో వచ్చిన 131 సీట్లే అత్యల్పం. ఈసారి ఆ రికార్డును అధిగమించవచ్చని సర్వేలంటున్నాయి. ''సునాక్ ఉత్తర ఇంగ్లాండ్‌లోని కన్జర్వేటివ్‌ల కంచుకోటైన తన సొంత పార్లమెంటరీ స్థానాన్ని కూడా కోల్పోవచ్చు. ఆర్థిక మంత్రి జెరెమీ హంట్‌తో సహా పలువురు సీనియర్ మంత్రులకు ఓటమి తప్పదు'' అని సావంత పోల్ పేర్కొంది. కన్జర్వేటివ్ పార్టీ చరిత్రలోనే అత్యంత ఘోర పరాజయం తప్పక పోవచ్చని రాజకీయ నిపుణులు అభిప్రాయపడుతున్నారు. భారత సంతతికి చెందిన వారు ఈసారి కన్జర్వేటివ్ పార్టీకి ఓటేయకపోవచ్చనేది పోల్‌స్టర్ల అంచనా.

లేబర్ పార్టీకి 425కు పైగా సీట్లు...!

హౌజ్ ఆఫ్ కామన్స్‌లో 650 సీట్లకు గాను లేబర్ పార్టీ 425కు పైగా సాధించి భారీ మెజారిటీతో అధికారంలోకి వస్తుందని సర్వేలు చెబుతున్నాయి. కన్జర్వేటివ్ పార్టీ 108 స్థానాలకు పరిమితమవుతుందని యూగవ్, కేవలం 53 స్థానాలకే పరిమితమవుతారని సావంత పోల్ పేర్కొన్నాయి. సావంత అయితే లేబర్ పార్టీకి దాని చరిత్రలోనే అత్యధికంగా 516 సీట్లు రావచ్చని అంచనా వేయడం విశేషం! కన్జర్వేటివ్‌లకు 72కు మించబోవని, లేబర్ పార్టీ 456 సీట్లు దాటుతుందని బెస్ట్ ఫర్ బ్రిటన్ సర్వే అంచనా వేసింది. 2019 ఎన్నికల్లో కన్జర్వేటివ్ పార్టీ 43.6 శాతం ఓట్లతో 365 సీట్లు సాధించగా లేబర్ పార్టీకి 32.1 శాతం ఓట్లతో 202 స్థానాలు దక్కాయి.

ఆకట్టుకుంటున్న కైర్ స్టార్మర్

'లెఫ్టీ లండన్ లాయర్'గా పేరు తెచ్చుకున్న కైర్ స్టార్మర్ లేబర్ పార్టీకి నాయకత్వం వహిస్తున్నారు. 14 ఏళ్లుగా విపక్షంలో ఉంటూ కుంగిపోయిన పార్టీలో ఆయన జోష్ నింపుతున్నారు. ఇళ్ల సంక్షోభాన్ని పరిష్కరిస్తామని, పన్ను పెంపుదల లేకుండా మెరుగైన ప్రజా సేవలను అందిస్తామనే హామీలతో ఓటర్లను ఆకర్షిస్తున్నారు. కన్జర్వేటివ్ పార్టీ ప్రధాన దాత అయిన బిలియనీర్ జాన్ కాడ్వెల్ కూడా ఈసారి లేబర్ పార్టీకి మద్దతిస్తున్నారు. తాను లేబర్ పార్టీకే ఓటేస్తానని బాహాటంగా చెబుతున్నారు. అందరూ అదే చేయాలని పిలుపునిస్తున్నారు.

ప్రజల్లో వ్యతిరేకతకు కారణాలెన్నో...

బ్రెగ్జిట్ పరిణామాల నేపథ్యంలో డేవిడ్ కామెరాన్ రాజీనామా అనంతరం చీటికీమాటికీ ప్రధానులు మారడం కన్జర్వేటివ్ పార్టీకి చేటు చేసింది. థెరిసా మే, బోరిస్ జాన్సన్, లిజ్ ట్రస్, రిషి రూపంలో ఏకంగా నలుగురు ప్రధానులు మారారు. వీరిలో 45 రోజులే కొనసాగిన ట్రస్ పార్టీకి గట్టి నష్టాన్ని కలిగించారని, దాన్ని సునాక్ పూడ్చలేకపోయారని అంటున్నారు.

- ఐదేళ్లలో బ్రిటన్ వాసుల జీవన ప్రమాణాలు బాగా పడిపోయాయి. వారిపై పన్ను భారమైతే గత 70 ఏళ్లలో అత్యధిక స్థాయిలో ఉంది. అక్రమ వలసలు పెరిగాయి. ప్రధానిగా సునాక్ నిర్ణయాలపై సొంత పార్టీ నేతల నుంచే విమర్శలొచ్చాయి.
- వీటికి తోడు 14 ఏళ్లుగా అధికారంలో ఉండటంతో సహజంగానే ప్రభుత్వ వ్యతిరేకత తీవ్రంగా ఉంది.
- 2022 అక్టోబర్లో రిషి ప్రధాని అవుతూనే ద్రవ్యోల్బణాన్ని సగానికి తగ్గిస్తానని, ఆర్థిక వ్యవస్థను గాడిన పెడతానని, రుణ భారాన్ని, నేషనల్ హెల్త్ సర్వీస్ వెయిటింగ్ జాబితాను తగ్గిస్తానని, అక్రమ వలసలను అడ్డుకుంటానని హామీ ఇచ్చారు. ఇవేవీ చేయలేకపోగా సంప్రదాయ ఓటర్లనూ మెప్పించలేకపోయారని విమర్శ ఉంది.
- రిఫార్మ్ యూకే పార్టీ పుంజుకోవడం కూడా కన్జర్వేటివ్‌లను దెబ్బ తీయనుంది. ఈ పార్టీకి 15 శాతం ఓట్ల వాటా ఉంది. ఈసారి చాలా స్థానాల్లో కన్జర్వేటివ్ ఓటు బ్యాంకుకు భారీగా గండి పెడుతుందని విశ్లేషకులు అంచనా వేస్తున్నారు.

- సాక్షి, నేషనల్ డెస్క్

నేటి నుంచి పార్లమెంట్

- నేడు, రేపు లోక్‌సభ సభ్యుల ప్రమాణ స్వీకారం
- బుధవారం స్పీకర్ ఎన్నిక, ఉభయ సభలను ఉద్దేశించి గురువారం రాష్ట్రపతి ప్రసంగం

సాక్షి, న్యూఢిల్లీ: పార్లమెంట్ ప్రత్యేక సమావేశాలు సోమవారం ప్రారంభం కానున్నాయి. 18వ లోక్‌సభకు ఎన్నికైన సభ్యులు సోమవారం, మంగళవారం ప్రమాణ స్వీకారం చేయనున్నారు. ప్రొటెం స్పీకర్ భర్తృహరి వారితో మెహతాబ్ ప్రమాణం చేయిస్తారు. తొలుత రాష్ట్రపతి ద్రౌపది ముర్ము సోమవారం ప్రొటెం స్పీకర్‌గా భర్తృహరితో ప్రమాణస్వీకారం చేయిస్తారు. అనంతరం తొలుత ప్రధాని నరేంద్ర మోదీ, ఆ తర్వాత సీనియారిటీ ఆధారంగా మంత్రులు, ఎంపీలు ప్రమాణం చేస్తారు. ఆంగ్ల వర్ణక్రమంలో రాష్ట్రాలు/కేంద్ర పాలిత ప్రాంతాల సభ్యులు ప్రమాణస్వీకారం చేస్తారు. బుధవారం లోక్‌సభ సభ్యులందరూ కలిసి నూతన స్పీకర్‌ను ఎన్నుకుంటారు. రాష్ట్రపతి ద్రౌపది ముర్ము గురువారం పార్లమెంట్ ఉభయసభలను ఉద్దేశించి ప్రసంగిస్తారు. రాష్ట్రపతి ప్రసంగానికి ధన్యవాదాలు తెలిపే తీర్మానంపై చర్చ అనంతరం వచ్చే నెల 3వ తేదీన పార్లమెంట్ ప్రత్యేక సమావేశాలు ముగియనున్నాయి. వర్షాకాల సమావేశాలు జూలై 22వ తేదీ నుంచి ప్రారంభమవుతాయి.

స్పీకర్‌గా మళ్లీ ఓం బిర్లా!

ప్రొటెం స్పీకర్ ప్యానెల్‌లో ఉండడానికి విపక్ష నేతలు విముఖత చూపడంతో స్పీకర్ ఎన్నికపై సర్వత్రా ఉత్కంఠ నెలకొంది. ఈసారి స్పీకర్ పదవిని ఎన్డీయేలో బీజేపీయేతర పక్షాలకు కేటాయిస్తారని జోరుగా ప్రచారం సాగుతోంది. మరోవైపు మిత్రపక్షాలతో కలిసి సంకీర్ణ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయడంతో బీజేపీ నాయకత్వం స్పీకర్ పదవిని ఇతరులకు ఇచ్చే అవకాశం తక్కువేనని రాజకీయ విశ్లేషకులు చెబుతున్నారు. స్పీకర్ పదవిని మహిళలకు కేటాయించే పక్షంలో గుజరాత్‌కు చెందిన పూనంబెన్, ఆంధ్రప్రదేశ్‌కు చెందిన దగ్గుబాటి పురందేశ్వరి పేర్లు వినిపిస్తున్నాయి. గత లోక్‌సభను తనదైన రీతిలో ముందుకు నడిపించిన ఓం బిర్లా పేరు కూడా తెరపైకి వచ్చింది. గత లోక్‌సభలో విపక్ష సభ్యులు తక్కువైనప్పటికీ వారు వినిపించిన ప్రభుత్వ వ్యతిరేక గళం అధికార పక్షంపై ప్రభావం చూపకుండా సభను నడిపించడంలో ఓం బిర్లా చాతుర్యం చూపించారు.

అమెరికాలో భారీ వర్షాలు

వాషింగ్టన్: ఎడతెరిపి కురుస్తున్న భారీ వర్షాలతో అమెరికాలో అయోవా రాష్ట్రం అతలాకుతలమైంది. వర్షపు నీటిలో మునిగి రహదారులు కనిపించకుండాపోయాయి. ఇళ్లు నీట మునగడంతో జనం సురక్షిత ప్రాంతాలకు తరలిపోతున్నారు. జలదిగ్బంధంలో చిక్కుకుపోయిన వారిని హెలికాప్టర్ సాయంతో రక్షించేందుకు ప్రభుత్వం రంగంలోకి దిగింది. పడవల్లో జనాలను వేరే చోట్లకు తరలిస్తున్నారు. అయోవా రాష్ట్రంలోని సియాక్స్ కౌంటీలోని రాక్‌వ్యాలీ జనావాసం మొత్తం జలమయమైంది. 21 కౌంటీల్లో అత్యవసర పరిస్థితి విధించారు.



సౌత్ డకోటాలో వరద బీభత్సం

45.72 సెంటీమీటర్ల వర్షపాతం

సౌత్ డకోటాలోనూ భీకర వర్షాలు కురుస్తున్నాయి. ఆగ్నేయ సియాక్స్ ఫాల్స్ సమీపంలోని కాన్‌టన్ పట్టణంలో ఏకంగా 45.72 సెంటీమీటర్ల వర్షపాతం నమోదైంది. జాతీయ రహదారులపైనా వర్షపు నీరు నిలిచింది. దీంతో హైవేలపై రాకపోకలను పోలీసులు ఆపేశారు. మిన్నెసోటాలోనూ రాష్ట్ర రహదారులను మూసేశారు.

మిగతా రాష్ట్రాలు అతి ఎండలు

అమెరికాలో ఓవైపు వర్షాలు వణికిస్తుంటే మిగతా రాష్ట్రాల్లో భానుడి భగభగలు కొనసాగుతున్నాయి. 1.5 కోట్ల జనాభాను వడగాల్పులు వేధిస్తున్నాయని, మరో 9 కోట్ల మంది భయంకర ఎండల బారిన పడ్డారని జాతీయ వాతావరణ సంస్థ ఆదివారం ప్రకటించింది. 1936 తర్వాత ఎన్నడూలేనంతగా గత ఏడాది అత్యధిక వడగాల్పులు అమెరికాకు ముచ్చెమటలు పట్టించాయి. దీంతో గత 45 ఏళ్లలో ఎప్పుడూలేనంతగా 2,300 మంది ఎండ సంబంధ ఘటనల్లో ప్రాణాలు కోల్పోయారు. సోమవారం వాషింగ్టన్, కాలిఫోర్నియాలోని సెంట్రల్ వ్యాలీల్లో అధిక ఉష్ణోగ్రత నమోదుకావచ్చని వాతావరణ శాఖ తెలిపింది.

పునర్వినియోగ ప్రయోగ వాహన పరీక్ష సక్సెస్

మూడోసారి విజయవంతంగా ప్రయోగించిన ఇస్రో

సూళ్లూరుపేట(తిరుపతి జిల్లా)/సాక్షి, బెంగళూరు: గతంతో పోలిస్తే అత్యంత ప్రతికూల పరిస్థితుల్లోనూ పునర్వినియోగ ప్రయోగ వాహనాన్ని వరసగా మూడోసారీ విజయవంతంగా పరీక్షించినట్లు ఇస్రో ఆదివారం ప్రకటించింది. రీ యూజబుల్ లాంఛ్ వెహికల్(ఆర్ఎల్‌వీ) అభివృద్ధిలో సంక్లిష్టమైన సాంకేతికతను ఇస్రో సముపార్జించిందని ఈ ప్రయోగం మరోసారి నిరూపించింది. ఆకాశం నుంచి కిందకు విడిచిపెట్టాక గమ్యం దిశగా రావడం, ల్యాండింగ్ ప్రాంతాన్ని ఖచ్చితంగా ఎంచుకోవడం, వేగంగా ల్యాండ్ అవడం వంటి పరామితులను పుష్పక్‌గా పిలుచుకునే ఈ ఆర్ఎల్‌వీ ఖచ్చితత్వంతో సాధించిందని ఇస్రో ఆదివారం పేర్కొంది. ల్యాండింగ్ ఎక్స్‌పరిమెంట్(ఎల్‌ఈఎక్స్-03) సిరీస్‌లో మూడోది, చివరిదైన ఈ ప్రయోగాన్ని ఆదివారం ఉదయం 7.10 గంటలకు కర్ణాటకలోని చిత్రదుర్గలో ఉన్న ఇస్రో వారి ఏరోనాటికల్ టెస్ట్ రేంజ్‌లో జరిపారు. మొదట పుష్పక్‌ను భారత వాయుసేనకు చెందిన చినూక్ హెలికాప్టర్‌లో రన్‌వేకు 4.5 కిలోమీటర్ల దూరంలో 4.5 కిలోమీటర్ల ఎత్తుకు తీసుకెళ్లి విడిచిపెట్టారు. అది సరిగ్గా రన్‌వే వైపు ఖచ్చితత్వంతో దూసుకొచ్చి అతి గాలులున్న ప్రతికూల వాతావరణంలోనూ సురక్షితంగా ల్యాండ్ అయింది. తక్కువ ఎత్తుకు తీసుకెళ్లి విడిచిపెట్టడం వల్ల ల్యాండింగ్ సమయంలో దాని వేగం గంటకు 320 కి.మీ.లు పెరిగింది. సాధారణంగా ల్యాండింగ్ జరుగుతున్నపుడు వాణిజ్య విమానం గంటకు 260 కి.మీ.లు, యుద్ధవిమానమైతే గంటకు 280 కి.మీ.ల వేగంతో ల్యాండ్ అవుతాయి. ల్యాండ్ కాగానే బ్రేక్ పారాచూట్ విచ్చుకోవడంతో పుష్పక్ వేగం గంటకు 100 కి.మీ.లకు తగ్గిపోయింది. ల్యాండింగ్ గేర్ బ్రేకులు వేయడంతో పుష్పక్ ఎట్టకేలకు స్థిరంగా ఆగింది. పుష్పక్ స్వయంచాలిత రడ్డర్, నోస్ వీల్ స్టీరింగ్ వ్యవస్థలను సరిగా వాడుకుందని ఇస్రో పేర్కొంది.



మరణశయ్యపై ఖలీదా జియా!

మాజీ ప్రధానిని ప్రభుత్వం చంపజూస్తోందన్న బంగ్లా విపక్షం



ఢాకా: బంగ్లాదేశ్ మాజీ ప్రధాని ఖలీదా జియాకు సరైన వైద్య అందించకుండా ఆమెపై ప్రధాని షేక్ హసీనా పగ తీర్చుకుంటున్నారని బంగ్లాదేశ్ నేషనల్ పార్టీ ఆరోపించింది. ఖలీదా 'మరణశయ్య'పై ఉన్నారని, ఆమెకు సరైన వైద్య చికిత్స అందడం లేదని ఆ పార్టీ సెక్రటరీ జేనరల్ ఫక్రుల్ ఇస్లామ్ అలంగీర్ ఆదివారం తెలిపారు. గృహ నిర్బంధంలో ఉన్న 78 ఏళ్ల ఖలీదా జియా శనివారం రాత్రి తన నివాసంలో అకస్మాత్తుగా అస్వస్థతకు గురయ్యారని, వెంటనే అంబులెన్స్‌లో ఎవర్‌కేర్ ఆస్పత్రికి తరలించారని తెలిపారు. 1991 నుంచి 96 వరకు, 2001 నుంచి 2006 రెండు పర్యాయాలు ప్రధానిగా పనిచేసిన ఖలీదా ఓ అవినీతి కేసులో జైలు పాలయ్యారు. అయితే జియా ఓల్డ్ ఢాకా సెంట్రల్ జైల్లోనే అనారోగ్యానికి గురయ్యారు. ఆ సమయంలోనే ఆమెకు సరైన వైద్యం అందలేదని అలంగీర్ ఆరోపించారు. ఆ తరువాత ఆమె ఇంట్లో ఉండటానికి అనుమతించినప్పటికీ పూర్తి నిర్బంధంలో జైలులాంటి జీవితాన్నే అనుభవిస్తున్నారని చెప్పారు. ఇప్పుడు తీవ్ర అనారోగ్యంతో ఉన్న ఖలీదాకు విదేశాల్లో చికిత్స అవసరమని మెడికల్ బోర్డు చెప్పినా ప్రభుత్వం పట్టించుకోవడంలేదని, సరైన వైద్యం అందకుండా చంపేసి, రాజకీయంగా అడ్డు తొలగించుకోవాలని ప్రధాని షేక్ హసీనా చూస్తున్నారని అలంగీర్ ఆరోపించారు.

మేనల్లుడే వారసుడు: మాయావతి

లక్నో: బీఎస్పీ అధినేత్రి మాయావతి మేనల్లుడు ఆకాశ్ ఆనంద్ తన వారసుడని మరోసారి ప్రకటించారు. పార్టీ కీలక బాధ్యతల నుంచి తప్పిస్తూ నెల రోజుల కిందటి నిర్ణయాన్ని వెనక్కి తీసుకున్నారు. ఆనంద్‌ను పార్టీ జాతీయ కో-ఆర్డినేటర్‌గా నియమిస్తూ ఆదేశాలు జారీ చేశారు. పార్టీ రాష్ట్ర కార్యాలయంలో ఆదివారం జరిగిన సమావేశం అనంతరం ఈ మేరకు ప్రకటన విడుదల చేశారు. ఆకాశ్‌ను మాయా గత డిసెంబర్‌లోనే తన వారసుడిగా ప్రకటించారు. అయితే లోక్‌సభ ఎన్నికల సమయంలో సీతాపూర్‌లో ర్యాలీలో చేసిన ప్రసంగంలో ఆనంద్ ఎన్నికల కోడ్‌ను ఉల్లంఘించారంటూ కేసు నమోదైంది. దీంతో ఆయన ఇంకా పరిణితి చెందాల్సి ఉందంటూ మూడో దశ ఎన్నికలు ముగిసిన వెంటనే పార్టీ బాధ్యతలనుంచి తప్పించారు.

బిహార్‌లో కూలిన మూడో వంతెన

మోతీహారి: బిహార్‌లో వంతెనలు వరుసగా కూలిపోతున్నాయి. ఇప్పటికే రెండు బ్రిడ్జిలు కూలిపోగా, తాజాగా ఆదివారం తూర్పు చంపారన్ జిల్లాలోని మోతీహారిలోని ఘోరాసహన్ బ్లాక్‌లో నిర్మాణంలో ఉన్న వంతెన మరొకటి కూలిపోయింది. కాలువపై నిర్మిస్తున్న ఈ వంతెన అమ్వా గ్రామాన్ని బ్లాక్‌లోని ఇతర ప్రాంతాలకు కలుపుతుంది. 16 మీటర్ల పొడవైన వంతెనను రూరల్ వర్క్స్ విభాగం రూ.1.5 కోట్ల వ్యయంతో నిర్మిస్తోంది. ఘటనపై విచారణకు ఆదేశించామని, అయితే కారణాలేమీ తెలియ రాలేదని ప్రభుత్వ అదనపు కార్యదర్శి దీపక్ కుమార్ సింగ్ తెలిపారు.

ఉక్రెయిన్ దాడుల్లో ఆరుగురి మృతి

కీవ్: రష్యా భూభాగాలపై ఉక్రెయిన్ ఆదివారం డ్రోన్లు, క్షిపణులతో ప్రతీకార దాడులకు దిగింది. వాటిలో ఆరుగురు ప్రాణాలు కోల్పోయారు. క్రిమియా ద్వీపకల్పంలోని సెవస్టోపోల్ తీరపట్టణంపై ఉక్రెయిన్ ఐదు క్షిపణులను ప్రయోగించింది. రష్యాను ఎదుర్కొనేందుకు అమెరికా, పాశ్చాత్య దేశాలు తమకు మరిన్ని ఆయుధాలివ్వాలని అధ్యక్షుడు జెలెన్‌స్కీ మరోసారి కోరారు.

నీట్ అక్రమాలపై సీబీఐ కేసు నమోదు

బిహార్‌లో సీబీఐ బృందంపై దాడి

న్యూఢిల్లీ: నీట్-యూజీ అక్రమాలపై దర్యాప్తు కోసం సీబీఐ రంగంలోకి దిగింది. కేసులో మొదటి ఎఫ్ఐఆర్ నమోదు చేసినట్లు ఆదివారం వెల్లడించింది. గుర్తుతెలియని వ్యక్తులను నిందితులుగా చేరుస్తూ పలు సెక్షన్ల కింద కేసు నమోదు చేశారు. నీట్ అవకతవకలపై పలు రాష్ట్రాల్లో నమోదైన కేసులను సీబీఐకి బదిలీ చేసేలా చర్యలు చేపట్టారు. యూజీసీ-నెట్ పరీక్ష అక్రమాలపై దర్యాప్తు చేస్తున్న సీబీఐ అధికారుల బృందంపై బిహార్‌లోని నవడా జిల్లా కాసియాదీ గ్రామంలో శనివారం సాయంత్రం దాడి జరిగింది. సీబీఐ అధికారుల వాహనాలపై స్థానికులు దాడికి దిగారు. పోలీసులు వారిని చెదరగొట్టారు. మరోవైపు గ్రేస్ మార్కులు సంపాదించిన 1,563 మంది అభ్యర్థుల్లో 813 మంది మళ్లీ నీట్-యూజీ పరీక్ష రాశారు.

నీట్ కుంభకోణంలో ప్రభుత్వ పెద్దలు: ఖర్గే

విద్యా వ్యవస్థలోకి పేపర్ లీకేజీలు, అవినీతి, అక్రమాలు, విద్యా మాఫియా చొరబడ్డాయని కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే విమర్శించారు. నీట్-యూజీ అభ్యర్థులకు జరిగిన అన్యాయానికి మోదీ ప్రభుత్వం బాధ్యత వహించాలంటూ ఎక్స్‌లో పోస్టు చేశారు. నీట్ కుంభకోణంలో ప్రభుత్వ పెద్దల హస్తముందని, వారిపై విచారణ జరపాలని డిమాండ్ చేశారు. యువత భవిష్యత్తుకు పెద్ద ముప్పుగా మారిందనేందుకు ఇదొక ఉదాహరణ అని రాహుల్‌గాంధీ, ప్రియాంకా గాంధీ వద్రా అన్నారు. విద్యావ్యవస్థను మోదీ ప్రభుత్వం మాఫియాకు, అవినీతి పరులకు అప్పగించిందని దుయ్యబట్టారు.

మీ అవధుల్లేని ప్రేమే నన్ను రక్షించింది

వయనాడ్ ప్రజలకు రాహుల్ భావోద్వేగ లేఖ

వయనాడ్: రాయ్‌బరేలీలోనూ నెగ్గడంతో వయనాడ్ లోక్‌సభ స్థానానికి రాజీనామా చేసిన కాంగ్రెస్ నేత రాహుల్‌గాంధీ ఆ నియోజకవర్గ ప్రజలకు ఆదివారం భావోద్వేగ లేఖ రాశారు. '' మీకు నేను పెద్దగా పరిచయం లేకున్నా నన్ను నమ్మారు. అవ్యాజమైన ప్రేమాభిమానాలు కురిపించారు. మీ రాజకీయ నేపథ్యం, వర్గం, మతం, భాషతో నిమిత్తం లేకుండా ఆదరించారు. ఎన్డీఏ శ్రేణులు నన్ను రోజూ అనవసరంగా తిట్టిపోస్తున్నా, వ్యక్తిగత దూషణకు బరితెగించినా మీ అవధుల్లేని ప్రేమే నన్ను కాపాడింది. మీరే నా సొంతిల్లు, నా కుటుంబం. మీకెలా కృతజ్ఞతలు తెలపాలో అర్థం కావడం లేదు. కష్టకాలంలో మీరు చూపిన ప్రేమ, ఇచ్చిన ధైర్యం అపూర్వం. మీరంతా నా కుటుంబంలో భాగం. మీ ఆశీస్సులతో ప్రియాంక వయనాడ్‌లో గెలిచి పార్లమెంట్‌లో మీ గళం వినిపిస్తారు'' అని రాహుల్ అన్నారు.

డీఎస్పీ నుంచి కానిస్టేబుల్‌గా డిమోషన్

లక్నో: ఉత్తమ ప్రతిభ కనబరిచిన పోలీసులకు పదోన్నతి లభించడం సాధారణం. అయితే కానిస్టేబుల్ స్థాయి నుంచి అంచెలంచెలుగా ఎదిగి డీఎస్పీ స్థాయికి చేరుకున్న ఒక పోలీసు అధికారి మళ్లీ కానిస్టేబుల్‌గా డిమోట్ అయిన ఘటన ఉత్తరప్రదేశ్‌లో తాజాగా చోటుచేసుకుంది. మూడేళ్ల క్రితం ఉన్నావ్ పరిధిలోని బిఘాపూర్ సర్కిల్ ఆఫీసర్ కృపాశంకర్ కనౌజియా సెలవు మీద వెళ్లి ఆచూకీ లేకుండా పోయారు. భార్య ఫిర్యాదుతో గాలించి కాన్పూర్ సమీపంలోని ఒక హోటల్ గదిలో ఉన్నట్టు కనిపెట్టారు. అందులో ఓ మహిళా కానిస్టేబుల్‌తో అక్రమ సంబంధం కొనసాగిస్తున్న కృపాశంకర్‌ను రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. ఆయనపై కఠిన చర్యలకు లక్నో రేంజ్ ఐజీ సిఫార్సు చేశారు. బాధ్యత మరచిన వ్యక్తి ఉన్నత పదవికి అనర్హుడంటూ విచారణ కమిటీ తాజాగా నివేదిక ఇచ్చింది. దాంతో కానిస్టేబుల్‌గా ప్రభుత్వం డిమోట్ చేసింది. దాంతో కానిస్టేబుల్ నుంచి మొదలైన ఆయన వృత్తి జీవితం మళ్లీ అక్కడికే వచ్చి చేరింది!

జేడీఎస్ ఎమ్మెల్సీ సూరజ్ రేవణ్ణ అరెస్ట్

అసహజ లైంగిక వేధింపులపై కేసు నమోదు

బనశంకరి: మహిళలపై లైంగిక వేధింపుల ఆరోపణలు ఎదుర్కొంటున్న మాజీ ఎంపీ ప్రజ్వల్ రేవణ్ణ సోదరుడు, జేడీ(ఎస్) ఎమ్మెల్సీ సూరజ్ రేవణ్ణ అరెస్టయ్యారు. 'అసహజ నేరాల' కింద ఆయన్ను అరెస్టు చేసినట్లు పోలీసులు ఆదివారం తెలిపారు. ఎమ్మెల్యే హెచ్‌డీ రేవణ్ణ పెద్ద కుమారుడైన సూరజ్ జూన్ 16న తనను లైంగికంగా వేధించాడని చేతన్ అనే 27 ఏళ్ల వ్యక్తి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. అతనికి ఆదివారం వైద్యపరీక్షలు నిర్వహించారు. కేసు దర్యాప్తును రాష్ట్ర ప్రభుత్వం సీఐడీకి అప్పగించింది.

రూ.5 కోట్ల కోసం బ్లాక్‌మెయిల్

జేడీఎస్ కార్యకర్త అయిన చేతన్ డబ్బుల కోసం సూరజ్‌ను బ్లాక్‌మెయిల్ చేస్తున్నాడని ఆయన సన్నిహితుడు శివకుమార్ ఫిర్యాదు చేశారు. రూ.5 కోట్లు ఇవ్వకపోతే తప్పుడు కేసు పెడతానని బెదిరించాడన్నారు. ప్రజ్వల్ రేవణ్ణ ఇప్పటికే జైలులో ఉన్న విషయం తెలిసిందే.



అగ్ని, జలశక్తులను గౌరవిస్తూ ఏటా జరుపుకునే ఇవాన్ కుపాలా నైట్ జానపద ఉత్సవంలో భోగి మంట చుట్టూ గుమికూడిన ఉక్రెయిన్ జాతీయులు. పోలండ్ రాజధాని వార్సా పట్టణంలో తీసిందీ ఫొటో.

ఛత్తీస్‌గఢ్‌లో నక్సల్స్ ఘాతుకం

సుక్మా జిల్లాలో ఐఈడీతో వాహనం పేల్చివేత ● ఇద్దరు సీఆర్‌పీఎఫ్ 'కోబ్రా' జవాన్లు మృతి

సాక్షి ప్రతినిధి, భద్రాద్రి కొత్తగూడెం: ఛత్తీస్‌గఢ్‌లోని సుక్మా జిల్లాలో నక్సలైట్ల ఘాతుకానికి సీఆర్‌పీఎఫ్ కోబ్రా దళానికి చెందిన ఇద్దరు జవాన్లు మృతిచెందారు. జేగురుగొండ పోలీస్ స్టేషన్ పరిధిలోని సిల్గేర్ దగ్గర ఇటీవల సీఆర్‌పీఎఫ్ ఆధ్వర్యంలో క్యాంపు ఏర్పాటైంది. దీనికి సమీపంలో ఉన్న టేకులగూడ క్యాంపు నుంచి సిల్గేర్‌కు సరుకులు తీసుకెళ్తున్న వాహనాన్ని లక్ష్యంగా చేసుకుని ఆదివారం మధ్యాహ్నం 3 గంటల సమయంలో నక్సలైట్లు శక్తివంతమైన ఐఈడీ (ఇంప్రూవైజ్డ్ ఎక్స్‌ప్లోజివ్ డివైజ్) పేల్చారు. పేలుడు తీవ్రతకు వాహనం తునాతునకలైంది. ఇంజన్‌తో పాటు డ్రైవర్ క్యాబిన్‌లోని సీట్లు వాహనం నుంచి విడిపోయి గాల్లోకి ఎగిరి ఘటనా స్థలిలో చెల్లాచెదురుగా పడ్డాయి. కానిస్టేబుల్ శైలేంద్ర(29), వాహనం డ్రైవర్ విష్ణు ఆర్(35) ప్రాణాలు కోల్పోయారు.

తప్పిన భారీ నష్టం

ఆపరేషన్ కగార్‌లో భాగంగా ఛత్తీస్‌గఢ్‌లో మావోయిస్టులపై భద్రతా దళాలు విరుచుకుపడుతున్నాయి. గడిచిన ఆరు నెలల్లో 131 మంది మావోయిస్టులు ఎన్‌కౌంటర్లలో చనిపోయారు. మావోయిస్టుల అడ్డాగా పేరొందిన సిల్గేర్ ప్రాంతంలో సీఆర్‌పీఎఫ్ సిబ్బంది ఇటీవల క్యాంపు ఏర్పాటు చేశారు. ఈ క్యాంపునకు సమీపంలోనే మావోయిస్టు అగ్రనేత హిడ్మా స్వగ్రామం పువ్వర్తి ఉంది. తమకు పట్టున్న ప్రాంతాల్లోకి చొచ్చుకొస్తున్న భద్రతా దళాలకు బ్రేక్ వేసేందుకు మావోయిస్టులు వల పన్ని ఐఈడీ పేల్చారు. అది సరుకుల వాహనం కావడంతో ఇద్దరు సిబ్బందే ఉన్నారు. పూర్తిగా భద్రతా దళాలు ప్రయాణించి ఉంటే ప్రాణనష్టం భారీగా ఉండేదని అధికారులన్నారు.



మందుపాతర పేల్చడంతో ఎగిరిపడిన ట్రక్కు

సీపీఆర్‌పై అవగాహన



కార్డియోపల్మనరీ రిససిటేషన్ (సీపీఆర్) పై అవగాహన, శిక్షణ కార్యక్రమం చెన్నై బెసెంట్‌నగర్‌లోని ఎలియట్స్ బీచ్‌లో ఆదివారం జరిగింది. ఇందులో వైద్యులు అశోక్, అశ్విణి లత, జననీ, సంజీవ్‌కుమార్ పాల్గొని హార్ట్ ఎటాక్ సమయంలో ఎలా స్పందించాలి, అత్యవసర చికిత్స ఎలా అందించాలి అనే విషయంపై ప్రజలకు అవగాహన కల్పించారు. - సాక్షి, చెన్నై

న్యూస్‌రీల్

కనుల పండువగా రథోత్సవం



రథోత్సవంలో భక్తులు (ఇన్‌సెట్) స్వామివారు

సాక్షి, చెన్నై: చెన్నై ట్రిప్లికేన్‌లోని పార్థసారథి స్వామి వారి ఆలయంలో ఆదివారం రథోత్సవం కనుల పండువగా జరిగింది. ఆలయ పరిసరాలు భక్తిభావంలో మునిగాయి. ట్రిప్లికేన్ పార్థసారథి స్వామి ఆలయంలో నరసింహ స్వామి వారి బ్రహ్మోత్సవాలు ఈనెల 17వ తేదీ నుంచి జరుగుతున్నాయి. ప్రతిరోజూ ఆలయంలో విశిష్టపూజలు, అభిషేకాలు, వాహన సేవలు జరుగుతూ వచ్చాయి. ఈ ఉత్సవాలలో ముఖ్య ఘట్టం రథోత్సవం ఆదివారం జరిగింది. ఉదయం ఏడు గంటలకు స్వామి అమ్మవార్లు రథోత్సవంపై ఆశీనులయ్యారు. భక్త జనుల గోవింద నామస్మరణ మధ్య రథోత్సవం ఆలయ మాడ వీధులలో సాగింది. పెద్ద ఎత్తున భక్తులు తరలి వచ్చి స్వామి, అమ్మవార్లను దర్శించుకున్నారు. ఆలయ పరిసరాలలో భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా అధికారులు చర్యలు తీసుకున్నారు.

నీట్‌ను శాశ్వతంగా రద్దు చేయాలి



స్టాలిన్

సాక్షి,చెన్నై: పేద విద్యార్థుల ఉన్నత చదువులకు తీవ్ర ఆటంకాన్ని కలిగిస్తున్న నీట్ పరీక్షను శాశ్వతంగా రద్దు చేయాలని సీఎం స్టాలిన్ డిమాండ్ చేశారు. ఆదివారం జరగాల్సిన పీజీ కోర్సులకు సంబంధించిన నీట్ పరీక్ష రద్దు కావడంపై సీఎం స్టాలిన్ ఓ ప్రకటన విడుదల చేశారు. ఇందులో విద్యార్థి , పేదలకు వ్యతిరేకంగా, సామాజిక న్యాయంకు వ్యతిరేకంగా ఉన్న నీట్‌పరీక్షను శాశ్వతంగా రద్దు చేయాల్సిన అవసరం ఉందని వివరించారు. ఆది నుంచి తాము నీట్‌కు వ్యతిరేకంగా పోరాడుతూ వస్తున్నామని గుర్తు చేశారు. ఇటీవల జరిగిన నీట్ పరీక్షల్లో అవకతవకలను గుర్తుచేస్తూ, ఈ అక్రమాలను కేంద్రం ప్రోత్సహిస్తున్నట్లుందని ఆరోపించారు. తాజాగా చివరి క్షణంలో పరీక్షను రద్దు చేయడాన్ని ప్రస్తావిస్తూ, ఈ పరీక్షల మీద నమ్మకం, విశ్వాసం పూర్తిగా కోల్పోయినట్టు వివరించారు. వెలుగుచూస్తున్న అక్రమాలను తీవ్రంగా పరిగణించాల్సిన అవసరం ఉందన్నారు. విద్యార్థులకు పాఠశాల విద్యను ముగించి ఉన్నత విద్యలోకి అడుగు పెడుతున్న సమయంలో తీవ్ర అడ్డంకులు ఎదురయ్యే పరిణామాలు చోటు చేసుకోవడం శోచనీయమన్నారు. అందుకే నీట్‌ను రద్దు చేసిన ఆయా రాష్ట్రాలకే అవకాశం కల్పించాలని, రాష్ట్రాల హక్కులను పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. తమకు తమ విద్యార్థుల సంక్షేమమే ముఖ్యం అని, వారి భవిష్యత్ కోసం ఎంత వరకైనా వెళ్లేందుకు సిద్ధంగా ఉన్నామన్నారు. నీట్ రద్దు నినాదానికి బలాన్ని చేకూర్చే విధంగా తమతో ప్రతి ఒక్కరూ చేతులు కలపాలని పిలుపునిచ్చారు.

ఇంట్లోకి చొరబడి నగలు దోపిడీ

- మాజీ అసిస్టెంట్ కమిషనర్ కుమారుడికి ఏడేళ్ల జైలు

అన్నానగర్: తిరుచ్చిలో ఇళ్లు పగులగొట్టి దోపిడీ చేసిన కేసులో శనివారం రిటైర్డ్ అసిస్టెంట్ కమిషనర్ ఆఫ్ పోలీస్ కుమారుడికి 7 ఏళ్ల జైలు శిక్ష పడింది. తిరుచ్చి కే.కే.నగర్ సమీపం సుందర్ నగర్ 7వ క్రాస్‌కి చెందిన సెన్బగవల్లి (70) గత 18.10.2022న ఇంట్లో ఒంటరిగా ఉండగా.. అక్కడికి వచ్చిన ఓ వ్యక్తి మెడపై కత్తి పెట్టి బెదిరించి ఆమె ధరించిన 6 సవర్ల నగలను దోచుకుని పరారయ్యాడు. సెన్బగవల్లి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేకే నగర్ పోలీసులు 5వ క్రాస్ ప్రాంతానికి చెందిన రిటైర్డ్ పోలీస్ కమిషనర్ వీరాసామి కుమారుడు రంజిత్ (40)ను అరెస్టు చేశారు. ఈ కేసుపై తిరుచ్చి జే.ఎం. కోర్టులో విచారణ సాగింది. శనివారం తీర్పు వెలువడింది. నిందితుడికి 7 ఏళ్ల జైలు శిక్ష, బాధితురాలికి రూ.25,000 పరిహారం ఇవ్వాలని జస్టిస్ మీనా చంద్ర ఆదేశించారు.

విద్యుత్ తీగలు తెగి పడి ఇద్దరు చిన్నారుల మృతి

వేలూరు: విల్లుపురం జిల్లా తిరువెన్నైనల్లూరు గ్రామానికి చెందిన వినోద్, విజయలక్ష్మి దంపతుల కుమారుడు సప్తగిరి(11) అదే గ్రామంలోని ప్రభుత్వ పాఠశాలలో 6వ తరగతి చదువుతున్నాడు. అదే గ్రామానికి చెందిన కలియపెరుమాల్ కుమారుడు లోకేష్(8) కూడా మూడవ తరగతి చదువుతున్నాడు. వీరిద్దరూ బంధువులు కావడంతో అదే గ్రామంలోని వ్యవసాయ మోటర్‌ను ఆన్ చేసి స్నానం చేస్తున్నారు. ఆ సమయంలో ఉన్న ఫలంగా విద్యుత్ తీగలు తెగి నీటిపై పడడంతో నీటిలో విద్యుత్ సరఫరా కావడంతో ఇద్దరు విద్యార్థులు అక్కడిక్కడే మృతి చెందారు. విషయం తెలుసుకున్న తహసీల్దార్ రాజ్‌కుమార్, విల్లుపురం డీఎస్పీ సురేష్, పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని చిన్నారుల మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఆసుపత్రికి తరలించి విచారణ చేస్తున్నారు. ఇదిలా ఉండగా విద్యుత్ తీగలు తెగి పడే విధంగా ఉన్నాయని వీటిని మార్పు చేయాలని పలు మార్లు గ్రామస్తులు విద్యుత్ శాఖ అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోక పోవడంతోనే ఈ ప్రమాదం జరిగిందని ఆరోపించారు.

విక్రవాండిలో త్రిముఖ సమరం

విక్రవాండి ఉప ఎన్నికలలో త్రిముఖ సమరం నెలకొంది. అన్నాడీఎంకే, డీఎండీకే ఈ ఎన్నికను బహిష్కరించడంతో డీఎంకే, పీఎంకే, నామ్ తమిళర్ కట్చిల మధ్య ప్రధాన పోటీ నెలకొంది. స్వతంత్ర అభ్యర్థులు 20 మందికి పైగా ఉన్నా, ప్రధాన పార్టీల అభ్యర్థులు గెలుపే లక్ష్యంగా వ్యూహాలకు పదును పెడుతున్నారు.

- గెలుపే లక్ష్యంగా వ్యూహాలకు డీఎంకే పదును
- పీఎంకే, అన్నాడీఎంకే రహస్య ఒప్పందం?
- ప్రచారంలో అభ్యర్థుల పోటాపోటీ



విక్రవాండి అధికారులతో ఎన్నికల అధికారి సత్యప్రద సాహూ సమీక్ష

సాక్షి, చెన్నై: డీఎంకే ఎమ్మెల్యే పుగలేంది మరణంతో విల్లుపురం జిల్లా విక్రవాండి అసెంబ్లీ స్థానానికి ఉప ఎన్నిక అనివార్యమైన విషయం తెలిసిందే. ఎన్నికలలో పోటీ చేసే అభ్యర్థుల నుంచి ఈనెల 14 నుంచి 21వ తేదీ వరకు నామినేషన్లు స్వీకరించారు. ఎన్నికల రిటర్నింగ్ అధికారి చంద్రశేఖర్‌కు ప్రధాన పార్టీల అభ్యర్థులతో పాటు స్వతంత్ర అభ్యర్థులు మొత్తంగా 25 మంది నామినేషన్లు సమర్పించారు. ఇందులో డీఎంకే అభ్యర్థిగా అన్నియూరు శివ, బీజేపీ కూటమిలో పీఎంకే అభ్యర్థిగా సి. అన్బుమణి, నామ్ తమిళర్ కట్చి అభ్యర్థిగా డాక్టర్ అభినయ ప్రధాన పార్టీ అభ్యర్థులుగా ఉన్నారు. ఈ నామినేషన్ల పరిశీలన ప్రక్రియ సోమ, మంగళవారం జరగనుంది. బుధవారం ఉపసంహరణ ప్రకియ అనంతరం పోటీలో ఉండే తుది అభ్యర్థుల జాబితాను ప్రకటించనున్నారు. జూలై 10వ తేదీన ఓటింగ్, 13వ తేదీన ఓట్ల లెక్కింపు ప్రక్రియ జరగనుంది. ఇందుకు సంబంధించిన ఏర్పాట్లపై విల్లుపురం జిల్లా యంత్రాంగం దృష్టి పెట్టింది. ఇక్కడ చేపట్టిన ఏర్పాట్లు, ఈవీఎంలు, వీవీ ప్యాట్‌లలో చిహ్నాలు, అభ్యర్థుల పేర్ల పొందు పరిచే విషయంగా అనుసరించాల్సిన విధానాల గురించి రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి సత్యప్రద సాహూ విల్లుపురం జిల్లా అధికారులతో ఆదివారం సమావేశమయ్యారు. వీడియో కాన్ఫరెన్స్ ద్వారా జరిగిన సమావేశంలో అన్ని వివరాలను, అనుసరించాల్సిన నిబంధనలు, ఎన్నికల విజయవంతానికి చేపట్టాల్సిన ఏర్పాట్లు గురించి ఈ సమావేశంలో సమీక్షించారు. ఇప్పటికే ఈవీఎంలు, వీవీ ప్యాట్‌లు నియోజకవర్గానికి చేరాయి. ఎన్నికల విధులకు హాజరయ్యే సిబ్బందికి శిక్షణ కార్యక్రమాలతో పాటు పోస్టల్ బ్యాలెట్ ఓట్ల నమోదుకు సంబంధించిన కసరత్తు జరుగుతోంది. ఎన్నికల యంత్రాంగం ఏర్పాట్లు ఓ వైపు ఉంటే, మరోవైపు తమ సిట్టింగ్ సీటును మళ్లీ కైవసం చేసుకునేందుకు వ్యూహాలకు డీఎంకే పదును పెట్టింది.

పీఎంకేతో అవగాహన?

పీఎంకే అభ్యర్థిగా పోటీలో ఉన్న సి. అన్బుమణి గతంలో ఒంటరిగా పోటీ చేసిన క్రమంలో 45 వేలకు పైగా ఓట్లను సాధించారు. ప్రస్తుతం బీజేపీ కూటమి బలం తనకు తోడు కావడంతో డీఎంకే అభ్యర్థి అన్నియూరు శివాను ఓడించి తీరుతామన్న ధీమాను వ్యక్తం చేస్తున్నారు. ఈ ఎన్నికలను అన్నాడీఎంకే, డీఎండీకే బహిష్కరించిన నేపథ్యంలో స్థానికంగా ఉన్న ఆ పార్టీలకు చెందిన నేతలతో రహస్య ఒప్పందం కుదుర్చుకుని పీఎంకే నేతలు వ్యూహాలకు పదును పెట్టినట్టుగా సంకేతాలు వెలువడ్డాయి. 2021 ఎన్నికలలో డీఎంకే అభ్యర్థి పుగలేంది కేవలం తొమ్మిది వేల ఓట్ల మెజారిటీతోనే ఇక్కడ గెలిచారు. ప్రస్తుతం తమ రహస్య ఒప్పందాలను ఆచరణలో పెట్టి గెలుపు దిశగా పీఎంకే అభ్యర్థి అన్బుమణి ఉరకలు తీస్తున్నారు. అదే సమయంలో ఓట్లను చీల్చే దిశగా స్థానికురాలైన డాక్టర్ అభినయ నామ్ తమిళర్ కట్చి అభ్యర్థిగా బరిలో ఉన్నారు. ధర్మపురి ఎంపీ స్థానంలో పోటీ చేసిన అభినయ 60 వేలకు పైగా ఓట్లను సాధించారు. ఇదే ఊపుతో తన సొంత నియోజకవర్గంలో బలాన్ని చాటుకుంటాననే ధీమాతో దూసుకెళ్తున్నారు. ఈమెకు మద్దతుగా ఆ పార్టీ నేత సీమాన్ తీవ్ర ప్రచారానికి సింకావడం గమనార్హం. ఈ త్రిముఖ సమరంలో గెలుపు ఎవరిని వరించేనో అన్న ఉత్కంఠ నెలకొంది. డీఎంకే వర్గాలను సారా రక్కసి భయం వెంటాడుతున్నా, గెలిచి తీరాలనే సంకల్పంతో ఆ పార్టీ నాయకులు దూసుకెళ్తున్నారు.

మరోమారు చేజిక్కించుకునేందుకు..



డీఎంకే అభ్యర్థి అన్నియూరు శివ, పీఎంకే అభ్యర్థి అన్బుమణి, నామ్ తమిళర్‌కట్చి అభ్యర్థి అభినయ

పునర్విభజన తర్వాత 2011లో విల్లుపురం జిల్లా విక్రవాండి అసెంబ్లీ స్థానానికి తొలిసారిగా ఎన్నికలు జరిగాయి. అన్నాడీఎంకే కూటమిలో సీపీఎంకు చెందిన రామమూర్తి ఈ నియోజకవర్గానికి తొలి ఎమ్మెల్యే అయ్యారు. 2016లో జరిగిన ఎన్నికలలో డీఎంకేకు చెందిన రాధామణి గెలిచినా, 2019లో ఆయన క్యాన్సర్ బారిన పడి మరణించడంతో ఉప ఎన్నికలు అనివార్యమయ్యాయి. ఈ సమయంలో జరిగిన ఉప ఎన్నికకలలో పోటీ చేసిన డీఎంకే అభ్యర్థి పుగలేంది ఓటమి పాలయ్యారు. సిట్టింగ్ సీటును డీఎంకే కోల్పోవాల్సి వచ్చింది. ఆ తర్వాత 2021లో జరిగిన ఎన్నికలలో పుగలేంది గెలిచారు. అయితే, పుగలేంది సైతం కాలేయ క్యాన్సర్ సంబంధిత అనారోగ్య సమస్యలతో ఈ ఏడాది మార్చిలో మరణించారు. దీంతో మరోమారు విక్రవాండి నియోజకవర్గం ఉపఎన్నిక అనివార్యమైంది. ఈసారి సిట్టింగ్ సీటు చేజారకుండా వ్యూహాలకు డీఎంకే పదును పెట్టింది. అయితే పొరుగున ఉన్న కళ్లకురిచ్చి జిల్లాలో సారా రక్కసి కోరలు చాచడంతో జరిగిన మరణాలు, నష్టాల ప్రభావం విక్రవాండి ఉప ఎన్నికల మీద పడే అవకాశాలు కన్పిస్తున్నాయి. దీంతో డీఎంకేలో టెన్షన్ తప్పడం లేదు. లోక్‌సభ ఎన్నికలలో అన్ని స్థానాలను క్లీన్‌స్వీప్ చేసిన డీఎంకే ఉప ఎన్నికలలో ఓటమిని ఎదుర్కొనే స్థితిలో లేదు. ఈ ఉప ఎన్నికలలో గెలిచి తీరాలనే లక్ష్యంగా వ్యూహాలను రచించి అమలు చేసే పనిలో నిమగ్నమైంది. మంత్రులు పొన్ముడి, సెంజి మస్తాన్‌తో పాటు డీఎంకే కూటమికి చెందిన ఎంపీలు, ఎమ్మెల్యేలు నియోజకవర్గంలో తిష్ట వేసి ఓట్ల వేటపై దృష్టి పెట్టారు. సిట్టింగ్ సీటు చేజారిన పక్షంలో ఎక్కడ మంత్రి పదవులు ఊడుతాయో అన్న బెంగతో డీఎంకే సీనియర్లు ఓటర్లను ప్రసన్నం చేసుకుంటున్నారు. గెలుపే లక్ష్యంగా వ్యూహాలను రచించి గ్రామగ్రామానా అమలు చేసే పనిలో ఉన్నారు.

ట్రాక్టర్ - ప్రభుత్వ బస్సు ఢీ

- ముగ్గురు మృతి
- 15 మంది గాయాలు

అన్నానగర్: దిండిగల్ జిల్లా ఆత్తూరు సేడపట్టి దక్షిణ వీధి నుండి ప్రతి నెల పౌర్ణమి నాడు కటిరాయం కుళంలోని కరుప్పనసామి ఆలయానికి వచ్చేవారు. రాత్రి ఈ ఆలయంలోనే పూజలు చేసి తర్వాత ఊరు వెళ్లడం ఆనవాయితీ. ఈ కార్యక్రమంలో పురుషులు మాత్రమే పాల్గొంటారు. దీని ప్రకారం శనివారం రాత్రి 20 మంది ట్రాక్టర్‌లో కాటిరాయంకుళం వచ్చారు. పూజలు ముగించుకుని రాత్రి 2 గంటలకు ట్రాక్టర్‌లో ఇంటికి తిరిగి బయలుదేరారు. ట్రాక్టర్‌ను సెల్వకుమార్ (35) నడుపుతున్నాడు. కాటిరాయంకుళం సెక్షన్ సమీపంలోకి ఆదివారం ఉదయం ట్రాక్టర్ రాగానే.. పళని వైపు వెళ్తున్న బస్సు ట్రాక్టర్‌ను ఢీకొంది. ట్రాక్టర్‌లో వచ్చిన వారంతా కిందపడి శిథిలాల మధ్య చిక్కుకుపోయారు. ఈ ప్రమాదంలో సేడపట్టికి చెందిన పెరియన్నన్ (35) అక్కడికక్కడే మృతి చెందాడు. ట్రాక్టర్‌లో వచ్చిన అగుమలై (18), అశోక్ (24), సంజయ్ (21), సేనాధిపతి (24), నాగేశ్వరన్ (26), వివేక్ (28), అకుమ్ (38), కుమార్ (35), సురేష్ (38), జయకుమార్ (16) ప్రభుత్వ బస్సులో వచ్చిన రాజమూర్తి (22), నవీన్ కుమార్ (21), సామినాథన్ సహా మొత్తం 15 మంది తీవ్రంగా గాయపడ్డారు. వారిని చికిత్స నిమిత్తం దిండుక్కల్ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఇందులో అగుమలై (18), అశోక్ (24) పొందుతూ మృతి చెందారు. రెడ్డియార్ చత్రం పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

విద్యుదాఘాతానికి గురై తాత మనవడి మృతి

సాక్షి, చెన్నై: విద్యుదాఘాతానికి కరూర్‌లో తాతా మనవడు ఆదివారం మరణించారు. కరూర్ జిల్లా కులితలై సమీపంలోని నడుపట్టి గ్రామానికి చెందిన శ్రీనివాసన్ (65) ఇంట్లో మనవడు తిరుకుమరన్ (12) ఆడుకుంటూ వచ్చాడు. ఆదివారం ఇంట్లో ఫ్యాన్ స్విచ్ ఆన్ చేసే సమయంలో విద్యుదాఘాతానికి గురయ్యాడు. మవనడిని రక్షించేక్రమంలో తాత శ్రీనివాసన్ కూడా విద్యుదాఘాతానికి గురయ్యాడు. ఇద్దరు ఘటనా స్థలంలోనే మరణించారు. విగత జీవులై పడి ఉన్న ఇద్దరిని గుర్తించిన కుటుంబ సభ్యులు విద్యుత్ సరఫరాను నిలుపుదల చేసి, ఆస్పత్రికి తరలించారు. అయితే వారు అప్పటికే మరణించినట్లు తేలడంతో ఈమేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.



మృతి చెందిన మహిళలు (ఫైల్)

- రెండు కార్ల రూపంలో ఐదుగురు బలి
- అతివేగమే ప్రమాదాలకు కారణం
- తాగునీరు పట్టుకునే సమయంలో ముగ్గురు మహిళల మృతి
- టీ తాగుతూ విగత జీవులైన మరో ఇద్దరు

ఘటనా స్థలంలో ధ్వంసమైన కారు



మృత్యు శకటాలు

సాక్షి, చెన్నై: రెండు లగ్జరీ కార్ల కారణంగా ఆదివారం ఉదయం ఐదుగురు బలయ్యారు. అతి వేగంగా వేర్వేరు ప్రాంతాలలో దూసుకొచ్చిన ఈ వాహనాల రూపంలో తాగు నీరు పంటుకుంటున్న ముగ్గురు మహిళలు, టీ దుకాణంలో తేనీరు సేవిస్తున్న ఇద్దరు విగత జీవులయ్యారు. వివరాలు.. తూత్తుకుడి జిల్లా ఏరల్ పెరుంగలైకు చెందిన మణి గండన్ సెల్ ఫోన్ దుకాణం నడుపుతున్నాడు. మిత్రులు నలుగురితో కలిసి బెంగళూరుకు వెళ్లి తన దుకాణానికి కావాల్సిన సెల్‌ఫోన్లను కొనుగోలు చేసి కారులో తిరుగు ప్రయాణమయ్యారు. ఆదివారం ఉదయం ఏరల్‌కు సమీపంలోని రోడ్డుకు పక్కగా ఉన్న వీధి కొళాయిలో నీరు పట్టుకుంటున్న మహిళల పాలిట మృత్యు పాశంగా ఇతడి కారు మారింది. అతి వేగంగా వచ్చిన కారు అదుపు తప్పి నీరు పట్టుకుంటున్న మహిళలపైకి దూసుకెళ్లి ఆగింది. ఈ ఘటనలో గాయపడ్డ వారిని స్థానికులు ఆస్పత్రికి తరలించారు. ఈ ప్రమాదంలో ఘటనా స్థలంలోనే పలవేషన్ భార్య శాంతి(45), రాజ్‌కుమార్ భార్య పార్వతి(40), చిత్ర వేల్ భార్య అమరావతి(59) మరణించారు. షన్ముగ తాయితో పాటు మరికొందరు గాయపడ్డారు. వీరికి ఆస్పత్రిలో చికిత్స అందిస్తున్నారు. సమాచారం అందుకున్న ఆత్తూరు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. అయితే తమ ప్రాంతంలో తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయని, ఇక్కడ స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేస్తూ ఆ పరిసర వాసులు ఆందోళనకు దిగారు. వీరి రాస్తారోకో కారణంగా వాహనాల రాక పోకలకు తీవ్ర ఆటంకం నెలకొంది. పోలీసులు బుజ్జగించడంతో ఆందోళనకారులు శాంతించారు. ఈ ప్రమాద ఘటనపై సీఎం స్టాలిన్ దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. మృతుల కుటుంబాలకు తలా రూ. 3 లక్షలు, గాయపడ్డ వారికి రూ. రూ. లక్ష చొప్పున పరిహారం ప్రకటించారు.

టీదుకాణంలోకి దూసుకెళ్లిన లగ్జరీ కారు

నాగపట్నం జిల్లా వేదారణ్యం సమీపంలో జరిగిన మరో ప్రమాదంలో లగ్జరీ కారు కారణంగా ఇద్దరు మృతి చెందారు. వేదారణ్యం సమీపంలోని తలైనాయర్ గ్రామంలోని ఆరోగ్య కేంద్రం వద్ద ఓ టీ దుకాణం ఉంది. ఇక్కడ ఉదయాన్నే ఆ పరిసర వాసులు తేనీరు సేవించడంలో నిమగ్నమయ్యారు. ఈ సమయంలో హఠాత్తుగా అతివేగంగా దూసుకొచ్చిన ఓ కారు అదుపు తప్పి టీ తాగుతున్నవారీ మీదుగా దూసుకెళ్లింది. ఈ ప్రమాదంలో ఘటనా స్థలంలోనే ఆ గ్రామానికి చెందిన రాజంగం(55), గోవిందరాజన్(50) మరణించారు. మరో నలుగురు తీవ్రంగా గాయపడ్డారు. కేరళ నుంచి వేలాంకన్ని పర్యటనకు వచ్చిన బృందం లగ్జరీ కారు అతి వేగం కారణంగా అదుపు తప్పడంతోనే ఈ ప్రమాదం జరిగినట్లు నిర్ధారించిన పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. అనంతరం మృత దేహాలను పోస్టుమార్టానికి తరలించారు.

టీఎన్‌సీసీలో జిల్లాల సంఖ్య 117కు పెంపు



కాంగ్రెస్ జిల్లా నేతల సమావేశంలో సెల్వ పెరుంతొగై తదితరులు

- పార్టీపరంగా ప్రతి రెండు నియోజక వర్గాలతో ఓ జిల్లా ఏర్పాటు
- సెల్వ పెరుంతొగై కసరత్తు

సాక్షి, చెన్నై: రాష్ట్ర కాంగ్రెస్‌లో తన మార్కు రాజకీయ వ్యూహాలకు కొత్త అధ్యక్షుడు సెల్వపెరుంతొగై పదును పెట్టారు. పార్టీ పరంగా జిల్లాల సంఖ్య పెంచేందుకు సిద్ధమయ్యారు. రెండు అసెంబ్లీ నియోజకవర్గానికి ఓ జిల్లాను తీర్చిదిద్దేందుకు కసరత్తు చేపట్టారు. అధిక శాతం మంది నేతలకు పార్టీ పరంగా పదువులను కట్టబెట్టేందుకే ఈ చర్యలు చేపట్టినట్లు తెలిసింది. వివరాలు.. రాష్ట్ర కాంగ్రెస్‌లో గ్రూపులకు కొదవ లేదన్న విషయం తెలిసిందే. ఈ గ్రూపుల నేతలను సంతృప్తి పరచడం అధ్యక్షులుగా ఉన్న వారికి పెద్ద టాస్క్. ప్రస్తుతం పార్టీ అధ్యక్షుడిగా సెల్వపెరుంతొగై బాధ్యతలు స్వీకరించారు. లోక్‌సభ ఎన్నికల సమయంలో అధ్యక్ష పగ్గాలు చేపట్టిన ఆయన 2026 అసెంబ్లీ ఎన్నికల సమయానికి రాష్ట్రంలో కాంగ్రెస్‌ను మరింత బలోపేతం చేయడమే లక్ష్యంగా వ్యూహాల రచనలో నిమగ్నమయ్యారు. వివిధ గ్రూపుల నేతలను కలుపుకుని, వారి సూచనలు, సలహాలను అనుసరిస్తూ ముందుకెళ్తున్నారు. అధ్యక్ష మార్పు నేపథ్యంలో రాష్ట్ర కార్యవర్గంలోనూ మార్పులు జరిగినట్టే. దీంతో రాష్ట్ర కార్యవర్గంలో పదవులను చేజిక్కించుకునేందుకు పలువురు కాంగ్రెస్ వాదులు తీవ్ర ప్రయత్నాలలో ఉన్నారు. అలాగే జిల్లాలోనూ పదవుల కోసం ఎదురు చూపులలో ఉన్న నేతలు ఎందరో ఉన్నారు. రాష్ట్ర కాంగ్రెస్‌లో ప్రస్తుతం పార్టీ పరంగా 72 జిల్లాలు ఉన్నాయి. ఇందులో 40 జిల్లాలకు అధ్యక్షులను, ఇతర కార్యవర్గ పదవులను మార్చేందుకు సంబంధించిన కసరత్తు వేగవంతం చేసినట్టు సంకేతాలు వెలువడ్డాయి. ఈ జిల్లాలకు కొత్త వారికి అవకాశం కల్పించే ప్రయ్నాలలో ఉన్నారు. అదే సమయంలో పార్టీ పరంగా జిల్లాల సంఖ్యనుపెంచేందుకు సిద్ధమయ్యారు. రాష్ట్రంలో 234 అసెంబ్లీ నియోజకవర్గాలు ఉండడంతో రెండు అసెంబ్లీ నియోజకవర్గాలను ఓ జిల్లాను రూపొందించేందుకు సిద్ధమయ్యారు. ఈ దృష్ట్యా పార్టీపరంగా జిల్లాల సంఖ్య117కు పెంచేందుకు చర్యలు చేపట్టినట్టు టీఎన్‌సీసీ వర్గాలు పేర్కొంటున్నాయి. ప్రస్తుతం జిల్లాల పర్యటనలో బీజీగా ఉన్న సెల్వపెరుంతొగై అందరి అభిప్రాయాలకు అనుగుణంగా జిల్లాల సంఖ్య పెంచబోతున్నట్టు చెబుతున్నారు. అందరికీ పదవులు కట్టబెట్టమే కాకుండా, పార్టీ బలోపేతం దిశగా వ్యూహాలకు పదును పెట్టేందుకు, కార్యక్రమాలను విస్తృతం చేయడానికి జిల్లా సంఖ్యను పెంచాల్సిన అవశ్యకతను అందరు నేతలకు జిల్లాల వారీగాసెల్వ పెరుంతొగై వివరిస్తున్నారు. త్వరలో ఇది కార్యరూపం దాల్చుతుందని టీఎన్‌సీసీ నేత ఒకరు పేర్కొన్నారు.

జన్మలో సారా జోలికెళ్లం!

"ఇది పునర్జన్మ, ఇక జన్మలో మేం సారా తాగం" అంటూ ఆస్పత్రి నుంచి డిశ్చార్జ్ అయ్యే సమయంలో ఆదివారం పలువురు బాధితులు కన్నీటి పర్యంతమయ్యారు. ఏడుగురు ఆదివారం ఆస్పత్రి నుంచి డిశ్చార్జ్ కావడంతో వారి బంధవులు, కుటుంబాలు వైద్యులకు ధన్యవాదాలు, కృతజ్ఞతలు తెలిపారు. ఇక సారా మరణాల సంఖ్య ఆదివారం 61కు చేరింది.

- కోలుకుంటున్న కల్తీ సారా బాధితులు
- ఆస్పత్రి నుంచి ఏడుగురు డిశ్చార్జి
- 61కి చేరిన మృతుల సంఖ్య



శోకంలో మృతుల కుటుంబీకులు, ఆస్పత్రి నుంచి డిశ్చార్జ్ అయిన మొట్టయ్యన్, శిలంబరసన్

సాక్షి, చెన్నై : కళ్లకురిచ్చి నగర పరిధిలోని కరుణాపురంలో నాలుగు రోజుల కల్తీ సారా రక్కసి కోరలు చాచిన విషయం తెలిసిందే. తొలుత ఐదుగురు, ఆ తదుపరి పది మంది, అంటూ శనివారం నాటికి 55 మంది సారా రక్కసికి బలి అయ్యారు. మొత్తం 190 మందికి పైగా ఆస్పత్రి పాలు కాగా, ఇందులో మరణాల సంఖ్య ఆదివారానికి 61కి చేరింది. మరో ఆరుగురు బలి కావడంతో ఆ కుటుంబాలు కన్నీటి పర్యంతమయ్యాయి. వారి మృతదేహాల వద్ద రోదిస్తూ తీవ్ర మనో వేదనకు లోనయ్యారు. మరో పదిహేను మందికి అత్యవసర వైద్యం అందుతుంది. దీంతో వీరైనా ప్రాణాలతో బయటకు రావాలని బాధిత కుటుంబాలు ప్రార్థిస్తున్నాయి. ఈ పరిస్థితులలో సాధారణ వార్డులలో చికిత్సలో ఉన్న వారిలో కళ్లకురిచ్చిలో ఇద్దరు , పుదుచ్చేరి జిప్మర్‌లో ఐదుగురు ఆదివారం డిశ్చార్జ్ అయ్యారు. వీరు సంపూర్ణ ఆరోగ్యవంతులు కావడంతో ఆస్పత్రి నుంచి ఇంటికెళ్లారు. కళ్లకురిచ్చి ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న 30 మంది ఆరోగ్యం క్రమంగా మెరుగు పడుతుండడంతో వీరు ఒకటిరెండు రోజుల్లో డిశ్చార్జ్ అవుతారని ఆ కుటుంబాలు భావిస్తున్నాయి. ఆదివారం ఆస్పత్రి నుంచి డిశ్చార్జ్ అయిన వారిలో కరుణాపురానికి చెందిన ముట్టయ్యన్ , శిలంబరసన్ మీడియాతో మాట్లాడుతూ, ఇది తమకు నిజంగానే పునర్జనగా పేర్కొన్నారు. ప్రాణం ఉన్నంత వరకు ఇక సారా జోలికి వెళ్లబోమని స్పష్టం చేశారు. ఆస్పత్రిలో నరకాన్ని చవి చూశామని, వైద్యులు తమకు మెరుగైన చికిత్స అందించి పునర్జన్మను ఇచ్చారని కన్నీటి పర్యంతమయ్యారు. ఇదిలా ఉండగా కరుణాపురం సమీపంలోని మాదవాచ్చేరి గ్రామంలో వేల్ మురుగన్, ఇళయరాజా బుధవారం సారా సేవించడంతో మరణించినట్టుగా బాధిత కుటుంబాలు కలెక్టరేట్‌లో ఫిర్యాదు చేశారు. వీరిమృత దేహాలకు ముందుగానే అంత్యక్రియలు జరిగిన నేపథ్యంలో వాటిని తవ్వి రీ పోస్టుమార్టం నిర్వహించేందుకు అధికారులు చర్యలు చేపట్టారు. వీరు సారా రక్కసికి బలమై ఉంటే, మరణాల సంఖ్య 63కు చేరినట్టే.

విచారణ వేగవంతం



కల్తీసార కేసులో ప్రధాన నిందితుడు శివకుమార్

సారా విక్రయ దారులభరతం పట్టే విధంగా సీబీసీఐడీ విచారణను వేగవంతం చేసింది. కళ్లకురిచ్చిలో సారా తయారీకి మిథనాల్‌ను సరఫరా చేసిన వారిలో ఇప్పటికే పలువురిని అరెస్టు చేశారు. ఆదివారం చెన్నై ఎంజీఆర్ నగర్‌లో బంధువుల ఇంట్లో తలదాచుకుని ఉన్న శివకుమార్ అనే వ్యక్తిని పోలీసులు అరెస్టు చేశారు. ఇతడే కళ్లకురిచ్చి వ్యాపారులకు మిథనాల్ సరఫరా చేసినట్టు తేలింది. అలాగే మాదేష్ అనే వ్యక్తికి మిథనాల్‌ను అధికారికంగా సరఫరా చేసినట్టు తేలింది. ఇతడికి సహకారంగా జీఎస్టీ నెంబరు ఇచ్చిన బన్రూటికి చెందిన హోటల్ యజమాని శక్తి వేల్‌ను సైతం పోలీసులు అరెస్టు చేశారు.

కారు బోల్తా పడి విద్యార్థిని మృతి

- మరో ముగ్గురికి తీవ్ర గాయాలు

వేలూరు: చెన్నైలోని ఓ ప్రైవేటు కళాశాలకు చెందిన విద్యార్థులు నలుగురు కలిసి తిరుపత్తూరు జిల్లా ఏలగిరి కొండకు వెళ్లేందుకు ప్రణాళిక రూపొందించుకున్నారు. దీంతో ఆదివారం ఉదయం నలుగురు కలిసి కారులో ఏలగిరి కొండకు బయలుదేరారు. ఉదయం 9 గంటల సమయంలో కారు వేలూరు సమీపంలోని అబ్దుల్లాపురం వద్ద వెళ్తున్న సమయంలో కారు అదుపు తప్పి డివైడర్‌ను ఢీకొని మరో రోడ్డుపైకి వెళ్లి బోల్తా పడింది. ఈ ప్రమాదంలో ఇద్దరు విద్యార్థులు, ఇద్దరు విద్యార్థినులకు తీవ్ర గాయాలయ్యాయి. విరింజిపురం పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని వేలూరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ ఓ విద్యార్థిని మృతి చెందింది. మరో ముగ్గురికి తీవ్ర గాయాలు కావడంతో వారి పరిస్థితి విషమంగా ఉంది. పోలీసుల విచారణలో మృతురాలు చెన్నైకి చెందిన మీనాక్షిసుందరం కుమార్తె అశ్వతి(21)గా తెలిసింది. తీవ్ర గాయాలైన శక్తి, విష్ణు, డేవిడ్ కూడా చెన్నై వారిని గుర్తించారు. ఈ మేరకు పోలీసులు కేసు విచారణ చేస్తున్నారు.

చెన్నై
సోమవారం ၊ 24 ၊ జూన్ ၊ 2024
సాక్షి

క్లుప్తంగా

105 మందిపై కేసుల నమోదు

తిరువళ్లూరు: కల్లకురుచ్చి జిల్లా కరుణాపురంలో కల్తీసారా తాగి 55 మంది మృతి చెందిన నేపథ్యంలో తిరువళ్లూరు జిల్లావ్యాప్తంగా ఎస్పీ శ్రీనివాస పెరుమాల్ నేతృత్వంలోని పోలీసులు తనిఖీలను ముమ్మరం చేశారు. ఇప్పటి వరకు 105 మందిపై కేసు నమోదు చేసిన పోలీసులు నలుగురు మహిళలు సహా 31 మందిని అరెస్టు చేసినట్లు వివరించారు. కలెక్టర్ ఆదేశాల మేరకు ఎస్పీ ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి గుమ్మిడిపూండి, ఊత్తుకోట, పొన్నేరి, తిరువళ్లూరు తదితర ప్రాంతాల్లో ఎక్సైజ్ పోలీసులు ఆకస్మిక దాడులు, నిర్వహించారు. నిందితుల నుంచి 1,519 నాణ్యత లేని మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నారు. కాగా ఆంధ్ర నుంచి నాటు సారాను తరలిస్తున్న నలుగురు మహిళలతో పాటు 10 మందిని సైతం అదుపులోకి తీసుకున్నట్లు పేర్కొన్నారు.

బోగ్‌లైన్ మిషన్ బోల్తా

• ఆపరేటర్ మృతి

అన్నానగర్: నెల్‌లై నుంచి మేలపాళ్యం చేరన్ మహాదేవి మీదుగా పాపనాశం వెళ్లే రహదారి విస్తరణ పనులు శరవేగంగా కొనసాగుతున్నాయి. ఇందుకోసం చేరన్ మహాదేవి ప్రాంతంలో రైలు పట్టాలు దాటేందుకు ఫ్లైఓవర్ నిర్మిస్తున్నారు. ఈ ఫ్లైఓవర్ పనులకు సంబంధించి ఆదివారం ఉదయం బోగ్‌లైన్ మిషన్ ద్వారా మట్టిని డంప్ చేసిన స్థలంలో లెవలింగ్ పనులు చేపడుతున్నారు. ఈ సమయంలో అనూహ్యంగా బోగ్‌లైన్ యంత్రం సుమారు 20 అడుగుల మేర ఉన్న మట్టి పై నుంచి కాలువలో బోల్తా పడింది. ఈ ప్రమాదంలో ఆపరేటర్ అయిన బుక్‌లైన్ నెల్లై జిల్లాకు చెందిన మహేంద్రన్ (18) మృతి చెందాడు. స్థానిక పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

చెన్నై విమానాశ్రయానికి బాంబు బెదిరింపులు

• తంజావూరు యువకుడి అరెస్ట్

అన్నానగర్: చెన్నై విమానాశ్రయానికి బాంబు బెదిరింపు ఇచ్చిన తంజావూరు యువకుడిని పోలీసులు శనివారం అరెస్ట్ చేశారు. చెన్నైలోని పెరుంబాక్కంలో ఇండిగో ఎయిర్‌లైన్స్ కస్టమర్ సర్వీస్ సెంటర్ పనిచేస్తోంది. గత నెల 18న చెన్నై నుంచి ముంబై వెళ్లే విమానంలో బాంబు ఉందని, అది పేలుతుందని ఓ గుర్తుతెలియని వ్యక్తి కాల్ చేసి డిస్‌కనెక్ట్ చేశాడు. ఈ విషయమై ఇండిగో ఎయిర్‌లైన్స్ వాటిక్ హ్యాండ్లర్ సర్వీస్ సెంటర్ ఎయిర్‌పోర్టు అధికారులకు, సైబర్ క్రైమ్ పోలీసులకు సమాచారం అందించింది. అయితే సోదాల్లో ఎలాంటి పేలుడు పదార్థాలు లభించలేదు. దీంతో ఫేక్ కాల్ అని తేలింది. విచారణలో తంజావూరు జిల్లా తిరువైయారు ప్రాంతంలోని ల్యాండ్ లేన్ నుంచి కాల్ వచ్చినట్లు తేలింది. దీంతో నిందితుడు ప్రసన్న(27)ను ఆదివారం అరెస్ట్ చేశారు.

యర్రమిల్లి రామకృష్ణ సేవలు చిరస్మరణీయం


వై. రామకృష్ణకు నివాళి అర్పిస్తున్న సమితి నిర్వాహకులు, అతిథులు

కొరుక్కుపేట: అమరజీవి పొట్టి శ్రీరాములు స్మారక సమితి వ్యవస్థాపకులు యర్రమిల్లి రామకృష్ణ సాహిత్య, సామాజిక, విద్యా రంగానికి అందించిన సేవలు చిరస్మరణీయం అని పలువురు వక్తలు కొనియాడారు. తెలుగు భాష మాధుర్యాన్ని, సంస్కృతి సంప్రదాయాలను కాపాడాలనే సదుద్దేశంతో సమితి తరఫున రామకృష్ణ పరిచయం చేసిన నెలనెలా కార్యక్రమం, ఆయన 81వ జయంతి వేడుకలు ఆదివారం స్థానిక మైలాపూర్‌లో ఘనంగా జరిగాయి. అమరజీవి పొట్టి శ్రీరాములు స్మారక భవనంలో అమరజీవి పొట్టి శ్రీరాములు స్మారక సమితి అధ్యక్షుడు, అజంతా సంస్థ అధినేత అజంతా డాక్టర్ కనిగెలుపుల శంకరరావు, ముఖ్య అతిథిగా సింగపూర్ కు చెందిన పలనియప్పన్, కేఎంసీ ప్రభుత్వ ఆసుపత్రి రేడియాలజిస్ట్ డాక్టర్ దేవి మీనల్, డాక్టర్ నెల్లై కుమార్, సీనియర్ జర్నలిస్ట్ డాక్టర్ రెంటాల జయదేవ, జనని ప్రధాన కార్యదర్శి గుడిమెట్ల చెన్నయ్య తదితరులు పాల్గొన్నారు. ముందుగా అజంతా శంకర రావు మాట్లాడుతూ అమరజీవి పొట్టి శ్రీరాములు స్మారక భవన నిర్మాణానికి ముఖ్య కారకులైన వైఎస్ శాస్త్రి కుమారుడు యర్రమిల్లి రామకృష్ణ తండ్రి మాట జవదాటకుండా సమాజానికి, భాషా సాహిత్యాలకు, విద్యారంగానికి ఎనలేని సేవలను అందించిన మహనీయులు అని కీర్తించారు. మహానగరం చెన్నైలో తెలుగువారికంటూ ఉన్న ఏకైక భవనం అయిన పొట్టి శ్రీరాములు స్మారక భవనం అభివృద్ధికి తెలుగు సంఘాలతో కలసి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో భాగంగా అందమైన జీవితం అనే అంశంతో రామకృష్ణకు సంబంధించిన వీడియోను ప్రదర్శించారు. అలాగే కలైమామణి అనిత గుహ శిష్యురాలు మునిపల్లె హంసిని నృత్యం అలరించింది. అలాగే మయసభ పేరుతో కేసరి మహోన్నత పాఠశాల టీ.నగర్ విద్యార్థులు ప్రదర్శించిన ఘట్టం ఆహుతులను ఆకట్టుకుంది. అలాగే సంగీతకారులు జోషుల శైలేష్ పద్య పఠనం, పత్రి అనురాధ పుస్తక విలాపం, ఘంటసాల సావిత్రి భావ గీతాలు, ఎస్పీ వసంతలక్ష్మి, డి. సరస్వతి సాంస్కృతిక ప్రదర్శనలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి.

మటన్ బిర్యానీలో పురుగులు

• ఆహార భద్రత విభాగం అధికారులకు బాధితుల ఫిర్యాదు

తిరువొత్తియూరు: చెన్నై, ముగప్పేర్ ప్రాంతానికి చెందిన గుణ. భార్య, ఇద్దరు కూతుళ్లతో కలిసి అక్కడ ఓ ప్రముఖ బిర్యానీ హోటల్‌కు వెళ్లాడు. తర్వాత మటన్ బిర్యానీ కొని అందరూ తిన్నారు. ఆ సమయంలో కూరలో ఎముక నుంచి తీవ్ర దుర్వాసన రావడంతో పిల్లలు తినడానికి నిరాకరించారు. దీని తరువాత, అతను ఎముకను నొక్కడంతో అందులో పురుగులు వున్నాయి. దిగ్భ్రాంతి చెందిన నలుగురూ ఒకరి తర్వాత ఒకరు వాంతులు చేసుకున్నారు. దీనిపై దుకాణ యజమానిని ప్రశ్నించగా వారు పొంతన లేని సమాధానాలు చెప్పినట్లు తెలుస్తోంది. అదే సమయంలో గుణ, అతని భార్య, పిల్లలు స్పృహ తప్పి పడిపోయారు. స్థానికులు వారిని ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స చేర్చారు. చికిత్స తర్వాత నలుగురూ ఇంటికి తిరిగి వచ్చారు. మటన్ బిర్యానీ తిన్నప్పుడు ఎముకలో పురుగులు కనిపించాయని, చెడిపోయిన బిర్యానిని విక్రయించినందున దీనిపై ఆహార భద్రతా శాఖ అధికారులు విచారణ జరిపించాలని సామాజిక కార్యకర్తలు, ఆహార భద్రత విభాగం అధికారులకు ఫిర్యాదు చేశారు.

22 మంది దివ్యాంగులకు ఉద్యోగాలు


నియామక ఉత్తర్వులను అందజేస్తున్న కలెక్టర్

తిరువళ్లూరు: ప్రత్యేక ప్రతిభావంతుల కోసం నిర్వహించిన జాబ్‌మేళాలో 167 మంది పాల్గొనగా వారిలో మొదటి దశలో 22 మందికి నియామక ఉత్తర్వులను కలెక్టర్ ప్రభుశంకర్ అందజేశారు. రాష్ట్రవ్యాప్తంగా ప్రత్యేక ప్రతిభావంతుల కోసం జాబ్‌మేళాను ప్రతి జిల్లాలోనూ నిర్వహించాలని ముఖ్యమంత్రి స్టాలిన్ ఆదేశించారు. ఇందులో భాగంగానే తిరువల్లూరు జిల్లా కలెక్టర్ కార్యాలయంలో జాబ్‌మేళాను నిర్వహించారు. ఇందులో ఆమెజాన్, మురుగప్ప, రిలయన్స్ తదితర 13 సంస్థలకు చెందిన ప్రతినిధులు పాల్గొన్నారు. మేళాకు 108 మంది పురుషులు, 59 మంది ప్రత్యేక ప్రతిభావంతులైన యువతులతో సహా మొత్తం 167 మంది ప్రత్యేక ప్రతిభావంతులు హాజరయ్యారు. వీరిలో ఏడుగురు యువతులు, 15 మంది యువకులు ఉద్యోగాలకు ఎంపికయ్యారు. వీరికి కలెక్టర్ నియామకపు ఉత్తర్వులను అందజేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రత్యేక ప్రతిభావంతుల కోసం ఇకపై క్రమం తప్పకుండా మేళా నిర్వహిస్తామన్నారు. ఉద్యోగాలు పొందిన ప్రతిభావంతులు తమ సత్తాను చాటాలని, అవకాశం దొరికిన అన్ని రంగాల్లో రాణించాలని పిలుపు నిచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా వికలాంగుల సంక్షేమశాఖ అధికారి శ్రీనివాసన్ తదితరులు పాల్గొన్నారు.

ప్రియురాలి బాబాయిపై కత్తితో దాడి

అన్నానగర్: కోయంబత్తూరులో అదృశ్యమైన కాలేజీ విద్యార్థిని కోసం గాలిస్తున్న బాబాయిని కత్తితో పొడిచి చంపిన ప్రియుడితో పాటు మరో ముగ్గురి కోసం పోలీసులు గాలిస్తున్నారు. వివరాలు.. కోయంబత్తూరులోని కనువై ప్రాంతానికి చెందిన సిత్తంబలంకు రేఖ అనే (19) ఏళ్ల కుమార్తె ఉంది. (పేరు మార్చబడింది). కోయంబత్తూరులోని ఓ ప్రైవేట్ పాలిటెక్నిక్ కాలేజీలో రేఖ 2వ సంవత్సరం చదువుతోంది. ఈమె కోయంబత్తూరులోని సుబ్రహ్మణ్యం పాళయానికి చెందిన మిథున్ (20) ప్రేమించింది. ఈ నేపథ్యంలో శనివారం మధ్యాహ్నం నుంచి రేఖ ఆచూకీ లభించలేదు. దీంతో అనుమానం వచ్చిన తండ్రి సిత్తంబలం తమ్ముడు మణికంఠన్‌కు సమాచారం అందించాడు. అనంతరం మణికంఠన్, సిత్తాంబలం, అతని స్నేహితుడు సెల్వం ఈ ముగ్గురు కారు తీసుకుని విద్యార్థిని కోసం వెతికారు. అప్పుడు మణికంఠన్ మిథుష్‌కి ఫోన్ చేసి అతని అన్న కూతురు గురించి ఆరా తీశాడు. మిథున్ ఇచ్చిన సమాచారం ఆధారంగా వారు కె.ఎన్.జి. పూదూర్ లోని ఓ ప్రైవేట్ అపార్ట్‌మెంట్ రోడ్డుపైకి వెళ్లారు. ఆ సమయంలో మిథున్ కత్తితో సిత్తంబలం, మణికంఠన్‌పై దాడి చేశాడు. మణికంఠన్ అక్కడికక్కడే మృతి చెందాడు. తుడియాలూరు పోలీసులు కేసు నమోదు చేసుకుని పరారీలో ఉన్న మిథున్, అతని స్నేహితుల కోసం గాలిస్తున్నారు.

22 మంది తమిళ జాలర్ల అరెస్ట్

కొరుక్కుపేట: సరిహద్దు దాటి చేపలు పడుతున్న ఆరోపణలపై శనివారం రాత్రి రామేశ్వరానికి చెందిన 22 మంది జాలర్లను శ్రీలంక నౌకాదళం అరెస్టు చేసింది. చేపల వేట నిషేధ కాలం ముగియడంతో రామనాథపురం జిల్లా, రామేశ్వరానికి చెందిన మత్స్యకారులు ఈనెల 14న 700కుపైగా పడవల్లో చేపల వేటకు వెళ్లారు. వారు కేవలం రెండు రోజులు మాత్రమే చేపలు పట్టి ఒడ్డుకు చేరుకున్నారు. తర్వాత తుపాను హెచ్చరికలతో రామేశ్వరం మత్స్యకారులు ఈనెల 18వ తేదీ నుంచి 5 రోజులకుపైగా సముద్రంలోకి వెళ్లలేదు. ఈక్రమంలో సముద్రంలో గాలి వేగం తగ్గడంతో మత్స్యకారులకు సముద్రంలోకి వెళ్లేందుకు అనుమతి ఇచ్చారు ఆ తర్వాత మత్స్యకారులు ఒక్కసారిగా ఐస్ ప్యాక్ చేసి రామేశ్వరం మత్స్యకారుల చేపల వేటకు సంబంధించిన మూడు బోట్లను బోట్లలోకి ఎక్కించుకుని చేపల వేటకు సిద్ధమయ్యారు. రామేశ్వరం పీటీ ఓడరేవు నుంచి 500కుపైగా పడవల్లో మత్స్యకారులు డాక్‌గన్ అనుమతిని పొంది సముద్రంలోకి చేపల వేటకు వెళ్లారు. రాత్రి 10 గంటల ప్రాంతంలో సముద్రం మధ్యలో చేపలు పడుతుండగా శ్రీలంక నౌకాదళం రామేశ్వరం మత్స్యకారులను తరిమికొట్టింది. దీంతో భయాందోళనకు గురైన మత్స్యకారులు చేపల వేట కొనసాగించలేక ఇతర ప్రాంతాలకు వెళ్లారు. ఈలోపు శ్రీలంక సముద్రంలోకి రెండు పెద్ద పెట్రోలింగ్ నౌకలు వచ్చి వారిని చుట్టుముట్టాయి. సరిహద్దు దాటి చేపలు పడుతున్నారనే ఆరోపణలపై 22 మంది మత్స్యకారులను అరెస్టు చేసి మూడు బోట్లను స్వాధీనం చేసుకున్నారు. అరెస్టు చేసిన మత్స్యకారులను బోట్లలో గంగేసన్ హార్బర్ ప్రాంతానికి తరలించారు. ఇది చూసిన మిగిలిన మత్స్యకారులు చేపలు పట్టకుండానే నష్టాలతో ఒడ్డుకు చేరుకున్నారు. శ్రీలంక నౌకాదళం స్వాధీనం చేసుకున్న బోట్లు తంగచిమఠం జస్టిన్, రేమండ్, హెరిన్ చెందినవని తేలింది.

నీట్ రద్దు చేయాలని ఆందోళన


సీపీఎం ఆధ్వర్యంలో ధర్నా

తిరువళ్లూరు: పరీక్షల్లో అక్రమాలు జరిగిన నేపథ్యంలో నీట్‌ను రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ తిరువళ్లూరు జిల్లా సీపీఎం ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి పార్టీ డివిజన్ కార్యదర్శి తమిళరసు అధ్యక్షత వహించగా జిల్లా కార్యదర్శి గోపాల్ ప్రారంభోపన్యాసం చేశారు. ముఖ్య అతిథిగా రాష్ట్ర కమిటీ సభ్యుడు నంబురాజ్ హాజరై ప్రసంగించారు. నీట్ పరీక్షల్లో బీజేపీతో సన్నిహిత సంబంధాలు వున్న వ్యక్తి నడుపుతున్న కళాశాలకు వందశాతం మార్కులు రావడంతో పాటు లీకేజీ జరిగినట్లు ఆరోపించారు. నీట్ పరీక్షల వల్ల నిరుపేదలకు చెందిన విద్యార్థులు తీవ్రంగా నష్టపోతున్నారని, ప్రత్యేకంగా తమిళనాడుకు చెందిన విద్యార్థులకు న్యాయం జరగడం లేదన్నారు. నీట్ పరీక్షలను వెంటనే రద్దు చేయడంతో పాటు ఈవీఎం ట్యాంపరింగ్‌లపై సైతం విచారణ చేపట్టాలని డిమాండ్ చేశారు. ఈ ఆందోళన కార్యక్రమంలో పార్టీ నేతలు పన్నీర్‌సెల్వం, సంపత్, రాజేంద్రన్, కన్నన్, పెరుమాల్, ఆంథోనీ, గంగధరన్, పద్మ, గీత పాల్గొన్నారు.

కేన్సర్ రోగులకు బ్రాంకీ థెరపీ చికిత్స


బ్రాంకీథెరపీ లోగోను ఆవిష్కరిస్తున్న వైద్యులు

సాక్షి,చెన్నై: కేన్సర్ రోగుల కోసం బాంక్రీ థెరపి చికిత్సను అందుబాటులోకి తెచ్చామని మెడిరియన్ ఆసుపత్రి వర్గాలు ప్రకటించారు. మాధవరం మెరిడియన్ హాస్పిటల్లో చెన్నై నుంచి నెల్లూరు దాకా ఉన్న క్యాన్సర్ రోగుల కోసం తొలిసారి బ్రాంకీ థెరఫీ చికిత్సను ప్రారంభిస్తూ ఆదివారం ఆ ఆసుపత్రి సీఈఓ డాక్టర్ అశోక్ త్యాగరాజన్ ప్రకటించారు. ఇందుకు సంబంధించిన లోగోను ఆవిష్కరించినానంతరం ఆయన మాట్లాడుతూ ఏప్రిల్ నెలలో ఎలిక్టా లినాక్ రేడియో థెరపీని కూడా ప్రారంభించామన్నారు. తమ ఆసుపత్రిలో క్యాన్సర్‌కు సంబంధించిన నాలుగు రకాల సేవలతో వైద్య నిపుణులు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటారన్నారు. ఈ కార్యక్రమంలో రేడియేషన్ ఆంకాలజిస్ట్ డాక్టర్ రాజేష్కర్, మెడికల్ ఆంకాలజిస్ట్ డాక్టర్ పాండిదురై, సర్జికల్ ఆంకాలజిస్ట్ డాక్టర్ కెన్నీ రాబర్ట్ తదితరులు పాల్గొన్నారు.

కోలీవుడ్ టాక్స్


సాయేషా సైగల్

మళ్లీ నటించడానికి సిద్ధం!

తమిళసినిమా: బాలీవుడ్ లెజెండ్రీ దిలీప్‌కుమార్ కుటుంబానికి చెందిన నటి సాయేషాసైగల్. టాలీవుడ్ యువ నటుడు అఖిల్ కథానాయకుడిగా నటించిన అఖిల్ చిత్రం ద్వారా కథానాయకిగా పరిచయమైన నటి సాయేషా సైగల్. ఆ తర్వాత అజయ్‌దేవగన్ సరసన శివాయ్ చిత్రంతో బాలీవుడ్‌కు ఎంట్రీ ఇచ్చారు. అదేవిధంగా జయంరవికి జంటగా వనమగన్ చిత్రంతో కోలీవుడ్‌కు దిగుమతి అయ్యారు. ఈ చిత్రంతో నటిగానే కాకుండా తనలో మంచి డాన్సర్ ఉన్నట్లు నిరూపించుకున్నారు. ఆ తర్వాత తమిళంలో కార్తీ సరసన కడైకుట్టి సింగం, విజయ్‌సేతుపతితో జూంగా, ఆర్యకు జంటగా గజినీకాంత్, రెడీ, సూర్య సరసన కాప్పాన్ చిత్రాల్లో కథానాయకిగా నటించారు. అలాంటి సమయంలో ఆర్యను ప్రేమించి పెద్దల అనుమతితో 2019లో పెళ్లిచేసుకున్నారు. దీంతో నటనకు చిన్నగ్యాప్ ఇచ్చారు. ఈ సినీజంటకు హర్యానా అనే కూతురు పుట్టింది. కాగా చిన్నగ్యాప్ తర్వాత సాయేషా శింబు కథానాయకుడిగా నటించిన పత్తుతల చిత్రంలో ఒక సింగిల్‌సాంగ్‌లో మెరిశారు. ప్రస్తుతం మళ్లీ నటించడానికి సిద్ధమైనట్లు తెలిసింది. పలు కథలు వింటున్నారని సమాచారం. దీంతో సాయేషా మళ్లీ నటించడానికి సిద్ధమవుతున్నారన్న వార్త ఆమె అభిమానుల్లో ఆనందాన్ని ఇస్తోంది. దీంతో త్వరలోనే సాయేషాసైగల్ రీఎంట్రీ షురూ అవుతుందని భావించవచ్చు. అయితే ఆమె తాజాగా ఏ నటుడి సరసన నటిస్తారన్నదే ఆసక్తిగా మారింది.

అంతర్జాతీయ చిత్రోత్సవాల్లో
ఏళు కడల్ ఏళుమలై


ఏళు కడల్ ఏళుమలై పోస్టర్

తమిళసినిమా: దర్శకుడు రామ్ చిత్రాలు అంటేనే జనరంజకంగానూ అదేసమయంలో ఆలోచింపజేసే ఉన్నత ప్రమాణాలతో కూడిన కథా చిత్రాలుగా ఉంటాయి. ఆయన ఇంతకుముందు తెరకెక్కించిన తంగమీన్‌గళ్, పేరన్బు చిత్రాలు మంచి విజయాన్ని అందుకోవడంతోపాటు పలు అంతర్జాతీయ చిత్రాత్సవాల్లో ప్రదర్శించారు. రామ్ దర్శకత్వం వహించిన తాజా చిత్రం ఏళు కడల్ ఏళుమలై. మలయాళ నటుడు నివీన్ బాలి, అంజలి జంటగా నటించిన ఈ చిత్రంలో సూరి ముఖ్యభూమిక పోషించారు. ఇంతకుముందు మానాడు వంటి విజయవంతంగా నిర్మించిన సురేష్ కామాక్షి తన వీక్ హౌస్ పతాకంపై నిర్మించిన చిత్రం ఇది. గత ఏడాది విడుదలైన ఏళు కడల్ ఏళుమలై చిత్రం విమర్శకుల నుంచి ప్రశంసలను అందుకుంది. ఈ చిత్రం ఇప్పటికే రోటర్ డామ్, మాస్కో అంతర్జాతీయ చిత్రోత్సవాల్లో ప్రదర్శింపబడి ప్రపంచ సినీ ప్రముఖుల ప్రశంసలు అందుకుంది. తాజాగా రోమరియా దేశంలో జరుగుతున్న ట్రాన్సీవారియా అంతర్జాతీయ చిత్ర ఉత్సవాల్లో ప్రదర్శింపబడడం సంతోషంగా ఉందని ఆ చిత్ర నిర్మాత సురేష్ కామాక్షి మీడియాకు విడుదల చేసిన ప్రకటనలో పేర్కొన్నారు.

ఫీల్‌గుడ్ చిత్రంగా 7జీ

తమిళసినిమా: హర్రర్, కామెడీ కథా చిత్రాలకు ప్రేక్షకుల నుంచి ఎప్పుడూ మంచి ఆదరణ ఉంటుంది. అందుకు ఉదాహరణ ఇటీవల విడుదలై వసూళ్ల వర్షం కురిపించిన అరణ్మనై-4 చిత్రమే. కాగా అదే తరహాలో రూపొందిన మరో చిత్రం 7జీ. డ్రీమ్ హౌస్ పతాకంపై హారూన్ స్వీయ దర్శకత్వంలో నిర్మించిన ఈ చిత్రంలో సోనియాఅగర్వాల్, స్మృతి వెంకట్ ప్రధాన పాత్రను పోషించగా సిద్ధార్థ్ విపిన్, స్నేహగుప్తా, సుబ్రహ్మణ్యం శివ, కల్కిరాజా ముఖ్యపాత్రలు పోషించారు. సిద్ధార్థ్ విపిన్ సంగీతాన్ని, కన్నా ఛాయాగ్రహణం అందించిన ఈ చిత్రం జులై 5న తెరపైకి రావడానికి ముస్తాబవుతోంది. చిత్ర ట్రైలర్ ఇటీవల విడుదలై ప్రేక్షకుల నుంచి మంచి స్పందన తెచ్చుకుంది. చిత్ర నిర్మాత తెలుపుతూ హర్రర్ కథా చిత్రం అంటేనే కామెడీగా మారిన తమిళ చిత్రాల్లో హద్దులు దాటిన ఒక పూర్తి థ్రిల్లింగ్ అనుభూతి కలిగించే బ్లాక్ మ్యాజిక్‌తో కూడిన ఫీల్ గుడ్ హర్రర్ చిత్రాన్ని రూపొందించినట్లు చెప్పారు. తనకంటూ ఒక కొత్త ఇంటిని కొనుక్కొని గృహప్రవేశం చేసిన యువతి ఆ ఇంట్లో కొన్ని అమానుషాలు ఉన్నట్లు గ్రహిస్తుంది అన్నారు. వాటి వెనక ఒక బ్లాక్ మ్యాజిక్ ఉన్నట్లు గ్రహించిన ఆమె వాటి వెనుక ఉన్న నిజాలను అన్వేషిస్తుందన్నారు. దీంతో పలు అనూహ్య సంఘటనలు వెలుగు చూస్తాయని తెలిపారు. అలాంటి ఉత్కంఠభరిత సన్నివేశాలతో సాగే చిత్రంగా 7జీ ఉంటుందన్నారు. చిత్ర షూటింగ్‌ను చెన్నై పరిసర ప్రాంతాల్లో నిర్వహించినట్లు చెప్పారు. కచ్చితంగా ప్రేక్షకులకు సరికొత్త అనుభూతిని కలిగిస్తుందనే అభిప్రాయాన్ని దర్శక, నిర్మాత హారూన్ వ్యక్తం చేశారు.


7జీ చిత్ర బాలనటుడితో సోనియాఅగర్వాల్

వెయ్యికిపైగా ఆడిషన్స్‌లో..
తిరస్కరణకు గురయ్యా


శోభిత ధూళిపాళ్ల

తమిళసినిమా: కవితకు కాదేది అనర్హం అన్నది నానుడి. నటనకు కాదు ఎవరు అనర్హం అని కూడా అనేకమంది నిరూపించారు. అలాంటి వారిలో నటి శోభిత ధూళిపాళ్ల ఒకరు. ఆంధ్ర రాష్ట్రంలోని తెనాలి ప్రాంతానికి చెందిన అచ్చ తెలుగు అమ్మాయి ఈ భామ. ఎలాంటి సినీ నేపథ్యంలేని శోభిత ధూళిపాళ్ల ఇప్పుడు టాలీవుడ్, కోలీవుడ్, మాలీవుడ్, బాలీవుడ్ దాటి హాలీవుడ్ స్థాయికి ఎదిగారు. అయితే ఈమె ఈస్థాయి సినీ పయనం అంత పూలబాట కాలేదు. ఎన్నో అవమానాలు ఎన్నో తిరస్కారాలు అధిగమించి కథానాయకిగా హాలీవుడ్ స్థాయికి చేరుకున్నారు. ముఖ్యంగా ప్రారంభ దశలో నలుపు అనే ఈమె రూపమే పెద్ద శాపంగా మారిందనే చెప్పాలి. నటి కావాలన్నా ఆసక్తితో ఎన్నో ఆడిషన్లకు హాజరైన శోభిత ధూళిపాళ్లకు అవమానాలు, నిరాశలే ఎదురయ్యాయి. అలా ఆమె వెయ్యికిపైగా ఆడిషన్లలో పాల్గొని తిరస్కారానికి గురయ్యారని, అలా వరుసగా మూడేళ్లపాటు అవకాశాల కోసం ఆడిషన్స్‌లో పాల్గొన్నారని ఒక ఇంటర్వ్యూలో ఆమె తెలిపారు. తాను అందంగా లేనంటూ పలువురు ముఖం మీద చెప్పేవారున్నారు. అన్ని అవమానాలు ఎదుర్కొన్న శోభిత 2000 సంవత్సరంలో మోడలింగ్ రంగంలోకి ప్రవేశించారు. తన సినీ రంగప్రవేశానికి ఇదే సరైన మార్గమని ఆమె భావించారు. ఇలా 2013లో మిస్ ఇండియా పోటీల్లోనూ రన్నర్‌గా నిలిచారు. అదే ఆమెను పాపులర్ చేసింది. బాలీవుడ్ దర్శకుడు అనురాగ్ కశ్యప్ తెరకెక్కించిన రామన్ రాఘవ్ 2.ఓ చిత్రం ద్వారా శోభిత ధూళిపాళ్ల నటిగా పరిచయమయ్యారు. ఆ చిత్రం విమర్శకుల ప్రశంసలను అందుకోవడంతో శోభితకు వరుసగా అవకాశాలు తలుపుతట్టాయి. మలయాళం, తెలుగు, తమిళం భాషల్లో నటిస్తున్న ఈమె తాజాగా హాలీవుడ్‌లోకి ఎంట్రీ ఇచ్చారు. అక్కడ మంకీమాన్ చిత్రంలో నటిస్తున్నారు. దీనికి దేవ్ పటేల్ దర్శకత్వం వహిస్తున్నారు. హిందీలోనూ వరుసగా వెబ్‌సిరీస్‌లో నటిస్తూ బిజీగా ఉన్నారు. ముఖ్యంగా తమిళంలో మణిరత్నం దర్శకత్వం వహించిన పొన్నియిన్ సెల్వన్ చిత్రం పార్ట్-1, పార్ట్-2లో శోభిత ధూళిపాళ్ల కీలకపాత్ర పోషించారన్నది గమనార్హం.

డీఎన్‌ఏకు డబ్బింగ్ మొదలైంది!

తమిళసినిమా: నటుడు అధర్వ కథానాయకుడిగా నటిస్తున్న తాజా చిత్రం డీఎన్ఏ. నటి నిమిషా సజయన్ నాయకిగా నటిస్తున్న ఈ చిత్రాన్ని ఇంతకుముందు డాడా వంటి పలు విజయవంతమైన చిత్రాలను నిర్మించిన ఒలిపియా మూవీస్ పతాకంపై ఎస్.అంబేద్కుమార్ నిర్మిస్తున్నారు. ఈయన దీంతోపాటు పలు చిత్రాలను నిర్మిస్తున్నారు. అవి వరుస చిత్రాలు త్వరలో తెరపైకి రానున్నాయి. కాగా ఇంతకుముందు ఒరునాళ్ కూత్తు, మాన్‌స్టర్, ఫర్హానా వంటి సక్సెస్ చిత్రాలను తెరకెక్కించిన నెల్సన్ వెంకటేశన్ దర్శకత్వం వహిస్తున్న తాజా చిత్రం డీఎన్ఏ. కథకు ప్రాముఖ్యతను ఇచ్చే దర్శకుడు ఈయన. కాగా యాక్షన్ ఎంటర్‌టైనర్‌గా రూపొందుతున్న డీఎన్ఏ చిత్రంలో అధర్వ పాత్ర ఆయన గత చిత్రాలకు భిన్నంగా ఉంటుందని దర్శకుడు పేర్కొన్నారు. ఇక ఛాలెంజ్ కథ పాత్రలు ఎంపిక చేసుకుని సమర్థవంతంగా పోషిస్తున్న నటి నిమిషా సజయన్ ఇందులోనూ నటనకు అవకాశం ఉన్న పాత్రలో నటిస్తున్నట్లు చెప్పారు. వైవిధ్యభరిత కథ, కథనాలతో రూపొందిస్తున్న డీఎన్ఏ చిత్ర షూటింగ్ పూర్తి అయ్యిందని నిర్మాత మీడియాకు విడుదల చేసిన ప్రకటనలో తెలిపారు. ఇది అందరూ ఆసక్తిగా ఎదురుచూసే కథా చిత్రంగా ఉంటుందన్నారు. కాగా ప్రస్తుతం నిర్మాణానంతర కార్యక్రమాలు జరుగుతున్నాయని, అందులో భాగంగా చిత్ర డబ్బింగ్‌ను శనివారం ప్రారంభించినట్లు చెప్పారు. అన్ని కార్యక్రమాలు పూర్తిచేసి చిత్రాన్ని త్వరలోనే తెరపైకి తీసుకురావడానికి సన్నాహాలు చేస్తున్నట్లు పేర్కొన్నారు.


డీఎన్ఏ చిత్రయూనిట్

క్లుప్తంగా

భర్త మృతి తట్టుకోలేక భార్య బలవన్మరణం

పళ్లిపట్టు: భర్త మృతిని తట్టుకోలేక భార్య ఆత్మహత్య చేసుకున్న ఘటన పళ్లిపట్టులో చోటుచేసుకుంది. పళ్లిపట్టుకు చెందిన పట్టాభిశెట్టి(76). ఇతని భార్య భారతి(70). వీరికి ముగ్గురు కుమారులు. వీరందిరికీ పెళ్లిల్లు జరిగి వేర్వేరుగా జీవిస్తున్నారు. ఈక్రమంలో నెల కిందట పట్టాభిశెట్టి మృతిచెందాడు. దీంతో ఇంట్లో భారతి ఒంటరిగా వుండేవారు. భర్త మృతి చెందిన బాధతో తరచూ మనస్తాపం చెందేది. ఈక్రమంలో ఆదివారం ఉదయం భారతి ఇల్లు మూసివుండడంతో కుమారులు ఆమె ఆచూకీ కోసం వెతికారు. ఈక్రమంలో ఇంటికి సమీపంలోని కుంటలో మునిగి ఆత్మహత్య చేసుకున్నట్లు గుర్తించారు. విషయం తెలిసి పళ్లిపట్టు పోలీసులు సంఘటన ప్రాంతం చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం తిరుత్తణి ప్రభుత్వాస్పత్రికి తరలించి కేసు దర్యాప్తు చేస్తున్నారు. భర్త మృతిని తట్టుకోలేని భార్య ఆత్మహత్య చేసుకున్న ఘటన పళ్లిపట్టులో విషాదాన్ని మిగిల్చింది.

నదిలో మునిగి బాలుడి మృతి

తిరువొత్తియూరు: నదిలో మునిగి ఓ బాలుడు మృతిచెందాడు. తిరుచ్చి భీమ్ నగర్ ప్రాంతానికి చెందిన లూటస్ కుమారుడు శ్యామ్ రోషన్ (15). ఇతను స్నేహితులతో కలిసి శనివారం కొల్లిడం నదిలో స్నానానికి వెళ్లారు. అక్కడ స్నానం చేస్తుండగా రోషన్ లోతైన ప్రాంతానికికి వెళ్లడంతో నీట మునిగిపోయాడు. ఇది చూసి స్నేహితులు కేకలు వేశారు. స్థానికులు నదిలో దూకి గాలించారు. అయినా బాలుడి ఆచూకీ తెలియరాలేదు. సమాచారం అందుకున్న అగ్నిమాపక సిబ్బంది అక్కడికి చేరుకుని గాలించారు. ఈక్రమంలో ఆదివారం ఉదయం శ్యామ్‌రోషన్ మృతదేహాన్ని బయటకు తీశారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

బాలికపై కుక్కల దాడి

అన్నానగర్: ఎనిమిదేళ్ల బాలికపై వీధి కుక్కలు దాడి చేశాయి. తెన్‌కాసి జిల్లా అచ్చంపుత్తూరుకు చెందిన కార్మికుడు కాళీరాజ్. ఇతని కుమార్తె మనీషా (8). ఆదివారం ఉదయం మనీషా ఇంటిముందు నిలబడి ఉంది. ఆసమయంలో రోడ్డుపై ఉన్న 10కి పైగా వీధికుక్కలు బాలికను చుట్టుముట్టి దాడి చేశాయి. దీంతో షాక్‌కు గురైన మనీషా కేకలు పెట్టింది. ఇది విన్న ఆమె తల్లిదండ్రులు, ఇరుగుపొరుగువారు అక్కడికి చేరుకుని వీధికుక్కలను తరిమికొట్టారు. అనంతరం తీవ్రంగా గాయపడిన మనీషాను రక్షించి తెన్‌కాసి ప్రభుత్వాస్పత్రికి తరలించారు.

తుపాకీతో బెదిరించి రీల్స్

- వ్యక్తి అరెస్ట్

తిరువొత్తియూరు: చెన్నై, వ్యాసార్పాడిలో తుపాకీ, కత్తులు పట్టుకుని రీల్స్ చేస్తూ వీడియో విడుదల చేసిన యువకుడిని పోలీసులు అరెస్టు చేశారు. చెన్నై వ్యాసార్పాడి కొండినగర్ 3వ వీధికి చెందిన సంజయ్ (22). ఇతను సెల్‌ఫోన్‌లో సామాజిక మాధ్యమాల్లో తరచూ తుపాకీ, కత్తి చూపి బెదిరిస్తూ రీల్స్ చేస్తుంటాడు. ఫిర్యాదు మేరకు పోలీసులు విచారణ జరిపి సంజయ్‌ను అరెస్టు చేశారు. అతని వద్ద నుంచి ప్లాస్టిక్ తుపాకీ, కత్తిని స్వాధీనం చేసుకున్నారు.

యువతి ఆత్మహత్య

తిరువళ్లూరు: అక్కతో కలిసి వుంటున్న యువతి ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన పూండిలో కలకలం రేపింది. తిరువళ్లూరు జిల్లా పూండికి చెందిన దయాళన్‌కు తమిళ్‌సెల్వి (34), అఖిల(24) అక్కచెల్లెల్లు. తమిళ్‌సెల్వికి వివాహం కాగా, అఖిలకు పెళ్లి సంబంధాలు చూస్తున్నారు. ప్రస్తుతం అఖిల తమిళ్‌సెల్వితో ఉంటోంది. ఈక్రమంలో శనివారం రాత్రి అఖిల అక్క ఇంట్లో ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకుంది. ఆలస్యంగా విషయాన్ని గుర్తించిన బంధువులు ఉరికి వేలాడుతున్న యువతిని కిందకు దింపి తిరువళ్లూరు ప్రభుత్వ వైద్యశాలకు తరలించగా అప్పటికే మృతిచెందినట్టు వైద్యులు నిర్ధారించారు. తమిళ్‌సెల్వి ఇచ్చిన ఫిర్యాదు మేరకు పుల్లరంబాక్కం పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

పాము కాటుకు గురైన మహిళ మృతి

తిరువళ్లూరు: పాము కాటుకు గురైన మహిళ చికిత్స పొందుతూ ఆస్పత్రిలో మృతిచెందింది. తిరువళ్లూరు జిల్లా కవరపేట సమీపంలోని పరనంబేడు గ్రామానికి చెందిన మహేష్ భార్య లత(34). వీరికి ఇద్దరు పిల్లలు. కాగా గత 20న ఇంట్లో నిద్రిస్తున్న లతను కాము కాటేసింది. వెంటనే అప్రమత్తమైన బంధువులు ఆమెను గుమ్మిడిపూండి ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. అక్కడ ప్రాథమిక చికిత్స అందించిన తరువాత మెరుగైన వైద్యం కోసం చెన్నై స్టాన్లీ వైద్యశాలకు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ లత శనివారం రాత్రి మృతిచెందింది.

ఆరుగురిపై గూండా యాక్ట్

అన్నానగర్: దిండుక్కల్ సమీపంలోని యాగప్పన్ పట్టికి చెందిన మాయాండి జోసెఫ్ (60). డీఎంకేకు చెందిన ఇతను రియల్ ఎస్టేట్, ఇతర వ్యాపారాల్లో నిమగ్నమై ఉన్నాడు. ఈ ఏడాది మే 23వ తేదీ రాత్రి మాయాండి జోసెఫ్ వేదపట్టి నుంచి బైకు పై తన ఇంటికి వెళుతుండగా, ఓ ముఠా అతన్ని నరికి చంపింది. దిండుక్కల్ తాలూకా పోలీసులు కేసు నమోదు చేసి దిండుక్కల్ కు చెందిన శేషు రాజ్ (39), డేనియల్ రాజ్ (20), అలెక్స్ బ్రిటో (20), కాళీశ్వరన్ (19), ప్రవీణ్ కుమార్ (19), స్టాలిన్ (20)ను అరెస్టు చేశారు. విద్వేషాల కారణంగానే హత్య జరిగినట్లు తేలింది. ఈ నేపథ్యంలో అరెస్టు అయిన ఆరుగురిపై గూండా చట్టం నమోదు చేయాలని కలెక్టర్ పొంగోడికి ఎస్పీ ప్రదీప్ విన్నవించారు. ఈమేరకు శేషురాజ్ సహా నిందితులందిరిని గూండా చట్టం కింద ఆదివారం అరెస్టు చేసి మదురై సెంట్రల్ జైలుకు తరలించారు.

తిరుత్తణిలో భక్తుల రద్దీ


అలంకరణలో స్వామివారు


క్యూలో వేచివున్న భక్తులు

తిరుత్తణి: తిరుత్తణి సుబ్రహ్మణ్యస్వామి ఆలయం ఆదివారం సెలవు కావడంతో భక్తుల రద్దీ నెలకొంది. మూడు గంటల పాటు భక్తులు క్యూలో వేచివుండి స్వామిని దర్శించుకున్నారు. తిరుత్తణిలోని సుబ్రహ్మణ్యస్వామికి ప్రతిరోజూ వేలాది మంది భక్తులు వచ్చి స్వామిని దర్శించుకోవడం పరిపాటి. ఆదివారం సందర్భంగా వివిధ రాష్ట్రాల నుంచి భారీ సంఖ్యలో వాహనాల్లో తిరుత్తణికి చేరుకున్న భక్తులు ఘాట్‌రోడ్డులో వాహనాల్లో, మెట్ల మార్గాల్లో కొండ ఆలయం చేరుకున్నారు. వేకువజామున స్వామికి ప్రత్యేక అభిషేక పూజలు చేసి స్వర్ణ, వజ్రాభరణాలతో అలంకరించి మహాదీపారాధన పూజలు చేశారు. రుద్రాక్ష మండపంలో ఉత్సవర్లకు ప్రత్యేక పుష్పాలంకరణ చేసి ప్రత్యేక పూజలు చేశారు. భక్తులు మూడు గంటల పాటు వేచివుండి స్వామివారి దర్శనం చేసుకున్నారు.

భర్త చనిపోతాడని చెప్పడంతో భార్య ఆత్మహత్య

- చికిత్స పొందుతూ భర్త మృతి
- సేలం ప్రభుత్వ ఆస్పత్రిలో కలకలం

సేలం: కుటుంబ కలహాల కారణంగా విషం తాగిన భర్తను ఆస్పత్రిలో చేర్చారు. ఆయన బతకడం కష్టమని వైద్యులు చెప్పడంతో భార్య ఆస్పత్రి ప్రాంగణంలో చెట్టుకు ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడిన ఘటన సేలంలో కలకలం రేపింది. సేలం జిల్లా తారమంగళం కాలనీ సమీపంలో తుట్టమ్‌పట్టి ప్రాంతానికి చెందిన భూపాలన్ (24). ఇతను అదే ప్రాంతంలో ఫాస్ట్‌ఫుడ్ సెంటర్ నిర్వహిస్తున్నాడు. ఈ స్థితిలో ఇతని బంధువు మేగల (21) అనే మహిళ గత సంవత్సరం క్రితం వివాహం చేసుకున్నారు. ఈ స్థితిలో భర్త, భార్య మధ్య కుటుంబ సమస్యలు నెలకొని ఉన్నాయి. దీంతో భర్త భూపాలన్ శనివారం విషం సేవించి ఆత్మహత్యకు ప్రయత్నించాడు. దీంతో భూపాలన్‌ను బంధువులు సేలం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ఈ స్థితిలో భూపాలన్‌కు చికిత్స చేసి వైద్యులు ఆయన బ్రతకడం కష్టమని భార్య మేగలకు చెప్పినట్టు తెలుస్తోంది. దీంతో తీవ్ర మనోవేదనకు గురైన మేగల ఆస్పత్రి ప్రాంగణంలో ఉన్న చెట్టుకు దుప్పట్టాతో ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. ఈ విషయం తెలిసి బంధువులు కలెక్టర్ కార్యాలయం ముందు ఆందోళన చేపట్టారు. భర్త చనిపోతాడని తెలిపినందువలనే భార్య ఆత్మహత్యకు పాల్పడిందని, సదరు వైద్యులపై తగు చర్యలు చేపట్టాలని డిమాండ్ చేస్తూ పోలీసు స్టేషన్ వద్ద ధర్నా చేపట్టారు. టౌన్ పోలీసులు కేసు విచారణ జరుపుతున్నారు. వివాహం జరిగిన ఒక సంవత్సరమే కావడంతో ఆర్డీఓ విచారణ జరుపుతున్నారు. ఇదిలా ఉండగా సేలం ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ వచ్చిన భూపాలన్ ఆదివారం ఉదయం మృతి చెందాడు. భర్త మృతి చెందుతాడని తెలపడంతో ముందుగానే ఆత్మహత్యకు పాల్పడి భార్య ప్రాణాలు కోల్పోయిన స్థితిలో భర్త కూడా చనిపోవడంతో ఆ ప్రాంతంలో తీవ్ర సంచలనం కలిగించింది.

ప్రభుత్వ పథకాలపై సమగ్ర అధ్యయనం


ఒప్పంద కార్యక్రమంలో ప్రిన్సిపల్ డా. వడ్డి శేషగిరిరావు, ప్రభుత్వ అధికారులు

కొరుక్కుపేట: తమిళనాడు ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలపై అధ్యయనం చేసేందుకు చెన్నై నగరంలోని సెయింట్ జోసఫ్ ఇంజినీరింగ్ కళాశాలకు అరుదైన అవకాశం దక్కింది. ఈ అధ్యాయనం నిర్వహించడానికి రూ. 41.5 లక్షలను అందించింది. దీనికి సంబంధించిన పథకాల అధ్యయనంపై ప్రత్యేక ఒప్పందం కుదుర్చుకుని శిక్షణ కార్యక్రమాన్ని ప్రారంభించారు. షోలింగనలూర్ సమీపంలోని సెయింట్ జోసఫ్ కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్ ప్రాంగణంలో జరిగిన కార్యక్రమంలో భాగంగా ఎవాల్యువేషన్ అండ్ అప్లైడ్ రీసెర్చ్ డిపార్టుమెంట్ (ఈఏఆర్‌డీ)కి చెందిన డైరెక్టర్ సుందరం, జాయింట్ డైరెక్టర్ విఘ్నేష్‌కుమార్ పాల్గొని శిక్షణ కార్యక్రమాన్ని పర్యవేక్షించారు. కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ వడ్డి శేషగిరిరావు, అధ్యాపకులు, ఎంబీఏ విద్యార్థులు పాల్గొన్నారు.

సార్.. ఆదుకోండి!

- బర్రె దాడిలో మహిళకు గాయం
- దెబ్బతిన్న కాలు
- ప్రభుత్వ సాయం కోసం భర్త వేడుకోలు



కొరుక్కుపేట: గేదె దాడిలో గాయపడిన మహిళ కాలు దెబ్బతిని కుళ్లి పోవడంతో విషాదం నెలకొంది. ఈ నేపథ్యంలో ఎలాగైన తన భార్యను ఆదుకోవాలని అంటూ ప్రభుత్వ సాయం కోసం భర్త వేడుకుంటున్నారు. వారం క్రితం తిరువొత్తియూరు గ్రామవీధిలో సంచరిస్తున్న గేదె ఒక్కసారిగా సామాన్య ప్రజలను వెంటాడి పొడిచింది. అదే ప్రాంతంలోని అంసా గార్డెన్ 2వ వీధికి చెందిన వినోద్ భార్య మధుమతి (33)ని కూడా ఆ సమయంలో గాయపడింది. గేదె కొమ్ములో మధుమతి ఇరుక్కుపోయింది. రహదారిపై సుమారు 50 మీటర్ల దూరం మధుమతిని గేదె ఈడ్చుకెళ్లింది. ఈ దృశ్యాలు అక్కడి నిఘా కెమెరాలో రికార్డయ్యాయి. ఆ దృశ్యం చూపరులను విస్మయానికి గురి చేసింది. గేదె ఈడ్చుకెళ్లడంతో మధుమతి కాలు, చేయి, శరీరానికి తీవ్ర గాయాలయ్యాయి. అనంతరం తిరువొత్తియూర్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చేర్పించారు. ప్రస్తుతం ఆమె ఆరోగ్యం క్షీణించడంతో భర్త, కుటుంబ సభ్యులు ఆందోళన చెందుతున్నారు. మధుమతికి సరైన వైద్యం అందేలా ప్రభుత్వం, కార్పొరేషన్ సహకరించాలని మధుమతి భర్త వినోద్ కన్నీటిపర్యంతమయ్యారు. వ్యాన్ డ్రైవర్‌గా పనిచేస్తున్న తాను ఇప్పటి వరకు రూ.లక్షకు పైగా ఖర్చు చేసినట్లు వాపోయారు. ప్రభుత్వం భార్య చికిత్సకు సహాయం చేయాలి విజ్ఞప్తి చేస్తున్నారు. వైద్యులు మాట్లాడుతూ.. మధుమతి కాలికి గేదె కొమ్ము గుచ్చుకుని నలిగిపోయిందని, 12 సెంటీమీటర్ల మేర తెగడమే కాకుండా.. ఆ ప్రాంతంలో మాంసం కుళ్లిపోయిందని పేర్కొన్నారు. ప్లాస్టిక్ సర్జరీ చేస్తే నయమయ్యే అవకాశం ఉందని వెల్లడించారు.

దివ్యాంగ చిన్నారులతో సుధాషా సందడి


కార్నివాల్‌లో దివ్యాంగ చిన్నారులతో సుధాషా

కొరుక్కుపేట: భారత మహిళా క్రికెట్ జట్టు మాజీ కెప్టెన్ సుధాషా దివ్యాంగ చిన్నారులతో కలిసి సందడి చేశారు. ది మద్రాస్ వెస్ట్ రౌండ్ టేబుల్ 10 (ఎండబ్ల్యూఆర్‌టీ–10) ఆధ్వర్యంలో యూనిఫైడ్ స్పెషల్ కార్నివాల్–2024ను నగరంలోని ఐసీఎఫ్ ఇండోర్ స్టేడియంలో కోలాహలంగా నిర్వహించారు. ఇందులో సుధాషా పాల్గొని దివ్యాంగ చిన్నారుల్లో స్ఫూర్తిని నింపే ప్రయత్నం చేశారు.

ఈ కార్నివాల్లో 1000 మందికి పైగా చిన్నారులు పాల్గొన్నారు. కార్నివాల్లో వివిధ రకాల ఆటలు, సంగీత పోటీలను నిర్వహించారు. ఎండబ్ల్యూఆర్‌టీ–10 చైర్మన్ వినో, వైస్ చైర్మన్ అకుల్ పాల్గొన్నారు.

అన్నా ట్రేడ్ యూనియన్ అధ్యక్షుడి తొలగింపు

కొరుక్కుపేట: అన్నా ట్రేడ్ యూనియన్ అధ్యక్షుడిని తొలగించినట్టు అన్నాడీఎంకే ప్రధాన కార్యదర్శి ఎడప్పాడి పళనిస్వామి ఓ ప్రకటనలో ఆదివారం తెలిపారు. ప్రభుత్వ రవాణా సంస్థ సేలం జోన్ ఎడప్పాడి పనిమ్మనై అన్నా ట్రేడ్ యూనియన్ అధ్యక్షుడు మురళీధరన్ పార్టీ నిబంధనలను ఉల్లంఘించినందున పార్టీ సభ్యత్వంతో సహా అన్ని బాధ్యతల నుంచి తొలగించినట్లు పేర్కొన్నారు.

అక్రమంగా మద్యం విక్రయం

- ముగ్గురి అరెస్ట్

తిరువొత్తియూరు: చెన్నై ఎంకేబీ నగర్ ప్రాంతంలో అక్రమంగా మద్యం విక్రయిస్తున్న ముగ్గురుని పోలీసులు అరెస్టు చేశారు. చెన్నై ఎంకేబీ నగర్ పోలీస్ స్టేషన్‌కు సంబంధించిన కక్కన్నజీ కాలనీ అన్బలగన్ వీధిలో మద్యం విక్రయిస్తున్నట్లు పోలీసులకు సమాచారం అందింది. ఈ మేరకు ఇన్‌స్పెక్టర్ పార్థసారథి నేతృత్వంలో పోలీసులు అక్కడికి వెళ్లారు. ఆ సమయంలో సందేహాస్పదంగా తిరుగుతున్న త్యాగరాజన్ (42) వ్యాసార్పాడి శర్మానగర్ ప్రాంతానికి చెందిన బాలాజీ (45)ను అదుపులోకి తీసుకొని విచారణ చేయగా వారు అక్రమంగా ఎక్కువ ధరకు మద్యం విక్రయిస్తున్నట్లు తెలిసింది. దీంతో ఇద్దరిని పోలీసులు అరెస్టు చేశారు. దీని తర్వాత డోబీకాన స్లమ్‌క్రియరెన్స్ కాలనీలో మద్యం బాటిల్స్ దాచి ఉంచి విక్రయిస్తున్న కెప్టెన్ (35) అనే అతన్ని పోలీస్ అరెస్ట్ చేసి అతని వద్ద నుంచి 20 మద్యం బాటిల్స్ స్వాధీనం చేసుకున్నారు. అనంతరం ముగ్గరిని కోర్టులో హాజరుపరిచి పుళల్ జైలుకు తరలించారు.

కారు దగ్ధం

తిరువొత్తియూరు: తండయార్‌పేటలో కారుకు నిప్పంటుకుని దగ్ధమైంది. తండయార్‌పేట తాండవరాయన్ వీధికి చెందిన యోగరాజ్ (22). కొత్త చాకలిపేట టోల్‌గేట్ ప్రాంతానికి వెళ్లేందుకు తండ్రి కారులో తండయార్‌పేట కుమ్మాలమ్మన్ కోయిల్ వీధి మీదుగా వెళ్లాడు. అకస్మాత్తుగా కారులో నుంచి పొగలు వచ్చాయి. కొద్దిసేపటికే కారులో మంటలు చెలరేగాయి. దీంతో యోగరాజ్ కారును నిలిపి కిందకు దిగి పరుగెత్తాడు. విషయం తెలిసి అక్కడికి చేరుకున్న అగ్నిమాపకశాఖ సిబ్బంది ఆర్పివేశారు. అయితే కారు పూర్తిగా దగ్ధమైంది. రోడ్డు పక్కన నిలిపి ఉన్న ఇతర కార్లకు మంటలు వ్యాపించకుండా అగ్నిమాపక శాఖ సిబ్బంది చర్యలు తీసుకున్నారు. అయితే పక్కనే ఉన్న కారులో కూడా స్వల్పంగా మంటలు చెలరేగాయి. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

మారణాయుధాలతో సంచారం: నలుగురి అరెస్ట్

తిరువొత్తియూరు: ప్రత్యర్థులను హత్య చేసేందుకు మారణాయుధాలతో సంచరిస్తున్న నలుగురిని పోలీసులు అరెస్టు చేశారు. చెన్నై ఒటేరి న్యూప్రిట్స్, దుర్గా రోడ్డు జంక్షన్‌లో కొంతమంది యువకులు కత్తులతో తిరుగుతున్నట్టు ఓట్టేరి ఇన్‌స్పెక్టర్ రమేష్‌కు సమాచారం అందింది. ఆ మేరకు పోలీసులు ఆ ప్రాంతానికి వెళ్లి మద్యం మత్తులో మారణాయుధాలతో తిరుగురుతున్న నలుగురిని అరెస్ట్ చేసి పోలీస్‌స్టేషన్‌కు తీసుకొచ్చి విచారించారు. విచారణలో పులియంతోపునకు చెందిన నియామతుల్లా (23), వ్యాసార్పాడి పీవీ కాలనీకి చెందిన రబీక్ (28), పెరంబూరు ప్రాంతానికి చెందిన అల్తాఫ్ బాషా (21), ఒట్టేరికి చెందిన సనావుల్లా (28) అని తేలింది. గత ఏడాది తమ స్నేహితుడు అజీజుల్లాను హతమార్చిన నిందితులను హత్య చేసేందుకు మారణాయుధాలతో సంచరిస్తునట్లు తెలిసింది. తర్వాత నలుగురిని అరెస్ట్ చేసి కోర్టులో హాజరుపరిచి జైలుకు తరలించారు.

శ్రీవారి దర్శనానికి 24 గంటలు

తిరుమల: తిరుమలలో భక్తుల అధికంగా ఉంది. క్యూకాంప్లెక్స్‌లో కంపార్ట్‌మెంట్లు నిండాయి. భక్తుల క్యూ శిలాతోరణం వద్దకు చేరుకుంది. శనివారం అర్ధరాత్రి వరకు 74,467 మంది స్వామివారిని దర్శించుకోగా, 40,005 మంది భక్తులు తలనీలాలు సమర్పించారు. స్వామివారికి కానుకల రూపంలో హుండీలో రూ.3.77 కోట్లు సమర్పించారు. టైంస్లాట్ టికెట్లు కలిగిన భక్తులకు సకాలంలోనే దర్శనమవుతోంది. టికెట్లు లేని భక్తులకు 24 గంటల్లో దర్శనం లభిస్తోంది. ప్రత్యేక ప్రవేశ టికెట్లు కలిగిన భక్తులకు 2 గంటల్లో దర్శనం లభిస్తోంది.

బోధనేతర విధుల నుంచి మినహాయింపు ఇవ్వాలి


సభ్యత్వ నమోదు పుస్తకాలను అందజేస్తున్న దాస్

తిరువళ్లూరు: ఉపాధ్యాయులను బోధనేతర విధుల నుంచి మినహాయింపు ఇవ్వాలని తమిళనాడు ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయుల కూటమి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దాస్ డిమాండ్ చేశారు. తమిళనాడు ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయుల కూటమి సంఘం సమావేశం జిల్లా అధ్యక్షుడు భాస్కరన్ అధ్యక్షతన నిర్వహించారు. సంఘం జిల్లా మహిళ కార్యదర్శులు మహాలక్ష్మి, మోహన తదిరులు ప్రారంభోపన్యాసం చేశారు. ముఖ్యఅతిథిగా సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దాస్ మాట్లాడుతూ ఉపాధ్యాయులు బోధనేతర పనులు చేయడం వల్ల బోధనపై ప్రభావం పడుతుందన్నారు. సీపీఎస్‌ను రద్దు చేసి పాత పింఛన విధానాన్ని వెంటనే అమలు చేయాలన్నారు. సమావేశంలో సంఘం సభ్యత్వ పుస్తకాలను ఉపాధ్యాయులకు అందించి భారీగా సభ్యత్వ నమోదు ప్రక్రియను చేయాలని కోరారు. ఈ సమావేశంలో కోశాధికారి లోకయ్య, స్టీఫెన్ పాల్గొన్నారు.

సీనియర్ సిటిజన్ల సేవలు అవసరం


అతిథులను సత్కరిస్తున్న నిర్వాహకులు

కొరుక్కుపేట: సీనియర్ సిటిజన్ల సేవలు సమాజానికి ఎంతో అవసరమని ప్రపంచ ఆర్యవైశ్య మహాసభ (వామ్) గ్లోబల్ అధ్యక్షుడు తంగుటూరి రామకృష్ణ అభివర్ణించారు. ప్రపంచ ఆర్యవైశ్య మహాసభ సీనియర్ సిటిజన్స్ ఫోరం–తమిళనాడు, వామ్ గ్రేటర్ చెన్నై, వామ్ మహిళా విభాగ్, వలసరవాక్కం ఆర్యవైశ్య అసోసియేషన్ సంయుక్త ఆధ్వర్యంలో తొలిసారిగా సీనియర్ సిటిజన్స్ మీట్ 2024 పేరిట ప్రత్యేక కార్యక్రమం చెన్నై పుదుపేటలో ఆదివారం వైభవంగా జరిగింది నిర్వహించారు. అనంతరం సీనియర్ సిటిజన్‌లకు క్విజ్, సంగీత పోటీలు నిర్వహించి, విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. వామ్ గ్లోబల్ అధ్యక్షుడు తంగుటూరి రామకృష్ణ, అజంతా అధినేత డాక్టర్ కె.శంకరరావు, వామ్ గ్లోబల్ సలహాదారు టి. రాజశేఖర్, సీనియర్ సిటిజన్స్ ఫోరం అధ్యక్షుడు వీఎస్ హరినాథ్, ఉపాధ్యక్షులు జి.రాధాకృష్ణ పాల్గొన్నారు.

మూడు పాఠశాలల్లో గ్రంథాలయాలు

- ఉపాధ్యాయులకు సత్కారం


ఉపాధ్యాయురాలిని సత్కరిస్తున్న నిర్వాహకులు

సాక్షి, చెన్నై: చెన్నై కార్పొరేషన్ పరిధిలోని మూడు పాఠశాలలో అన్ని రకాల వసతులతో గ్రంథాలయాలను రోటరీ క్లబ్ ఆఫ్ మద్రాస్ నెక్స్ట్ జెన్ నేతృత్వంలో ఏర్పాటు చేశారు. తండయార్ పేటలోని ప్రైమరీ స్కూల్, మద్రాసు సొసైటీ ఫర్ ది ప్రొటెక్షన్ ఆఫ్ చిల్డ్రన్స్ స్కూల్, తిరువొత్తియూరులోని మిడిల్ స్కూల్‌లో చదువుతున్న నిరుపేద విద్యార్థులు, ఆదరణ లేని పిల్లల కోసం అన్ని రకాల వసతులతో పాటు గ్రంథాలయాలను ఏర్పాటు చేశారు. వీటిని నెక్స్ జెన్ అధ్యక్షుడు డాక్టర్ అభిషేక్ మురళి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ గ్రంథాలయం పూర్తిగా సరికొత్త పెయింటింగ్స్‌తో తీర్చిదిద్దామని వివరించారు. విద్యార్థుల కోసం అన్ని రకాల ఏర్పాట్లు చేశామన్నారు. తాము ఇప్పటి వరకు 40కు పైగా గ్రంథాలయాలను విజయవంతంగా నిర్మించామని వివరించారు. అలాగే విద్యార్థులను ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దడంలో రాణిస్తున్న ఉపాధ్యాయులను ఈసందర్భంగా సత్కరించారు.

ప్రకృతి పరిరక్షణపై అవగాహన


మారథాన్‌ను జెండా ఊపి ప్రారంభిస్తున్న సతీష్

- మారథాన్‌ను ప్రారంభించిన సతీష్

సేలం: ప్రకృతి పరిరక్షణపై అవగాహన కల్పిస్తూ నిర్వహించిన మారథాన్‌ను హాస్య నటుడు సతీష్ ప్రారంభించారు. ఈరోడ్ జిల్లా శివగిరిలో నీటిపారుదల ప్రాముఖ్యతను ప్రజలకు తెలియజేసేందుకు, ప్రకృతిని కాపాడుకోవాల్సిన ఆవశ్యకతను గుర్తించేందుకు మారథాన్ రన్ నిర్వహించారు. ఈ మారథాన్ పోటీలను హాస్యనటుడు సతీష్ జెండా ఊపి ప్రారంభించారు. మారథాన్‌లో 1.500 మందికి పైగా పాల్గొన్నారు. 15 కిలోమీటర్ల వరకు మారథాన్‌లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మారథాన్‌లో పాల్గొన్న వారికి సర్టిఫికెట్లను అందజేశారు.

సూర్యచంద్రులపై అనంత తేజోమూర్తి


సూర్యప్రభపై భక్తులను కటాక్షిస్తున్న గోవిందుడు

- వైభవంగా సాగుతున్న ప్రసన్నుడి బ్రహ్మోత్సవాలు
- అప్పలాయగుంటలో నేడు రథోత్సవం


చంద్రప్రభపై ఊరేగుతున్న శ్రీవారు

పుత్తూరు: అప్పలాయగుంటలో వెలసిన శ్రీప్రసన్న వేంకటేశ్వరస్వామి ఆలయ బ్రహ్మోత్సవాల్లో ఏడవరోజు ఆదివారం వైకుంఠనాథుడు సూర్య, చంద్రప్రభ వాహనాలపై అనంత తేజోమూర్తిగా భక్తులకు దర్శనమిచ్చారు. పట్టుపీతాంబరాలు, విశేష స్వర్ణాభరణాలతో ముగ్ధమనోహర రూపంలో గోవిందుడు ప్రత్యక్ష దైవాలైన సూర్య చంద్రులపై ఆశీనులై అశేష భక్తులను కటాక్షించారు. ఉదయం 5 గంటలకు స్వామివారిని సుప్రభాత సేవతో మేల్కొలిపి విశ్వరూప దర్శనం, తోమాలసేవ, కొలువు, అర్చన, మొదటి గంట తదితర కార్యక్రమాలు నిర్వహించారు. 7.30 గంటలకు శ్రీవారిని వాహన మండపంలోకి వేంచేపు చేశారు. 8 నుంచి 9 గంటల వరకు ప్రసన్న వేంకటేశ్వరుడు చంద్రప్రభ వాహనంపై ఊరేగుతుండగా అశేష భక్తుల గోవింద నామస్మరణతో మాడవీధులు మార్మోగాయి. సాయంత్రం 5.30 గంటల నుంచి 6.30 గంటల వరకు భక్తి కీర్తనల ఆలాపనల మధ్య స్వామివారి ఊంజల్ సేవ కనుల పండువగా సాగింది. అనంతరం శ్రీవారు వాహన మండపంలోకి వేంచేపు చేశారు.

చంద్రప్రభపై చిద్విలాసంగా..

బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆదివారం రాత్రి 7 గంటలకు శ్రీవారు చంద్రప్రభ వాహనంపై పట్టు పీతాంబరాలు, విశేష స్వర్ణాభరణాలు, సుగంధ పరిమళభరిత పుష్పమాలికలతో చిద్విలాసంగా విహరిస్తుండగా అశేష భక్తజనం గోవిందనామ స్మరణలతో మాడవీధులు మార్మోగాయి. వాహన సేవ అనంతరం స్వామివారికి ఏకాంత సేవ నిర్వహించారు.

బ్రహ్మోత్సవాల్లో నేడు..

బ్రహ్మోత్సవాల్లో భాగంగా సోమవారం ఉదయం 9.25 గంటల నుంచి 11 గంటల వరకు రథోత్సవం సాయంత్రం 5.30 గంటల నుంచి 6.30 వరకు ఊంజల్ సేవ, రాత్రి 7 గంటల నుంచి 8 వరకు అశ్వ వాహనంపై స్వామి వారు విహరిస్తారు.

పచ్చ సౌధాలు!

రాష్ట్రవ్యాప్తంగా రాజకోటల్లా టీడీపీ ఆఫీసులు.. జీవోలన్నీ బాబు హయాంలోనే

తమకు అనుకూలంగా గతంలోనే పార్టీలకు భూముల కేటాయింపు విధానం తెచ్చిన చంద్రబాబు

వాటి ఆధారంగా అడ్డగోలుగా కేటాయింపులు... పక్కనున్న పేదల స్థలాలు సైతం కబ్జా

తన నిర్వాకాలను కప్పిపుచ్చి వైఎస్సార్‌సీపీ కార్యాలయాలపై తప్పుడు ప్రచారాలు

సర్కారు స్థలాలు, పేదల భూములను లాక్కుని పచ్చ భవనాలు నిర్మించుకున్న టీడీపీ పెద్దలు సుద్దులు వల్లించడం గురివింద సామెతను గుర్తు చేస్తోంది. అధికారంలో ఉండగా ఎన్టీఆర్ భవన్‌ల పేరుతో అత్యాధునిక కార్యాలయాలు సమకూర్చుకున్న టీడీపీ రాజకీయ కక్ష సాధింపులకు పాల్పడుతున్నట్లు తాజా పరిణామాలు స్పష్టం చేస్తున్నాయి. వాగు పోరంబోకు, రైతుల భూమిని కబ్జా చేసి మంగళగిరిలో అత్యంత విలాసవంతమైన టీడీపీ జాతీయ కార్యాలయాన్ని నిర్మించుకోగా విశాఖలో దసపల్లా భూముల్లో పాగా వేసి పచ్చ భవనాలు కట్టుకున్నారు. విజయవాడ ఆటోనగర్‌లో ఇరిగేషన్ స్థలం.. శ్రీకాకుళంలో దళితులకు కేటాయించిన భూమి.. కాకినాడలో జెడ్పీ స్థలం.. ఇలా చెప్పుకుంటూ పోతే ఈ లెక్క చాంతాడును తలపిస్తుంది. ఇవన్నీ ఎన్టీఆర్ భవన్‌లే. అధికారం మాటున చంద్రబాబు సమకూర్చుకున్న పార్టీ కార్యాలయాలు. ముఖ్యమంత్రి చంద్రబాబు ఉంటున్న ఉండవల్లి కరకట్ట నివాసమే అక్రమాలకు కేరాఫ్ అడ్రస్ లాంటిది. నిబంధనలు, చట్టాలకు తూట్లు పొడిచి కృష్ణా నది ఒడ్డున కట్టిన ఆ విలాస రాజ భవనంలోనే చంద్రబాబు ఎనిమిదేళ్లుగా నివాసం ఉంటున్నారు. అక్రమాల బాటలో రాష్ట్రవ్యాప్తంగా ఎన్టీఆర్ భవన్‌ల పేరుతో విలాసవంతమైన కోటలు కట్టేశారు. వీటిని కప్పిపుచ్చి నిస్సిగ్గుగా వైఎస్సార్‌సీపీ కార్యాలయాలపై బురద జల్లడంపై విస్మయం వ్యక్తమవుతోంది.

– సాక్షి, అమరావతి

గతంలో చంద్రబాబు ప్రభుత్వం జారీ చేసిన జీవో


GOVERNMENT OF ANDHRA PRADESH
ABSTRACT

Lands – Allotment of Government Land for locating the offices of the National Political Parties/ Recognized State Political Parties – Revised Policy – Orders – Issued

REVENUE (ASSN.I) DEPARTMENT

G.O.Ms.No. 340 — Dated 21-07-2016
Read:

G.O.Ms.No.826, Revenue (Q) Dept., dated 21.08.1997.

ORDER:

In the reference 1st read above, orders were issued as a Policy for allotment of Government lands for locating the offices of the Recognized Political Parties on lease basis, according to which a provision was made to allot land not exceeding Ac.1.00 on 33 years lease basis renewable for a further period as agreed upon at the option of the lessee, in the State and the District Head Quarters to the recognized political parties which do not already own any land or building, subject to availability and certain conditions.

2. Although, the G.O. prescribed the allotment on lease basis yet in actual implementation in several cases, the land was allotted on alienation basis in relaxation of the above G.O. on the basis of representations of the political parties. Further, there was no prescription about the rate of lease in the G.O. In actual implementation, the leases and alienations have been made on nominal rate without uniformity and also, there was no eligibility criteria for the political parties.

3. Government have therefore felt the need of revising the above said policy and bringing out a New Policy, so as to bring out uniform guidelines in the matter of allotment.

4. Government, in supersession of the G.O. read above, hereby approve the "Revised Policy" to allot the land to the National Political Parties/ Recognized State Political Parties in the State who do not have any land or building in the State and the District Headquarters, as follows:

I. Extent of land eligible in Capital City/ CRDA area:
Category (1): The National Political Parties/ Recognized State Political Parties having more than 50% strength in Lower House (Assembly) will be eligible upto an extent of Ac.4.00 cents of land.
Category (2): If the strength is ranging from 25% to 50% in Lower House, they shall be eligible upto half acre of land.
Category (3): If the strength is below 25% in Lower House but there is atleast one Member in either of the Houses, they shall be eligible upto 1,000 Sq. Yards.

II. Extent of land eligible in the District Head Quarters:
Category (1): The National Political Parties/ Recognized State Political Parties having more than 50% strength in Lower House (Assembly) will be eligible upto an extent of upto Ac.2.00 cents of land.
Category (2): If the strength is ranging from 25% to 50% in Lower House, they shall be eligible upto 1,000 Sq.Yards of land.


– 2 –

Category (3): If the strength is below 25% in Lower House but there is atleast one Member in either of the Houses, they shall be eligible upto 300 Sq. Yards of land.

III. Period of lease: 33 Years, renewable upto total 99 years, provided the Party survives.

IV. Lease Rent: Rs.1,000/- per acre per annum.

V. Sanctioning Authority: The Government shall be the Sanctioning Authority for allotment of land.

VI. Conditions: The allotment of land shall be subject to the following conditions in addition to the normal conditions under Board Standing Orders :-

(a) The land shall be used for the purpose for which it is allotted. It shall not be further alienated or leased.
(b) The land shall be for exclusive use of the Political Party.
(c) The land shall not be used for any Commercial purpose.
(d) The allottee shall commence and complete the construction of the building on the land within one year from the date of issue of the allotment orders.
(e) For violation of any conditions of the allotment, the alienation/ lease shall automatically stand terminated/ cancelled and the land along with the building shall be resumed by the Government without payment of any cost for any structures or such other improvements that might have been constructed/ carried out by the alienee/ lessee on the land.
(f) The District Collector shall be the authority to cancel and resume the land from the allottee for violation of conditions as well as for non utilization of land.

5. The Special Chief Secretary & Chief Commissioner of Land Administration, and all the District Collectors shall take further necessary action accordingly in the matter.

(BY ORDER AND IN THE NAME OF THE GOVERNOR OF ANDHRA PRADESH)

J.C.SHARMA,
SPECIAL CHIEF SECRETARY TO GOVERNMENT

To
The Spl.C.S. & Chief Commissioner of Land Administration, A.P., Hyderabad.
All the District Collectors.
Copy to:
PS to Spl.Chief Secretary to Hon'ble C.M.
O.S.D. to Hon'ble Dy.CM(Rev).
P.S. to Chief Secretary.
PS to Spl.Chief Secretary to Govt., Finance Dept.
PS to Spl.Chief Secretary to Govt. (Land Admn.)
All the Assignment Sections in Revenue Dept.
SF/SC.

// Forwarded :: By order //

SECTION OFFICER

రాజకీయ పార్టీలకు భూముల కేటాయింపులకు సంబంధించి 2016లో చంద్రబాబు ప్రభుత్వం జారీ చేసిన జీవో

పార్టీలకు భూముల జీఓ ఇచ్చిందే బాబు

నిజానికి చంద్రబాబు గతంలో అధికారంలో ఉన్నప్పుడే రాజకీయ పార్టీలకు భూములు కేటాయించే విధానాన్ని తెచ్చారు. ఇందుకోసం 2016 జూలై 21న జీఓ నెంబర్ 826 విడుదల చేశారు. రాజధానిలో మూడు కేటగిరీలుగా పార్టీలకు భూములు కేటాయించాలని అందులో పేర్కొన్నారు. మొదటి కేటగిరీలో జాతీయ రాజకీయ పార్టీ / గుర్తింపు పొందిన రాష్ట్ర రాజకీయ పార్టీకి అసెంబ్లీలో 50 శాతానికి పైగా బలం ఉంటే 4 ఎకరాలు కేటాయించాలి. రెండో కేటగిరీ కింద అసెంబ్లీలో 25 నుంచి 50 శాతం బలం ఉన్న పార్టీలకు అర ఎకరం కేటాయించాలి. మూడో కేటగిరీలో 25 శాతం కంటే తక్కువ ఉన్న పార్టీలకు వెయ్యి గజాల స్థలం కేటాయించాలి. దీని ప్రకారం అప్పట్లో టీడీపీకి 4 ఎకరాలు, నాడు 67 స్థానాలతో ప్రతిపక్షంలో ఉన్న వైఎస్సార్‌సీపీకి అర ఎకరం పొందే అర్హత లభించింది. జిల్లా కేంద్రాల్లోనూ ఇదే విధానం ప్రకారం మొదటి కేటగిరీలో ఉన్న పార్టీలకు రెండు ఎకరాలు, రెండో కేటగిరీలో ఉన్న పార్టీలకు వెయ్యి గజాలు, మూడో కేటగిరీలో ఉన్న పార్టీలకు 300 గజాలు ఇవ్వాలన్నది జీవో సారాంశం. ఏడాదికి వెయ్యి రూపాయల చొప్పున 33 ఏళ్ల లీజుకు ఈ విధానంలో భూములు కేటాయించాలని నిర్ణయించారు. నియోజకవర్గ కేంద్రాల్లోనూ ఇదే విధానం ప్రకారం 30 సెంట్లు కేటాయించాలని 2017 డిసెంబర్ 8న మరో జీఓ 340 జారీ చేశారు.

లీజు నిబంధనలు బేఖాతర్

తాను ఇచ్చిన జీవోకు అనుగుణంగా రాజధానితో పాటు జిల్లా కేంద్రాలు, నియోజకవర్గ కేంద్రాల్లో టీడీపీ కార్యాలయాల కోసం చంద్రబాబు వరసగా భూములు కేటాయించుకున్నారు. పార్టీ జిల్లా అధ్యక్షుల పేరిట ఈ భూములు కేటాయిస్తూ ప్రత్యేకంగా జీవోలు జారీ చేశారు. 175 నియోజకవర్గాల్లోనూ టీడీపీ కార్యాలయాల నిర్మాణానికి ప్రణాళిక రూపొందించి చాలాచోట్ల భూములు కేటాయించి ఆగమేఘాల మీద భవనాలు కూడా కట్టేశారు. నాడు చంద్రబాబు ప్రకటించిన విధానం ప్రకారం 33 ఏళ్ల లీజుకు భూములు కేటాయించాలి. అయితే ఆ నిబంధనను కొన్నిచోట్ల ఉల్లంఘించి ఏకంగా 99 ఏళ్ల పాటు లీజుకు కేటాయించేసుకున్నారు. మంగళగిరి, కాకినాడ, శ్రీకాకుళంలో 99 ఏళ్ల లీజుకు భూములు తీసుకున్నారు. ముఖ్యమైన నగరాలు, పట్టణాల్లో అత్యంత విలువైన భూముల్లో స్థలాలు కేటాయించుకొని కార్యాలయాలు నిర్మించి ఇప్పుడు అక్కడి నుంచే పార్టీ కార్యకలాపాలు నడిపిస్తున్నారు. అదే జీవో ప్రకారం వివిధ జిల్లాల్లో వైఎస్సార్‌సీపీ 33 ఏళ్లకు లీజుకు తీసుకుంటే అదేదో ఘోరం అనే రీతిలో దుష్ప్రచారానికి తెర తీశారు.


GOVERNMENT OF ANDHRA PRADESH
ABSTRACT

Lands–Guntur District–Lease of land to an extent of Ac.3.65 Cents (classified as AWD) i.e., in Sy.No.392-1 (Ext. Ac.0.13 cts), Sy.No.392-3 (Ext. Ac.0.64 cts), Sy.No.392-4 (Ext. Ac.1.80 Cts), Sy.No.392-8 (Ext. Ac.0.74 cts), Sy.No.392-9 (Ext. Ac.0.27 cts) and Sy.No.392-10 (Ext. Ac.0.07 cts) situated in Atmakur Village, Mangalagiri Mandal, in favour of the President, Telugu Desam Party of Andhra Pradesh for establishment of TDP State Office for a period of 99 years, subject survival of party, with lease rent of Rs.1000/- per annum per acre – Subject to certain conditions–Orders–Issued.

REVENUE (ASSIGNMENT.IV) DEPARTMENT

G.O.MS.No. 228 — Dated: 22-06-2017
Read the following:-

1.From the District Collector, Guntur, Rc. No.646/2017-E1,dt:28.05.2017.
2.From the Spl.C.S & CCLA's ref.No.Assn.I(1)/384/2016, dt.30.05.2017.


***

ORDER:

In the circumstances stated by the District Collector, Guntur and the Special Chief Secretary & Chief Commissioner of Land Administration, A.P., in the references read above, Government after careful examination of the proposal, hereby ordered for allotment of following lands to an extent of Ac.3.65 cents(classified as AWD) situated in Atmakur Village, Mangalagiri Mandal, Guntur District in favour of the President, Telugu Desam Party for construction of TDP State Party Office of Andhra Pradesh on lease basis for a period of (99) years, subject to survival of party @ Rs.1000/- per acre per annum as per G.O.Ms.No.340,Rev.(Assn.1) Dept., dt.21.7.2016 subject to the conditions mentioned below, in addition to the conditions under BSO-24 and G.O.Ms No.571, Revenue (Assn-I) Dept., dt.14.09.2012:

Sl.No.	Survey No.	Extent of land (in Acres- Cts)
1)	392/1	0-13
2)	392/3	0-64
3)	392/4	1-80
4)	392/8	0-74
5)	392/9	0-27
6)	392/10	0-07
	Total:	3-65

i) The land shall be utilized for the purpose for which it is allotted within three years of the orders for the alienation.
ii) The water bodies if any existing in the land should not be disturbed and should be allowed to continue their natural course.
iii) The land shall be for exclusive use of the Political party.
iv) The land shall not be used for any Commercial purpose.
v) The allottee shall commence and complete the construction of building on the land within one year from the date of issue of the allotment orders.


2. The Special Chief Secretary & Chief Commissioner of Land Administration, A.P., and the District Collector, Guntur shall take further necessary action accordingly.

(BY ORDER AND IN THE NAME OF THE GOVERNOR OF ANDHRA PRADESH)

R.KARIKAL VALAVEN
PRINCIPAL SECRETARY TO GOVERNMENT(I/C)

To
The Special Chief Secretary & Chief Commissioner of Land Administration, A.P., Gollapudi, Vijayawada.
The District Collector, Guntur.
Copy to: The P.S. to Special Chief Secretary to C.M.
The OSD to Dy.C.M.(Revenue), The P.S. to C.S.
The P.S. to Special Chief Secretary (Revenue)
The G.A. (Cabinet) Department
(w.r.t. Council Resolution No.230/2017)
SF/SC

// FORWARDED:: BY ORDER //

SECTION OFFICER

మంగళగిరిలో టీడీపీ కార్యాలయానికి 3.65 ఎకరాల భూమిని కేటాయిస్తూ జారీ చేసిన జీవో

పోరంబోకు భూమికి మంగళం!

ప్రస్తుతం చంద్రబాబు, టీడీపీ నేతలు సకల విలాసాలతో దర్జాగా మీడియా, పార్టీ సమావేశాలు నిర్వహిస్తున్న మంగళగిరిలోని టీడీపీ కార్యాలయం స్థలం కోల్‌కతా–చెన్నై హైవేను ఆనుకుని ఉంది. 3.65 ఎకరాల విస్తీర్ణంలో ఉన్న ఈ స్థలం విలువ రూ.75 కోట్లకుపైనే ఉంటుంది. ఇందులో వాగు పోరంబోకు, కాలువ భూమి, రైతులకు కేటాయించిన డి పట్టా భూములూ ఉన్నాయి. కాలువను పూడ్చి... పోరంబోకు భూమిని ఆక్రమించి... రైతుల భూములను కబ్జా చేసి మరీ టీడీపీ జాతీయ కార్యాలయం కట్టారు. 99 ఏళ్ల లీజుకు కేటాయించుకున్న ఈ స్థలానికి ఏడాదికి చెల్లించేది ఎకరాకు రూ.1,000 మాత్రమే. నిజానికి ఆ భూమికి సంబంధించి 1974లోనే బొమ్ము రామిరెడ్డి పేర 0.65 సెంట్లు, కొల్లా రాఘవరావు పేరిట 1.75 ఎకరాలు, కొల్లా భాస్కరరావు పేరిట 1.75 ఎకరాలను డి పట్టాలుగా ఇచ్చారు. వారిని బలవంతంగా తరిమేసి సాగు చేస్తున్న పంటలను పొక్లెయిన్లతో దున్నేసి రాత్రికి రాత్రే టీడీపీ నేతలు స్వాధీనం చేసుకున్నారు. బాధిత రైతులు కోర్టుకు వెళ్లి స్టే తెచ్చుకున్నా పట్టించుకోకుండా చంద్రబాబు పార్టీ భవనం కట్టేశారు. ఆ రైతుల తరఫున మంగళగిరి ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి (ఆర్కే) కోర్టును ఆశ్రయించారు. ఈ కేసు ఇప్పుడు సుప్రీంకోర్టు విచారణలో ఉంది. 8 అంతస్తుల విలాసవంతమైన ఈ ఎన్టీఆర్ భవన్‌ను అనుమతి లేకుండా నిర్మించేశారు. ఉల్లంఘనలు, అక్రమాలకు పర్యాయపదం టీడీపీ జాతీయ కార్యాలయం.

గుంటూరులోనూ గుటకాయ స్వాహా

తొలుత 2015లో గుంటూరు అరండల్‌పేటలోని పిచుకలగుంటలో టీడీపీ రాష్ట్ర కార్యాలయాన్ని ఏర్పాటు చేశారు. వెయ్యి గజాల స్థలాన్ని కార్పొరేషన్ నుంచి లీజుకు తీసుకుని అదనంగా పక్కనే ఉన్న మరో 1,500 గజాల స్థలాన్ని ఆక్రమించి ఈ భవనాన్ని నిర్మించారు. మున్సిపల్ స్థలాలను లీజుకు ఇచ్చే పరిస్థితి లేకపోయినా చంద్రబాబు బలవంతంగా ఈ భూమిని లీజుకు తీసుకున్నారు. అధికారులపై ఒత్తిడి తెచ్చి కౌన్సిల్‌లో తీర్మానం చేయించి ఆక్రమించిన స్థలంతో కలిపి 2,500 గజాల స్థలాన్ని క్రమబద్ధీకరించుకుని పార్టీ భవనం కట్టేశారు.

హైదరాబాద్‌లో రాత్రికి రాత్రే

ఉమ్మడి రాష్ట్రంలోనూ చంద్రబాబు అత్యంత విలువైన స్థలాలను టీడీపీ కార్యాలయాల కోసం సొంతం చేసుకున్నారు. హైదరాబాద్ బంజారాహిల్స్‌లో అత్యంత ఖరీదైన ఎకరం స్థలాన్ని రాత్రికి రాత్రే కేటాయించేసుకున్నారు. వాణిజ్య భూమిగా హైదరాబాద్ పట్టణాభివృద్ధి సంస్థ (హుడా) చేతిలో ఉన్న ఆ స్థలాన్ని 1997 ఏప్రిల్ 30న జూబ్లీహిల్స్ మున్సిపాలిటీ నుంచి షేక్‌పేట ఎమ్మార్వోకు బదలాయించారు. ఆయన అదేరోజు ఎన్టీఆర్ మెమోరియల్ ట్రస్టీగా ఉన్న డి.శ్రీనివాసరావు పేరు మీదకు మార్చారు. అదే రోజున ట్రస్టుకు స్థలాన్ని కేటాయిస్తూ ప్రభుత్వం జీవో ఇవ్వటం గమనార్హం. ఈ పనులన్నీ గంటల వ్యవధిలో జరిగిపోయాయి. అంతటి విలువైన స్థలాన్ని నెలకు రూ.7,500 అద్దెకు చంద్రబాబు కేటాయించుకున్నారు. హైటెక్ సిటీ నిర్మాణ బాధ్యతలు దక్కించుకున్న ఎల్ అండ్ టీ సంస్థ ద్వారా అత్యాధునిక హంగులతో ఎన్టీఆర్ భవన్‌ను నిర్మించుకున్నారు. ఉమ్మడి రాష్ట్రంలో జిల్లాల వారీగా టీడీపీ కార్యాలయాలకు భూములు కేటాయించుకున్న చంద్రబాబు 2014లో అధికారంలోకి వచ్చాక కూడా అదే తీరును కొనసాగించారు.

విజయనగరం



నెల్లూరు



విశాఖపట్నం



శ్రీకాకుళం



తిరుపతి



తిరుపతి జిల్లా కార్యాలయం



గుంటూరు



ఒంగోలు



కాకినాడ



విజయవాడ



కర్నూలు



సిక్కోలులో దళితుల భూమిలో పాగా

శ్రీకాకుళంలో ఎస్సీల ఇళ్ల స్థలాల కోసం సాంఘిక సంక్షేమ శాఖ సేకరించిన భూమిని టీడీపీ కార్యాలయానికి తీసుకున్నారు. ఉడా, కార్పొరేషన్ అధికారుల అనుమతి లేకుండా పార్టీ భవనాన్ని నిర్మించారు. అంతటితో ఆగకుండా పక్కనే ఉన్న మరికొంత స్థలాన్ని ఆక్రమించేశారు. 80 అడుగుల ప్రధాన రోడ్డులో ఉన్న ఈ స్థలం విలువ 2017లోనే అనధికారికంగా రూ.20 కోట్లు ఉంది. ఏడాదికి రూ.25 వేల చొప్పున 99 సంవత్సరాల లీజుకు తీసుకున్న ఈ స్థలంలో టీడీపీ కార్యాలయాన్ని నిర్మించి 2019 ఎన్నికలకు నాలుగు నెలల ముందు స్వయంగా చంద్రబాబే ప్రారంభించారు.

కాకినాడలో జెడ్పీ స్థలంపై కన్నేసి..

కాకినాడలో విలువైన జిల్లా పరిషత్ స్థలాన్ని టీడీపీ కార్యాలయానికి కేటాయించుకుని విలాసవంతమైన భవనాన్ని కట్టారు. మేడలైన్ ఆఫ్ కాకినాడ ప్రాంతంలో 2 వేల గజాలను 99 ఏళ్ల లీజుకి జిల్లా పరిషత్ తీర్మానం ద్వారా టీడీపీ పరం చేశారు. ఈమేరకు 2016 నవంబర్ 1న భూమిని కేటాయిస్తూ జీవో జారీ చేశారు. దీని విలువ రూ.10 కోట్లకు పైమాటే.

బెజవాడ నడిబొడ్డున రూ.40 కోట్ల స్థలం

విజయవాడ నడిబొడ్డున ప్రజావసరాలకు ఉపయోగపడే విలువైన భూమిని అప్పటి జలవనరుల శాఖ మంత్రి దేవినేని ఉమా ఒత్తిడితో టీడీపీ కార్యాలయానికి అప్పగించారు. గుణదల పరిధిలోకి వచ్చే ఆటోనగర్–గురునానక్ కాలనీకి ఆనుకుని ఇరిగేషన్ శాఖకు 95 సెంట్ల భూమి ఉంది. ఇరిగేషన్ విభాగం ఫ్లోరేజి, ఇతర పనుల కోసం దీన్ని వినియోగించేవారు. ఇందులో కార్యాలయం కూడా ఉండేది. అయితే టీడీపీ ఆఫీసు కోసం దీన్ని ఇవ్వాలని అధికార యంత్రాంగంపై ఒత్తిడి తెచ్చి కూల్చేశారు. ఇరిగేషన్ మెటీరియల్, యంత్రాలను మరోచోటకు తరలించారు. అన్ని అభ్యంతరాలనూ తోసిరాజని 99 ఏళ్ల లీజుకిచ్చేశారు. ఆటోనగర్ పరిధిలో ఉన్న ఈ స్థలాన్ని పారిశ్రామిక అవసరాలకు మాత్రమే వాడాలనే నిబంధన ఉన్నా ఐలా పాలకవర్గాన్ని బెదిరించి నోరు మూయించారు. వాణిజ్య భూమిగా కన్వర్షన్ చేసి టీడీపీ కార్యాలయం నిర్మించుకున్నారు. దీని విలువ రూ.40 కోట్లకు పైమాటే.

అనంతపురం



ఏలూరు



విశాఖలో దసపల్లా కొండను తొలచి..

విశాఖపట్నంలో దసపల్లా కొండను తొలిచి మరీ టీడీపీ కార్యాలయాన్ని కట్టేశారు. దసపల్లా భూముల్లో 2 వేల గజాల్ని 33 ఏళ్ల పాటు ఏడాదికి రూ.25 వేలు లీజు చొప్పున 2002లో అప్పటి తెలుగుదేశం ప్రభుత్వం టీడీపీకి కేటాయించింది. ఆ స్థలంతోపాటు పక్కనే ఉన్న కొండను (మరో వెయ్యి గజాల మేర) కూడా ఆక్రమించి 2016లో టీడీపీ కార్యాలయాన్ని నిర్మించారు. టౌన్ ప్లానింగ్ అనుమతులు లేకుండానే జీ+3 భవనం నిర్మించి 2018లో లోకేశ్ ప్రారంభించారు.

టీడీపీ కార్యాలయాలకు కేటాయించుకున్న భూములు

జిల్లా	స్థలం విస్తీర్ణం	సర్వే నెంబర్	కేటాయింపు జీఓ
మంగళగిరి	3.65 ఎకరాలు	392-1, 3, 4, 8, 9, 10	జీఓ ఎంఎస్ నంబర్ 228, 22-06-2017 (ప్రధాన కార్యాలయం)
విజయవాడ	95 సెంట్లు	493.-1	జీఓ ఎంఎస్ నంబర్ 513, 11-10-2018
చిలకలూరిపేట	20 సెంట్లు	123/సి-2ఇ	జీఓ ఎంఎస్ నంబర్ 197, 22-04-2018
కడప (నాగరాజుపల్లె)	1 ఎకరం	295/1ఎ1బి	జీఓ ఎంఎస్ నంబర్ 27, 20-07-2015
విశాఖ (చినవాల్తేరు)	87 సెంట్లు	13	జీఓ ఎంఎస్ నంబర్ 526, 30-12-2016
విజయనగరం (అయ్యన్నపేట)	1 ఎకరం	15/1పి	జీఓ ఎంఎస్ నంబర్ 195, 23-04-2018
ప్రకాశం (ఒంగోలు టౌన్)	1.96 ఎకరాలు	68/8	జీఓ ఎంఎస్ నంబర్ 514, 11-10-2018
శ్రీకాకుళం (టెక్కలి)	2 ఎకరాలు 30 సెంట్లు	106/3	జీఓ ఎంఎస్ నంబర్ 63, 24-01-2019
కాకినాడ	2 వేల గజాలు	-	-
గుంటూరు	1000 గజాలు	-	-

మంచి మాట

అందం అంటే..?



'అందమే ఆనందం' అని ఒక సినిమా కవి అందాన్ని నిర్వచించాడు, ఆనందానికి నిర్వచనం ఇవ్వ బోతూ. ఆనందాన్ని కలిగించ కలిగింది మాత్రమే అందమని కవిహృదయం. ఎవరికి దేని వల్ల ఆనందం కలుగుతుందో చెప్పలేము. అందుకని అందం చూసే వాళ్ళ కళ్లలో ఉంటుందే కానీ వస్తువులో కాదు అనే ఆంగ్ల సామెత వచ్చింది. పైగా అందం వ్యక్తిగతం.''లోకో భిన్న రుచిః'' అన్నట్టు ఒక్కొక్కరి కళ్ళకి అందంగా కనిపించింది వేరొకరికి అందంగా కనిపించక పోవచ్చు. అందం విషయంలో చాలామంది దృష్టి చర్మం దగ్గర ఆగి పోతుంది. కానీ,''నిజమైన అందం శాశ్వతమైన ఆనందాన్ని కలిగిస్తుంది'' అంటాడు ఆంగ్లకవి జాన్ కీట్స్.అందం అన్నది వస్తుగతం కాదు అనే విషయం పాశ్చాత్యులు కూడా బాగా అర్థం చేసుకున్నారు అని అర్థమయింది కదా!

అందానికి సంబంధించి ఒక్కొక్క దేశంలో ప్రమాణాలు ఒక్కొక్క రకంగా ఉంటాయి. చైనా దేశంలో స్త్రీల పాదాలు ఎంత చిన్నవిగా ఉంటే అంతటి అందగత్తెలుగా పరిగణిస్తారు. ముక్కు కొస పైకి ఉండి, ముక్కు రంధ్రాలు కనపడేట్టు ఉండటం అందంగా కొన్ని పాశ్చాత్య దేశాలలో పరిగణించబడుతుంది. భారతీయులు అందంగా పరిగణించే పొడవుగా, కోటేరు వేసినట్టు ముక్కు ఉంటే ఏనుగు ముక్కు అని వేళాకోళం చేస్తారట కూడా.ఆఫ్రికా దేశంలో పెదవులు ఎంత పెద్దగా ఉంటే అంత అందంగా ఉన్నట్టు. అందుకోసం చిన్నతనంలో పెదవులకి చిన్న చిన్న చిడతల వంటి వాటిని తగిలిస్తారట!

> భారతీయులకి అందం వస్తువు లేక మనిషికి సంబంధించింది కాదు. మనస్సుకి ఆత్మకి సంబంధించింది. ఆత్మసౌందర్యం మొదలైన పదబంధాలని వింటూనే ఉన్నాము. అంటే అందం వస్తువు లేక మనిషి మూలతత్త్వానికి సంబంధించింది. ఉదాహరణకి బెల్లం చూడటానికి అందంగా కనిపించదు. దాని అందం అంతా దాని రుచిలో ఉంటుంది. మనిషి మనసు స్వచ్ఛంగా ఉంటే అందంగా ఉన్నట్టు అనిపిస్తారు. నిజానికి వారి అవయవాల్లో ఒక్కటి కూడా అందాల పోటీల వాళ్ళ కొలతలకి సరిపోవు. అవయవాల పొందిక వల్ల అందంగా ఉన్నట్టు కనిపిస్తారు. పొందికకి తోడు వారి ప్రేమపూరితమైన మనస్సు. దయ, సుహృద్భావం వంటి సద్భావనలతో మనస్సు నిండి ఉంటే ఆ సానుకూల భావతరంగాలు మనసు నుండి కనుల ద్వారా వెలువడి ముఖాన్ని కాంతిమంతంగా చేస్తాయి. అప్పుడు అందంగా కనిపించదా? దీన్ని వర్చస్సు అని కూడా చెప్పవచ్చు.

భారతీయుల సౌందర్య దృష్టిలో కూడా పారమార్థికత ఉంది. సౌందర్యం పరమాత్ముడి లక్షణాలు, లేక తత్వాలలో ఒకటి. సచ్చిదానంద స్వరూపుడైన పరమాత్మ తత్త్వం ''సత్యం, శివం, సుందరం''.సృష్టిలోని అందమంతా మూర్తీభవించిన పురుషరూపం శివుడు.ఆయనే చొక్కనాథుడు, సుందరేశ్వరుడు. అదే స్త్రీ రూపమైతే లలితా త్రిపురసుందరి.

భౌతికమైన అందం శాశ్వతం కాదు. ముద్దుముద్దుగా చూడగానే ముచ్చట గొలిపే పాలబుగ్గల పసివాడు చూస్తూ ఉండగానే పెద్దవాడు అవుతాడు. అప్పుడు పాలబుగ్గలు అందానికి హేతువు కాదు అని అర్థమవుతుంది.ఈ భౌతికరూపాన్ని అధిగమించిన అందాన్ని గురించి మాత్రమే భారతీయ ఋషులు, దార్శనికులు ప్రస్తావించారు. ఆ ప్రమాణాలని అనుసరించే ప్రాచీన కవులు సౌందర్య వర్ణన చేశారు. చేతులని, పాదాలని, ముఖాన్ని, కన్నులని కూడా పద్మాలతో పోల్చుతారు. కారణం వాటి ఆకారం అట్లా ఉందని కాదు. పద్మం అందమైనది.ఆహ్లాదకరమైనది, మృదువైనది, శుభప్రదమైనది, పవిత్రమైనది. కనుక ఆ అవయవాలు అంతటి పవిత్రమైనవి అని సూచించటం.ఇతరమైన ఉపమానాలు కూడా అటువంటివే. పైకి భౌతికరూప వర్ణనలాగా అనిపించినా అంతరార్థం వేరు. బాహ్య సౌందర్యం ఆత్మసౌందర్య వ్యక్తీకరణ మాత్రమే.

– డా.ఎస్.అనంతలక్ష్మి

గృహస్థాశ్రమ వైశిష్ట్యం

చదువు - లోకహితం కోసమే



రామాయణంలో ఒక చోట ''సర్వే వేద విదః శూరః సర్వే లోకహితే రతః /సర్వే జ్ఞానోపసంపన్నాః సర్వే సముదితా గుణైః'' అని ఉంటుంది. రామలక్ష్మణ భరత శత్రుఘ్నులకు గురువులు ఎన్నో విషయాలు నేర్పారు.ఎన్ని నేర్పినా, వాళ్ళకు నేర్పుతున్నప్పుడే అంతర్లీనంగా ఒక బోధ చేశారు. ''ఈ చదువు మీకు ఒక కొత్త విభూతిని కట్టబెడుతుంది. ఈ చదువు మీకు ఒక కొత్త అధికారాన్ని తీసుకొస్తుంది. మీకున్న ఏ విభూతిని కూడా స్వార్థ ప్రయోజనానికి వాడుకోకుండా కేవలం ప్రజాహితానికి మాత్రమే వాడాలి.''–అని.

చదువు లేనివాడు మోసం చేయడానికి సంతకం కూడా పెట్టలేడు. చదువుకున్నవాడు వాడిని పిలిచి నిలదీస్తే వాడు భయపడి 'ఇంకెప్పుడూ ఇలా చేయనండీ ...' అంటాడు. కానీ బాగా చదువుకున్నవాడు అందరికీ నియమనిష్ఠలు చెప్పగలిగినవాడు తప్పు చేసినప్పుడు.. ... తన తప్పును అంగీకరించకపోగా అదే ఒప్పు అని సమర్థించుకోవడానికి సవాలక్ష వాదనలు ముందు పెడతాడు. రావణాసురుడికి ఏ విద్యలు తెలియవని!!! అయినా ''స్వధర్మో రక్షసాం భీరు సర్వథైవ న సంశయః! గమనం వా పర స్త్రీణాం హరణం సంప్రమథ్య వా!!'' అని వాదించాడు. 'నా తప్పేముంది కనుక. నేను రాక్షసుడిని.నా జాతి ధర్మం ప్రకారం నాకు కావలసిన స్త్రీలను అవహరిస్తాను, అనుభవిస్తాను. నేను చూడు ఎంత ధర్మాత్ముడినో'' అని సమర్థించుకునే ప్రయత్నం చేసాడు. అంత చదువుకున్నవాడు అంత మూర్ఖంగా వాదిస్తే అటువంటివాడిని అభిశంసించగలిగిన వాడెవడుంటాడు!!! చదువు సంస్కారవంతమై ఉండాలి.సామాజిక నిష్ఠతో ఉండాలి. అందరి మేలు కోరేదై ఉండాలి.



బ్రహ్మశ్రీ చాగంటి కోటేశ్వరరావు

విశ్వామిత్రుడుకానీ, వశిష్ఠుడు కానీ రామలక్ష్మణులకు విద్యను నేర్పించేటప్పుడు 'ఇంత ధనుర్వేదాన్ని వీళ్లకు అందచేస్తున్నాం. వీళ్ళు తలచుకుంటే ముల్లోకాలను లయం చేయగలరు. అంత శక్తిమంతులవుతారు..' అన్న ఆలోచనతో దానిని ఎక్కడా దుర్వినియోగపరచకుండా ఉండేవిధంగా విద్యాబోధనలో ఎంతో జాగ్రత్త తీసుకున్నారు. నిజానికి రామచంద్రమూర్తి నేర్చుకున్న ధనుర్విద్యాపాటవం అటువంటిది. ఆచరణలో ఆయన దానికి పూనుకుంటే ఆపడం ఎవరితరం కాదు. ఆయన బాణ ప్రయోగం చేస్తే అగ్నిహోత్రం కప్పేస్తుంది సమస్త భూమండలాన్ని... అది ప్రళయాన్ని సృష్టించగలదు. కానీ అంత బలాఢ్యుడై ఉండి కూడా రాముడు ఒక్కసారి కూడా స్వార్థం కోసం హద్దుదాటి ఎవరినీ శిక్షించలేదు. అంటే గురువులు ఇచ్చిన విద్య లోకప్రయోజనం కోసం మాత్రమే ఉపయోగపడాలన్న స్పృహతో ఉండడమే కాదు, అందరికీ తన నడవడిక ద్వారా ఒక సందేశం ఇచ్చి ఆదర్శంగా నిలిచాడు.

రుషులు లోకహితం కోరి మనకు అందించిన పురాణాలు మనల్ని వారికి రుణగ్రస్థుల్ని చేసాయి. ఎప్పుడో వయసు మీరిన తరువాత, పదవీవిరమణ తరువాత చదవాల్సినవి కావు అవి. చిన్నప్పటినుంచి వాటిని చదువుకుంటే, అవగాహన చేసుకుంటే మన జీవితాలు చక్కబడతాయి. అదీకాక రుషిరుణం తీరదు కూడా. ఇది తీరడానికి బ్రహ్మచర్య ఆశ్రమం చాలు. బ్రహ్మచారిగా ఉండగా రామాయణ భారత భాగవతాదులు, ఇతర పురాణాలు, వేదాలు ఏవయినా చదువుకోవచ్చు. కానీ మిగిలిన రెండు రుణాలు–పితృరుణం, దేవరుణం మాత్రం గృహస్థాశ్రమ స్వీకారంతోనే తీరతాయి.

బౌద్ధవాణి

అజేయులు

ఆ ఇంట్లో ఇల్లాలు వంటచేస్తూ అందులో నిమగ్నమై పోయింది. ఆ రోజు భిక్షు సంఘాన్ని భిక్ష కోసం ఆహ్వానించారు ఆ గృహస్థులు. ఆమెకు ఒక నెలల బిడ్డ. ఆ బిడ్డడిని ఇంటిముందు దుప్పటి మీద పడుకోబెట్టారు. ఇద్దరు పిల్లలు ఆడిస్తున్నారు. ఆ పసివాడు వెల్లకిలా పడుకుని, కాళ్ళూ చేతులూ ఆడిస్తూ బోసినవ్వులు చిందిస్తున్నాడు. ఆమె వంటగది లోంచి అప్పుడప్పుడూ ఆ పిల్లలకేసి చూస్తూనే ఉంది.

కొంత సమయం గడిచింది. ఇంటి యజమాని కావడితో మంచినీరు తెచ్చి ఇంట్లో విశాలమైన మధ్య గదిలో ఉంచాడు. ఆరుబయట ఆడుకుంటున్న పిల్లల్లో ఒకడు పెద్దగా అరిచాడు.

''అమ్మా! భిక్షువులు వస్తున్నారు'' అంటూ ఆ వీధి చాలా పొడవైంది. ఆ వీధిలోకి అప్పుడే వచ్చారు భిక్షుగణం.

భిక్షగా సమర్పించే ఆహార పదార్థాలన్నీ పూర్తయ్యాయి. వాటిని గిన్నెల్లోకి సర్దుతోంది. ఇంతలో బయట ఏదో శబ్దం వినపడింది. కోడెదూడ ఒకటి చెంగుచెంగున ఎగురుతూ, తోక ఎత్తి అటుకేసి వచ్చింది. పసి పిల్లవాణ్ణి అక్కడే ఉంచి, మిగిలిన ఇద్దరు పిల్లలూ ఇంట్లోకి పరుగు తీశారు. ఇల్లాలికి విషయం అర్థమై, వేగంగా బైటికి పరుగు తీసింది.

కానీ... అప్పటికే ఆ గిత్తదూడ వచ్చేసింది. ఆరుబయట పడుకున్న పిల్లవాడి మీదగా దూకి వెళ్ళిపోయింది. ఆమెకు గుండె ఆగినంత పని అయింది. ఆమె వెళ్ళేసరికి... చిరునవ్వులు చిందిస్తూ బోసి నోటితో ఊ కొడుతున్నాడు ఆ బిడ్డ. కొంతసేపటికి భిక్షువులు వచ్చారు. వారు భిక్ష పూర్తి చేశాక ధర్మోపదేశం చేశారు. అప్పుడు వారికి ప్రమాదం తప్పిన పిల్లవాని గురించి తెలిసింది.

''చేశారా! ఆ బాలుడు స్థిరచిత్తుడు. స్థిత ప్రజ్ఞుడు. చావు ముందుకొస్తున్నా చిరునవ్వు చెదరనివాడు'' అన్నాడు ఆ భిక్షువు.

''అవును. కుశల సంపన్నుడు అజేయుడు'' అన్నాడు మరో భిక్షువు. పాపకర్మలు చేయనివాడు, మోసపు మాటలు ఎరుగని వాడు, పాప సంకల్పాలు తెలియని వాడు. అందుకే స్థిరచిత్తుడు '' అన్నాడు మొదటి భిక్షువు.



వారు అలా వాద సంవాదాలు చేసుకుంటూ ఆరామానికి చేరారు. అక్కడా ఇదే సంఘటన చెప్పి, అదే చర్చ కొనసాగించారు. అలా చర్చించే వారంతా కొత్తగా వచ్చిన వారే.

వారి మధ్య మాటలు జరుగుతూ ఉండగా బుద్ధుడు అక్కడికి వచ్చాడు. భిక్షువులందరూ నిశ్శబ్దం పాటించారు.

''భిక్షువులారా! ఇపుడు మీరు వాదులాడుకుంటున్న విషయం ఏమిటి?' అని అడిగాడు.

విషయమంతా తెలుసుకున్నాడు.

''భిక్షువులారా! శరీరంతో పాప కర్మలు చేయని వారు, పాపపు మాటలు మాట్లాడనివారు, పాప సంకల్పాలు చేయని వారు, పాప జీవనం కొనసాగించనివారు ఈ నాలుగు ధర్మాల్ని పాటించేవారు కుశల సంపన్నులే. అజేయులే! అత్యున్నత స్థితిని పొందినవారే! అయితే పసివారు ఇవేవీ చేయరు కాబట్టి వారు అజేయులు కారు. ఎందుకంటే.... వారు వెల్లకిలా పడుకుని మాత్రమే ఉండగలరు. వారు తమ శరీరంతో ఏ కర్మలూ చేయలేరు. వారికి నోరుంటుంది. నవ్వు, ఏడుపులు ఉంటాయి తప్ప, తప్పు ఒప్పులు మాట్లాడలేరు. అంటే... మాటల ద్వారా కర్మలాచరించలేరు. అలాగే... అది చేయాలి, ఇది చేయాలి, అలా చేయాలి, ఇలా చేయాలి అనే ఆలోచనలు వారికి ఉండవు. కాబట్టి సంకల్పాలూ ఉండవు. ఇక, తాను అది తినాలి ఇది తినాలిఅని ఎలా ఉండదో... ఆ తిండిని ఏదో ఒక మార్గంలో, మంచిగానో చెడుగానో సంపాదించి తినాలి అనే కోరికా ఉండదు. తల్లి పాలు తాగడం తప్ప... మరే విధమైన జీవన కర్మలు చేయరు. పసిపిల్లవాణ్ణి కర్మలతో కొలవకూడదు.


పెరిగి పెద్దయ్యాక కలిగే అనేక వికారాల నుండి, దోషాల నుండి, స్వార్థాల నుండి బైటపడిన వారినే కుశల సంపన్నులుగా, అజేయునిగా భావించాలి. అలాంటి నిస్వార్థ జీవనాన్ని కీర్తించాలి. అ నాలుగు ధర్మాల్ని ధరించిన వారికి అపజయం కలగదు. ప్రమాదం వచ్చి మీద పడుతున్నా చిరునవ్వు చెరగదు. '' అన్నాడు. పాపకర్మలు చేసే అవకాశం ఉన్నా చేయని వారు పాపపు జీవన విధానం ఎదుటే ఉన్నా దాన్ని స్వీకరించని వారు... ఇలాంటి వారు మాత్రమే అజేయులు. ఎందుకంటే వారు తమని తాము జయించుకుంటారు కాబట్టి అనే విషయం వారికి అర్థమైంది.

ఆ కొత్త భిక్షువులు బుద్ధునికి ప్రణమిల్లారు.

– డా. బొర్రా గోవర్ధన్

సినిమా

ట్రైలర్ రెడీ



కమల్‌హాసన్

హీరో కమల్ హాసన్, దర్శకుడు శంకర్ కాంబోలో రూపొందిన సినిమా 'ఇండియన్' (తెలుగులో 'భారతీయుడు'). 1996లో విడుదలైన ఈ సినిమా బ్లాక్‌బస్టర్‌గా నిలిచింది. పాతిక సంవత్సరాల తర్వాత 'ఇండియన్' సినిమాకు సీక్వెల్స్‌గా 'ఇండియన్ 2', 'ఇండియన్ 3' చిత్రాలను తెరకెక్కించారు కమల్‌హాసన్ అండ్ శంకర్. లైకా ప్రొడక్షన్స్, రెడ్ జెయింట్ మూవీస్ పతాకాలపై సుభాస్కరన్ నిర్మించారు. 'భారతీయుడు 2' తెలుగు, తమిళ, హిందీ భాషల్లో జూలై 12న విడుదల కానుంది. 'భారతీయుడు 2' మూవీ తెలుగు హక్కులను ఏషియన్ సురేష్ ఎంటర్‌టైన్మెంట్స్ ఎల్‌ఎల్‌పీ, సీడెడ్ హక్కులను శ్రీ లక్ష్మి మూవీస్ సంస్థలు దక్కించుకున్నాయి. తాజాగా 'ఇండియన్ 2' ట్రైలర్‌ను ఈ నెల 25న విడుదల చేయనున్నట్లు మేకర్స్ ప్రకటించారు. ముంబైలో జరగనున్న ఈ ట్రైలర్ లాంచ్ ఈవెంట్‌లో తెలుగు, తమిళ, హిందీ భాషల్లో 'ఇండియన్ 2' ట్రైలర్ విడుదలవుతుందని ఫిల్మ్‌నగర్ సమాచారం. సిద్ధార్థ్, ఎస్‌జే సూర్య, సముద్ర ఖని, బాబీ సింహా, కాజల్ అగర్వాల్, రకుల్‌ప్రీత్ సింగ్, ప్రియా భవానీ శంకర్, జయరాం, గుల్షన్ గ్రోవర్, బ్రహ్మానందం ఇతర లీడ్ రోల్స్‌లో నటిస్తున్న 'ఇండియన్ 2' సినిమాకు అనిరుధ్ రవిచందర్ స్వరకర్త. కాగా 'ఇండియన్ 3' సినిమా వచ్చే ఏడాది ప్రారంభంలో విడుదల కానుందని కోలీవుడ్ టాక్.

థాయ్‌లాండ్‌లో పాట



బాస్కో మార్టిస్, ఎన్టీఆర్



జాన్వీ కపూర్

హీరో ఎన్టీఆర్, హీరోయిన్ జాన్వీ కపూర్ థాయ్‌లాండ్‌లో చిందేస్తున్నారు. ప్రస్తుతం వీరిద్దరిపై అక్కడ ఓ పాటని చిత్రీకరిస్తున్నారు మేకర్స్. 'జనతా గ్యారేజ్'(2016) వంటి హిట్ మూవీ తర్వాత హీరో ఎన్టీఆర్, డైరెక్టర్ కొరటాల శివ కాంబినేషన్‌లో రూపొందుతోన్న చిత్రం 'దేవర'. ఈ మూవీ ద్వారా జాన్వీ కపూర్ టాలీవుడ్‌లో ఎంట్రీ ఇస్తున్నారు. కల్యాణ్‌రామ్ సమర్పణలో ఎన్టీఆర్ ఆర్ట్స్, యువసుధ ఆర్ట్స్ బ్యానర్స్‌పై మిక్కిలినేని సుధాకర్, హరికృష్ణ.కె ఈ సినిమా నిర్మిస్తున్నారు. 'దేవర' కీలక షెడ్యూల్‌ని థాయ్‌లాండ్‌లో ప్లాన్ చేశారు కొరటాల శివ. ఎన్టీఆర్, జాన్వీ కపూర్‌లపై ఓ సాంగ్‌తో పాటు ప్రధాన తారాగణంపై కొన్ని కీలక సన్నివేశాలు చిత్రీకరించనున్నారు. ఈ షెడ్యూల్‌లో పాల్గొనేందుకు ఈ నెల 17న హైదరాబాద్ నుంచి ఎన్టీఆర్, ఈ నెల 16న ముంబై నుంచి జాన్వీ కపూర్ థాయ్‌లాండ్‌కి బయలుదేరి వెళ్లిన సంగతి తెలిసిందే. ప్రస్తుతం వీరిద్దరిపై ఓ రొమాంటిక్ సాంగ్ చిత్రీకరణ జరుగుతోందని సమాచారం. 'పఠాన్, వార్, ఫైటర్' వంటి చిత్రాల్లో మంచి స్టెప్స్‌ను కంపోజ్ చేసిన ప్రముఖ కొరియోగ్రాఫర్ బాస్కో మార్టిస్ ఈ పాటకి నృత్యరీతులు సమకూర్చుతున్నారు. ఈ సందర్భంగా ఎన్టీఆర్‌తో కలిసి దిగిన ఫొటోను తన ఇన్‌స్టాగ్రామ్‌లో షేర్ చేశారు బాస్కో మార్టిస్. హై యాక్షన్ థ్రిల్లర్ నేపథ్యంలో రెండు భాగాలుగా రూపొందుతోన్న 'దేవర' చిత్రం మొదటి భాగం తెలుగు, తమిళ, హిందీ, కన్నడ, మలయాళ భాషల్లో సెప్టెంబర్ 27న విడుదల కానుంది. ఈ చిత్రానికి కెమెరా: రత్నవేలు, సంగీతం: అనిరుధ్.

కశ్మీర్‌లో మిస్టర్ బచ్చన్



రవితేజ

కశ్మీర్‌లో మెలోడీ డ్యూయెట్ పాడుతున్నాడు మిస్టర్ బచ్చన్. రవితేజ హీరోగా నటిస్తున్న తాజా చిత్రం 'మిస్టర్ బచ్చన్'. ఇందులో భాగ్యశ్రీ బోర్సే హీరోయిన్‌గా నటిస్తున్నారు. హరీష్ శంకర్ దర్శకత్వంలో పనోరమా స్టూడియోస్– టీ సిరీస్ సమర్పణలో టీజీ విశ్వ ప్రసాద్ నిర్మిస్తున్న ఈ సినిమా చిత్రీకరణ తుదిదశకు చేరుకుంది. కాగా ఈ మూవీ షూటింగ్ ప్రస్తుతం కశ్మీర్ వ్యాలీలో జరుగుతోంది. రవితేజ, భాగ్యశ్రీ బోర్సేలపై శేఖర్ మాస్టర్ కొరియోగ్రఫీలో ఓ పాటను చిత్రీకరిస్తున్నారు మేకర్స్. ''నాలుగు రోజులుగా ఈ పాట చిత్రీకరణ జరుగుతోంది. ఆదివారంతో ఈ సాంగ్ షూటింగ్ పూర్తయింది. విజువల్ ఫీస్ట్‌గా ఉంటూనే ఎమోషనల్ ఎలిమెంట్‌తో ఈ సాంగ్ ఉంటుంది. ఈ మూవీ షూటింగ్ తొంభై శాతం పూర్తయింది. మిగతా భాగాన్ని త్వరగా చిత్రీకరించేలా శరవేగంగా పని చేస్తున్నాం'' అని చిత్రయూనిట్ పేర్కొంది. జగపతి బాబు, సచిన్ ఖేడ్కర్ ఇతర పాత్రల్లో నటిస్తున్న ఈ సినిమాకు మిక్కీ జె మేయర్ సంగీతం అందిస్తున్నారు. ఈ సంగతి ఇలా ఉంచితే హిందీ హిట్ ఫిల్మ్ అజయ్ దేవగన్ 'రైడ్ '(2018)కు తెలుగు రీమేక్‌గా 'మిస్టర్ బచ్చన్' చిత్రం తెరకెక్కుతోందనే టాక్ వినిపిస్తోంది.

చిన్న చిన్న కన్‌గళ్‌!



స్నేహ, విజయ్

తమిళ స్టార్ హీరోల్లో ఒకరైన దళపతి విజయ్ నటిస్తున్న 50వ చిత్రం 'ది గ్రేటెస్ట్ ఆఫ్ ఆల్ టైమ్' (ది గోట్). వెంకట్ ప్రభు దర్శకత్వం వహిస్తున్న ఈ మూవీలో విజయ్ ద్విపాత్రాభినయం చేస్తున్నారు. ప్రశాంత్, ప్రభుదేవా, కిచ్చా సుదీప్, లైలా, మీనాక్షీ చౌదరి, స్నేహ, యోగిబాబు, జయరాం ఇతర ముఖ్య పాత్రల్లో నటిస్తున్నారు. ఏజీఎస్ ఎంటర్‌టైన్‌మెంట్ పతాకంపై నిర్మిస్తున్న ఈ సినిమా సెప్టెంబరు 5న విడుదలకానుంది. ఇదిలా ఉంటే.. జూన్ 22న విజయ్ పుట్టినరోజు. ఈ సందర్భంగా 'ది గోట్' నుంచి ఓ వీడియో గ్లింప్స్‌ను విడుదల చేసి, అభిమానులకు సర్‌ప్రైజ్ ఇచ్చారు మేకర్స్. ఇందులో డైలాగ్స్ లేకుండా కేవలం ఛేజింగ్ యాక్షన్ సీక్వెన్స్ ఉన్నప్పటికీ మంచి స్పందన వస్తోంది. ఇదిలా ఉంటే.. తాజాగా ఈ మూవీ నుంచి 'చిన్న చిన్న కన్‌గళ్..'(చిన్న చిన్న కళ్లు) అంటూ సాగే రెండో పాటని ఆదివారం విడుదల చేశారు. ఈ చిత్రానికి యువన్ శంకర్ రాజా సంగీతం అందించారు. కుటుంబ భావోద్వేగాలతో సాగే ఈ పాటకి కబిలన్ వైరముత్తు సాహిత్యం అందించారు. యువన్ శంకర్ రాజా, రాజా భవతరినిలతో కలిసి విజయ్ ఈ పాట పాడటం విశేషం. సైన్స్ ఫిక్షన్ నేపథ్యంలో రూపొందుతోన్న ఈ సినిమాలో విజయ్ తండ్రీ కొడుకులుగా నటిస్తున్నారు.

మత్స్యకారుల జీవితంతో...



అజయ్, వంశీరామ్

వంశీరామ్ పెండ్యాల, అజయ్, స్వాతి భీమిరెడ్డి, ఏపూరి హరి ప్రధాన పాత్రల్లో నటించిన చిత్రం 'రేవు'. హరినాథ్ పులి దర్శకత్వం వహించారు. నవీన్ పారుపల్లి సమర్పణలో సంహిత్ ఎంటర్‌టైన్‌మెంట్స్‌పై డా. మురళి గింజుపల్లి నిర్మించిన ఈ మూవీ త్వరలో విడుదలకానుంది. ఈ సందర్భంగా హైదరాబాద్‌లో నిర్వహించిన సమావేశానికి దర్శకుడు రామ్‌గోపాల్ వర్మ, నటీనటులు అనన్య నాగళ్ల, మురళీ మోహన్, ఉత్తేజ్ అతిథులుగా హాజరయ్యారు. రామ్‌గోపాల్ వర్మ మాట్లాడుతూ–''నేను విజయవాడలో ఉన్నప్పుడు మచిలీపట్నం రేవుకు వెళ్లేవాడిని. రేవు నేపథ్యంగా సాగే మత్స్యకారుల జీవితాలతో తెరకెక్కించిన ఈ సినిమా హిట్ కావాలి'' అన్నారు. ''వర్మగారు, మురళీ మోహన్‌గారు నా తొలి సినిమా వేడుకకి అతిథులుగా రావడం చాలా సంతోషంగా ఉంది'' అన్నారు డా.మురళి గింజుపల్లి. ఈ చిత్రానికి కెమెరా: రేవంత్ సాగర్, నేపథ్య సంగీతం: వైశాక్ మురళీధరన్.

ఆగస్టులో ఆరంభం



శివ రాజ్‌కుమార్

శివ రాజ్‌కుమార్ హీరోగా నటించనున్న నూతన ద్విభాషా (తెలుగు, కన్నడ) చిత్రం ఖరారైంది. కార్తీక్ అద్వైత్ ఈ సినిమాకు దర్శకత్వం వహించనున్నారు. పద్మజ ఫిలింస్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ సమర్పణలో భువనేశ్వరి పిక్చర్స్ బ్యానర్‌పై ఎస్ఎన్ రెడ్డి, సుధీర్. పి నిర్మించనున్నారు. ''హై బడ్జెట్ యాక్షన్ థ్రిల్లర్ ఫిల్మ్ ఇది. స్క్రిప్ట్ వర్క్ పూర్తయింది. మ్యూజిక్ వర్క్ జరుగుతోంది. ఆగస్టులో ఈ సినిమా ప్రారంభోత్సవంతో పాటు రెగ్యులర్ షూటింగ్ మొదలయ్యేలా ప్లాన్ చేస్తున్నాం. ఈ సినిమాకు సంబంధించిన ఇతర పూర్తి వివరాలను త్వరలోనే వెల్లడిస్తాం'' అని చిత్రయూనిట్ పేర్కొంది. ఈ సినిమాకు సంగీతం: సామ్ సీఎస్, కెమెరా: ఏజే శెట్టి.

మధురం హిట్ అవుతుంది - నితిన్



నితిన్, ఉదయ్ రాజ్

''మధురం' సినిమా టీజర్ చాలా బాగుంది. చూస్తుంటే ఔట్ అండ్ ఔట్ లవ్ స్టోరీలా అనిపిస్తోంది. ఈ సినిమా మంచి హిట్ అవుతుందనే నమ్మకం ఉంది. చిత్ర నిర్మాత బంగార్రాజు, దర్శకుడు రాజేష్, హీరో ఉదయ్‌తో పాటు టీమ్‌కి ఆల్ ది బెస్ట్'' అని హీరో నితిన్ అన్నారు. ఉదయ్ రాజ్, వైష్ణవీ సింగ్ జంటగా రాజేష్ చికిలే దర్శకత్వం వహించిన చిత్రం 'మధురం'. 'ఎ మెమొరబుల్ లవ్' అనేది ట్యాగ్‌లైన్. శ్రీ వెంకటేశ్వర ఎంటర్‌టైన్మెంట్‌పై యం. బంగార్రాజు నిర్మించారు. ఈ చిత్రం టీజర్‌ను నితిన్ విడుదల చేశారు. రాజేష్ చికిలే మాట్లాడుతూ–''1990 నేపథ్యంలో జరిగే టీనేజ్ లవ్ స్టోరీ ఇది. సినిమా చూసిన ప్రేక్షకులకు వాళ్ల స్కూల్ డేస్, కాలేజ్ డేస్ గుర్తుకొస్తాయి'' అన్నారు. ''క్లీన్ యూత్‌ఫుల్ ఫ్యామిలీ ఎంటర్‌టైనర్ మూవీ ఇది. ఈ సినిమాతో నా జీవితం మలుపు తిరుగుతుంది'' అన్నారు ఉదయ్ రాజ్. ''రొమాంటిక్ లవ్ ఎంటర్‌టైనర్‌గా ఈ చిత్రాన్ని తెరకెక్కించాం. ప్రస్తుతం సెన్సార్ వర్క్ జరుగుతోంది. అతి త్వరలోనే సినిమా విడుదల చేస్తాం'' అన్నారు యం. బంగార్రాజు. ఈ చిత్రానికి కెమెరా: మనోహర్ కొల్లి, సంగీతం: వెంకీ వీణ.

సోనాక్షి వెడ్స్ జహీర్



జహీర్ ఇక్బాల్, సోనాక్షీ సిన్హా

బాలీవుడ్ నటుడు జహీర్ ఇక్బాల్, నటి సోనాక్షీ సిన్హా వివాహం చేసుకున్నారు. ఏడేళ్లుగా ప్రేమలో ఉన్న వీరిద్దరూ ఆదివారం ముంబైలో సింపుల్‌గా రిజిస్టర్ మ్యారేజ్ చేసుకున్నారు. ఇరు కుటుంబ సభ్యులు, సన్నిహితులు, బంధువుల సమక్షంలో వీరి పెళ్లి జరిగింది. ''ఏడు సంవత్సరాల క్రితం మా ఇద్దరి కళ్లలో నిజమైన ప్రేమ ఉన్నట్లుగా మాకు అర్థమైంది. ఈ ప్రేమను ఇలానే కంటిన్యూ చేయాలనుకున్నాం. ఇప్పుడు మా ప్రేమే మా వివాహం జరిపించింది. మా రెండు కుటుంబాలు, బంధువులు, దేవుళ్ల ఆశీర్వాదాలతో మా పెళ్లి జరిగింది'' అంటూ ఇన్‌స్టాలో పెళ్లి ఫోటోలను షేర్ చేశారు సోనాక్షీ సిన్హా. కాగా 2022లో విడుదలైన హిందీ చిత్రం 'డబుల్ ఎక్స్'లో సోనాక్షీ సిన్హా, జహీర్ ఇక్బాల్ స్క్రీన్ షేర్ చేసుకున్న విషయం తెలిసిందే.

జోర్డాన్ హ్యాట్రిక్: సెమీస్‌లో ఇంగ్లండ్


జోర్డాన్

బ్రిడ్జ్‌టౌన్: ఆల్‌రౌండ్ ప్రదర్శనతో చెలరేగిపోయిన డిఫెండింగ్ చాంపియన్ ఇంగ్లండ్ జట్టు టి20 ప్రపంచకప్‌లో సెమీఫైనల్లోకి దూసుకెళ్లింది. అమెరికా జట్టుతో ఆదివారం జరిగిన గ్రూప్–2 'సూపర్–8' మ్యాచ్‌లో ఇంగ్లండ్ 10 వికెట్ల తేడాతో గెలిచింది. తొలుత బ్యాటింగ్‌కు దిగిన అమెరికా 18.5 ఓవర్లలో 115 పరుగులకు ఆలౌటైంది. నితీశ్ (24 బంతుల్లో 30; 1 ఫోర్, 2 సిక్స్‌లు), కోరె అండర్సన్ (28 బంతుల్లో 29; 1 సిక్స్) రాణించారు. ఇంగ్లండ్ బౌలర్ క్రిస్ జోర్డాన్ 'హ్యాట్రిక్' నమోదు చేశాడు. జోర్డాన్ 2.5 ఓవర్లలో కేవలం 10 పరుగులిచ్చి 4 వికెట్లు తీశాడు. ఇన్నింగ్స్ 19వ ఓవర్‌లో జోర్డాన్ 5 బంతుల్లో 4 వికెట్లు పడగొట్టాడు. 19వ ఓవర్ తొలి బంతికి అండర్సన్‌ను అవుట్ చేసిన జోర్డాన్... మూడో బంతికి అలీఖాన్‌ను, నాలుగో బంతికి కెంజిగెను, ఐదో బంతికి నేత్రావల్కర్‌ను అవుట్ చేసి 'హ్యాట్రిక్' పూర్తి చేసుకున్నాడు.

బట్లర్ మెరుపులు

116 పరుగుల లక్ష్యంతో బరిలోకి దిగిన ఇంగ్లండ్ 9.4 ఓవర్లలో వికెట్ నష్టపోకుండా 117 పరుగులు చేసి గెలిచింది. కెప్టెన్ జోస్ బట్లర్ (38 బంతుల్లో 83 నాటౌట్; 6 ఫోర్లు, 7 సిక్స్‌లు), ఫిల్ సాల్ట్ (21 బంతుల్లో 25 నాటౌట్; 2 ఫోర్లు) మెరిపించారు. అమెరికా బౌలర్ హర్మీత్ సింగ్ వేసిన తొమ్మిదో ఓవర్లో బట్లర్ ఏకంగా 5 సిక్స్‌లు కొట్టాడు. ఈ గెలుపుతో ఇంగ్లండ్ 4 పాయింట్లతో సెమీఫైనల్ చేరుకుంది. నేడు దక్షిణాఫ్రికా, వెస్టిండీస్ జట్ల మధ్య జరిగే మ్యాచ్‌లో నెగ్గిన జట్టు గ్రూప్–2 నుంచి రెండో జట్టుగా సెమీఫైనల్ చేరుకుంటుంది.

గ్రూప్–2 పాయింట్ల పట్టిక

జట్టు	ఆ	గె	ఓ	పా	ర.రే
ఇంగ్లండ్	3	2	1	4	1.992
దక్షిణాఫ్రికా	2	2	0	4	0.625
వెస్టిండీస్	2	1	1	2	1.814
అమెరికా	3	0	3	0	–3.906

నోట్: ఆ–ఆడినవి, గె–గెలిచినవి, ఓ–ఓడినవి, పా–పాయింట్లు, ర.రే–రన్‌రేట్

జోరు కొనసాగించాలని...

నేడు ఆస్ట్రేలియాతో భారత్ 'సూపర్–8' మ్యాచ్

- ఆసీస్ గెలిస్తేనే సెమీస్ ఆశలు సజీవం
- మ్యాచ్‌కు పొంచిఉన్న వర్షం ముప్పు
- రాత్రి గం. 8 నుంచి స్టార్ స్పోర్ట్స్‌లో ప్రత్యక్ష ప్రసారం



గ్రాస్ ఐలెట్: టి20 ప్రపంచకప్‌లో వరుస విజయాలతో దూసుకుపోతున్న భారత జట్టుకు ఆస్ట్రేలియా రూపంలో నేడు అసలు సిసలు పరీక్ష ఎదురుకానుంది. గ్రూప్–1లో టాప్‌లో ఉన్న భారత జట్టు ఆసీస్‌పై నెగ్గితే దర్జాగా సెమీఫైనల్ చేరుకుంటుంది. రోహిత్, కోహ్లి, సూర్యకుమార్, హార్దిక్ పాండ్యా, రిషభ్ పంత్ రాణిస్తే భారత్ భారీ స్కోరు చేయడం ఖాయం. బుమ్రా, అర్ష్‌దీప్ పేస్‌కు తోడు కుల్దీప్ స్పిన్ తోడైతే ఆస్ట్రేలియాకు కష్టాలు తప్పవు. మరోవైపు భారత్‌పై గెలిచి సెమీఫైనల్ చేరే అవకాశాలను సజీవంగా నిలబెట్టుకోవాలని ఆస్ట్రేలియా పట్టుదలతో ఉంది. అయితే భారత్, ఆస్ట్రేలియా మ్యాచ్‌కు వర్షం అంతరాయం కలిగించే అవకాశాలు ఉన్నాయి. మ్యాచ్ రద్దయితే మాత్రం భారత్ ఐదు పాయింట్లతో సెమీఫైనల్ చేరుకుంటుంది. ఆస్ట్రేలియా సెమీస్ చేరే అవకాశాలన్నీ అఫ్గానిస్తాన్–బంగ్లాదేశ్ మధ్య మంగళవారం ఉదయం కింగ్స్‌టౌన్‌లో జరిగే మ్యాచ్‌పై ఆధారపడి ఉంటాయి. ఈ మ్యాచ్‌లో బంగ్లాదేశ్ గెలిస్తే ఆస్ట్రేలియా 3 పాయింట్లతో సెమీఫైనల్ చేరుతుంది. అఫ్గానిస్తాన్ గెలిస్తే ఆ జట్టు 4 పాయింట్లతో సెమీఫైనల్ చేరుకొని ఆస్ట్రేలియాను ఇంటిదారి పట్టిస్తుంది. ఒకవేళ భారత జట్టుపై ఆస్ట్రేలియా 41 పరుగుల తేడాతో గెలిచి... అఫ్గానిస్తాన్ జట్టు 81 పరుగుల తేడాతో బంగ్లాదేశ్‌ను ఓడిస్తే మాత్రం రన్‌రేట్‌లో వెనుకబడి టీమిండియా టోర్నీ నుంచి నిష్క్రమిస్తుంది.

గ్రూప్–1 పాయింట్ల పట్టిక

జట్టు	ఆ	గె	ఓ	పా	ర.రే.
భారత్	2	2	0	4	2.425
ఆస్ట్రేలియా	2	1	1	2	0.223
అఫ్గానిస్తాన్	2	1	1	2	–0.650
బంగ్లాదేశ్	2	0	2	0	–2.489

అఫ్గానిస్తాన్ అద్భుతం


మ్యాక్స్‌వెల్ అవుటయ్యాక అఫ్గానిస్తాన్ ప్లేయర్లు గుల్బదిన్, గుర్బాజ్ సంబరం

- ఆస్ట్రేలియాపై 21 పరుగులతో సంచలన విజయం
- మెరిసిన గుల్బదిన్, గుర్బాజ్, ఇబ్రహీం
- తొలిసారి అఫ్గానిస్తాన్ చేతిలో ఓడిన ఆసీస్
- కమిన్స్ హ్యాట్రిక్ వృథా

సమష్టి ఆటతీరుతో అఫ్గానిస్తాన్ తమ క్రికెట్ చరిత్రలోనే చిరస్మరణీ విజయం అందుకుంది. ప్రపంచ క్రికెట్‌లో అన్ని ఫార్మాట్‌లలో (టెస్టు, వన్డే, టి20) విశ్వవిజేతగా నిలిచిన ఆస్ట్రేలియాను అఫ్గానిస్తాన్ తొలిసారి ఓడించింది. గతంలో ఆస్ట్రేలియాతో ఆడిన నాలుగు వన్డేలలో, ఒక టి20 మ్యాచ్‌లో ఓడిపోయిన అఫ్గానిస్తాన్ ఆరో ప్రయత్నంలో మాత్రం క్రికెట్ అభిమానులందరూ అబ్బురపడే ఫలితాన్ని సాధించింది. ప్రపంచ వ్యాప్తంగా జరిగే టి20 ఫ్రాంచైజీ లీగ్‌లలో ఆడుతున్న అఫ్గాన్ క్రికెటర్లు ఆ అనుభవాన్నంతా రంగరించి పోరాడటంతో ఆస్ట్రేలియా తొలిసారి అఫ్గానిస్తాన్ ముందు తలవంచక తప్పలేదు.

కింగ్స్‌టౌన్: ప్రపంచ క్రికెట్‌లో ఇక నుంచి తమను చిన్న జట్టుగా ఎవరూ పరిగణించకూడదని అఫ్గానిస్తాన్ చాటి చెప్పింది. అగ్రశ్రేణి జట్లపై గెలిచే సత్తా తమలోనూ ఉందని... క్రమం తప్పకుండా తమతో మేటి జట్లు ద్వైపాక్షిక సిరీస్‌లు ఆడితే మరింత రాటుదేలుతామని అఫ్గానిస్తాన్ క్రికెటర్లు నిరూపించారు. టి20 ప్రపంచకప్ 'సూపర్–8' దశలో భాగంగా మాజీ చాంపియన్ ఆస్ట్రేలియాతో ఆదివారం ఉదయం జరిగిన గ్రూప్–1 మ్యాచ్‌లో అఫ్గానిస్తాన్ 21 పరుగుల తేడాతో సంచలన విజయం సాధించింది. ఆస్ట్రేలియా కెప్టెన్ మిచెల్ మార్ష్ టాస్ గెలిచి ఫీల్డింగ్ ఎంచుకోగా... తొలుత బ్యాటింగ్‌కు దిగిన అఫ్గానిస్తాన్ నిర్ణీత 20 ఓవర్లలో 6 వికెట్లు కోల్పోయి 148 పరుగులు చేసింది. అనంతరం 149 పరుగుల లక్ష్యంతో బరిలోకి దిగిన ఆస్ట్రేలియా 19.2 ఓవర్లలో 127 పరుగులకు ఆలౌటై ఓడిపోయింది. మ్యాక్స్‌వెల్ (41 బంతుల్లో 59; 6 ఫోర్లు, 3 సిక్స్‌లు) మినహా ఇతర బ్యాటర్లు విఫలమయ్యారు. నవీనుల్ హక్ (3/20), 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' గుల్బదిన్ నైబ్ (4/20) తమ వైవిధ్యభరిత బౌలింగ్‌తో ఆస్ట్రేలియాను దెబ్బ కొట్టారు. గతంలో ఒక్కసారి కూడా ఆస్ట్రేలియాపై నెగ్గని అఫ్గానిస్తాన్‌కు ఈ మ్యాచ్‌లో ఓపెనర్లు రహ్మనుల్లా గుర్బాజ్ (49 బంతుల్లో 60; 4 ఫోర్లు, 4 సిక్స్‌లు), ఇబ్రహీం జద్రాన్ (48 బంతుల్లో 51; 6 ఫోర్లు) శుభారంభం అందించారు. వీరిద్దరు తొలి వికెట్‌కు 118 పరుగులు జోడించారు. గుర్బాజ్, ఇబ్రహీం అవుటయ్యాక వచ్చిన ఇతర అఫ్గాన్ బ్యాటర్లు మెరిపించలేకపోయారు.

కమిన్స్ హ్యాట్రిక్

ఇన్నింగ్స్ 18వ ఓవర్ వేసిన ఆసీస్ పేసర్ కమిన్స్ చివరి బంతికి అఫ్గానిస్తాన్ కెప్టెన్ రషీద్ ఖాన్ (2)ను అవుట్ చేశాడు. ఆ తర్వాత 20వ ఓవర్లో తొలి రెండు బంతులకు కరీమ్ జన్నత్ (9 బంతుల్లో 13; 1 సిక్స్), గుల్బదిన్ నైబ్ (0)లను అవుట్ చేసి ఈ టోర్నీలో రెండో 'హ్యాట్రిక్' నమోదు చేశాడు.


కమిన్స్

నవీనుల్, గుల్బదిన్ సూపర్ బౌలింగ్

కష్టసాధ్యంకాని లక్ష్యంతో బరిలోకి దిగిన ఆస్ట్రేలియాకు తొలి ఓవర్‌లోనే షాక్ తగిలింది. నవీనుల్ హక్ అద్భుత బంతికి ఓపెనర్ ట్రవిస్ హెడ్ (0) బౌల్డయ్యాడు. ఆ తర్వాత నవీనుల్ తన రెండో ఓవర్లో కెప్టెన్ మిచెల్ మార్ష్ (9 బంతుల్లో 12; 2 ఫోర్లు)ను అవుట్ చేశాడు. ఇన్నింగ్స్ ఆరో ఓవర్లో వార్నర్ (3)ను నబీ పెవిలియన్‌కు పంపించడంతో ఆసీస్ కష్టాల్లో పడింది. ఈ దశలో మ్యాక్స్‌వెల్, స్టొయినిస్ (17 బంతుల్లో 11; 1 ఫోర్) ఇన్నింగ్స్ చక్కదిద్దేందుకు ప్రయత్నించారు. అయితే గుల్బదిన్ వైవిధ్యభరిత బంతులతో ముందుగా స్టొయినిస్‌ను, ఆ తర్వాత టిమ్ డేవిడ్‌ను అవుట్ చేశాడు. అనంతరం ప్రమాదకరంగా మారిన మ్యాక్స్‌వెల్‌ను కూడా గుల్బదిన్ పెవిలియన్‌కు పంపించాడు. ఆ తర్వాత మాథ్యూ వేడ్‌ను రషీద్ ఖాన్ అవుట్ చేయడంతో ఆసీస్ 108 పరుగులకే 7 వికెట్లు కోల్పోయి ఓటమి వైపు సాగింది. కమిన్స్ ఏమైనా అద్భుతం చేస్తాడా అని ఆశించినా అతడిని గుల్బదిన్ అవుట్ చేయడంతో ఆస్ట్రేలియా పరాజయం ఖాయమైంది.

1 వరుసగా రెండు అంతర్జాతీయ టి20 మ్యాచ్‌ల్లో 'హ్యాట్రిక్' నమోదు చేసిన, టి20 ప్రపంచకప్‌లో రెండు హ్యాట్రిక్‌లు తీసిన తొలి బౌలర్ కమిన్స్. బంగ్లాదేశ్‌తో జరిగిన తొలి సూపర్–8 మ్యాచ్‌లోనూ కమిన్స్ హ్యాట్రిక్ సాధించాడు. అంతేకాకుండా మలింగ (శ్రీలంక), టిమ్ సౌతీ (న్యూజిలాండ్), మార్క్ పావ్‌లోవిచ్ (సెర్బియా), వసీమ్ అబ్బాస్ (మాల్టా) తర్వాత టి20ల్లో రెండు హ్యాట్రిక్‌లు సాధించిన ఐదో క్రికెటర్‌గా కమిన్స్ నిలిచాడు.

టి20 ప్రపంచకప్‌లో నేడు

దక్షిణాఫ్రికా X వెస్టిండీస్
వేదిక: నార్త్‌సౌండ్; ఉదయం గం. 6 నుంచి
భారత్ X ఆస్ట్రేలియా
వేదిక: గ్రాస్ ఐలెట్; రాత్రి గం. 8 నుంచి
స్టార్ స్పోర్ట్స్, హాట్‌స్టార్‌లో ప్రత్యక్ష ప్రసారం

భారత్ క్లీన్‌స్వీప్


సిరీస్ ట్రోఫీతో హర్మన్‌ప్రీత్

బెంగళూరు: దక్షిణాఫ్రికా మహిళల క్రికెట్ జట్టుతో జరిగిన మూడు మ్యాచ్‌ల వన్డే సిరీస్‌ను భారత మహిళల జట్టు 3–0తో క్లీన్‌స్వీప్ చేసింది. ఆదివారం జరిగిన చివరి మ్యాచ్‌లో హర్మన్‌ప్రీత్ కౌర్ నాయకత్వంలోని భారత్ 6 వికెట్ల తేడాతో గెలిచింది. టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకున్న దక్షిణాఫ్రికా 50 ఓవర్లలో 8 వికెట్లకు 215 పరుగులు సాధించింది. ఓపెనర్లు లౌరా వొల్వార్ట్ (57 బంతుల్లో 61; 7 ఫోర్లు), తజ్మిన్ (38; 2 ఫోర్లు, 1 సిక్స్) తొలి వికెట్‌కు 102 పరుగులు జోడించారు. భారత బౌలర్లలో అరుంధతి రెడ్డి (2/36), 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' దీప్తి శర్మ (2/27) రాణించారు. 216 పరుగుల లక్ష్యంతో బరిలోకి దిగిన భారత్ 40.4 ఓవర్లలో 4 వికెట్లు కోల్పోయి 220 పరుగులు చేసి గెలిచింది. వైస్ కెప్టెన్ స్మృతి మంధాన (83 బంతుల్లో 90; 11 ఫోర్లు), హర్మన్‌ప్రీత్ కౌర్ (48 బంతుల్లో 42; 2 ఫోర్లు) రాణించడంతో భారత్ 56 బంతులు ఉండగానే విజయాన్ని అందుకుంది.

ధీరజ్‌కు రెండు కాంస్యాలు



అంటాల్యా (టర్కీ): ప్రపంచకప్ ఆర్చరీ స్టేజ్–3 టోర్నమెంట్‌లో భారత్‌కు ప్రాతినిధ్యం వహించిన ఆంధ్రప్రదేశ్ ప్లేయర్ బొమ్మదేవర ధీరజ్ రెండు కాంస్య పతకాలు సాధించాడు. మిక్స్‌డ్ టీమ్ కాంస్య పతక మ్యాచ్‌లో ధీరజ్–భజన్ కౌర్ (భారత్) ద్వయం 5–3తో మటియాస్–వలెన్సియా (మెక్సికో) జోడీపై గెలిచింది. వ్యక్తిగత విభాగం కాంస్య పతక మ్యాచ్‌లో ధీరజ్ 7–3 తో మౌరో నెస్పోలి (ఇటలీ)పై విజయం సాధించాడు.

భవిత

కెరీర్ కౌన్సెలింగ్
మీ సందేహాలు, సలహాలు పంపించాల్సిన ఈ- మెయిల్ sakshieducation@gmail.com

విద్య, ఉద్యోగ సమాచారం

భారత తీరరక్షక దళంలో 320 నావిక్, యాంత్రిక్ పోస్టులు

భారత రక్షణ మంత్రిత్వ శాఖకు చెందిన భారత తీర రక్షక దళం.. కోస్ట్ గార్డ్ ఎన్‌రోల్డ్ పర్సనల్ టెస్ట్(సీజీఈపీటీ)–01/2025 బ్యాచ్ ద్వారా నావిక్(జనరల్ డ్యూటీ), యాంత్రిక్ పోస్టుల భర్తీకి పురుష అభ్యర్థుల నుంచి దరఖాస్తులు కోరుతోంది.

» మొత్తం పోస్టుల సంఖ్య: 320

పోస్టుల వివరాలు

» నావిక్(జనరల్ డ్యూటీ): 260 (రీజియన్/జోన్ వారీ ఖాళీలు: నార్త్–77, వెస్ట్–66, నార్త్ ఈస్ట్–68, ఈస్ట్–34, నార్త్ వెస్ట్–12, అండమాన్–నికోబార్–03.

» యాంత్రిక్(మెకానికల్/ఎలక్ట్రికల్/ఎలక్ట్రానిక్స్): 60.

» అర్హత: నావిక్ పోస్టులకు 12వ తరగతి(మ్యాథ్స్/ఫిజిక్స్), యాంత్రిక్ పోస్టులకు పదో తరగతి లేదా 12వ తరగతితో పాటు సంబంధిత విభాగంలో డిప్లొమా ఉత్తీర్ణులై ఉండాలి.

» వయసు: 18 నుంచి 22 ఏళ్ల మధ్య ఉండాలి. 01.03.2003 నుంచి 28.02.2007 మధ్య జన్మించి ఉండాలి. ఎస్సీ, ఎస్టీలకు ఐదేళ్లు, ఓబీసీలకు మూడేళ్ల గరిష్ట వయసులో సడలింపు వర్తిస్తుంది.

» వేతనం: నెలకు నావిక్ పోస్టులకు రూ.21,700; యాంత్రిక్ పోస్టులకు రూ.29,200.

» ఎంపిక విధానం: స్టేజ్–1, స్టేజ్–2, స్టేజ్–3, స్టేజ్–4 పరీక్షలు, వైద్య పరీక్షలు, ధ్రువపత్రాల పరిశీలన ఆధారంగా ఎంపికచేస్తారు.

ముఖ్య సమాచారం

» దరఖాస్తు విధానం: ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి.

» ఆన్‌లైన్ దరఖాస్తు ప్రారంభతేది: 13.06.2024.

» ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది: 03.07.2024.

» పరీక్ష తేదీలు/ఈ–అడ్మిట్ కార్డ్ డౌన్‌లోడ్: స్టేజ్–1: సెప్టెంబర్ 2024; స్టేజ్–2: నవంబర్ 2024; స్టేజ్–3: ఏప్రిల్ 2024.

» వెబ్‌సైట్: https://joinindiancoastguard.cdac.in/cgept

శ్రీ కొండా లక్ష్మణ్ యూనివర్సిటీలో హార్టికల్చర్ డిప్లొమ కోర్సుల్లో ప్రవేశాలు

సిద్ధిపేట జిల్లా ములుగులోని శ్రీ కొండా లక్ష్మణ్ తెలంగాణ స్టేట్ హార్టికల్చరల్‌యూనివర్సిటీ 2024–25 విద్యా సంవత్సరానికి సంబంధించి రెండేళ్ల హార్టికల్చర్ పాలిటెక్నిక్ డిప్లొమా కోర్సుల్లో ప్రవేశాలకు దరఖాస్తులు కోరుతోంది. ప్రభుత్వ, ప్రైవేట్ అనుబంధ పాలిటెక్నిక్‌లలో ప్రవేశాలు కల్పిస్తారు. ఇందులో 60 శాతం సీట్లను గ్రామీణ విద్యార్థులకు, 40 శాతం సీట్లను పట్టణ ప్రాంత విద్యార్థులకు కేటాయించారు.

కోర్సు.. డిప్లొమా ఇన్ హార్టికల్చ్ (ఇంగ్లిష్ మీడియం)

» సీట్లు: యూనివర్సిటీ పాలిటెక్నిక్‌లు–120,అనుబంధ పాలిటెక్నిక్‌లు–200.

» అర్హత: పదో తరగతి ఉత్తీర్ణులవ్వాలి. లేదా ఇంటర్మీడియట్ ఫెయిల్ అయిన అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవచ్చు. తెలంగాణ పాలిసెట్–2024 ఉత్తీర్ణులై ఉండాలి.

» వయసు: 31.12.2024 నాటికి 15 నుంచి 22 ఏళ్ల మధ్య ఉండాలి.

» ఎంపిక విధానం: పాలిసెట్–2024 ర్యాంక్, పదో తరగతి మార్కుల ఆధారంగా సీటు కేటాయిస్తారు.

» దరఖాస్తు విధానం: ఆఫ్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి.

» దరఖాస్తు ఫీజు: ఇతరులకు రూ.1100, ఎస్సీ, ఎస్టీ, దివ్యాంగ అభ్యర్థులకు రూ.600.

» దరఖాస్తు ప్రారంభతేది: 15.06.2024.

» దరఖాస్తులకు చివరితేది: 15.07.2024.

» వెబ్‌సైట్: www.skltshu.ac.in

నీట్ కౌన్సెలింగ్.. ఇలా!

నేషనల్ ఎలిజిబిలిటీ కమ్ ఎంట్రన్స్ టెస్ట్–అండర్ గ్రాడ్యుయేట్.. సంక్షిప్తంగా నీట్–యూజీ! దేశ వ్యాప్తంగా.. ఎంబీబీఎస్, బీడీఎస్‌తోపాటు ఆయుష్ వైద్య కోర్సుల్లో ప్రవేశానికి నిర్వహించిన పరీక్ష! కొద్దిరోజుల క్రితమే నీట్ యూజీ–2024 ఫలితాలు వెల్లడయ్యాయి. మరోవైపు ఈ పరీక్షపై వివాదం కొనసాగుతున్నా.. నీట్ కౌన్సెలింగ్‌కు సన్నాహాలు మొదలయ్యాయనే వార్తలు! ఈ నేపథ్యంలో నీట్ కౌన్సెలింగ్ ప్రక్రియ ఎలా ఉంటుంది.. ఆల్ ఇండియా కోటా, స్టేట్ కోటా సీట్ల భర్తీ విధానం.. తెలుగు రాష్ట్రాలకు సంబంధించి సీట్ల భర్తీ తీరు, నీట్ ర్యాంకర్లు కౌన్సెలింగ్‌కు సిద్ధం చేసుకోవాల్సిన పత్రాలు తదితర అంశాలపై విశ్లేషణ..

» త్వరలో నీట్ యూజీ–2024 కౌన్సెలింగ్
» ర్యాంకు ఆధారంగా ఎంబీబీఎస్, బీడీఎస్ సీట్ల భర్తీ
» డీజీహెచ్‌ఎస్ ఆధ్వర్యంలో ఆల్ ఇండియా కోటా కౌన్సెలింగ్
» రాష్ట్ర స్థాయిలో హెల్త్ యూనివర్సిటీల నేతృత్వంలో కౌన్సెలింగ్
» ఆయుష్ కోర్సులకు ప్రత్యేక కౌన్సెలింగ్



'నీట్ యూజీ–2024 ఫలితాలపై ఆందోళనలు జరుగుతున్నా.. మళ్లీ పరీక్ష నిర్వహించే అవకాశాలు తక్కువే. కాబట్టి నీట్ ఉత్తీర్ణులు ఫలితాలపై వస్తున్న వార్తల జోలికి వెళ్లకుండా.. కౌన్సెలింగ్‌కు సిద్ధమవ్వాలి' అంటున్నారు నిపుణులు.

పెరుగుతున్న సీట్లు

- నేషనల్ మెడికల్ కమిషన్ గణాంకాల ప్రకారం–దేశ వ్యాప్తంగా మొత్తం 783 ఎంబీబీఎస్ కళాశాలల్లో 1,61,220 సీట్లు ఉన్నాయి. వీటిలో 331 ప్రైవేట్ కళాశాలలు, డీమ్డ్ యూనివర్సిటీలు ఉండగా.. అందుబాటులో ఉన్న సీట్ల సంఖ్య 74,703. అదేవిధంగా నీట్ స్కోర్‌తోనే భర్తీ చేసే బీడీఎస్ కోర్సుల్లో 28,088 సీట్లు, ఆయుష్ కోర్సుల్లో 52,720 సీట్లు అందుబాటులో ఉన్నాయి.
- తెలుగు రాష్ట్రాలకు సంబంధించి ఆంధ్రప్రదేశ్‌లో.. ప్రస్తుతం 16 ప్రభుత్వ వైద్య కళాశాలల్లో 2,935 ఎంబీబీఎస్ సీట్లు; మరో 16 ప్రైవేట్ కళాశాలల్లో 2,850 సీట్లు ఉన్నాయి. రెండు మైనారిటీ కళాశాలల్లో 300 సీట్లు; స్వయం ప్రతిపత్తి కలిగిన శ్రీ పద్మావతి మహిళా వైద్య కళాశాలలో 175 సీట్లు ఉన్నాయి. బీడీఎస్‌కు సంబంధించి.. రెండు ప్రభుత్వ డెంటల్ కళాశాలల్లో 140 సీట్లు; 14 ప్రైవేట్ కళాశాలల్లో 1,300 సీట్లు చొప్పున ఉన్నాయి.
- తెలంగాణ రాష్ట్రంలో.. ఎంబీబీఎస్‌కు సంబంధించి 27 ప్రభుత్వ కళాశాలల్లో 3,790 సీట్లు; 29 ప్రైవేట్, మైనారిటీ కళాశాల్లో 4,700 సీట్లు ఉన్నాయి. బీడీఎస్‌కు సంబంధించి ఒక ప్రభుత్వ కళాశాలలో 100 సీట్లు; పది ప్రైవేట్ కళాశాలల్లో 1,000 సీట్లు; వీటికి అదనంగా సికింద్రాబాద్ ఆర్మీ డెంటల్ కళాశాలలో ఆరు సీట్లు ఉన్నాయి.

పేరున్న కళాశాలలో సీటు

ప్రస్తుతం అందుబాటులో ఉన్న ఎంబీబీఎస్, బీడీఎస్ సీట్లను పరిగణనలోకి తీసుకుంటే.. ఆల్ ఇండియా స్థాయిలో రిజర్వ్‌డ్ కేటగిరీలో రెండు లక్షల వరకు ర్యాంకు వరకూ సీట్లు పొందే అవకాశముందని అంచనా. పేరున్న ప్రభుత్వ కళాశాలల్లో సీట్లు సొంతం చేసుకోవాలంటే మాత్రం జాతీయ స్థాయిలో 40 వేల లోపు ర్యాంకుతోనే సాధ్యమని చెబుతున్నారు.

కౌన్సెలింగ్.. ఏఐక్యూ, స్టేట్ కోటా

నీట్ యూజీ కౌన్సెలింగ్‌ను రెండు విధానాల్లో నిర్వహించి సీట్ల భర్తీ చేపడతారు. అవి.. ఆల్ ఇండియా కోటా, స్టేట్ కోటా. ఆల్ ఇండియా కోటా సీట్ల భర్తీని డీజీహెచ్‌ఎస్‌కు చెందిన మెడికల్ కౌన్సెలింగ్ కమిటీ నిర్వహిస్తుంది. రాష్ట్ర కోటాకు సంబంధించి.. రాష్ట్రాల వైద్య విశ్వ విద్యాలయాలు కౌన్సెలింగ్ నిర్వహిస్తాయి.

ఆల్ ఇండియా కోటా

జాతీయ స్థాయిలోని మెడికల్ కళాశాలలను నేషనల్ పూల్‌లోకి తీసుకెళ్లినప్పటి నుంచి ఆల్ ఇండియా కోటా పేరుతో కౌన్సెలింగ్‌ను నిర్వహిస్తున్నారు. ఈ విధానం ప్రకారం.. జాతీయ స్థాయిలోని అన్ని మెడికల్, డెంటల్ కళాశాలలు, యూనివర్సిటీల్లోని 15 శాతం సీట్లకు ప్రత్యేకంగా కౌన్సెలింగ్ నిర్వహిస్తారు. దీనిని కేంద్ర ప్రభుత్వ ఆధ్వర్యంలోని డీజీహెచ్‌ఎస్‌కు చెందిన మెడికల్ కౌన్సెలింగ్ కమిటీ చేపడుతుంది. ఆసక్తి ఉన్న విద్యార్థులు తప్పనిసరిగా ఎంసీసీ నిర్వహించే కౌన్సెలింగ్‌కు ప్రత్యేకంగా దరఖాస్తు చేసుకోవాలి. ఆల్ ఇండియా కోటా విధానంలో ఒక రాష్ట్రానికి చెందిన అభ్యర్థులు ఇతర రాష్ట్రాల్లోని వైద్య కళాశాలలకు కూడా పోటీ పడే అవకాశం లభిస్తుంది.

స్టేట్ కోటా కౌన్సెలింగ్

జాతీయ స్థాయిలో ఎంసీసీ కేవలం 15 శాతం సీట్లకే కౌన్సెలింగ్ నిర్వహిస్తుంది. మిగతా 85 సీట్లను ఆయా రాష్ట్రాలు సొంతంగా కౌన్సెలింగ్ నిర్వహించి భర్తీ చేస్తాయి. ప్రభుత్వ కళాశాలల్లోని 85 శాతం సీట్లు(ఆల్ ఇండియా కోటాకు కేటాయించాక మిగిలిన సీట్లు), ప్రైవేటు కళాశాలల్లో కన్వీనర్ కోటా పేరుతో అందుబాటులో ఉండే 50 శాతం సీట్లను.. అదే విధంగా ప్రైవేట్ కళాశాలల్లో ప్రైవేట్–బి పేరిట ఉండే 35 శాతం సీట్లు, ఎన్ఆర్ఐ కోటాగా పిలిచే 15 శాతం సీట్లను కూడా హెల్త్ యూనివర్సిటీలే కౌన్సెలింగ్ విధానంలో భర్తీ చేస్తాయి. ఇందుకోసం ప్రత్యేకంగా నోటిఫికేషన్ విడుదల చేస్తాయి. మైనారిటీ కళాశాలల్లో అందుబాటులో ఉండే సీట్లను కూడా ఆయా వర్గాలకు చెందిన విద్యార్థులతోనే భర్తీ చేస్తారు. ఈ ప్రక్రియను కూడా హెల్త్ యూనివర్సిటీలే చేపడతాయి.

ఫీజులు ఇలా

- ఏపీలో ప్రభుత్వ కళాశాలలు, ప్రైవేట్ కళాశాలల్లో కేటగిరీ–ఎ పేరిట ఉండే కన్వీనర్ కోటాలో రూ.15 వేలు ఫీజుగా నిర్ధారించారు. ప్రైవేట్ కళాశాలల్లో మేనేజ్‌మెంట్ కోటా కేటగిరీ–బి సీటుకు రూ.12 లక్షలు; పైవేట్ కళాశాలల్లో ఎన్ఆర్ఐ కోటా(కేటగిరీ–సి) సీట్లకు: రూ.36 లక్షలుగా పేర్కొన్నారు. బీడీఎస్ కోర్సుకు సంబంధించి ప్రభుత్వ కళాశాలలు, ప్రైవేట్ కళాశాలల్లో కేటగిరీ–ఎ కన్వీనర్ కోటా సీట్లకు ఫీజు రూ.13 వేలు; ప్రైవేట్ కళాశాలల్లోని కేటగిరీ–బి మేనేజ్‌మెంట్ సీట్లకు రూ.4 లక్షలు, ఎన్ఆర్ఐ కోటా సీట్లకు రూ.12 లక్షలు వార్షిక ఫీజుగా ఉంది.
- తెలంగాణలో ప్రభుత్వ కళాశాలల్లో సీటుకు రూ.10 వేలు; ప్రైవేట్ కళాశాలల్లో కన్వీనర్ కోటా సీటుకు రూ.60 వేలు; ప్రైవేట్ కళాశాలల్లో బి–కేటగిరీ(మేనేజ్‌మెంట్ కోటా) సీటుకు రూ.11.55 లక్షలు–రూ.13 లక్షలుగా ఫీజు ఉంది. అదే విధంగా.. ప్రైవేట్ కళాశాలల్లో ఎన్ఆర్ఐ కోటా(సి–కేటగిరీ) సీటు ఫీజు బి కేటగిరీ సీటుకు రెండు రెట్లుగా ఉంది. బీడీఎస్ కోర్సుల్లో.. ప్రభుత్వ కళాశాలల్లో రూ.10 వేలు; ప్రైవేట్ కళాశాలల్లో ఎ–కేటగిరీ(కన్వీనర్ కోటా) సీట్లు: రూ.45 వేలు; ప్రైవేట్ కళాశాలల్లో బి–కేటగిరీ(మేనేజ్‌మెంట్ కోటా) సీట్లు: రూ.4.2 లక్షలు – రూ.5 లక్షలు చొప్పున ఉన్నాయి. ప్రైవేట్ కళాశాలల్లో సి–కేటగిరీ(ఎన్ఆర్ఐ కోటా) సీటుకు బి కేటగిరీ సీటుకు 1.25 రెట్లు సమానమైన మొత్తం ఫీజుగా ఉంది.
- ఈ ఫీజుల వివరాలు 2023–24 విద్యా సంవత్సరానికి సంబంధించినవిగా గుర్తించాలి. కౌన్సెలింగ్ సమయానికి వీటిలో మార్పులు, చేర్పులు జరిగే అవకాశం ఉంది.

ఏఐక్యూ.. కౌన్సెలింగ్ విధానమిదే

- విద్యార్థులు కౌన్సెలింగ్‌కు హాజరయ్యేందుకు ఇప్పటి నుంచే సంసిద్ధంగా ఉండాలి. జాతీయ స్థాయిలోని సీట్లకు పోటీ పడాలనుకునే విద్యార్థులు.. మెడికల్ కౌన్సెలింగ్ కమిటీ నిర్వహించే ఆన్‌లైన్ కౌన్సెలింగ్‌కు హాజరు కావాలి. ఇందుకోసం ఎంసీసీ వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉండే క్యాండిడేట్ రిజిస్ట్రేషన్ ఆప్షన్‌ను క్లిక్ చేసి.. ఆన్‌లైన్ విధానంలో రిజిస్ట్రేషన్ చేసుకుని లాగిన్ ఐడీ, పాస్‌వర్డ్ క్రియేట్ చేసుకోవాలి. అనంతరం ఆన్‌లైన్ అప్లికేషన్‌లో ఉండే అన్ని వివరాలను నమోదు చేయాలి.
- ఆ తర్వాత అందుబాటులో ఉన్న కళాశాలలు, సీట్ల వివరాలు కనిపిస్తాయి. వాటికి అనుగుణంగా తమ ప్రాథమ్యాలను పేర్కొంటూ.. ఆన్‌లైన్ ఛాయిస్ ఫిల్లింగ్ పూర్తి చేయాలి. ఆ తర్వాత రౌండ్ల వారీగా సీట్ అలాట్‌మెంట్ వివరాలను వెల్లడిస్తారు.
- తొలి రౌండ్‌లో సీట్ అలాట్‌మెంట్ పొందిన అభ్యర్థులు సదరు కళాశాలలో చేరాలనుకుంటే.. నిర్దేశిత మొత్తాన్ని రిజిస్ట్రేషన్ ఫీజుగా చెల్లించాల్సి ఉంటుంది.
- తొలి రౌండ్‌లో సీటు వచ్చిన కళాశాలలో చేరడం ఇష్టం లేకుంటే.. ఫ్రీ ఎగ్జిట్ అవకాశం అందుబాటులో ఉంది. వీరు రెండో రౌండ్ కౌన్సెలింగ్‌కు హాజరవ్వచ్చు.
- తొలి రౌండ్ కౌన్సెలింగ్‌లోనే సీటు లభించి ఫీజు చెల్లించిన అభ్యర్థులు మరింత మెరుగైన సీటు కోసం తదుపరి రౌండ్‌కు హాజరయ్యే అవకాశం కూడా ఉంది.

స్టేట్ కోటాకు ప్రత్యేక కౌన్సెలింగ్

రాష్ట్రాల స్థాయిలో హెల్త్ యూనివర్సిటీలు నిర్వహించే స్టేట్ కోటా సీట్ల కౌన్సెలింగ్‌కు విద్యార్థులు ప్రత్యేకంగా దరఖాస్తు చేసుకోవాలి. ఎంసీసీ కౌన్సెలింగ్ తొలి రౌండ్ ముగిసిన తర్వాత హెల్త్ యూనివర్సిటీలు ప్రత్యేకంగా నోటిఫికేషన్ విడుదల చేస్తాయి. ఈ కౌన్సెలింగ్ కూడా పలు రౌండ్లలో జరుగుతుంది. స్టేట్ కోటాకు దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులకు సంబంధించి వారికి వచ్చిన ఆల్ ఇండియా ర్యాంకు ఆధారంగా ముందుగా ప్రొవిజనల్ మెరిట్ లిస్ట్‌ను ప్రకటిస్తారు. ఈ మెరిట్ లిస్ట్‌లో చోటు సాధించిన అభ్యర్థులు నిర్దేశిత రిజిస్ట్రేషన్ ఫీజును చెల్లించి.. ఆన్‌లైన్‌లో జాయినింగ్ రిపోర్ట్ ఇవ్వాల్సి ఉంటుంది. తదుపరి రౌండ్ల కౌన్సెలింగ్‌కు హాజరయ్యే అవకాశం కూడా ఉంటుంది.

పూర్తిగా ఆన్‌లైన్

హెల్త్ యూనివర్సిటీలు నిర్వహించే కౌన్సెలింగ్ ప్రక్రియ కూడా ఆన్‌లైన్ విధానంలోనే ఉంటుంది. అభ్యర్థులు నోటిఫికేషన్ వెలువడిన తర్వాత నిర్దేశించిన వెబ్‌సైట్‌లో లాగిన్ ఐడీ, పాస్‌వర్డ్ క్రియేట్ చేసుకోవడం, ఆ తర్వాత నీట్ ర్యాంకు సహా, ఇంటర్మీడియెట్ వరకూ.. అన్ని అర్హతల వివరాలను పేర్కొనడం, ఆన్‌లైన్ ఛాయిస్ ఫిల్లింగ్ తప్పనిసరి.

ప్రభుత్వ కళాశాలలకే ప్రాధాన్యం

నీట్‌లో ఉత్తీర్ణత సాధించి మెరిట్ జాబితాలో నిలిచిన అభ్యర్థులు ప్రభుత్వ కళాశాలలకే ప్రాధాన్యం ఇస్తున్నారు. ఆంధ్రప్రదేశ్‌లో ఏఎంసీ–విశాఖపట్నం, జీఎంసీ–గుంటూరు, కాకినాడ మెడికల్ కాలేజ్, కర్నూలు మెడికల్ కళాశాలలు ముందు వరుసలో నిలుస్తున్నాయి. తెలంగాణలో.. ర్యాంకర్ల తొలి ప్రాధాన్యం ఉస్మానియా మెడికల్ కళాశాల కాగా ఆ తర్వాత స్థానంలో గాంధీ మెడికల్ కళాశాల, కాకతీయ మెడికల్ కళాశాల, ఈఎస్ఐ మెడికల్ కళాశాల నిలుస్తున్నాయి.

ఈ సర్టిఫికెట్లు సిద్ధంగా

నీట్ కౌన్సెలింగ్ ప్రక్రియ మరికొద్ది రోజుల్లో ప్రారంభమయ్యే అవకాశం ఉంది. కాబట్టి విద్యార్థులు ఇప్పటి నుంచే కౌన్సెలింగ్‌కు అవసరమైన పత్రాలు, సర్టిఫికెట్లు సిద్ధం చేసుకోవాలి. అవి.. నీట్ ఎంట్రన్స్ అడ్మిట్ కార్డ్, నీట్ ర్యాంక్ కార్డ్, పుట్టిన తేదీ ధ్రువపత్రం, పదో తరగతి సర్టిఫికెట్, ఇంటర్మీడియెట్ తత్సమాన కోర్సు మార్క్ షీట్, సర్టిఫికెట్, ఆరో తరగతి నుంచి ఇంటర్మీడియెట్ వరకు స్టడీ సర్టిఫికెట్స్(స్థానికతను నిర్ధారించేందుకు), పాస్‌పోర్ట్ సైజ్ ఫొటోగ్రాఫ్స్ ఎనిమిది. ఇలా కౌన్సెలింగ్ విధానంతోపాటు అవసరమైన అన్ని సర్టిఫికెట్లను సిద్ధంగా ఉంచుకుంటే.. కౌన్సెలింగ్ ఎప్పుడు జరిగినా తడబాటులేకుండా ముందుకు సాగే అవకాశం ఉంటుంది.

సాక్షి ప్రాఫిట్ ప్లస్
సోమవారం
24-6-2024

స్టాక్ మార్కెట్లు (శుక్రవారం ముగింపు)

దేశీ సూచీలు		
సెన్సెక్స్ ▽	269	77,210
నిఫ్టీ ▽	66	23,501

మరిన్ని బిజినెస్ వార్తల కోసం 'సాక్షి ప్లస్' చూడండి

విదేశీ సూచీలు			
నాస్‌డాక్	17,689	▽	32
డోజోన్స్	39,150	△	16
ఎఫ్‌టీఎస్ఈ 100	8,238	▽	35
డాక్స్	18,164	▽	91
షాంఘై	2,998	▽	7
నికాయ్	38,596	▽	37

అమెరికా • బ్రిటన్ • జర్మనీ • చైనా • జపాన్

ఫారెక్స్ రేట్లు రూ.లలో

			కొనుగోలు	అమ్మకం
$	యూఎస్ డాలర్	ఎస్‌బీఐ	83.19	84.21
£	బ్రిటన్ పౌండ్	ఎస్‌బీఐ	104.69	107.24
€	యూరో	ఎస్‌బీఐ	88.51	90.89
¥	జపాన్ ఎన్ (100)	ఎస్‌బీఐ	52.10	53.24
AUS	ఆస్ట్రేలియా డాలర్	ఎస్‌బీఐ	54.83	56.77
S$	సింగపూర్ డాలర్	ఎస్‌బీఐ	59.33	64.02
SAR	సౌదీ రియాల్	థామస్‌కుక్	21.38	22.94
UAE D	యూఏఈ దిర్హామ్	థామస్‌కుక్	21.86	23.64
¥	చైనా యువాన్	థామస్‌కుక్	10.38	12.46

గ్రాట్యుటీ.. ఉద్యోగి సేవలకు గుర్తింపు!



- ఒక సంస్థలో ఐదేళ్ల సర్వీస్‌తో అర్హత
- కొన్ని కేటగిరీలకు భిన్నమైన నిబంధనలు
- సకాలంలో చెల్లించకపోతే వడ్డీ సైతం..
- ఎంతొస్తుందన్న దానిపై అవగాహన అవసరం

ప్రైవేటు రంగంలో ప్రతి ఒక్కరికీ ఉద్యోగ భద్రత ఉంటుందని చెప్పలేం. అదే సమయంలో ఉద్యోగి తన వ్యక్తిగత, వృత్తిపరమైన అవసరాల దృష్ట్యా ఒక సంస్థ నుంచి మరో సంస్థకు మారిపోవడం సహజంగా చూస్తుంటాం. కారణాలు ఏవైనా కానీ ఉద్యోగం వీడితే వచ్చే ప్రయోజనాల గురించి ప్రతి ఒక్కరికీ అవగాహన ఉండాలి. ఉద్యోగం నుంచి వైదొలగినప్పుడు వచ్చే ప్రయోజనాల్లో గ్రాట్యుటీ కీలకమైనది. ఉద్యోగి పనిచేసిన కాలంపై ఇది ఆధారపడి ఉంటుంది. గ్రాట్యుటీ చెల్లింపుల చట్టం 1972 ఇందుకు ప్రామాణికం. చట్టంలోని నిబంధనలపై అవగాహన కల్పించే కథనమే ఇది.



ఇవి తెలుసుకోవాలి..

- పనిచేసిన కాలం ఆరు నెలలు దాటి ఒక్క రోజు ఉన్నా దాన్ని పూర్తి సంవత్సరం కింద గ్రాట్యుటీ చెల్లింపులకు పరిగణనలోకి తీసుకుంటారు.
- ఉద్యోగి దుష్ప్రవర్తన కారణంగా సంస్థ తొలగించినప్పుడు గ్రాట్యుటీ ఇవ్వక్కర్లేదు.
- ఉద్యోగి మరణించిన సందర్భాల్లో నామినీ లేదా వారసులకు గ్రాట్యుటీ చెల్లిస్తారు.
- సంస్థలు దివాలా తీసినప్పటికీ గ్రాట్యుటీ చెల్లించాల్సిన బాధ్యత వాటిపై ఉంటుంది.
- నోటీస్ పీరియడ్ కూడా గ్రాట్యుటీ లెక్కింపు పరిధిలోకి వస్తుంది.
- మూడేళ్ల సర్వీస్ పూర్తి చేసుకుంటే గ్రాట్యుటీకి అర్హత కల్పించాలన్న డిమాండ్ కేంద్ర ప్రభుత్వం పరిశీలనలో ఉంది.


గ్రాట్యుటీ అంటే..?



ఉద్యోగి సేవలను గుర్తిస్తూ సంస్థ అందించే ఆర్థిక ప్రయోజనమే గ్యాట్యుటీ. ఎన్నో ఏళ్లుగా సంస్థ అభ్యున్నతి కోసం సేవలు అందించే ఉద్యోగుల పట్ల చూపించే కృతజ్ఞత. ఇది వేతనంలో భాగం కాదు. ప్రతి ఒక్కరూ దీనికి అర్హులే. కానీ, ఇందుకు అర్హత సాధించాలంటే గ్రాట్యుటీ చెల్లింపుల చట్టం, 1972లో నిబంధనలకు అనుగుణంగా ఉద్యోగి సేవలు ఉండాలి. కనీసం ఐదేళ్ల సర్వీస్ (పని చేసిన కాలం) పూర్తి చేసుకున్న వారికే దీన్ని పొందే అర్హత లభిస్తుంది. ఎన్నో రంగాలకు ఈ చట్టం అమలవుతోంది. ప్రభుత్వ విభాగాలు, డిఫెన్స్, స్థానిక సంస్థల ఉద్యోగులు, ప్రైవేటు సంస్థల ఉద్యోగులు దీని పరిధిలోకి వస్తారు.

ఎన్నేళ్లు పనిచేయాలి?

గడిచిన ఏడాది కాలం పాటు కనీసం 10 మంది ఉద్యోగులు కలిగిన సంస్థలకు గ్రాట్యుటీ చెల్లింపుల చట్టం వర్తిస్తుంది. ఆయా సంస్థలు తమ ఉద్యోగులకు నిబంధనలకు అనుగుణంగా గ్రాట్యుటీని అందించాల్సి ఉంటుంది. మైనింగ్ విధుల్లో ఉన్న ఉద్యోగులకు కనీసం 190 పని దినాలు, నాన్ మైనింగ్ విధుల్లోని వారికి 240 పనిదినాలు ఏడాది కింద పరిగణిస్తారు. కనీసం ఐదేళ్ల పాటు అంతరాయం లేకుండా సేవలు అందించిన ఉద్యోగులు అందరూ గ్రాట్యుటీకి అర్హులు. సమ్మెలు, లాకౌట్‌లు, ప్రమాదాలు, సెలవులు, తాత్కాలిక తొలగింపు వల్ల గైర్హాజరుకు మినహాయింపులు ఉంటాయి. ఐదేళ్ల సర్వీస్ పూర్తి కాకముందే సంస్థ తొలగించిన సందర్భంలోనూ ఉద్యోగికి గ్రాట్యుటీ చెల్లించాల్సిందే. వారంలో ఆరు పనిదినాలు అమలు చేసే కంపెనీల్లో 4 ఏళ్ల 240 రోజులు పనిచేసినా గ్రాట్యుటీకి అర్హత లభిస్తుంది. వారంలో ఐదు రోజుల పనిదినాలున్న కంపెనీల్లోని వారు 4 ఏళ్ల 190 రోజులు పనిచేస్తే అర్హులు. కొన్ని రంగాల్లోని వారికి ఈ కనీస పదవీ కాలం భిన్నంగా ఉంటుంది. న్యూస్ పేపర్ ఎంప్లాయీస్ అండ్ మిస్‌లేనియస్ ప్రొవిజన్స్ యాక్ట్ కింద పనిచేసే వర్కింగ్ జర్నలిస్టులకు పదేళ్ల సర్వీస్ ఉంటేనే గ్రాట్యుటీకి అర్హత లభిస్తుంది.



ఉద్యోగి మరణించినా లేదా వైకల్యం కారణంగా విధుల నుంచి తొలగించినప్పుడు పనిచేసిన కాలంతో సంబంధం లేకుండా గ్రాట్యుటీ చెల్లించాలని నిబంధనలు స్పష్టం చేస్తున్నాయి. గ్రాట్యుటీ అనేది కేవలం పదవీ విరమణ వయసుకు వచ్చినప్పుడే కాకుండా.. స్వచ్ఛంద పదవీ విరమణ తీసుకున్నప్పుడు, ఉద్యోగి తప్పిదం లేకుండా తొలగించినప్పుడు, రాజీనామా చేసినప్పుడు ఇవ్వాల్సి ఉంటుందని లెక్స్‌లెవర్ సర్వీసెస్ డైరెక్టర్ హర్షిత అగర్వాల్ శర్మ తెలిపారు.

పరిమితి

గ్రాట్యుటీ గరిష్ట పరిమితి రూ.20 లక్షలు. నిబంధనల ప్రకారం సంస్థలు గరిష్టంగా ఇంతకు మించి ఇవ్వక్కర్లేదు. రూ.20లక్షలు మించితే అది ఎక్స్‌గ్రేషియా కిందకు వస్తుంది. ఎక్స్‌గ్రేషియా ఎంత ఇవ్వాలన్నది సంస్థల అభీష్టమే. ఇంత మేర ఇవ్వాలని నిబంధనలు చెప్పడం లేదు.

గ్రాట్యుటీ లెక్కింపు

చివరి నెల వేతనంలో మూల వేతనం, డీఏ ఎంతో తెలుసుకోవాలి. ఇలా ఒక ఏడాదికి 15 రోజుల వేతనం గ్రాట్యుటీ కింద వస్తుంది. మొత్తం పనిచేసిన సంవత్సరాలు ఇంటూ 15 రోజులు ఇంటూ చివరిగా అందుకున్న మూల వేతనం, డీఏ డివైడ్ 26(నెలలో పనిచేసిన రోజులు) సూత్రం అమలవుతుంది. ఆరు నెలలు దాటిన కాలాన్ని పూర్తి ఏడాదిగా పరిగణిస్తారు. ఉదాహరణకు ఎక్స్ అనే వ్యక్తి 12 సంవత్సరాల పాటు ఒక కంపెనీలో పనిచేసినట్టు అనుకుందాం. చివరిగా అందుకున్న మూల వేతనం, డీఏ కలిపి రూ.75,000. దీంతో ఎక్స్‌కు వచ్చే మొత్తం గ్రాట్యుటీ రూ.5,19,230. గ్రాట్యుటీ చట్టం పరిధిలోకి రాని వారికి ఇచ్చే గ్రాట్యుటీ ఫార్ములా కొంత భిన్నం. ఏడాదిలో 15 రోజులు ఇంటూ చివరి నెలలో మూల వేతనం, డీఏ ఇంటూ పనిచేసిన సంవత్సరాలు డివైడ్ 30(నెలలో పనిచేసిన రోజులు). పూర్తి ఏడాది పాటు పనిచేసిన కాలాన్నే వీరికి ఏడాది కింద పరిగణిస్తారు. దీని ప్రకారం ఎక్స్ అనే వ్యక్తి ఒక సంస్థలో 12 ఏళ్లు పనిచేసి, చివరి నెలలో మూలవేతనం, డీఏ కింద రూ.75,000 తీసుకున్నారని అనుకుంటే.. వచ్చే గ్రాట్యుటీ రూ.4,50,000.

ఆలస్యం అయితే



విధుల నుంచి వైదొలగిన 30 రోజుల్లోపు గ్రాట్యుటీ చెల్లించాలి. ఇంతకుమించి జాప్యం చేస్తే ఆ మొత్తంపై వడ్డీ కూడా చెల్లించాలని నిబంధనలు స్పష్టం చేస్తున్నాయి. ఉద్యోగికి గ్రాట్యుటీ ప్రయోజనం అన్నది పనిచేసిన కాలం ఆధారంగానే అర్హత ఉండాలి కానీ, రిటైర్మెంట్ వయసు ఆధారం కాకూడదని ఇటీవలే అలహాబాద్ హైకోర్టు తీర్పునిచ్చింది. ''60 ఏళ్లకు రిటైర్మెంట్ తీసుకుంటేనే గ్రాట్యుటీ, లేకపోతే అర్హత లేదన్నది సరైనది కాదు. ఒక ఉద్యోగి ఎన్ని సంవత్సరాల పాటు పనిచేశాడన్న దాని ఆధారంగా గ్రాట్యుటీ హక్కు లభిస్తుంది''అని అలహాబాద్ సింగిల్ జడ్జి ధర్మాసనం ఓ కేసులో భాగంగా తీర్పు జారీ చేసింది.

పన్ను బాధ్యత

గ్రాట్యుటీపై పన్ను విషయంలో ప్రభుత్వ లేదా ప్రైవేటు రంగ ఉద్యోగులకు నిబంధనల్లో వ్యత్యాసం ఉంది. ప్రభుత్వ ఉద్యోగి ఎవరికైనా (కేంద్ర, రాష్ట్ర, స్థానిక సంస్థల) సరే గ్రాట్యుటీ ఎంత అందుకున్నా పన్ను లేదు. ప్రైవేటు రంగంలో పనిచేస్తున్న వారికి రూ.20 లక్షలు లేదా, చివరి 15 రోజుల వేతనాన్ని పనిచేసిన సంవత్సరాలతో హెచ్చించినప్పుడు వచ్చే మొత్తం, వాస్తవంగా అందుకున్న గ్రాట్యుటీ.. వీటిల్లో ఏది తక్కువ అయితే ఆ మొత్తానికి పన్ను మినహాయింపు ఉంటుంది. ఆదాయపన్ను చట్టంలోని సెక్షన్ 10(10) కిందకు గ్రాట్యుటీ వస్తుంది. గతంలో రూ.10 లక్షల వరకు గ్రాట్యుటీపై పన్ను ఉండేది కాదు. ఈ పరిమితిని మోదీ సర్కారు రూ.20 లక్షలకు పెంచింది.



ఎస్‌బీఐ నుంచి 400 కొత్త శాఖలు

బ్యాంక్ చైర్మన్ దినేష్ ఖరా



న్యూఢిల్లీ: దేశంలోనే దిగ్గజ బ్యాంక్ అయిన ఎస్‌బీఐ తన నెట్‌వర్క్ విస్తరణకు ప్రాధాన్యం ఇస్తోంది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో కొత్తగా 400 శాఖలు తెరవనున్నట్టు సంస్థ చైర్మన్ దినేష్ ఖరా వెల్లడించారు. గత ఆర్థిక సంవత్సరంలో (2023-24) ఎస్‌బీఐ 137 కొత్త శాఖలను ప్రారంభించడం గమనార్హం. ఇందులో 59 శాఖలు గ్రామీణ ప్రాంతాల్లోనే ఉన్నాయి. ''89 శాతం డిజిటల్, 98 శాతం లావాదేవీలు శాఖల వెలుపలే జరుగుతున్నప్పుడు ఇకమీదట శాఖల అవసరం ఉంటుందా? అని నన్ను ఒకరు ప్రశ్నించారు. ఇందుకు అవునన్నదే నా సమాధానం. కొత్త విభాగాలు అవతరిస్తున్నప్పుడు శాఖల అవసరం ఉంటుంది''అని దినేష్ ఖరా వివరించారు. అడ్వైజరీ (సలహాలు), పెట్టుబడుల సేవలను శాఖల ద్వారానే అందించగలమన్నారు. అవకాశాలున్న చోట శాఖలు ప్రారంభిస్తామని స్పష్టం చేశారు. 2024 మార్చి నాటికి ఎస్‌బీఐకి దేశవ్యాప్తంగా 22,542 శాఖలున్నాయి.

సరైన సమయంలో సబ్సిడరీల ఐపీవోలు

ఎస్‌బీఐ సబ్సిడరీ కంపెనీల్లో వాటాల విక్రయాన్ని సరైన సమయంలో చేపడతామని దినేష్ ఖరా వెల్లడించారు. సబ్సిడరీల కార్యకలాపాలు మరింత విస్తరించిన తర్వాతే దీన్ని పరిశీలిస్తామన్నారు. దీని వల్ల వాటి విలువ పెరిగి, ఎస్‌బీఐకి మెరుగైన రాబడులు వస్తాయన్నారు. క్యాపిటల్ మార్కెట్ (ఐపీవో) మార్గంలోనే వాటాల విక్రయం ఉంటుందన్నారు. ఎస్‌బీఐ జనరల్ ఇన్సూరెన్స్, ఎస్‌బీఐ పేమెంట్ సర్వీసెస్ వాటాల విక్రయానికి అర్హత కలిగినవంటూ.. వీటికి సంబంధించి ప్రస్తుతానికి అయితే ఎలాంటి వాటాల విక్రయ ప్రతిపాదన లేదన్నారు.

కోడిగుడ్లు (హోల్‌సేల్-నెక్ / 100కు రూ.లలో)

24-6-2024	
విశాఖ	525-00
చిత్తూరు	573-00
ఈస్ట్, వెస్ట్ గోదావరి	515-00
విజయవాడ	515-00
హైదరాబాద్	515-00
వరంగల్	517-00

క్వాంట్ ఫండ్ కార్యాలయాల్లో సెబీ సోదాలు

ముంబై: ఫ్రంట్ రన్నింగ్ కేసులను తీవ్రంగా పరిగణిస్తున్న మార్కెట్ల నియంత్రణ సంస్థ సెబీ తాజాగా క్వాంట్ మ్యుచువల్ ఫండ్‌పై దృష్టి సారించింది. కంపెనీకి చెందిన హైదరాబాద్, ముంబై కార్యాలయాల్లో సోదాలు నిర్వహించినట్లు సమాచారం. ఈ కేసుతో సంబంధమున్న డీలర్లు, వ్యక్తులను కూడా సెబీ ప్రశ్నించినట్లు సంబంధిత వర్గాలు తెలిపాయి. సందీప్ టాండన్ నెలకొల్పిన క్వాంట్ మ్యుచువల్ ఫండ్ అసెట్లు 2019లో సుమారు రూ. 100 కోట్లుగా ఉండగా.. ప్రస్తుతం రూ. 90,000 కోట్ల పైచిలుకు చేరాయి. 26 స్కీములు, 54 లక్షల పోలియోలతో ఈ ఫండ్ ఈ ఏడాది జనవరిలోనే రూ. 50,000 కోట్ల మార్కును దాటింది. సంస్థకి చెందిన స్మాల్ క్యాప్ ఫండ్ గత అయిదేళ్లలో ఏకంగా 45 శాతం రాబడిని అందించింది. మే నెలలో స్మాల్ క్యాప్ ఫండ్ కేటగిరీలోకి వచ్చిన మొత్తం నిధులలో 43 శాతం నిధులు క్వాంట్ స్మాల్ క్యాప్ ఫండ్‌లోకే రావడం గమనార్హం. పెద్ద ఆర్డర్లు రాబోతున్న సమాచారం తెలుసుకుని ఫండ్ మేనేజర్లు, డీలర్లు, బ్రోకర్లు ముందుగానే తమ సొంత ఖాతాల ద్వారా ఆయా షేర్లలో ట్రేడింగ్ చేసి లాభపడటాన్ని ఫ్రంట్ రన్నింగ్‌గా వ్యవహరిస్తారు. ఇలాంటి లావాదేవీలన్నీ వేరే వారి పేరిట ఉండే ఖాతాల ద్వారా జరుగుతాయి కాబట్టి అంతిమంగా లబ్ధి పొందే వ్యక్తులను గుర్తించడం కఠినతరంగా ఉంటోంది. దీంతో సెబీ కొన్నాళ్లుగా ఈ తరహా కేసులపై మరింత లోతుగా విచారణ జరుపుతోంది. ఇలాంటి ఆరోపణలపైనే యాక్సిస్ మ్యుచువల్ ఫండ్‌కి చెందిన ఫండ్ మేనేజర్ వీరేశ్ జోషితో పాటు అతనికి సంబంధించిన 20 సంస్థలు, వ్యక్తులపై సెబీ గతంలో చర్యలు తీసుకుంది.


కోటక్ స్పెషల్ ఆపర్చూనిటీస్ ఫండ్



కోటక్ మహీంద్రా అసెట్ మేనేజ్‌మెంట్ కంపెనీ కొత్తగా స్పెషల్ ఆపర్చూనిటీస్ ఫండ్‌ను (ఎస్‌వోఎఫ్) ఆవిష్కరించింది. ఈ ఎన్‌ఎఫ్‌వో జూన్ 24తో ముగుస్తుంది. కార్పొరేట్ రీస్ట్రక్చరింగ్, ప్రభుత్వ విధానాల్లో మార్పులు, టెక్నాలజీ మార్పులు వంటి ప్రత్యేక సందర్భాల నుంచి లబ్ధి పొందే కంపెనీల్లో ఇన్వెస్ట్ చేయడం ద్వారా మెరుగైన రాబడులు అందించడం ఈ ఫండ్ లక్ష్యం. పరిశ్రమలో కన్సాలిడేషన్లు, మేనేజ్‌మెంట్ మార్పులు, విలీనాలు.. కొనుగోళ్ల వంటి పరిణామాలతో కంపెనీల పనితీరు ప్రభావితం అవుతుంటుంది. అలాంటి పరిస్థితుల్లో సానుకూల ప్రభావాలు ఉండే కంపెనీల్లో పెట్టే పెట్టుబడులతో మదుపరులకు అధిక లబ్ధి చేకూర్చాలనేది ఈ ఫండ్ లక్ష్యమని ఫండ్ మేనేజర్ సింఘాల్ తెలిపారు.

ఎస్‌జీబీల్లో సిప్ చేయొచ్చా?

Q & A



ధీరేంద్ర కుమార్
సీఈవో, వ్యాల్యూ రీసెర్చ్

ఇన్వెస్టర్ మరణించిన సందర్భాల్లో ఎన్‌పీఎస్ పథకంలోని డబ్బులను వారసులు ఎలా పొందగలరు? ఈ మొత్తంపై పన్ను బాధ్యత ఉంటుందా?

– శరవణన్ గోపాలన్

ఇన్వెస్టర్ మరణించినట్టయితే నిధుల బదలాయింపు ఎలా అన్నది ఎన్‌పీఎస్ చట్టంలోని నిబంధనల్లో స్పష్టంగా ఉంది. ప్రభుత్వ ఉద్యోగులు అయితే.. ఎన్‌పీఎస్‌లో ఫండ్ (నిధి) రూ.5 లక్షల వరకే ఉంటే నామినీ లేదంటే చట్టబద్ధమైన వారసులు ఒకే విడతఈ మొత్తాన్ని క్లెయిమ్ చేసుకోవచ్చు. దీనిపై పన్ను ఉండదు. ఒకవేళ మరణించిన ఎన్‌పీఎస్ సభ్యుడు ప్రభుత్వ ఉద్యోగి అయి, ఫండ్ రూ.5లక్షలకు మించి ఉంటే.. అప్పుడు నామినీ లేదంటే చట్టబద్ధమైన వారసులు మొత్తం నిధిలో 80 శాతంతో యాన్యుటీ ప్లాన్ కొనుగోలు చేయాల్సి ఉంటుంది. అంటే సభ్యుడి ఎన్‌పీఎస్ ఖాతాలో ఉన్న బ్యాలన్స్ నుంచి 20 శాతాన్నే వెనక్కి తీసుకోగలరు. ఈ మొత్తంపై పన్ను ఉండదు. మిగిలిన 80 శాతం నిధితో బీమా సంస్థ నుంచి యాన్యుటీ ప్లాన్ కొనుగోలు చేస్తే, దానిపై ప్రతి నెలా రాబడి వస్తుంది. ఇది పన్ను పరిధిలోకి వస్తుంది. ఒకవేళ ఎన్‌పీఎస్‌లో ప్రభుత్వ ఉద్యోగి కాని సభ్యుడు/సభ్యురాలు మరణించిన సందర్భంలో ఖాతాలో ఉన్న నిధి మొత్తాన్ని నామినీ లేదంటే వారసులు పూర్తిగా వెనక్కి తీసుకోవడానికి అనుమతిస్తారు. దీనిపై పన్ను కూడా లేదు. ప్రతి నెలా ఆదాయాన్నిచ్చే యాన్యుటీ ప్లాన్ తీసుకోవడం స్వచ్ఛందమే. కేవలం ప్రభుత్వ ఉద్యోగులకు సంబంధించే 80 శాతం నిధితో యాన్యుటీ ప్లాన్ అన్నది నిర్బంధం. ఒకవేళ ఎన్‌పీఎస్‌లో 60 ఏళ్ల తర్వాత చేరిన సభ్యుడు/ సభ్యురాలు మరణించిన సందర్భాల్లో అందులో ఉన్న మొత్తం నిధిని నామినీ లేదంటే వారసులు వెనక్కి తీసుకోవచ్చు. క్లెయిమ్ కోసం సభ్యుడి డెత్ సర్టిఫికెట్‌ను పాయింట్ ఆఫ్ ప్రెజెన్స్ (పీవోపీ) కేంద్రం లేదా ఎన్‌పీఎస్ ట్రస్ట్‌కు సమర్పించాలి. పీవోపీ నుంచి లేదంటే ఎన్‌పీఎస్ వెబ్‌సైట్ నుంచి క్లెయిమ్ ఫారమ్‌ను డౌన్‌లోడ్ చేసుకుని, అందులో వివరాలు నింపి ఇవ్వాల్సి ఉంటుంది. క్లెయిమ్ చేసే వారి సొంత కేవైసీ డాక్యుమెంట్లు సమర్పించాలి. బ్యాంక్ ఖాతా వివరాలు కూడా ఇవ్వాలి. వారసులు అయితే మరణించిన వ్యక్తితో సంబంధాన్ని నిరూపించే లీగల్ హేర్ సర్టిఫికెట్ సమర్పించాలి. నామినీ నమోదు చేయని సందర్భాల్లో వారసులకే నిధిపై హక్కు ఉంటుంది.



మ్యూచువల్ ఫండ్స్ మాదిరే సావరీన్ గోల్డ్ బాండ్స్ (ఎస్‌జీబీలు)లో సిస్టమ్యాటిక్ ఇన్వెస్ట్‌మెంట్ ప్లాన్ (సిప్) రూపంలో పెట్టుబడులు పెట్టుకోవచ్చా?

– శ్రీకళ

ఎస్‌జీబీల్లో సిప్‌కు అవకాశం లేదు. కావాలంటే క్రమానుగతంతో స్టాక్ మార్కెట్లో ఈ బాండ్లను (వేరొకరు విక్రయించిన సందర్భాల్లో) కొనుగోలు చేసుకోవచ్చు. అలాగే, ప్రభుత్వం విడుదల చేసిన ప్రతి సిరీస్‌లోనూ ఎస్‌జీబీల్లో ఇన్వెస్ట్ చేసుకోవడం ఒక మార్గం. ప్రతి ఆర్థిక సంవత్సరంలో కేంద్ర ప్రభుత్వం నాలుగు పర్యాయాలు ఎస్‌జీబీలను జారీ చేస్తుంటుంది. ఆ సమయంలో నేరుగా వాటిల్లో ఇన్వెస్ట్ చేసుకోవచ్చు. ప్రతి నెలా కొనుగోలు చేసుకోవాలనుకునే వారికి స్టాక్ మార్కెట్ ఒక్కటే మార్గం. స్టాక్ మార్కెట్లో కొనుగోలు చేసినప్పటికీ.. కాల వ్యవధి ముగిసే వరకు ఆ పెట్టుబడిని కొనసాగిస్తే లాభంపై పన్ను ఉండదు. అలాగే ఎస్‌జీబీ జారీ ధరపై ఏటా 2.5 శాతం చొప్పున వడ్డీ రాబడిని ఆరు నెలలకు ఒకసారి అందుకోవడానికి అర్హులే.

యథార్థ్ హాస్పిటల్స్ | చాయిస్ బ్రోకింగ్ | కొనొచ్చు

ప్రస్తుత ధర: రూ. 419 టార్గెట్: రూ. 525


ఎందుకంటే: ప్రయివేట్ రంగ సంస్థ యథార్థ్ హాస్పిటల్ అండ్ ట్రౌమా కేర్ సర్వీసెస్ ఆర్థిక ఫలితాలకు సంబంధించి వివిధ కీలక అంశాలలో పటిష్ట పనితీరు చూపుతోంది. గతేడాది(2023-24) చివరి క్వార్టర్‌లో వార్షికంగా కన్సాలిడేటెడ్ ఆదాయంలో దాదాపు 24 శాతం వృద్ధిని అందుకుంది. క్యూ4(జనవరి-మార్చి)లో తొలిసారి రూ. 1,780 కోట్ల ఆదాయం సాధించింది. నిర్వహణ లాభం(ఇబిటా) సైతం 21 శాతం పురోగతిని చూపింది. అయితే మార్జిన్లు స్వల్పంగా 0.58 శాతం క్షీణించి 26.2 శాతానికి చేరాయి. నికర లాభం వార్షికంగా 122 శాతం దూసుకెళ్లగా.. త్రైమాసిక వారీగా సైతం 30 శాతం ఎగసి రూ. 384 కోట్లను తాకింది. ప్రధానంగా పన్ను రేటు తగ్గడం సానుకూల ప్రభావాన్ని చూపింది. ప్రస్తుతం చేపట్టిన స్పెషాలిటీ సర్వీసుల పెంపు(మిక్స్), రానున్న మూడేళ్లలో పడకల సామర్థ్యాన్ని రెట్టింపు చేయనుండటం వంటి అంశాలు భవిష్యత్ వృద్ధికి తోడ్పాడునివ్వనున్నాయి. అంతేకాకుండా ఇతర సంస్థల కొనుగోళ్ల ద్వారా పడకలను(బెడ్స్) పెంచుకునే వ్యూహాలు, అంతర్జాతీయ పేషెంట్ల వాటా పెరుగుతుండటం, నగదు ద్వారా చెల్లింపులకు ప్రాధాన్యత ఇవ్వడం తదితర ప్రణాళికలు అమలు చేస్తోంది. వెరసి రానున్న రెండు, మూడేళ్లలో కనీసం 200 పడకల సామర్థ్యంగల ఒక సంస్థనైనా చేజిక్కించుకునే లక్ష్యంతో ఉంది. ఇందుకు కేంద్రపాలిత ప్రాంతం(ఎన్‌సీఆర్) మినహా ఉత్తరాది మార్కెట్‌పై దృష్టి పెట్టింది. దీనిలో భాగంగా ఒక్కో బెడ్ కొనుగోలుకీ సగటున రూ. 65-70 లక్షల చొప్పున వెచ్చించే అవకాశముంది. 2024-26 కాలంలో ఆదాయం 26 శాతం, ఇబిటా, నికర లాభం 27 శాతం చొప్పున వృద్ధి చెందవచ్చని అంచనా.



జేకే టైర్ | ఐసీఐసీఐ డైరెక్ట్ | కొనొచ్చు

ప్రస్తుత ధర: రూ. 398 టార్గెట్: రూ. 525

ఎందుకంటే: టైర్ల తయారీ కంపెనీ జేకే టైర్ అండ్ ఇండస్ట్రీస్ బ్యాలన్స్‌షీట్ అధిక రుణాలను కలిగి ఉంది. దేశీయంగా టైర్ల తయారీ రంగంలో రుణ సౌకర్యాలను కంపెనీ అధికంగా వినియోగిస్తోంది. 2019-20 ఆర్థిక సంవత్సరానికల్లా రూ. 5,400 కోట్ల నికర రుణ భారాన్ని మోస్తోంది. దీంతో నికర రుణాలు, ఈక్విటీ నిష్పత్తి 2.2 రెట్లుగా నమోదైంది. అయితే లాభదాయకత పుంజుకోవడం, నగదు ఆర్జన(క్యాష్‌ఫ్లో జనరేషన్)పై ప్రత్యేక దృష్టి పెట్టడం ద్వారా రుణాల తిరిగి చెల్లింపులను చేపడుతూ వచ్చింది. సమయానుగుణంగా ఈక్విటీ పెట్టుబడులకూ తెరతీసింది. వెరసి గతేడాది(2023-24)కల్లా నికర రుణ భారం రూ. 3,700 కోట్లకు దిగివచ్చింది. టైర్ల తయారీ కంపెనీల ముడిసరుకు వ్యయాలలో ప్రధానంగా రబ్బర్, ముడిచమురు డెరివేటివ్స్ అధిక వాటాను ఆక్రమిస్తాయి. దీంతో గత కొన్నేళ్లుగా దేశీ టైర్ల పరిశ్రమలో మార్జిన్లు హెచ్చుతగ్గులకు లోనవుతూ వచ్చాయి. ఫలితంగా ముడిసరుకుల ధరలు తగ్గినప్పుడు మెరుగుపడటం, ముడి వ్యయాలు పెరిగినప్పుడు మార్జిన్లు నీరసించడం వంటి ఆటుపోట్లను చవిచూస్తున్నాయి. దీనికితోడు సెకండరీ(ఆఫ్టర్) మార్కెట్లో తీవ్ర పోటీ కారణంగా టైర్ల కంపెనీల మార్జిన్లకు సవాళ్లు ఎదురవుతున్నాయి. అయితే ప్రస్తుతం టైర్ల పరిశ్రమ ప్రొడక్టుల ధరల విషయంలో అప్రమత్తంగా వ్యవహరిస్తోంది. ప్రస్తుతం జేకే టైర్ నికర రుణాలు, ఈక్విటీ నిష్పత్తి 0.8 రెట్లుకు దిగివచ్చింది. ఇది సానుకూల అంశం. మరోపక్క గతేడాది కంపెనీ చరిత్రలోనే అత్యధిక ఆదాయాన్ని సాధించింది. ఇబిటా, నికర లాభం దాదాపు 14 శాతం ఎగశాయి. దీంతో ఆర్‌వోఈ, ఆర్‌వోసీఈ రెండంకెలకు అంటే 17 శాతానికి బలపడ్డాయి.



గమనిక: ఈ కాలమ్‌లో షేర్లపై ఇచ్చిన సలహాలు వివిధ బ్రోకరేజ్ సంస్థలు వ్యక్తం చేసిన అభిప్రాయాలు మాత్రమే

క్లుప్తంగా...

దుర్గమ్మ సేవలో కర్ణాటక హైకోర్టు న్యాయమూర్తి


జస్టిస్ వి.శ్రీషానందకు అమ్మవారి చిత్రపటం అందజేస్తున్న ఈవో రామారావు

ఇంద్రకీలాద్రి(విజయవాడ పశ్చిమ): ఇంద్రకీలాద్రిపై కొలువై ఉన్న దుర్గమ్మను కర్ణాటక హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ వి.శ్రీషానంద ఆదివారం దర్శించుకున్నారు. అమ్మవారి దర్శనానికి విచ్చేసిన జస్టిస్ శ్రీషానందకు ఆలయ అధికారులు సాదరంగా స్వాగతం పలికి ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు జరిపించుకున్న అనంతరం వేద పండితులు ఆశీర్వచనం పలుకగా, ఆలయ ఈవో కె.ఎస్.రామారావు అమ్మవారి చిత్రపటం, ప్రసాదాలు, శేషవస్త్రాలను అందజేశారు.

విశాఖ తీరంలో ఉత్సాహంగా ఒలింపిక్ డే రన్


పరుగిడుతున్న ఔత్సాహిక చిన్నారులు

విశాఖ స్పోర్ట్స్: ఒలింపిక్ ఉద్యమ స్ఫూర్తిని ప్రపంచ వ్యాప్తంగా జరుపుకునే ఒలింపిక్ డే రన్ విశాఖ సాగరతీరంలో ఉత్సాహంగా సాగింది. ద ఒలింపిక్ అసోసియేషన్, విశాఖ శాఖ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించగా క్రీడాకారులు ఉత్సాహంగా పరుగు తీశారు. సంఘం చీఫ్ ప్యాట్రన్, ఎమ్మెల్యే పి.వి.జి.ఆర్.నాయుడు(గణబాబు) ఒలింపిక్ జ్యోతిని వెలిగించి ప్రారంభించారు. శాఖ అధ్యక్షుడు ప్రసన్నకుమార్ రన్ ప్రాముఖ్యత వివరించగా, కార్యదర్శి సూర్యనారాయణ పర్యవేక్షించారు. శాఖ కోశాధికారి మోహన్‌రామ్ అంతర్జాతీయంగా రాణించిన క్రీడాకారులను వేదికపైకి ఆహ్వానించగా అతిథులు ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా శిలభమ్ క్రీడాకారుల ప్రదర్శన అలరించింది. ఈ కార్యక్రమంలో డీఎస్‌డీవో జూన్ గాలియట్, ద్రోణాచార్య అవార్డు గ్రహీత ఐ.వెంకటేశ్వరరావు, మోహన్ రామ్ తదితరులు పాల్గొన్నారు.

బాబు తెచ్చిన ఆనవాయితీనే

- మాజీ ఎమ్మెల్యే సుధాకర్ బాబు
- పార్టీలకు భూములు కేటాయింపుల జీవోలిచ్చింది చంద్రబాబు సర్కారే
- ఆ ప్రకారమే దరఖాస్తు.. అన్ని అనుమతులతో మా కార్యాలయాల నిర్మాణం
- మంగళగిరి టీడీపీ ప్రధాన కార్యాలయానికి 33 ఏళ్లకు బదులు 99 ఏళ్ల లీజుకివ్వడం నిజం కాదా?


మంగళగిరిలోని టీడీపీ సెంట్రల్ ఆఫీస్ ఫొటో చూపిస్తున్న మాజీ ఎమ్మెల్యే టీజేఆర్ సుధాకర్‌బాబు

సాక్షి, అమరావతి: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయాలకు ప్రభుత్వ భూములు బదలాయించారన్న ఆరోపణల్లో నిజం లేదని మాజీ ఎమ్మెల్యే టీజేఆర్ సుధాకర్ బాబు స్పష్టం చేశారు. రాజకీయ పార్టీలకు భూముల కేటాయింపులకు ఆద్యుడు సీఎం చంద్రబాబేనని, ఆమేరకు జీవోలిచ్చింది ఆయన ప్రభుత్వమేనని గుర్తు చేశారు. అదే విధానాన్ని తరువాత ప్రభుత్వం కొనసాగించడంలో తప్పేముందని ప్రశ్నించారు. ఆదివారం తాడేపల్లిలోని వైఎస్సార్‌సీపీ కేంద్ర కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. రాజకోటలు కట్టుకున్నారని, వైఎస్ జగన్‌కు ప్యాలెస్‌ల పిచ్చి పట్టిందంటూ టీడీపీ విమర్శించడంపై తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తారు. తాము కట్టినవి ప్యాలెస్‌లు అయితే టీడీపీ నిర్మించినవి ఏమిటని నిలదీశారు. హైదరాబాద్‌లో కట్టిన ఎన్టీఆర్ ట్రస్టు భవనం ఏమైనా గుడిసెనా? అని ప్రశ్నించారు. పేద విద్యార్థులకు చదువు నేర్పేందుకు వినియోగిస్తామంటూ ప్రభుత్వానికి దరఖాస్తు చేసుకుని తర్వాత ఎన్టీఆర్ ట్రస్టుకు బదలాయించారన్నారు. ఆ ఆస్తి విలువ హైదరాబాద్ మార్కెట్ విలువ ప్రకారం ప్రస్తుతం రూ.1,000 కోట్లకుపైగా ఉంటుందన్నారు. మంగళగిరిలో హైవే పక్కన ఉన్న టీడీపీ కేంద్ర కార్యాలయం భూమి విలువే రూ.75 కోట్లు ఉంటుందన్నారు. టీడీపీ తమ పార్టీ కార్యాలయాల కోసం కేటాయించిన భూముల విలువ రూ.2 వేల కోట్లకు పైనే ఉంటుందన్నారు. గతంలో చంద్రబాబు ప్రభుత్వం ఇచ్చిన జీవో ప్రకారమే తమ పార్టీ కార్యాలయాలకు స్థలాల కోసం ప్రభుత్వానికి దరఖాస్తు చేసుకుని అన్ని అనుమతులతో నిర్మాణాలు చేపట్టామని స్పష్టం చేశారు. ఎక్కడా అక్రమ నిర్మాణాలు చేయలేదన్నారు. మీ తాత జాగీరా? అంటూ మంత్రి లోకేశ్ అనుచిత వ్యాఖ్యలు చేయటాన్ని తీవ్రంగా ఖండిస్తున్నట్లు చెప్పారు. అధికార మదంతో వ్యవహరిస్తే ప్రజలే తగిన గుణపాఠం చెబుతారన్నారు. పార్టీ కార్యాలయాలను బుల్డోజర్లతో కూల్చివేసే సంస్కృతిని ప్రజలు సహించరని హెచ్చరించారు. ఈ దుశ్చర్యలను వెంటనే ఆపాలని డిమాండ్ చేశారు. 40 శాతం మంది ప్రజలు తమ పార్టీకి ఓట్లు వేశారన్న సంగతి మర్చిపోవద్దన్నారు. ఎక్కడ లోపాలు జరిగాయో సరిదిద్ది వైఎస్ జగన్ మళ్లీ బలమైన రాజకీయ శక్తిగా అవతరిస్తారని ధీమా వ్యక్తం చేశారు. రాష్ట్రవ్యాప్తంగా టీడీపీ నిర్మించిన భారీ కార్యాలయాల ఫొటోలు, జీవోల కాపీలను ఈ సందర్భంగా సుధాకర్‌బాబు మీడియాకు విడుదల చేశారు.

➤ మంగళగిరిలో టీడీపీ కేంద్ర కార్యాలయానికి సర్వే నంబర్లు 392/1, 392/3, 392/4, 392/8, 392/9, 392/10లో జీవో నంబర్ 228 ద్వారా ఆత్మకూరు గ్రామంలో 2017 జూన్ 22న 3.65 ఎకరాలు కేటాయింపు. 33 ఏళ్ల మాత్రమే లీజుకు ఇవ్వాల్సిన భూములను 99 ఏళ్ల పాటు ఏటా రూ.1,000 చొప్పున లీజుకు ఇవ్వటం నిజం కాదా?

➤ వైఎస్సార్ కడప జిల్లా నాగార్జునపల్లిలో సర్వే నంబర్ 295/1ఎ, 1బిలో జీవో నంబర్ 279 కింద 2015 జూలై 20న 33 ఏళ్లకు ఏటా రూ.వెయ్యి లీజు చొప్పున కేటాయింపు.

➤ శ్రీకాకుళంలో సర్వే నంబర్ 700/1లో రెండు ఎకరాల భూమి 99 ఏళ్లకు ఏటా రూ.25 వేల చొప్పున లీజుకు కేటాయింపు.

➤ విజయనగరంలో సర్వే నంబర్ 15/క, అయ్యన్న పేట గ్రామంలో జీవో 195 ద్వారా 2018 ఏప్రిల్ 23న 33 ఏళ్లకు రూ.1000 చొప్పున ఒక ఎకరం భూమి కేటాయింపు.

➤ ఉమ్మడి గుంటూరు జిల్లా చిలకలూరిపేట మండలం పురుషోత్తపట్నం గ్రామంలో జీవో నంబర్ 197 ద్వారా 2018 ఏప్రిల్ 23న 20 సెంట్ల భూమి 33 ఏళ్లకు రూ.1000 చొప్పున లీజుకు కేటాయింపు.

➤ విజయవాడ అర్బన్ మండలం గుణదలలో జీవో నంబర్ 513 ద్వారా 2018 అక్టోబర్ 11న 95 సెంట్లు స్థలం 33 ఏళ్లకు రూ.1000 చొప్పున లీజుకు కేటాయింపు.

➤ ఉమ్మడి ప్రకాశం జిల్లా ఒంగోలు మండలం పెళ్లూరులో సర్వే నంబర్ 68/8లో జీవో నంబర్ 514 ద్వారా 2018 అక్టోబర్ 11న 33 ఏళ్లకు 1.96 ఎకరాల భూమి రూ.1000 చొప్పున లీజుకు కేటాయింపు.

➤ వైఎస్సార్ కడప జిల్లా అక్కాయపల్లి గ్రామంలో సర్వే నంబర్ 37/4లో జీవో 56 ద్వారా 2019 జనవరి 24న రెండు ఎకరాల భూమి 33 ఏళ్ల పాటు రూ.1000 చొప్పున లీజుకు కేటాయింపు.

➤ చిత్తూరు జిల్లా గుండ్లాపల్లి గ్రామంలో సర్వే నంబర్ 1/1బీ3లో జీవో 59 ద్వారా 2019 జనవరి 24న 1.20 ఎకరాల భూమి 33 ఏళ్ల పాటు ఏడాదికి రూ.1000 చొప్పున లీజుకు కేటాయింపు.

➤ శ్రీకాకుళం జిల్లా కొత్త అంబళ్లపల్లి మండలం కొత్తపేట గ్రామంలో సర్వే నంబర్ 106/3లో జీవో 63 ద్వారా 2019 జనవరి 24న 30 సెంట్ల భూమి 33 ఏళ్ల లీజుకు కేటాయింపు.

విశాఖ జూకు గుజరాత్ వన్యప్రాణులు

- ఒకటి, రెండు వారాల్లో రాక
- ఎన్‌క్లోజర్లు సిద్ధం చేస్తున్న అధికారులు
- సందర్శకులకు మరింత ఆనందం


స్క్విరల్ మంకీస్..


జూలో మీర్‌కాట్ కోసం నిర్మించిన ఎన్‌క్లోజర్..


స్కార్లెట్ మకావ్.


కామన్ మార్మో సెట్స్..


మీర్‌కాట్..

ఆరిలోవ: ఇందిరాగాంధీ జూ పార్కుకు కొద్ది రోజుల్లో గుజరాత్ రాష్ట్రం నుంచి మరికొన్ని కొత్త వన్యప్రాణులు రానున్నాయి. వీటి కోసం జూ అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. వీటిని ఇక్కడకు తీసుకురావడానికి జూ అథారిటీ ఆఫ్ ఇండియా(సీజెడ్ఏ) నుంచి అనుమతులు లభించాయి. కొన్నాళ్లుగా ఇందిరాగాంధీ జూలాజికల్ పార్కుకు ఇతర జూ పార్కుల నుంచి జంతు మార్పిడి విధానం ద్వారా కొత్త జంతువులు, అరుదైన పక్షులను తీసుకువస్తున్నారు. రెండు నెలల కిందట కోల్‌కతా రాష్ట్రం అలీపూర్ జూ పార్కు నుంచి జంతు మార్పిడి విధానం ద్వారా జత జిరాఫీలు, ఏషియన్ వాటర్ మానిటర్ లిజర్డ్స్, స్కార్లెట్ మకావ్స్ ఇక్కడకు తీసుకువచ్చిన విషయం తెలిసిందే. ఇప్పుడు ఆయా వన్యప్రాణులు జూలో సందర్శకులను అలరిస్తున్నాయి. మరికొన్ని వన్యప్రాణులను గుజరాత్ రాష్ట్రం జామ్‌నగర్‌లో రాధాకృష్ణ టెంపుల్ ఎలిఫెంట్ వెల్ఫేర్ ట్రస్ట్ నుంచి ఒకటి, రెండు వారాల్లో ఇక్కడకు తీసుకురానున్నారు. వాటి కోసం జూలో ఒక్కో జాతి జంతువులు, పక్షులు వేర్వేరుగా ఎన్‌క్లోజర్లు కూడా సిద్ధం చేశారు. ఆయా వన్యప్రాణులు చేరితే విశాఖ జూకి మరింత కొత్తదనం లభించనుంది.

కొత్తగా రానున్నవి ఇవే..

గ్రీన్ వింగ్డ్ మెకావ్ రెండు జతలు, స్కార్లెట్ మెకావ్స్ రెండు జతలు, మిలటరీ మెకావ్స్ రెండు జతలు, మీడియం సల్ఫర్ క్రెస్టెడ్ కాక్‌టూ రెండు జతలు, స్క్విరల్ మంకీస్ రెండు జతలు, కామన్ మార్మోసెట్స్ రెండు జతలు, మీర్‌కాట్ ఒక జత, రెడ్ నెక్డ్ వాల్లబీ ఒక జత కొత్తగా ఇక్కడకు తీసుకురానున్నారు.

ప్రత్యేక ఎన్‌క్లోజర్లు సిద్ధం



విశాఖ జూకు కొత్త వన్యప్రాణులు రానున్నాయి. గుజరాత్ రాష్ట్రం జామ్‌నగర్‌లో రాధాకృష్ణ టెంపుల్ ఎలిఫెంట్ వెల్ఫేర్ ట్రస్ట్ నుంచి వాటిని తీసుకురావడానికి అవసరమైన ఏర్పాట్లు పూర్తయ్యాయి. కొత్త వన్యప్రాణుల కోసం ప్రత్యేకంగా ఎన్‌క్లోజర్లు సిద్ధం చేశాం.
–డి.మంగమ్మ, జూక్యూరేటర్(ఎఫ్‌ఏసీ), ఇందిరాగాంధీ జూ పార్కు, విశాఖపట్నం

చిరంజీవిని కలిసిన బండి సంజయ్

- ఆప్యాయంగా ఆలింగనం చేసుకుని శాలువాతో సత్కరించిన చిరంజీవి
- మర్యాదపూర్వకంగానే కలిశా: బండి

సాక్షి, హైదరాబాద్: సినీ హీరో చిరంజీవిని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కలుసుకున్నారు. ఆదివారం రాత్రి జూబ్లీహిల్స్‌లోని చిరంజీవి నివాసంలో ఆయనను కలిశారు. ఈ సందర్భంగా సంజయ్‌ను చిరంజీవి సాదరంగా ఆహ్వానించి, శాలువాతో సన్మానించారు. ఆప్యాయంగా ఆలింగనం చేసుకుని 'సంజయ్... మీరు ఎంతో కష్టపడి పైకొచ్చారు. మీరు మంత్రి కావడం చాలా ఆనందంగా ఉంది. మీ అగ్రెసివ్ మెంటాలిటీకి తగిన పోస్ట్ లభించింది' అని ప్రశంసించారు. ఇటీవల ప్రధాని మోదీ తమను దగ్గరకు తీసుకుని పలకరించడం మర్చిపోలేని అనుభూతిగా మిగిల్చిందని ఈ సందర్భంగా చిరంజీవి తెలిపారు. బండి స్పందిస్తూ 'నేను విద్యార్థి దశలో మీ సినిమాలకు అభిమానిని' అని పేర్కొన్నారు. ఏపీలో కూటమి మంచి ఫలితాలు సాధించిందని, ప్రజలకు మంచి పాలన అందిస్తారనే ఆశాభావాన్ని సంజయ్ వ్యక్తం చేశారు. అనంతరం ఇరువురు దేశ, రాష్ట్ర రాజకీయాలపై కొద్దిసేపు ముచ్చటించుకున్నారు. దాదాపు అరగంట పాటు చిరంజీవి నివాసంలో సంజయ్ గడిపారు. చిరంజీవిని మర్యాదపూర్వకంగానే కలిశానని బండి తెలిపారు.

సముద్రంలో మునిగి ఇద్దరు మృతి

- మరో ఇద్దరిని కాపాడిన స్నేహితులు
- రెండురోజులు గడవకముందే బాపట్ల జిల్లా, రామాపురం బీచ్‌లో మరో ఘటన



బాల సాయి, బాలనాగేశ్వరరావు (ఫైల్‌ఫొటో)

వేటపాలెం: దూరప్రాంతాల నుంచి విహారం కోసం వస్తున్న పర్యాటకులు అనుకోని పరిస్థితుల్లో మృత్యువాత పడుతున్నారు. రామాపురం బీచ్‌లో నలుగురు యువకులు మృత్యువాత పడి రెండురోజులు గడవక ముందే అదే ప్రాంతంలో ఆదివారం మరో ఇద్దరు సముద్ర కెరటాలకు బలైపోయారు. వివరాల్లోకి వెళితే.. మంగళగిరికి చెందిన 12 మంది యువకులు విహారయాత్ర కోసం రామాపురం బీచ్‌కు చేరుకున్నారు. స్నేహితులంతా ఉత్సాహంగా కేరింతలు కొడుతూ గడిపారు. సముద్రం నీటిలో మునుగుతున్న సమయంలో ప్రమాదవశాత్తు అలల తాకిడికి నలుగురు కొట్టుకుపోతుండగా గమనించిన స్నేహితులు ఇద్దరిని కాపాడి ఒడ్డుకు చేర్చారు. మరో ఇద్దరు బల నాగేశ్వరరావు (27), బాలసాయి (26) మృత్యువాత పడ్డారు. వీరంతా విజయవాడలోని వివిధ బంగారం షాపుల్లో పనులు చేసుకుంటూ జీవిస్తున్నారు. ఘటనా స్థలాన్ని ఈపురుపాలెం ఎస్సై శివకుమార్ యాదవ్ పరిశీలించి మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం చీరాల ఏరియా వైద్యశాలకు తరలించారు. అయితే రెండురోజుల వ్యవధిలో రెండు సంఘటనలు చోటుచేసుకోవడంతో జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్ చీరాల, వేటపాలెం ఎస్సైలకు పలు సూచనలు ఇచ్చారు. సముద్ర తీరం వద్ద నిఘా పెంచాలని, గజ ఈతగాళ్లు, మెరైన్ పోలీసులను సిద్ధంగా ఉంచాలని ఆదేశించారు. దూరప్రాంతాల నుంచి వచ్చే పర్యాటకులకు బీచ్‌పై అవగాహన కల్పించాలని సూచించారు.

గుడి కూల్చేసిన టీడీపీ నేత

- రెండడుగులు తన స్థలంలోకి వచ్చిందని ఆలయం మొత్తం కూల్చేసిన టీడీపీ నేత
- శ్రీకాళహస్తిలో గంగమ్మ గుడి నేలమట్టం


ఆలయాన్ని కూల్చివేసి ఆనవాళ్లు కూడా లేకుండా చేసిన ప్రదేశం

శ్రీకాళహస్తి: తిరుపతి జిల్లా శ్రీకాళహస్తి పట్టణంలోని కుందేటివారి వీధి ఎస్టీ కాలనీలో నిర్మాణంలో ఉన్న గంగమ్మ గుడిని శనివారం రాత్రి తెలుగుదేశం నేత వెంకటేష్‌శెట్టి కూల్చేశారు. ఆలయం రెండడుగులు తన స్థలంలోకి వచ్చిందని ఆలయం మొత్తాన్ని జేసీబీతో కూల్చేయడమేగాక అడ్డుకున్న కాలనీవాసుల్ని బెదిరించారు. కాలనీలో నివసిస్తున్న యానాదులు పాత గంగమ్మ గుడిని తొలగించి నాలుగు నెలల కిందట ఆరడుగుల స్థలంలో కొత్త ఆలయ నిర్మాణం చేపట్టారు. ఈ కాలనీకి ఆనుకుని వ్యాపారి అయిన టీడీపీ నేత వెంకటేష్‌శెట్టికి స్థలం ఉంది. ఆ స్థలంలో గుడి కడితే తన స్థలాన్ని ఎవరూ కొనరని, అందువల్ల గుడి కట్టవద్దని అతడు ఆ కాలనీవాసులతో గొడవ పడేవారు. శనివారం మండల సర్వేయర్ హరి సర్వే చేసి, కడుతున్న ఆలయం వ్యాపారి స్థలంలో రెండడుగుల మేర ఉందని మార్క్ వేశారు. ఆ రెండడుగుల స్థలానికి డబ్బు ఇస్తామని, లేదంటే సమయం ఇస్తే ఆ మేర ఆలయం తొలగిస్తామని కాలనీవాసులు వెంకటేష్‌శెట్టికి, మండల సర్వేయర్‌కు చెప్పారు. ఈ నేపథ్యంలో శనివారం రాత్రి వెంకటేష్‌శెట్టి జేసీబీతో నిర్మాణంలో ఉన్న గంగమ్మ ఆలయాన్ని కూల్చేశారు. అడ్డుకున్న కాలనీవాసులతో మీ నివాసాలు కూడా కూల్చేస్తానంటూ బెదిరించారు. దాతల సాయంతో గుడి నిర్మించుకుంటున్నామని, ఇప్పటికే రూ.2.5 లక్షలు ఖర్చయిందని కాలనీవాసులు ఆవేదన చెందుతున్నారు. ఆలయాన్ని కూల్చేసిన వెంకటేష్‌శెట్టి మీద చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు. ఈ విషయమై సర్వేయర్ హరిని అడగగా.. వెంకటేష్ స్థలంలో రెండడుగుల మేర ఆలయ నిర్మాణం చేపట్టారని తెలిపారు. ఈ విషయమై చర్చించుకుని సామరస్యంగా సర్దుకునే వెసులుబాటు ఉన్నా గుడి మొత్తాన్ని కూల్చేయడం సమంజసం కాదని చెప్పారు.

ఆనవాళ్లు కూడా లేకుండా చేశారు

కుందేటివారి వీధి ఎస్టీకాలనీ వాసులు రెక్కాడితే గానీ డొక్కాడని పేదలు. ఇక్కడ అందరూ రోజువారీ కూలీలే. పైసాపైసా కూడబెట్టి గ్రామదేవత గంగమ్మ ఆలయ నిర్మాణానికి వెచ్చించారు. ఆపై దాతల సాయంతో కొంత మొత్తాన్ని సేకరించారు. తర్వాత వారే కూలీలుగా ఆలయాన్ని నిర్మిస్తున్నారు. టీడీపీకి చెందిన వ్యాపారి వెంకటేష్‌శెట్టి తన స్థలానికి బేరం కుదరడంలేదన్న సాకుతో ఆలయం మొత్తాన్ని కూల్చేసేందుకు స్కెచ్ వేశారు. సర్వేలో ఆలయం తన స్థలంలోకి రెండడుగుల మేర వచ్చిందన్న సాకుతో మరింత రెచ్చిపోయారు. ఆలయం మొత్తాన్ని రాత్రికిరాత్రే జేసీబీతో కూల్చేశారు. శిథిలాలను ట్రాక్టర్ల ద్వారా రాత్రికిరాత్రే తరలించారు. అడొచ్చిన వారిపై చిందులేస్తూ.. చంపేస్తానంటూ బెదిరింపులకు దిగారు. దీంతో గిరిజనులు చేసేదిలేక ఆలయాన్ని కూల్చేస్తున్నా ఆవేదనగా చూస్తూ ఉండిపోయారు. వెంకటేష్‌శెట్టికి స్థానిక ఎమ్మెల్యే అండదండలు ఉండడం వల్లే ఎస్టీలమైన తమపై ప్రతాపం చూపుతున్నాడని వారు మండిపడుతున్నారు.

జనరల్ కోచ్‌ల కోసం వెతుకులాట!

- పేదల ప్రయాణానికి తప్పని ఇబ్బందులు
- ధనిక వర్గాల ప్రయాణం కోసమే వందే భారత్
- ఎన్నికల ఎఫెక్ట్‌తో దిగి వచ్చిన బీజేపీ సర్కారు
- జనరల్ కోచ్‌ల సంఖ్య పెంపుపై దృష్టి

దయచేసి వినండి అనే అనౌన్స్‌మెంట్ రాగానే రైలు ప్లాట్‌ఫామ్‌కు చేరుకున్న పేద, మధ్య తరగతి ప్రయాణికులు జనరల్ బోగీల కోసం వెతుకులాడుకోవాలి. ఇంజిన్ వెనకో..గార్డు బ్రేక్ ముందో ఒక బోగీ ఉంటుంది. అప్పటికే ఆ ఒక్క బోగి కిక్కిరిసి ఉంటుంది. అందులో ప్రయాణం నరకమే. నిత్యం ఇదే పరిస్థితి ఉంటూ సామాన్యుడికి రైలు దూరమయ్యే పరిస్థితి నేటికీ మెయిల్, ఎక్స్‌ప్రెస్ రైళ్లలో కొనసాగుతోంది.



రాజంపేట: ఎన్‌డీఏ పాలనలో దేశ వ్యాప్తంగా అన్ని రైళ్ల జనరల్ కోచ్‌లు తగ్గించేశారనే అపవాదు పేదల్లో బలంగా వినిపిస్తోంది. ఇప్పుడు వాటి జాడ కనుక్కొనేందుకు ప్రయాణికులు ప్లాట్‌ఫాంపై ఉరుకులు, పరుగులు తీయాల్సి వస్తోంది. తిరుపతి-నిజామాబాద్ మధ్య నడిచే రాయలసీమ, వెంకటాద్రి , జయంతి చెన్నై-ముంబాయి ఎక్స్‌ప్రెస్ రైళ్లలో సింగల్ జనరల్ బోగీనే కనిపిస్తోంది. వైఎస్సార్ కడప, అన్నమయ్య జిల్లాల మీదుగా ఉండే రైల్వే మార్గంలో 25 స్టేషన్లు ఉండగా, డైలీ 30 (అప్ అండ్ డౌన్) రైళ్లు నడుస్తున్నాయి. వీటిలో ఒకే బోగీలో కిక్కిరిసిన ప్రయాణంతో పేదలు ఇబ్బందిపడాల్సి వస్తోంది. ఒక్కోసారి జనరల్ బోగీ ఎక్కలేక స్లీపర్ కోచ్ ఎక్కి టీసీల దురుసుతనంతో నెట్టి వేయబడిన సంఘటనలు కోకొల్లలు. సార్వత్రిక ఎన్నికల తర్వాత లోక్‌సభలో తన సంఖ్యా బలం పడిపోవడంతో బీజేపీ తమ నిర్ణయాలను మార్చుకునే దిశగా అడుగులు వేసింది. జనరల్ బోగీలను పెంచేందుకు దృష్టి సారించింది.

కోచ్‌ల పెంపు ప్రతిపాదనలు సిద్ధం

ముచ్చటగా హ్యాట్రిక్ ఎన్‌డీఏ పాలనలో పేద, మధ్య తరగతి ప్రయాణికుల కోసం ఒక మెట్టు దిగివచ్చేందుకు రైల్వే శాఖ సిద్ధమవుతున్నట్లు సమాచారం. సార్వత్రిక ఎన్నికల్లో బీజేపీ పేద, మధ్య తరగతి ఓట్ల ప్రభావం స్పష్టంగా రుచిచూసిన క్రమంలో రైల్వే పరంగా చేసిన తప్పులను సరిదిద్దుకోవాలనే దిశగా అడుగులు వేసింది. మెయిల్, ఎక్స్‌ప్రెస్ రైళ్లలో జనరల్ కోచ్‌ల సంఖ్య రెట్టింపు దిశగా చర్యలకు దిగింది. ప్రస్తుతం రెండు కోచ్‌లున్న రైళ్లలో 4, జనరల్ కోచ్ లేని రైళ్లకు రెండు కోచ్‌లను ఏర్పాటుచేయనున్నారు. అదనంగా 1,377 స్లీపర్ కోచ్‌లు, 2,500 జనరల్ బోగీలను అందుబాటులో తీసుకువచ్చేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయి. ఒక్కో కోచ్‌లో 150-200 మంది ప్రయాణించే కోచ్‌ను రూపుదిద్దాలని రైల్వే శాఖ యోచిస్తోంది.

వందేభారత్‌లతో..

పేదలకు అనుకూలమైన రైళ్లు తీసుకురావడం కన్నా వందేభారత్ లాంటి ఖరీదైన రైళ్లను తీసుకురావడంతో రైల్వే శాఖ పేదలకు రైళ్లు దూరం చేస్తోందనే వాదన మేధావి వర్గాల నుంచి వినిపిస్తోంది. పేదలు ప్రయాణించే ప్యాసింజర్లను ఎక్స్‌ప్రెస్ రైళ్లుగా మార్చి పట్టాలెక్కిస్తున్నారు. వందేభారత్‌తో దూరప్రాంత ప్రయాణికులకు మేలు జరిగినా, అందులో ధరలు చూస్తే పేద, మధ్య తరగతి వాసులు ఆ బండి దిక్కు కూడా కన్నెత్తి చూడరనేది సుస్పష్టం.

ఏసీ, స్లీపర్ కోచ్‌లే అధికం

ఇప్పుడు నడుస్తున్న ఎక్స్‌ప్రెస్ రైళ్లలో ఏసీ, స్లీపర్ కోచ్‌లే అధికంగా కనిపిస్తున్నాయి. లోకో నుంచి అటు గార్డు బ్రేక్‌నుంచి ఎటు చూసినా స్లీపర్, ఏసీ కోచ్‌లున్నాయి. ఈ ఏసీలో త్రీ టైర్, టూటైర్ శ్రేణుల కోచ్‌లుంటాయి. కోచ్ పొజిషన్‌ను బట్టి స్లీపర్, ఏసీ కోచ్ పెంచాల్సిన పరిస్థితి ఉంటుంది. లేడీస్ కోచ్ ఉంటుంది. అటువంటప్పుడు సాధారణ ప్రయాణికులు రైలెక్కాలంటే ఆ సమయంలో బోగీల కోసం ఉరుకులు, పరుగులు తీయాల్సి వస్తోంది. ఇలాంటి పరిస్థితి ప్రమాదాలకు గురై ప్రాణాలు పోగొట్టుకున్న ఎందరో ప్రయాణీకులున్నారు.

మిలిటరీ కోచ్‌లకు మంగళం

దేశ ప్రధాని మోదీ పాలనలో వివిధ రైళ్లలో మిలిటరీ కోచ్‌లకు మంగళం పాడారు. ఒకప్పుడు ముంబై-చెన్నై మధ్య నడిచే ఎక్స్‌ప్రెస్, బై వీక్లీ, స్పెషల్ ట్రైన్స్‌లో మిలిటరీ కోచ్‌లుండేవి. అవి ఇప్పుడు ఏ రైళ్లలోనూ కనిపించడంలేదు. ఎన్‌డీఏ సర్కారు దేశ సైనికులకు ఇచ్చే గౌరవమిదేనా అని మాజీ సైనికులు పెదవి విరిస్తున్నారు. ఇప్పటికైనా కేంద్ర ప్రభుత్వం మిలిటరీ కోచ్‌లను ఎక్స్‌ప్రెస్ ఫార్మాసిన్‌లో అందుబాటులోకి తీసుకురావాలని కోరుతున్నారు.

మార్గం: ముంబాయి-చెన్నై
రైళ్లు: 30 (అప్ అండ్ డౌన్)
జనరల్ బోగీ: ఒకటి లేదా రెండు

జనరల్ కోచ్‌ల సంఖ్య పెంచాలి

పేద, మధ్య తరగతి ప్రయాణికులను దృష్టిలో ఉంచుకోవాలి. కేవలం వందే భారత్ రైళ్ల పైనే దృష్టి సారించడం విచారకరం. ఈ రైళ్లతో పేద, మధ్య తరగతి ప్రజానీకం లాభం లేదు. మెయిల్, ఎక్స్‌ప్రెస్ రైళ్లలో జనరల్ బోగీలను క్రమంగా కనీసం నాలుగు ఉండేలా చర్యలు తీసుకోవాలి. కొన్ని రైళ్లలో లేడీస్ కోచ్‌లు లేవు. ప్రత్యేకంగా ప్రతి రైలులో లేడీస్ కోచ్ ఉండేలా చర్యలు తీసుకోవాలి.
–ఆర్. శ్రీవాణిరెడ్డి, వైఎస్సార్‌సీపీ మహిళా నేత, రాజంపేట

పేదల ప్రయాణంపై దృష్టి పెట్టాలి

రైల్వే మంత్రిత్వ శాఖ పేద వాని ప్రయాణంపై దృష్టిపెట్టాలి.జిల్లా మీదుగా నడిచే రైళ్లలో పేదోడి బోగీలు కనిపించడం లేదు. ఫలితంగా ఫార్మసిన్‌లో ఉన్న ఒక్క బోగీ కిక్కిరిసి ఉంటోంది. పేద ప్రయాణికులు రైలు ప్రయాణానికి దూరం అవుతున్నారు. ఒకప్పుడు రైళు ఫార్మసిన్‌లో జనరల్ బోగీలు, మిలటరీ కోచ్‌లుండేవి. సార్వత్రిక ఎన్నికల తర్వాత మోదీ సర్కారుకు కనువిప్పు కలిగినట్లు ఉంది. అందుకే జనరల్ బోగీలను పెంచుతామనే యోచనకు వచ్చారని సమాచారం.
–ఫైజుల్లాఖాన్ లోడి, లోక్ అదాలత్ సభ్యుడు, నందలూరు

అమెరికాలో తెలుగు యువకుడిపై కాల్పులు

- సూపర్ మార్కెట్‌లో ఘటన.. చికిత్స పొందుతూ మృతి
- బాపట్ల జిల్లా యాజలిలో విషాదం
- గోపీకృష్ణ మృతి పట్ల వైఎస్ జగన్ సంతాపం


విలపిస్తున్న గోపీకృష్ణ తల్లిదండ్రులు


గోపీకృష్ణ (ఫైల్)

కర్లపాలెం/సాక్షి, అమరావతి: అమెరికాలో ఓ దుండగుడి తుపాకీ కాల్పుల్లో బాపట్ల జిల్లా కర్లపాలెం మండలం యాజలి గ్రామానికి చెందిన యువకుడు దాసరి గోపీకృష్ణ (32) మృతి చెందాడు. రైతు కూలీ కుటుంబానికి చెందిన దాసరి శ్రీనివాసరావు, లక్ష్మి దంపతులకు ఒక్కగానొక్క కుమారుడు గోపీకృష్ణ. బీటెక్ వరకు చదివి హైదరాబాద్‌లో సాఫ్ట్‌వేర్ ఉద్యోగం చేస్తూ హెచ్-1బి వీసా రావటంతో ఉద్యోగం కోసం సుమారు 11 నెలల కిందట అమెరికా వెళ్లాడు. ఓ వైపు ఉద్యోగ ప్రయత్నాలు చేస్తూ.. మరో వైపు టెక్సాస్ రాష్ట్రం డెల్లాస్ సిటీలోని సూపర్ మార్కెట్‌లో పార్ట్ టైమ్ జాబ్ చేస్తున్నాడు. ఈ నేపథ్యంలో అమెరికా కాలమానం ప్రకారం శుక్రవారం రాత్రి ఓ దుండగుడు సూపర్ మార్కెట్‌కు వచ్చి గోపీకృష్ణపై గన్‌తో కాల్పులు జరిపి ఏవో వస్తువులు తీసుకుని పారిపోయాడు. తీవ్రగాయాలైన గోపీకృష్ణ అక్కడే కుప్పకూలిపోగా స్థానికులు ఓ వైద్యశాలలో చేర్పించారు. చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందినట్లు కుటుంబ సభ్యులకు సమాచారం అందింది. దీంతో వారు కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు. గోపీకృష్ణకు రెండున్నరేళ్ల క్రితం ప్రవల్లికతో వివాహం జరిగింది. వీరికి ఏడాదిన్నర కుమారుడు ఉన్నాడు. ప్రజాప్రతినిధులు స్పందించి ప్రభుత్వ సహకారంతో తమ బిడ్డ భౌతికకాయాన్ని త్వరగా తీసుకువచ్చేలా చర్యలు తీసుకోవాలని కుటుంబ సభ్యులు కోరుతున్నారు.

గోపీకృష్ణ కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలి: వైఎస్ జగన్

అమెరికాలోని సూపర్ మార్కెట్లో జరిగిన కాల్పుల ఘటనలో బాపట్ల జిల్లా కర్లపాలెం మండలం యాజలి గ్రామానికి చెందిన దాసరి గోపీకృష్ణ మృతి చెందటం పట్ల వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. గోపీకృష్ణ కుటుంబానికి ప్రభుత్వం తోడుగా నిలవాలని, అన్ని రకాలుగా ఆదుకోవాలని విజ్ఞప్తి చేశారు. గోపీకృష్ణ కుటుంబానికి తగిన సహాయ సహకారాలు అందించాల్సిందిగా కేంద్ర విదేశాంగ శాఖను కోరారు. మృతుడి కుటుంబానికి వైఎస్ జగన్ తన ప్రగాఢ సంతాపాన్ని తెలియజేస్తూ ఆదివారం ఓ ప్రకటన విడుదల చేశారు.

ఆరోగ్య సంజీవని నడక

అంతర్జాతీయ వాకర్స్ సంస్థ అధ్యక్షుడు మురళీమోహన్


మాట్లాడుతున్న మురళీమోహన్

అమలాపురం టౌన్: ప్రస్తుత యాంత్రిక జీవనంలో నడకే మనిషికి ఆరోగ్య సంజీవని అని అంతర్జాతీయ వాకర్స్ సంస్థ అధ్యక్షుడు వి.మురళీ మోహన్ తెలిపారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాలోని అమలాపురం శ్రీకళా గ్రాండ్‌లో ఆదివారం 158వ అంతర్జాతీయ వాకర్స్ కౌన్సిల్ సదస్సు నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన సంస్థ అంతర్జాతీయ అధ్యక్షుడు మురళీ మోహన్ మాట్లాడుతూ ప్రతి వాకర్ తనకు తాను వ్యక్తిగత ఆరోగ్యం కోసం నడుస్తూనే ఆరోగ్య సమాజం కోసం కష్టపడాలని సూచించారు. మానవ మనుగడలోనే నేడు నడక కీలకపాత్ర పోషిస్తోందన్నారు. అంతర్జాతీయ వాకర్స్ సలహాదారు రామానందం, అంతర్జాతీయ వాకర్స్ సంస్థ నేత ఎం.ప్రభావతి నడక చైతన్యంలో వాకర్స్ క్లబ్ పాత్రల గురించి వివరించారు. తొలుత నడక ఉద్యమకారుడు, నడక పితామహుడు అళ్వార్ దాస్ చిత్రపటానికి అంతర్జాతీయ వాకర్స్ ప్రతినిధులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా నడక చైతన్యంతో ఉత్తమ ఫలితాలు కనబరిచిన వాకర్స్ క్లబ్‌ల అధ్యక్షులను అభినందించారు.

Published and printed by V. Murali on behalf of Jagati Publications Limited, Published from Vishnu Motor Plaza,2nd Floor, 31-A, Jawaharlal Nehru Road, Ekkattuthangal, Chennai -600 032 and Printed MNS Printers Private Limited, Survey no. 76/1, Noombal Village, Velappanchavadi, Poonamallee High Road, Chennai - 600 077. Jagati Publications Limited, Survey No.172, Vegata Village, Jadigenalhalli, Hoskote Taluk,Bangaluru Rural Dist, Impression Printing & Packaging Limited, C-18-19-20, Sector -59, Noida, Uttar Pradesh-201 301, Dangat Media Pvt Ltd.,22.Dighe MIDC, Navi Mumbai, Maharashtra- 400708.
Editor: V. Murali, (Responsible for selection of News under the PRB Act) RNI No:TNTEL/2008/25943